ఈనాడు

విజయవాడ 1-11-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 81

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



హరియాణాలోని కర్నాల్ జిల్లాకు చెందిన సునీల్ కుమార్ చేపల పెంపకంలో అద్భుతాలు సాధిస్తున్నారు. పదో తరగతి వరకే చదివిన ఆయన కర్నాల్ నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేపల పెంపకంపై శిక్షణ పొందారు. 2000లో తన స్వగ్రామంలో రెండు ఎకరాల పంచాయతీ చెరువు లీజుకు తీసుకొని చేపల పెంపకానికి శ్రీకారం చుట్టారు. 2005లో తన పొలంలోని ఏడెకరాల్లో చేపల హేచరీని ప్రారంభించారు. అలాగే మరో 8 ఎకరాల్లోనూ పలు రకాల చేపలు, రొయ్యల పెంపకాన్ని విస్తరించారు. 2015లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలికి తీవ్రగాయమై కర్ర సాయంతో నడుస్తున్నా సునీల్ తన కృషిని ఆపలేదు. ప్రస్తుతం హేచరీ, చేపల విక్రయం ద్వారా ఏటా రూ.60 లక్షల ఆదాయాన్ని గడిస్తున్నారు. చేపల చెరువు గట్లపై పెంచుతున్న మామిడి, జామ, బ్లాక్ బెర్రీ, సపోటా వంటి పండ్లతోటల్లో అదనపు ఆదాయం పొందుతున్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, రైతులు సునీల్ కుమార్ చేపల పెంపకాన్ని పలుమార్లు పరిశీలించారు.

గిరిజనుల స్వాతంత్ర్య పోరాటంపై డిజిటల్ మ్యూజియం



ఛత్తీస్‌గఢ్ 25వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రాష్ట్రం ఓ ప్రత్యేకమైన సాంస్కృతిక కానుక అందుకోబోతోంది. దేశ స్వాతంత్ర్య పోరాటంలో రాష్ట్రం నుంచి అమరుడైన తొలి యోధుడిగా చరిత్రకెక్కిన వీర్ నారాయణ్ సింగ్ స్మారకంగా రాయ్‌పుర్‌లో నిర్మించిన భారత తొలి పూర్తిస్థాయి డిజిటల్ ట్రైబల్ మ్యూజియాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించనున్నారు. ఆధునిక సాంకేతికతతో కూడిన వర్చువల్ రియాలిటీ, వీఎఫ్‌ఎక్స్, కృత్రిమమేధ (ఏఐ)ల సమ్మిళితంగా గిరిజన వీరుల జీవితాలు, పోరాటాలు, సంప్రదాయాలను ఈ సంగ్రహాలయం ఆవిష్కరించనుంది. ఆంగ్లేయులపై ఛత్తీస్‌గఢ్‌లో ఉద్భవించిన గిరిజన తిరుగుబాట్లను ప్రతిబింబించేలా 16 గ్యాలరీలను ఇందులో ఏర్పాటు చేశారు. ఛత్తీస్‌గఢ్‌తోపాటు ఒడిశా, పశ్చిమబెంగాల్ కళాకారులు వీటిని తీర్చిదిద్దారు. మ్యూజియంలో ఏర్పాటుచేసిన ఏఐ కెమెరాల సాయంతో సందర్శకులు తమను తాము అడవులు లేదా గ్రామీణ నేపథ్యంతో గిరిజన దుస్తుల్లో చూసుకోవచ్చు. 9.75 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ మ్యూజియంలో గిరిజనుల జెండా సత్యాగ్రహం, జంగిల్ సత్యాగ్రహం వంటివి కళ్లకు కట్టే 650 శిల్పాలు ఉన్నాయి. గిరిజనుల సంప్రదాయ ఆయుధాలు, పనిముట్లు కూడా చూడవచ్చు.

నవంబరులో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువ

ఐఎండీ అంచనా



దిల్లీ: దేశంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో నవంబరులో సాధారణం కంటే తక్కువ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) తెలిపింది. అదే విధంగా వాయువ్య మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవ్వచ్చని పేర్కొంది. పశ్చిమ హిమాలయ ప్రాంతం, హిమాలయ సమీప ప్రాంతాలు, ఈశాన్య భారతంలోని ఎక్కువ భాగం, దక్షిణ భారతంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం కంటే ఎక్కువ గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఉండొచ్చని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. మధ్య, తూర్పు భూమధ్య రేఖ పసిఫిక్ మహాసముద్రంపై బలహీనమైన లా నినా పరిస్థితులు కొనసాగుతున్నట్లు ఆయన చెప్పారు. వాయవ్య భారత్‌లోని కొన్ని ప్రాంతాలు, దక్షిణ ద్వీపకల్పంలోని కొన్ని ప్రాంతాల్లో నవంబరులో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదవుతుందని మృత్యుంజయ్ తెలిపారు.

యువతకు కోటి ప్రభుత్వ ఉద్యోగాలు

- కేజీ టు పీజీ న్యాయమైన ఉచిత విద్య
- రాష్ట్రంలో 7 అంతర్జాతీయ విమానాశ్రయాల నిర్మాణం
- బిహార్ ప్రజలపై ఎన్డీయే హామీల వర్షం



పట్నాలో ఎన్డీయే మ్యానిఫెస్టోను విడుదల చేస్తున్న నడ్డా, నీతీశ్ కుమార్. చిత్రంలో కేంద్ర మంత్రులు చిరాగ్ పాస్వాన్, జీతన్‌రామ్ మాంఝీ తదితరులు

పట్నా: భారీ వాగ్దానాలతో బిహార్ అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోను అధికార ఎన్డీయే శుక్రవారం పట్నాలో విడుదల చేసింది. రాబోయే ఐదేళ్లలో రాష్ట్ర యువతకు కోటి ప్రభుత్వ ఉద్యోగాలు, ఇతర ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఉచితంగా విద్య, వైద్యం, రేషన్ సరుకులు అందిస్తామని తెలిపింది. మహిళలు, వలస కార్మికులను ఆకట్టుకునేలా పలు వాగ్దానాలు చేసింది. ప్రతి జిల్లాలో మెగా స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని వెల్లడించింది. కేంద్ర మంత్రి-భాజపా అధ్యక్షుడు జె.పి.నడ్డా, బిహార్ సీఎం నీతీశ్ కుమార్‌తో పాటు కూటమిలోని భాగస్వామ్య పక్షాల అధినేతలు 69 పేజీల సంకల్ప పత్రం (మ్యానిఫెస్టో)ను విడుదల చేశారు.

ముఖ్యమైన హామీలు

- ★ ఈబీసీలోని వివిధ వృత్తుల నిపుణులకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం.
- ★ పేదలకు కేజీ నుంచి పీజీ వరకు న్యాయమైన ఉచిత విద్య.
- ★ ఉన్నత విద్యను చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు నెలకు రూ.2వేల సాయం.
- ★ కోటి మంది మహిళలను 'లఖ్‌పతి దీదీ'లుగా మార్చడం.
- ★ స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేసే మహిళలకు ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన ద్వారా రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం.
- ★ రాష్ట్రంలో 7 అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయాల ఏర్పాటు.
- ★ 7 ఎక్స్‌ప్రెస్ మార్గాల నిర్మాణం. మరో నాలుగు నగరాల్లో మెట్రో రైళ్లు.
- ★ కర్పూరీ ఠాకూర్ కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు ఏటా రూ.3వేల సాయం. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి (రూ.6వేలు)కి ఇది అదనం.
- ★ రాష్ట్ర ప్రజలకు ఉచితంగా రేషన్ సరకులు. పేదలకు 50 లక్షలకుపైగా పక్కా ఇళ్ల నిర్మాణం. రూ.5 లక్షల దాకా ఉచిత వైద్య చికిత్సల సదుపాయం.
- ★ సీతాదేవి జన్మస్థానం 'పునౌరా ధామ్'లో నిర్మిస్తున్న జానకీ మందిర్‌ను ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడం. సీతాపురంగా నామకరణం చేయడం.

భారత్-అమెరికా మధ్య కీలక రక్షణ ఒప్పందం

- సంతకాలు చేసిన రాజ్‌నాథ్, హెగ్సెత్



ఒప్పందంపై సంతకాలు చేస్తున్న హెగ్సెత్, రాజ్‌నాథ్

దిల్లీ: భారత్- అమెరికాల మధ్య వ్యూహాత్మక, భద్రత సంబంధాలు మరింత బలపడనున్నాయి. ఇరుదేశాలు శుక్రవారం 10 ఏళ్ల కాలానికి కీలక రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. భారత్-అమెరికాల మధ్య బలపడుతున్న వ్యూహాత్మక సంబంధాలకు ఇది నిదర్శనమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత పరిస్థితులు నెలకొనేలా చూసేందుకు భారత్‌తో కలిసి పనిచేస్తామని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేర్కొన్నారు. ఇద్దరు నేతలు శుక్రవారం కౌలాలంపూర్‌లో ద్వైపాక్షిక రక్షణ ఒప్పందంపై సంతకాలు చేశారు. అంతకుముందు అనేక అంశాలపై చర్చలు జరిపారు. భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాలు విధించాక రెండు దేశాల మధ్య సంబంధాలు ఇటీవల బాగా క్షీణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజా ఒప్పందానికి ప్రాధాన్యం ఏర్పడింది. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పటిష్ఠం చేసే క్రమంలో విస్తృత స్థాయి దార్శనిక పత్రంలా, విధానపరమైన మార్గదర్శిగా ఇది ఉపయోగపడనుంది. 2015లో కుదిరిన ఇలాంటి ఒప్పందం గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఇది అనివార్యమైంది.



జనవరి వరకూ ఆగొద్దు..

అక్టోబరు నెల అయిపోయింది. కొత్త సంవత్సరంలో అడుగుపెట్టేందుకు రెండు నెలల సమయం ఉంది. మీ శరీరాకృతిని, అలవాట్లను, ఆలోచనాతీరును మార్చుకునేందుకు ఈ కాలం సరిపోతుంది. జనవరి వరకూ ఆగకుండా నేటి నుంచే ఆ దిశగా అడుగులు వేయండి.

– గ్యారీ బ్రెకా, జీవశాస్త్రవేత్త

ఎన్నికల అనంతర హింస... టాంజానియాలో 700 మంది మృతి


దారే స్సలాం: టాంజానియా అధ్యక్ష ఎన్నికల అనంతరం ఆ దేశంలోని వివిధ నగరాల్లో చెలరేగిన హింసాత్మక ఘటనల్లో 700 మందికి పైగా ప్రజలు మృతి చెందారు. ప్రస్తుత అధ్యక్షురాలు సమీయా సులూహు హసాన్ తన అధికారాన్ని కాపాడుకునేందుకు ప్రత్యర్థులను అణచివేశారని, జైలులో బంధించి ఎన్నికల్లో పాల్గొనకుండా అడ్డుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గందరగోళ పరిస్థితుల్లో బుధవారం ఎన్నికలు ముగియగా ఆ ఫలితాలను ప్రకటించొద్దంటూ రాజధాని దారే స్సలాంతో పాటు వివిధ నగరాల్లో ప్రజలు భారీ ఎత్తున నిరసనలకు దిగారు. సమీయా సులూహు పోస్టర్లను చింపివేశారు. పోలీసులతో ఘర్షణకు దిగారు. హింసాత్మక ఘటనలను నివారించేందుకు సైన్యం రంగంలోకి దిగి పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించింది. శుక్రవారం కూడా నిరసనలు కొనసాగాయి. రాజధాని దారే స్సలాంలోనే 350 మంది వరకూ చనిపోయారనే వార్తలు వస్తున్నాయి.

'ఆ సీఎస్‌లంతా 3న కోర్టుకు హాజరు కావాల్సిందే'

దిల్లీ: వీధి శునకాల సంతాన నియంత్రణ నిబంధనల అమలుపై నిర్దేశించిన గడువులోగా అఫిడవిట్లు సమర్పించని వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శు(సీఎస్)లపై సర్వోన్నత న్యాయస్థానం మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. వారికి కోర్టు ఉత్తర్వులపై గౌరవమే లేదంటూ మండిపడింది. ఆగస్టు 22న ఇచ్చిన ఆదేశాల ప్రకారం 8 వారాల గడువులోగా అఫిడవిట్లు దాఖలు చేయని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల సీఎస్‌లందరూ (తెలంగాణ, పశ్చిమ బెంగాల్ మినహా) ఈ నెల 3న కోర్టుకు హాజరు కావాల్సిందేనని శుక్రవారం స్పష్టం చేసింది.

న్యాయవాదులకు సమన్లు జారీ చేసే అధికారం దర్యాప్తు సంస్థలకు లేదు

- ఎస్పీస్థాయి అధికారి ఆమోదం తెలిపితే తప్ప..
- ఈడీ సమన్ల కేసులో సుప్రీంకోర్టు తీర్పు



దిల్లీ: క్రిమినల్ కేసుల్లో నిందితులకు న్యాయ సలహా ఇచ్చే న్యాయవాదులకు ఏకపక్షంగా సమన్లు జారీ చేసే అధికారం దర్యాప్తు సంస్థలకు/దర్యాప్తు అధికారికి లేదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. సీనియర్ న్యాయవాదులకు ఏకపక్షంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేయడంపై వివాదం రేగడంతో ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించి విచారించిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. న్యాయవాది-కక్షిదారు మధ్య జరిగే సంభాషణను కాపాడుతూ.. సమన్ల జారీ అంశంపై దిశానిర్దేశం చేసింది. భారతీయ సాక్ష్య అధినియమ్ (బీఎస్ఏ)లో సెక్షన్ 132.. న్యాయవాది- కక్షిదారు సంబంధాన్ని స్పష్టంగా నిర్వచించిందని.. కాబట్టి ఈ కేసులో తాము ప్రత్యేకంగా ఎలాంటి మార్గదర్శకాలను జారీ చేయడం లేదని తెలిపింది. సెక్షన్ 132 కింద నిందితుడితో జరిగే సంభాషణను రహస్యంగా ఉంచే హక్కు న్యాయవాదులకు ఉందని స్పష్టం చేసింది. అయితే సెక్షన్ 132లో పేర్కొన్న మినహాయింపుల కింద ఏదైనా అంశం వస్తే సమన్లు జారీ చేయొచ్చని తెలిపింది. మినహాయింపుల్లో ఏ నిబంధన కింద జారీ చేస్తున్నారో విచారణాధికారి స్పష్టం చేయాలని, అదే సమయంలో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) స్థాయి కంటే తక్కువ ర్యాంకులో లేని అధికారి అంగీకారం తీసుకోవాలని తెలిపింది. ఆ అధికారి కూడా విచారణాధికారి పేర్కొన్న మినహాయింపుపై సంతృప్తిని రాతపూర్వకంగా వ్యక్తంచేయాలని అప్పుడే సమన్లు జారీ చేయాలని స్పష్టంగా ధర్మాసనం పేర్కొంది.

'కేంద్రీయ గృహమంత్రి దక్షతా పదక్' అవార్డులు 1,466 మందికి

- ప్రకటించిన హోంశాఖ

దిల్లీ: ఈ ఏడాదికి గానూ 'కేంద్రీయ గృహ మంత్రి దక్షతా పదక్' అవార్డుల కోసం వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర సంస్థలకు చెందిన 1,466 మంది పోలీసు సిబ్బందిని ఎంపిక చేసినట్లు శుక్రవారం కేంద్ర హోం మంత్రిత్వశాఖ ప్రకటించింది. ఇందులో పహల్గాం ఉగ్రవాదులను హతమార్చడంలో కీలక పాత్ర పోషించిన 40 మంది జమ్మూకశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఉన్నారు. ఆపరేషన్ మహదేవలో ముఖ్యపాత్ర పోషించిన 19 మంది జమ్మూకశ్మీర్ పోలీసుల్లో ఐజీ (కశ్మీర్ రేంజ్) వీకే బిర్దీ, సీనియర్ ఎస్పీ (శ్రీనగర్) జీవీ సందీప్ చక్రవర్తి ఉన్నారు. 21 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బందిలో ఓ అసిస్టెంట్ కమాండంట్ ఉన్నారు. వృత్తిలో ప్రతిభ, ఉన్నత ప్రామాణాలతో పాటు ప్రత్యేక కార్యకలాపాలు, దర్యాప్తు, నిఘా, ఫోరెన్సిక్ సైన్స్ అనే నాలుగు రంగాల్లో అధికారులు చూపిన తెగువకు గుర్తింపుగా ఈ పతకాలు అందజేస్తారు. ఈ పతకాల ప్రదానాన్ని ఫిబ్రవరి 1, 2024న మొదలుపెట్టారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఏటా అక్టోబరు 31న పతకాలను ప్రకటిస్తారు. అవార్డు గ్రహీతల జాబితా ఎంహెచ్ఏ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంది.

ఆ బిడ్డ గురించే మా ఆందోళన

భారత్-రష్యా సంబంధాలను ప్రభావితం చేసే ఉత్తర్వులివ్వలేం: సుప్రీం

ఇంటర్నెట్‌డెస్క్: రష్యా జాతీయురాలైన భార్యకు జన్మించిన బిడ్డ సంరక్షణపై భారత్‌కు చెందిన భర్త చేస్తున్న న్యాయ పోరాటంపై శుక్రవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రష్యా మహిళ ఆచూకీపై ఆ దేశ ఎంబసీ నుంచి తగిన స్పందన రాకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. "రెండు దేశాల సంబంధాలను ప్రభావితం చేసే ఎలాంటి ఉత్తర్వులను మేం జారీ చేయాలని అనుకోవడం లేదు. ఇది ఒక చిన్నారికి సంబంధించిన కేసు. ఇది చాలా సున్నితమైన అంశం. తన తల్లితో ఉన్నందున ఆ బిడ్డ క్షేమంగా ఉన్నాడని మేం ఆశిస్తున్నాం. ఇది చిన్నారుల అక్రమ రవాణా కేసు కాదని మేం భావిస్తున్నాం" అని కోర్టు వ్యాఖ్యలు చేసింది. అలాగే ఆమె వివరాలను సేకరించేందుకు అధికారులకు రెండు వారాల గడువు ఇచ్చింది. గత విచారణలో కోర్టు స్పందిస్తూ.. "తల్లి లేక తండ్రికి ఇంతవరకు చిన్నారి కస్టడీ అప్పగించలేదు. సుప్రీంకోర్టు కస్టడీ నుంచి ఆ బిడ్డను లాగేసుకుపోయారు" అని తీవ్రంగా స్పందించిన సంగతి తెలిసిందే. తన నుంచి విడిపోయిన రష్యన్ మహిళ వద్ద ఉన్న బిడ్డ సంరక్షణ కోసం భారత్‌కు చెందిన తండ్రి పోరాడుతున్నాడు. జులై 4న రష్యన్ ఎంబసీ వెనుక ద్వారం నుంచి ఓ దౌత్యాధికారి ఆమెను లోపలికి తీసుకువెళ్లినట్లు అతడు చెబుతున్నాడు. ఆమె సరిహద్దు దాటి నేపాల్‌లోకి ప్రవేశించి.. అక్కడి నుంచి షార్జా మీదుగా రష్యాకు వెళ్లినట్లుగా భావిస్తున్నామని గత విచారణలో కేంద్రం వెల్లడించింది. మాస్కోలోని భారత ఎంబసీ ఆమె వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించినా.. రష్యా అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదని విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించింది.

తొలి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్‌ను కాంగ్రెస్ పార్టీ అవమానించింది

- యూపీ సీఎం ఆదిత్యనాథ్ ఆరోపణ



సివాన్: గుజరాత్‌లో పునరుద్ధరించిన సోమనాథ్ ఆలయ ప్రారంభోత్సవానికి వెళ్లొద్దని చెప్పడం ద్వారా తొలి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్‌ను నాటి ప్రధాని, కాంగ్రెస్ అగ్రనేత జవహర్‌లాల్ నెహ్రూ అవమానించారని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆరోపించారు. రాజేంద్ర ప్రసాద్ జన్మస్థలం సివాన్‌లో శుక్రవారం నిర్వహించిన భాజపా ఎన్నికల ప్రచార సభలో ఆదిత్యనాథ్ ప్రసంగించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, బాబాసాహెబ్ అంబేడ్కర్, రాజేంద్ర ప్రసాద్, కర్పూరీ ఠాకూర్ వంటి దిగ్గజ నేతలను అవమానించడంతోనే కాంగ్రెస్ పార్టీని ప్రజలు పదేపదే తిరస్కరిస్తున్నారని తెలిపారు. బిహార్‌కు చెందిన నేత, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సీతారాం కేసరికి కూడా ఆ పార్టీలో తీవ్ర అవమానం ఎదురైందని ఆదిత్యనాథ్ ఆరోపించారు. దేశం వెనుకబాటుకు, పేదరికం ప్రబలంగా ఉండటానికి కాంగ్రెస్ పార్టీ పాలనే కారణమని ధ్వజమెత్తారు.

దేశ గౌరవానికే ఇందిర తొలి ప్రాధాన్యం

- 41వ వర్ధంతిన రాహుల్ సహా కాంగ్రెస్ నేతల నివాళి



మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా దిల్లీలో శక్తి స్థల్ వద్ద శుక్రవారం నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ. చిత్రంలో లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ

దిల్లీ: మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 41వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ శుక్రవారం ఆమెకు ఘనంగా నివాళులు అర్పించింది. శక్తిమంతులను ఎదుర్కొనేటపుడు ఆమె నిర్భయంగా, అచంచలంగా ఉండేవారని, దేశ ఆత్మగౌరవం కంటే ఏదీ ఎక్కువ కాదనీ తమకు నేర్పించారని పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. ఆమె ధైర్యం, కరుణ, దేశభక్తి తను వేసే ప్రతి అడుగులో స్ఫూర్తినిస్తూనే ఉంటాయని ఆయన పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ సహా పలువురు నాయకులు దిల్లీలోని శక్తిస్థల్ వద్ద పుష్పగుచ్ఛంతో నివాళులు అర్పించారు. సఫ్దర్‌జంగ్ రోడ్‌లోని ఇందిర గాంధీ స్మారక చిహ్నాన్ని కూడా వారు సందర్శించారు. "ధైర్యసాహసాలకు ప్రతిరూపం, భారత తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీకి హృదయపూర్వక నివాళి. తన దృఢ సంకల్పం, దార్శనికతతో దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటంలో ఆమె కీలకపాత్ర పోషించారు. భారత స్ఫూర్తిని కాపాడుతూ ఆమె తన ప్రాణాన్ని బలిచేశారు" అని ఖర్గే ఎక్స్‌లో పోస్టుచేశారు.

చరిత్రలో అత్యంత చీకటిరోజు
కేంద్రమంత్రి హర్‌దీప్

ఇందిరా గాంధీ మరణానంతరం సిక్కులకు వ్యతిరేకంగా జరిగిన అల్లర్లను కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పురి గుర్తుచేసుకున్నారు. సిక్కు అల్లర్ల బాధితుల వరుస కథనాలను హర్‌దీప్ 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. "1984 నాటి గాయం బాధితులను ఇంకా వెంటాడుతూనే ఉంది. దేశమంతటా మహిళలు, చిన్నారులు సహా దాదాపు 16 వేలమంది సిక్కులను కాంగ్రెస్ నేతలు, వారి అనుచరులు దారుణంగా హతమార్చారని స్వతంత్ర నివేదికలు వెల్లడించాయి. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ కూడా సిక్కుల ఊచకోతకు బహిరంగ మద్దతునిచ్చారు. నేడు మనం చరిత్రలోని చీకటి రోజుల్లో ఒకదానికి వార్షికోత్సవం జరుపుకొంటున్నాం" అని హర్‌దీప్ నాటి పరిస్థితులను మననం చేసుకున్నారు.

మా ప్రాంతంలో రష్యా భారీగా సైన్యాన్ని మోహరించింది: జెలెన్‌స్కీ



కీవ్: అత్యంత కీలకమైన పొక్రొవిస్క్ నగరాన్ని స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా ఉక్రెయిన్‌లోని తూర్పు దొనెస్క్ ప్రాంతంలో రష్యా దాదాపు 1,70,000 మంది సైనికుల్ని మోహరించిందని అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ శుక్రవారం ఆరోపించారు. అయితే వారు పొక్రొవిస్క్‌ను స్వాధీనం చేసుకోకుండా తమ బలగాలు సమర్థంగా తిప్పికొడుతున్నాయని తెలిపారు. ఉక్రెయిన్‌లోని కొన్ని కీలక నగరాలు తమ అధీనంలోకి వస్తున్నాయని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించిన నేపథ్యంలో జెలెన్‌స్కీ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది.

హెచ్-1బీ వీసాదారులపై అమెరికా అక్కసు

- భారత్‌ను నిందిస్తూ యాడ్

ఇంటర్నెట్‌డెస్క్: హెచ్-1బీ వీసాదారులు, వలసదారులపై అమెరికా అక్కసును వెళ్లగక్కింది. స్థానిక అమెరికన్లకు దక్కాల్సిన ఉద్యోగాలను విదేశీయులు సొంతం చేసుకుంటున్నారని, అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఈ ఆటలు సాగనివ్వలేదంటూ అమెరికా లేబర్ డిపార్ట్‌మెంట్ 'ఎక్స్'లో ఓ యాడ్‌ను విడుదల చేసింది. కంపెనీలు హెచ్-1బీ వీసాను దుర్వినియోగం చేస్తున్నాయని యాడ్‌లో ఆరోపించింది. అమెరికా యువతకు దక్కాల్సిన ఉద్యోగాలను విదేశీయులతో భర్తీ చేస్తున్నారని, ఇందులో అత్యధికంగా భారతీయులే ఉన్నారంటూ ఆక్షేపించింది. "హెచ్-1బీ వీసా దుర్వినియోగం కారణంగా విదేశీ కార్మికులతో ఉద్యోగాలు భర్తీ అవుతున్నాయి. యువత 'అమెరికన్ కల' దోపిడీకి గురవుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, లేబర్ విభాగం నాయకత్వంలో వీసాను దుర్వినియోగం చేస్తోన్న కంపెనీలను జవాబుదారీ చేస్తున్నాం. కష్టపడి పనిచేస్తే.. అమెరికా కలను సాధించుకోవచ్చని మేం తరతరాలుగా చెప్తున్నాం. కానీ ఇక్కడి యువత విషయంలో అలా జరగడం లేదు" అని యాడ్‌లో ప్రస్తావించారు. హెచ్-1బీల్లో 72 శాతం భారతీయులకే వెళ్తున్నాయని ఒక గ్రాఫ్ రూపంలో వెల్లడించారు. ఈ వీసా విషయంలో ఏవైనా అవకతవకలు చోటుచేసుకుంటున్నాయా..? అని గుర్తించేందుకు 'ప్రాజెక్ట్ ఫైర్‌వాల్' పేరిట లేబర్ విభాగం ఆడిట్ నిర్వహిస్తోంది. ఈ సమయంలోనే ఈ యాడ్‌ను పోస్టుచేసింది.



జబల్‌పుర్‌లో ఐక్యతా పరుగులో పాల్గొన్న విద్యార్థులు



జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం శ్రీనగర్‌లోని దాల్ సరస్సు ఒడ్డున ఐక్యతా పరుగులో పాల్గొన్న ప్రజలు

'క్షమాపణ పత్రం' విడుదల చేయాల్సింది

ఎన్డీయే మ్యానిఫెస్టోపై ఆర్జేడీ నేత తేజస్వీ వ్యాఖ్య

పట్నా: ఎన్డీయే విడుదల చేసిన బిహార్ ఎన్నికల మ్యానిఫెస్టోపై విపక్ష పార్టీలు జేడీయూ, కాంగ్రెస్ విమర్శలు గుప్పించాయి. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన పాత హామీల అమలుకే దిక్కులేనప్పుడు కోటి ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామంటూ మ్యానిఫెస్టోలో భారీ వాగ్దానాలు ఎందుకిచ్చారని ఎన్డీయే నేతలను ఆర్జేడీ అగ్రనేత, విపక్ష 'మహాగఠ్‌బంధన్' సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్ ప్రశ్నించారు. గత హామీల అమలులో విఫలమైనందున 'సంకల్ప పత్రా'నికి బదులుగా 'క్షమాపణ పత్రా'న్ని విడుదల చేసి ఉండాల్సిందన్నారు.

నీతీశ్‌ను మాట్లాడనివ్వకపోవడం అవమానకరం: కాంగ్రెస్

ఎన్డీయే ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ కాకుండా, డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి ఎందుకు మాట్లాడారని కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గహ్లోత్ ప్రశ్నించారు. మ్యానిఫెస్టోపై మాట్లాడే స్థితిలో నీతీశ్ లేరా అని నిలదీశారు. భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా, సీఎం నీతీశ్ సహా పలువురు ముఖ్య నేతలు పాల్గొన్న మ్యానిఫెస్టో విడుదల కార్యక్రమాన్ని కేవలం 26 సెకన్లలోనే ముగించి వెళ్లిపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నీతీశ్‌ను మాట్లాడనివ్వకపోవడం బిహార్‌ను, రాష్ట్ర ప్రజలను అవమానించడమేనని కాంగ్రెస్ ఎంపీ అఖిలేశ్ ప్రసాద్ యాదవ్ విమర్శించారు.

అమెరికాకు మానవ అక్రమ రవాణా.. భారతీయుడి సంస్థపై ఆంక్షలు

న్యూయార్క్: దేశంలోకి అక్రమంగా ప్రజలను రవాణా చేస్తున్నారన్న ఆరోపణలపై ఓ భారతీయుడు, అతడి భార్య, అతని సంస్థ సహా 16 కంపెనీలపై అమెరికా ఆంక్షలు విధించింది. విక్రాంత్ భరద్వాజ్, అతనికి చెందిన కంపెనీ భరద్వాజ్ హెచ్ఎస్ఓపై ఆంక్షలు విధించినట్లు ఫెడరల్ అధికారులు తెలిపారు. అతడి కంపెనీ మెక్సికో, యూఏఈ, భారత్‌ల నుంచి పనిచేస్తోందని.. ఆసియా, దక్షిణ అమెరికా, పశ్చిమాసియా, ఐరోపాల నుంచి ఇప్పటి వరకు వేలమందిని అమెరికాలోకి అక్రమంగా తరలించిందని పేర్కొన్నారు. వలసదారులకు నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి విమానాలు, నౌకల్లో తరలిస్తున్నారని తెలిపారు.

హాలోవీన్ వీకెండ్.. మిషిగన్‌లో హింసాత్మక దాడులకు కుట్ర

ఇంటర్నెట్ డెస్క్: హాలోవీన్ వీకెండ్ సందర్భంగా మిషిగన్‌లో హింసాత్మక దాడులు జరిపేందుకు పన్నిన కుట్రను భగ్నం చేసినట్లు ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాశ్ పటేల్ వెల్లడించారు. ఇందుకు సంబంధించి పలువురు అనుమానితులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఎఫ్‌బీఐ సిబ్బంది పూర్తి అప్రమత్తతతో ఉంటూ దేశ రక్షణలో నిమగ్నమయ్యారని ఆయన ప్రశంసించారు.

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 1-11-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 81
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru


గుజరాత్‌లోని కేవడియాలో శుక్రవారం ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

కశ్మీర్ అంశంలో నెహ్రూ తప్పు చేశారు

సర్దార్ పటేల్ అభిప్రాయానికి విలువివ్వలేదు

అందుకే కొంత భాగం పాక్ ఆక్రమణలోకి వెళ్లింది

వల్లభ్‌భాయ్ 150వ జయంతి వేడుకల్లో కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగిన ప్రధాని మోదీ

2 లో

ఒంగోలులో ముంపు.. ఒక్కరోజులో తొలగింపు

యంత్రాంగం పకడ్బందీ చర్యల ఫలితం


8 లో

రెండు లక్షల మంది రైతులకు కష్టం

- 3.75 లక్షల ఎకరాల్లో పంటలకు దెబ్బ
- ఆక్వా రంగానికి భారీ నష్టం.. రూ.514 కోట్లు ఇవ్వండి
- 1,434 గ్రామాలు, 58 పట్టణాలపై తుపాను ప్రభావం
- 187 మండలాల్లో భారీ, అతిభారీ, అత్యంత భారీ వర్షాలు
- 4,794 కి.మీ. పొడవైన రహదారులు గుంతలమయం
- మరమ్మతులు, పునరుద్ధరణకు రూ.2,744 కోట్లు అవసరం
- 18.20 లక్షల మందిపై మొంథా.. పంజా

17 రంగాలకు నష్టం.. ₹5,244 కోట్ల సాయం చేయండి

కేంద్రానికి ప్రాథమిక నివేదిక పంపిన రాష్ట్ర ప్రభుత్వం



ఈనాడు – అమరావతి

మొంథా తుపాను ప్రభావంతో 17 రంగాలకు రూ.5,244 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. 1.98 లక్షల మంది రైతులకు సంబంధించి 3.75 లక్షల ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. రహదారులు పెద్దఎత్తున కోతకు గురయ్యాయి. వీటికి తాత్కాలికంగా మరమ్మతులు చేయాలన్నా, పునరుద్ధరించాలన్నా రూ.2,774 కోట్లు అవసరం. 18.20 లక్షలమందిపై తుపాను ప్రభావం పడిందని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించింది. తుపాను ప్రభావాన్ని ఆర్టీజీఎస్ నుంచి గమనిస్తూ.. ఎప్పటికప్పుడు ముందు జాగ్రత్తలు తీసుకున్న తీరును అందులో వివరించింది. జిల్లాల వారీగా ప్రత్యేక అధికారుల నియామకంతోపాటు పునరావాస కేంద్రాల ఏర్పాటు, సహాయ చర్యలనూ పేర్కొంది. తుపాను కారణంగా రాష్ట్రంలో ముగ్గురు మృతి చెందారని.. 161 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైందని తెలిపింది. తుపాను నష్టానికి సంబంధించి శాఖల వారీ నష్టం, చిత్రాలతో సహా నివేదిక తయారు చేసి కేంద్రానికి పంపింది. క్షేత్రస్థాయిలో నష్టం పరిశీలనకు బృందాల్ని (మిగతా 8లో)

పొలాల్లో నీరు తొలగించండి

డ్రైనేజీ వ్యవస్థను చక్కదిద్దండి

కేంద్ర బృందాలను ఆహ్వానించండి

సహాయ చర్యలపై సీఎం చంద్రబాబు

8 లో


హత్యకు గురైన కఠారి మోహన్, అనురాధ


దోషులు వెంకట చలపతి, జయప్రకాశ్‌రెడ్డి, మంజునాథ్, వెంకటేశ్, చంద్రశేఖర్

మేయర్ దంపతుల హత్య కేసులో
ఐదుగురికి ఉరిశిక్ష

- చిత్తూరు జిల్లా అదనపు సెషన్స్ కోర్టు సంచలన తీర్పు
- ప్రధాన నిందితుడికి రూ.70 లక్షల జరిమానా విధింపు
- పదేళ్ల కిందట చిత్తూరులో పట్టపగలే ఘాతుకం

ఈనాడు- చిత్తూరు, న్యూస్‌టుడే- చిత్తూరు న్యాయవిభాగం: చిత్తూరు నగర మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ హత్య కేసులో ఐదుగురు దోషులకు ఉరిశిక్ష విధిస్తూ చిత్తూరు ఆరో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు శుక్రవారం సంచలన తీర్పు ఇచ్చింది. ప్రధాన సూత్రధారి, ఏ1గా ఉన్న మోహన్ మేనల్లుడు శ్రీరామ్ చంద్రశేఖర్ ఎలియాస్ చింటూ, గోవిందస్వామి శ్రీనివాసయ్య వెంకటాచలపతి ఎలియాస్ రేజర్ వెంకటేష్ (ఏ2), జయప్రకాష్‌రెడ్డి ఎలియాస్ జయారెడ్డి (ఏ3), తోటి మంజునాథ్ ఎలియాస్ మంజూ (ఏ4), మునిరత్నం వెంకటేష్ ఎలియాస్ గంగనపల్లి వెంకటేష్ (ఏ5)లను మరణించే వరకు ఉరి తీయాలని ఆదేశించింది. చింటూకు రూ.70 లక్షలు, మిగిలిన నిందితులకు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించింది. జరిమానా కట్టని పక్షంలో ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని పేర్కొంది. చింటూ చెల్లించే (మిగతా 2లో)

ఎన్డీయేకు 'షాబాద్' సవాల్!

బిహార్‌లో పూర్వ వైభవానికి అధికార కూటమి ప్రయత్నం

11 లో

ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగానికి నేడు కౌంట్‌డౌన్

ఇళ్లు, స్థలాలు ఇక మీ సొంతమే!

- గ్రామాల్లో 45 లక్షల ఆస్తులకు యజమాన్య హక్కులు
- వచ్చే మార్చిలో 'ప్రాపర్టీ కార్డుల' పంపిణీకి సన్నాహాలు
- 'స్వామిత్వ' కార్యక్రమాన్ని గాడిలో పెట్టిన కూటమి ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: గ్రామ కంఠాల్లో ఇళ్లు, దుకాణాలు, ఇతర నిర్మాణాలు, స్థలాలకు యాజమాన్య హక్కులు కల్పించే స్వామిత్వ కార్యక్రమం గాడిలో పడుతోంది. వచ్చే ఏడాది మార్చి నాటికి 45 లక్షల ఆస్తులకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ ప్రాపర్టీ కార్డులను ప్రభుత్వం జారీచేయనుంది. డిసెంబరు నెలాఖరులోగా క్షేత్రస్థాయిలో సర్వేలు పూర్తిచేస్తారు. ప్రస్తుతం 6వేల గ్రామాల్లో 'ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్' ఆధారంగా ఆస్తుల కొలతలను సేకరిస్తున్నారు.

గ్రామాల్లో దశాబ్దాల క్రితం నాటి ఇళ్లు, స్థలాలకు ఇప్పటికీ యాజమాన్య హక్కుల్లేవు. వీటిని విక్రయించినా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్టర్ చేయరు. ఆస్తులు గ్రామకంఠాల్లో ఉండటమే ప్రధాన కారణం. వీటిపై ప్రజలకు యజమాన్య హక్కులు కల్పించేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన స్వామిత్వ కార్యక్రమాన్ని వైకాపా ప్రభుత్వం భ్రష్టుపట్టించింది. ఐదేళ్లలో 1,300 ప్రాపర్టీ కార్డులే పంపిణీ చేశారు. (మిగతా 2లో)

తొందరపడి టికెట్లు ఇచ్చానేమో..!

యువత కదా అని ప్రోత్సహిస్తే రచ్చకెక్కి పరువు తీశారు

ఎమ్మెల్యే కొలికపూడి, ఎంపీ కేశినేని చిన్ని విభేదాలపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం

11 లో

నెట్‌వర్క్ ఆసుపత్రుల సమ్మె విరమణ

ఎన్టీఆర్ వైద్యసేవలు పునఃప్రారంభిస్తామని 'ఆశా' ప్రకటన

3 లో

13 జిల్లాల్లో ఆర్టీజీఎస్ కేంద్రాలు

- పాలనకు సాంకేతికత జోడింపు
- డిసెంబరు నాటికి పూర్తి చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం



రాష్ట్ర ఆర్టీజీఎస్ కేంద్రం నమూనా

మొంథా తుపాను ప్రభావాన్ని ముందుగా అంచనా వేసి.. ప్రజలను అప్రమత్తం చేయడంలో రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) సాంకేతికత కీలకంగా మారింది. భారీ విపత్తులోనూ ప్రాణనష్టం నివారించడం సాధ్యమైంది. సీఎం చంద్రబాబు సహా ఉన్నతాధికారులు, మంత్రులు ఆర్టీజీఎస్ సాంకేతికత ఆధారంగా ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో ఆర్టీజీఎస్ కేంద్రాలు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం సంకల్పించింది.

- పూర్తి వివరాలు 2లో

ఇళ్లు, స్థలాలు ఇక మీ సొంతమే!

(మొదటి పేజీ తరువాయి)



ప్రభుత్వ అధికారచిహ్నంతో ముద్రించిన స్వామిత్వ ప్రాపర్టీ కార్డు

వాటిపైనా గత సీఎం జగన్ ఫొటో ముద్రించడంతో ఎక్కువమంది తీసుకోడానికి నిరాకరించారు. వాటి స్థానంలో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ అధికారచిహ్నంతో కొత్త కార్డులను ఇస్తోంది.

■ స్వామిత్వ కార్యక్రమం అమలులో జాతీయస్థాయిలో ఆంధ్రప్రదేశ్ చివరి స్థానానికి పరిమితం కావడంతో కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రస్థాయి యూనిట్‌ని బలోపేతం చేయడంతోపాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ, సర్వే శాఖలు సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకుంది. గ్రామ సచివాలయాల సిబ్బందిని భాగస్వాములను చేసింది.

■ 6వేల గ్రామాల్లో 45 లక్షల ఆస్తుల సమగ్ర వివరాలు డ్రోన్ల ద్వారా సేకరించారు. వీటి ఆధారంగా ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్‌లను రూపొందించి ప్రాపర్టీ పార్సిల్ మ్యాపింగ్ చేస్తున్నారు. వీటిలో ప్రతి ఇల్లు, స్థలం పొడవు, వెడల్పు వివరాలు నిక్షిప్తమయ్యాయి. వీటి నిర్ధారణకు రెవెన్యూ, సచివాలయాల సిబ్బంది ప్రతి ఆస్తికీ కొలతలు తీస్తున్నారు. ఇప్పటికే 43 లక్షల ఆస్తుల తనిఖీ పూర్తయింది. రెండు, మూడు రోజుల్లో మిగిలినవీ పూర్తి చేయనున్నారు.

■ ఆస్తులపై నిర్ధారించుకున్న కొలతలతో సెక్షన్ 9(2) ప్రకారం వచ్చే నెలలో ప్రజలకు నోటీసులిచ్చి అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక క్షేత్రస్థాయి తనిఖీ పూర్తయినట్లు సెక్షన్ 13 కింద ప్రకటిస్తారు.

■ రికార్డ్స్ ఆఫ్ రైట్స్ (ఆర్‌ఓఆర్) కింద ఆస్తులకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ ముద్రించిన జాబితాలు సచివాలయాల్లో, పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శిస్తారు. పేర్లు మారినా, ఇతర లోపాలు గమనించినా ప్రజలు అభ్యంతరాలు తెలియజేయొచ్చు. తహసీల్దార్ ఆధ్వర్యంలో వాటిని సవరిస్తారు.

■ మరోదశలో ఇంకో 6వేల గ్రామాల్లో 45 లక్షల ఇళ్లు, స్థలాలకు యజమాన్య హక్కులు కల్పించే కార్యక్రమం 2026 మార్చి తర్వాత ప్రారంభం కానుంది.

కార్డుతో లాభాలివి

■ ప్రజల అవసరాల మేరకు ఇళ్లు, ఖాళీస్థలాలు విక్రయించొచ్చు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇలాంటి క్రయవిక్రయాలను రిజిస్టర్ చేస్తారు. ఈ మేరకు రెవెన్యూ చట్ట సవరణ చేశారు.

■ కార్డు ఆధారంగా ఆస్తులకు బ్యాంకులు రుణాలిస్తాయి. వారసులకు ఆస్తులు బదిలీ చేయొచ్చు.

సతీసమేతంగా నేడు లండన్‌కు చంద్రబాబు

- 4న భువనేశ్వరికి డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ పురస్కారం
- హెరిటేజ్ ఫుడ్స్‌కు గోల్డెన్ పీకాక్ అవార్డు

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు.. సతీమణి భువనేశ్వరితో కలిసి వ్యక్తిగత పర్యటన నిమిత్తం శనివారం లండన్ వెళుతున్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీగా ఉన్న భువనేశ్వరికి 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్' (ఐఓడీ) సంస్థ 2025 సంవత్సరానికి డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డును నవంబరు 4న లండన్‌లో ప్రదానం చేయనుంది. హెరిటేజ్ ఫుడ్స్‌కు 'ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్' విభాగంలో గోల్డెన్ పీకాక్ అవార్డునూ ఆ సంస్థ ఎండీ హోదాలో అదే వేదికపై భువనేశ్వరి అందుకోనున్నారు. ఈ కార్యక్రమానికి చంద్రబాబు హాజరవుతారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ప్రజాసేవ, సామాజిక సాధికారతకు పాటుపడుతున్నందుకు భువనేశ్వరిని విశిష్ట వ్యక్తిగా గుర్తిస్తూ ఐఓడీ సంస్థ డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డును అందిస్తోంది. ఈ కార్యక్రమం లండన్‌లోని గ్లోబల్ కన్వెన్షన్‌లో జరుగుతుంది. గతంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం, హిందూజా గ్రూప్ కో ఛైర్మన్ గోపీచంద్, ఆదిత్య బిర్లా సెంటర్ ఫర్ కమ్యూనిటీ ఇనిషియేటివ్స్ ఛైర్‌పర్సన్ రాజశ్రీ బిర్లా తదితరులు ఈ అవార్డును అందుకున్నారు.

■ వ్యక్తిగత పర్యటన తర్వాత సీఎం లండన్ పారిశ్రామికవేత్తలు, ప్రవాసాంధ్రులతో భేటీ అవుతారు. విశాఖలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు వారిని ఆహ్వానిస్తారు. నవంబరు 6న ఆయన తిరిగి అమరావతికి చేరుకుంటారు.

ఏపీలో ఐదుగురికి 'కేంద్రీయ దక్షతా' అవార్డులు



ఫణిభూషణ్

ఈనాడు, అమరావతి-ఈనాడు డిజిటల్, భీమవరం- భీమవరం పట్టణం, ఉండి, న్యూస్‌టుడే: ప్రతిష్ఠాత్మక 'కేంద్రీయ గృహ మంత్రి దక్షతా పదక్' అవార్డులకు ఏపీ నుంచి ఐదుగురు ఎంపికయ్యారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ శుక్రవారం ఈ అవార్డులను ప్రకటించింది. పలు విభాగాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు వీటిని అందజేస్తారు. ఈ అవార్డులకు దేశ వ్యాప్తంగా మొత్తం 1466 మందిని ఎంపిక చేశారు. అందులో ఏపీ నుంచి ఐదుగురు ఉన్నారు. వీరిలో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఎస్పీ అద్నాన్ నయిం అస్మి, అదనపు ఎస్పీ వి.భీమారావు, డీఎస్పీ ఆర్.జి.జయసూర్య, ఉండి ఎస్‌ఐ ఎండి.నసీరుల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్ ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాల డీఎన్‌ఏ విభాగం సహాయ సంచాలకుడు బొమ్మకంటి ఫణిభూషణ్ ఉన్నారు. సంచలనం సృష్టించిన చెక్క పెట్టెలో శవం కేసును గతేడాది డిసెంబరులో పశ్చిమగోదావరి జిల్లా పోలీసులు ఛేదించినందుకు ఈ అవార్డులు వరించాయి. ఫోరెన్సిక్ విభాగంలో దేశవ్యాప్తంగా 9 మందికి ఈ పురస్కారాలు లభించగా, అందులో ఆంధ్రప్రదేశ్ ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాల డీఎన్‌ఏ విభాగం సహాయ సంచాలకుడు ఫణిభూషణ్ ఒకరు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, ఏపీ ఫోరెన్సిక్ ప్రయోగశాల డైరెక్టర్ పాలరాజులు.. ఫణిభూషణ్‌ను అభినందించారు.

కాంట్రాక్టు కిల్లర్లు, ల్యాండ్‌మైన్ ముఠాలతో చెట్టాపట్టాలు

మెరైన్ ఇంజినీర్ నుంచి నేర సామ్రాజ్యంలోకి

- చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబుపై పలుమార్లు హత్యాయత్నం
- ఇదీ చింటూ నేపథ్యం



ఉరిశిక్ష తీర్పు అనంతరం కోర్టు ప్రాంగణంలో చేయి ఊపుతున్న ప్రధాన సూత్రధారి చింటూ

ఈనాడు, చిత్తూరు: 'శ్రీరామ్ చంద్రశేఖర్' ఈ పేరు చిత్తూరు జిల్లా ప్రజలకు పెద్దగా తెలియదు. 'చింటూ' అంటే మాత్రం భయాందోళనకు గురవుతారు. 1996 వరకు ముంబయిలో ఉద్యోగం, తర్వాత ఆరేళ్ల యూఏఈలో కాంట్రాక్టు ప్రాతిపదికన మెరైన్ ఇంజినీర్‌గా పని చేసిన అతను నేర సామ్రాజ్యంలోకి అడుగుపెట్టాడు. చిత్తూరు నగరంలో అరాచక శక్తిగా ఎదిగాడు. టార్గెట్ చేశాడంటే చంపేందుకైనా వెనుకాడడు. చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే జయచంద్రారెడ్డిని (సీకే బాబు) అంతమొందించేందుకు చింటూ అనేక ప్రయత్నాలు చేశాడు. 2006 మే 15, 16 తేదీల్లో చిత్తూరులో గంగ జాతర సమయంలో సీకే బాబును హతమార్చాలని వివిధ రాష్ట్రాల నుంచి కాంట్రాక్టు కిల్లర్లను రప్పించాడు. భక్తుల తాకిడి ఎక్కువగా ఉండటంతో ప్రణాళికలు పారలేదు. కర్ణాటకలోని పావగడలో పోలీసులు ఓ ముఠాను అరెస్టు చేయగా, ఏపీలోని చిత్తూరు ఎమ్మెల్యేను చంపేందుకు ప్రయత్నించినట్లు వారు తెలిపారు. దీంతో చింటూను పోలీసులు అరెస్టు చేశారు. ఆ కేసులో చింటూ, మరికొందరు నిర్దోషులుగా బయటపడ్డారు.

■ తర్వాత ఏడాది మరోసారి సీకే బాబు హత్యకు చింటూ స్కెచ్ గీశాడు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి షూటర్లను రప్పించి 2007 ఫిబ్రవరి 9న ఆయన కార్యాలయం వద్దే కాల్పులు జరిపించాడు. అంగరక్షకుడు వారిపై కాల్పులు జరిపాడు. ఎదురుకాల్పుల్లో హుస్సేన్ బాషా అనే ఏఆర్ గన్‌మన్ ప్రాణాలు విడిచారు. అదే ఏడాది డిసెంబరు 31న మరోసారి చంపాలని ప్రయత్నించి బాబు ఇంటి సమీపంలో కల్వర్టు వద్ద క్లైమోర్ మైన్లు పెట్టించాడు. ఆ ఘటనలో సురేంద్ర అనే గన్‌మన్ మరణించగా సీకేబాబు గాయాలతో బయటపడ్డారు.

కఠారి హత్యకూ రెక్కీ

కొంతకాలానికి చింటూకు మేనమామ కఠారి మోహన్‌తో ఆర్థిక, రాజకీయ విభేదాలు తలెత్తాయి. మోహన్ భార్య అనురాధ మేయర్ కావడం, ఆమె మాటలు విని మామ తనను దూరం పెడుతున్నాడని రగిలిపోయాడు. దీంతో వారిద్దరి హత్యకు పలుమార్లు రెక్కీ నిర్వహించి చివరకు ప్రాణాలు తీసేశాడు. ఈ హత్యలతో తనకు సంబంధం లేదని, బాధపడుతున్నానని వాంగ్మూలం ఇచ్చాడు. ఇప్పుడు ఉరిశిక్ష ఖరారైనా ఎలాంటి జంకు, పశ్చాత్తాపం లేకుండా కనిపించాడు.

విచారణ నుంచి తప్పుకొంటానన్న ఏపీపీ

మేయర్ దంపతుల హత్య కేసు విచారణ నుంచి తప్పుకొంటానని అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) 2022 జూన్‌లో కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ కీలక దశలో ఉండగా ఇలా చేయడం సరికాదని కోర్టు తేల్చిచెప్పింది. ఏపీపీపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తెచ్చారని అప్పట్లో కఠారి కుటుంబసభ్యులు ఆరోపించారు. ప్రధాన సాక్షి సతీష్‌నాయుడు సహా సాక్షుల్ని చింటూ గ్యాంగ్ పలురకాలుగా బెదిరించారు.

మా ఇంట్లో పెరిగి అమ్మ, నాన్నను హత్య చేశాడు

మా అన్న కంటే ఎక్కువగా చింటూను చూసుకున్నాం. మా ఇంట్లోనే పెరిగి అమ్మానాన్నలపై శత్రుత్వం పెంచుకొని దారుణంగా చంపేశాడు. సాక్ష్యం చెప్పకూడదంటూ చింటూ, అతని గ్యాంగ్ సాక్షులను బెదిరించారు. ఒకానొక సమయంలో మమ్మల్ని కోర్టు పరిసరాల్లోకే రానివ్వలేదు. అయినా సాక్షులు వారికి లొంగకుండా ధైర్యం చెప్పాం. ఆర్థికంగా ఇబ్బందులు పెట్టారు. తప్పు చేసిన వారికి శిక్ష పడాలి. హైకోర్టుకు వెళ్లినా ఇదే తీర్పు వస్తుందని ఆశిస్తున్నా.

- లావణ్య, కఠారి దంపతుల కుమార్తె

న్యాయం కోసం నిలబడ్డా

కఠారి మోహన్‌ను కాపాడేందుకు వెళితే నన్నూ కత్తితో పొడిచారు. తొలి సాక్షిగా ఉన్న నన్నూ, నా కుటుంబాన్ని చింటూ, ఆయన అనుచరులు బెదిరించారు. వారి వేధింపులు తట్టుకోలేక ఇతర ఊళ్లకు వెళ్లి తలదాచుకున్నాం. ఆర్థికంగా సమస్యలు సృష్టించారు. ఉద్యోగానికి వెళ్లకుండా చేశారు. న్యాయాన్ని గెలిపించాలని గట్టిగా నిలబడ్డా. హంతకులకు సరైన శిక్ష పడింది.

- సతీష్ నాయుడు, తొలి సాక్షి

రాజీ కోసం రాజకీయ ఒత్తిళ్లు

- బాధిత కుటుంబసభ్యులపై గంజాయి కేసు
- సాక్షులకే కాదు పోలీసులకూ బెదిరింపులు
- న్యాయాధికారులపైనా తప్పుడు ఆరోపణలు
- మేయర్ దంపతుల హత్య కేసులో శిక్ష నుంచి తప్పించుకునేందుకు చింటూ కుయుక్తులు

ఈనాడు, అమరావతి: చిత్తూరు మేయర్ దంపతుల హత్య కేసు నుంచి బయటపడటానికి నిందితులు ఎన్నో కుయుక్తులు పన్నారు. ప్రలోభాలకు, బెదిరింపులకు పాల్పడ్డారు. హత్య కేసు దర్యాప్తు చేసిన అప్పటి ఇన్‌స్పెక్టర్‌ను బెదిరించారు. దీనిపై ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు ఆధారంగా నిందితులపై కేసు నమోదయ్యింది. బాధిత కుటుంబసభ్యులపై రాజీ ఒత్తిడి తెచ్చి రాజీ కుదుర్చుకునేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. రాజీకి రానందుకు మృతుల కుమార్తె, అల్లుడు, కోడలిపై గంజాయి కేసు నమోదు చేయించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ప్రముఖ ప్రజాప్రతినిధులైన తండ్రీ కొడుకులు పార్టీ మారి వైకాపాలోకి రావాలని వారిని తీవ్ర ఒత్తిడికి గురిచేశారని చెబుతున్నారు. గతంలో నిందితుల తరఫున కేసుల్లో వాదనలు వినిపించిన న్యాయవాదిని ఈ కేసులో ప్రత్యేక పీపీగా నియమించుకొని కేసు నుంచి బయటపడేందుకు చింటూ, ఇతర నిందితులు పెద్ద కుట్ర పన్నారు. దాడిలో గాయపడిన సాక్షులను కిడ్నాప్ చేసి, బెదిరించేందుకు ప్రయత్నించారు. శిక్ష నుంచి తప్పించుకునేందుకు ప్రతి దశలో అవరోధాలు సృష్టించారు.

హైకోర్టులో తిప్పికొట్టిన సీనియర్ న్యాయవాది పోసాని: ఈ కేసులో నిందితులు వివిధ సందర్భాల్లో హైకోర్టులో సుమారు 50కి పైగా పిటిషన్లు దాఖలు చేశారు. బాధితుల పక్షాన సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, న్యాయవాది పి.సాయిసూర్య తేజ పోరాటం చేశారు. సాక్షులకు రక్షణ కల్పించారు. మృతుల కుటుంబసభ్యులపై తప్పుడు కేసులు నమోదు చేసే వారికి అండగా నిలిచారు. నిందితులు విచారణ కోర్టు న్యాయాధికారులపై తప్పుడు ఆరోపణలు చేస్తూ కేసును వారి వద్ద నుంచి బదిలీ చేయించుకోవడానికి, నచ్చిన న్యాయవాదిని ప్రత్యేక పీపీగా నియమింపజేసుకోవడానికి పన్నిన కుట్రలను అడ్డుకున్నారు. కేసు విచారణ ముందుకెళ్లకుండా కల్పించిన అవరోధాలను అధిగమించారు. నిందితుల బెయిలు పిటిషన్లలో బాధితుల తరఫున వాదనలు వినిపించి, బెయిలు మంజూరును తీవ్రంగా వ్యతిరేకించారు.

మేయర్ దంపతుల హత్య కేసులో ఐదుగురికి ఉరిశిక్ష

(మొదటి పేజీ తరువాయి)

జరిమానాలో రూ.50 లక్షలు మృతుల వారసులు, రూ.20 లక్షలను అప్పుడు హత్య ఆపడానికి ప్రయత్నించి తీవ్రంగా గాయపడిన వేలూరి సతీష్‌కుమార్ నాయుడికి చెల్లించాలని స్పష్టం చేసింది. చిత్తూరు ఆరో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎన్.శ్రీనివాసరావు శుక్రవారం ఈ మేరకు తీర్పు వెలువరించారు. చిత్తూరు కోర్టు చరిత్రలో ఒకే కేసులో ఐదుగురికి ఉరిశిక్ష పడటం ఇదే తొలిసారి.

తుపాకులు, కత్తులతో దారుణంగా హత్యలు

2015 నవంబరు 17న ఉదయం 11.45 గంటలకు నగరపాలక సంస్థ కార్యాలయంలోనే మేయర్ దంపతులను తుపాకీతో కాల్చి, కత్తులతో నరికి పాశవికంగా హత్య చేశారు. నిందితులు బురఖాలు ధరించి చేతిసంచుల్లో తుపాకులు, కత్తులతో మేయర్ ఛాంబర్‌లోకి ప్రవేశించారు. కఠారి అనురాధను తల, ఛాతీపై కాల్చారు. తనను చంపొద్దని ఆమె వేడుకున్నా చింటూ మనసు కరగలేదు. తీరా కాల్చి ఆమె మరణించిందని రుజువు చేసుకున్నాకే అక్కడి నుంచి కదిలారు. పక్క ఛాంబర్‌లో ఉన్న మోహన్ తప్పించుకోవాలని ప్రయత్నించగా కత్తులతో వెంటాడి నరికి, చంపారు. ఈ ఘటనపై అదేరోజు చిత్తూరు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది.

57 మంది విచారణ

ఈ కేసులో 130 మందిని సాక్షులుగా పేర్కొన్నారు. 57 మందిని న్యాయస్థానం విచారించింది. 2016 ఫిబ్రవరి 18న కోర్టులో ప్రవేశపెట్టిన ఛార్జిషీటులో 23 మందిని నిందితులుగా పేర్కొన్నారు. శ్రీకాళహస్తికి చెందిన కాసరం రమేష్ హత్యతో తనకు సంబంధం లేదని కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా ఉపశమనం లభించింది. మరో నిందితుడు శ్రీనివాసాచారి విచారణ కొనసాగుతుండగానే చనిపోయారు. దీంతో తుది విచారణ నాటికి 21 మంది నిందితులుగా ఉన్నారు.

ఏ1 నుంచి ఏ5 వరకు దోషులని, మిగిలినవారిపై అభియోగాలు రుజువు కాలేదని అక్టోబరు 24న జడ్జి తీర్పు ఇచ్చారు. అక్టోబరు 27న ఐదుగురు దోషుల కుటుంబ, సామాజిక, ఆర్థిక, మానసిక స్థితి, జైల్లో ఉన్న సమయంలో వారి ప్రవర్తనపై నివేదికలు ఇవ్వాలని చిత్తూరు జిల్లా ప్రొబేషన్ అధికారి, వైద్య బృందం, జైళ్ల సూపరింటెండెంట్లను న్యాయమూర్తి ఆదేశించారు. వీటిని పరిగణనలోకి తీసుకుని ఉరిశిక్ష విధించారు. బాధిత కుటుంబసభ్యులు అనుభవించిన వ్యథను నివేదిక రూపంలో ప్రత్యేక పీపీ శైలజ కోర్టుకు సమర్పించారు. దాన్ని పరిశీలించిన జడ్జి రూ.70 లక్షలు చెల్లించాలని చింటూను ఆదేశించారు.

తప్పుడు సాక్ష్యం చెప్పిన 14 మందికి నోటీసులు


ఘటన జరిగిన రోజు మేయర్ ఛాంబర్, నగరపాలక సంస్థ కార్యాలయంలో పలువురు ఉద్యోగులు, అధికారులు ఉన్నారు. అందులో 14 మంది కేసును నీరుగార్చడానికి న్యాయస్థానంలో తప్పుడు సాక్ష్యం ఇచ్చారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన జడ్జి వీరందరిపై ఎందుకు ప్రాసిక్యూట్ చేయకూడదో చెప్పాలంటూ షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. 10 రోజుల్లోపు వారి వివరణలను కోర్టుకు సమర్పించాలని ఒకటో పట్టణ సీఐను ఆదేశించారు.

పశ్చాత్తాపం మాటే లేని దోషులు

జడ్జి ఉరిశిక్ష విధించిన తర్వాత కూడా దోషుల్లో ఎలాంటి పశ్చాత్తాపం కనిపించలేదు. చింటూ ఏదో ఘనకార్యం చేసినట్టు చేయి ఊపుతూ, కోర్టు బయట అభివాదం చేశారు. న్యాయస్థానం ప్రాంగణంలోనే వైద్య పరీక్షలు చేసి, వారంట్లు సమర్పించాక ఐదుగురినీ కడప కేంద్ర కారాగారానికి తరలించారు. తీర్పు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. కఠారి అనుచరులు బాణసంచా కాల్చి, సంబరాలు చేసుకున్నారు.

కాకినాడలో విద్యుత్తు నౌకల తయారీ

కేంద్రంతో శాన్ మారిటైం షిప్పింగ్ సంస్థ ఎంవోయూ



కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్‌కు తమ ప్రాజెక్టుల గురించి వివరిస్తున్న శాన్ మారిటైం ఎండీ అహ్మద్ అలీషా

ఈనాడు, కాకినాడ: శాన్ మారిటైం షిప్పింగ్ సంస్థ విద్యుత్తు నౌకల తయారీలోనూ అడుగుపెట్టనుంది. కాకినాడ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ సంస్థ మూడు రోజుల కిందట ముంబయిలో నిర్వహించిన ఇండియా మారిటైం వీక్-2025లో కేంద్ర నౌకాశ్రయాలు, రవాణా, జలమార్గాల మంత్రిత్వశాఖతో ఎంవోయూ కుదుర్చుకుంది. జపాన్, నార్వే దేశాల సాంకేతిక పరిజ్ఞానంతో ఇక్కడ ఎలక్ట్రిక్ షిప్పులను తయారు చేయనున్నారు. దీని కోసం రూ.600 కోట్లు పెట్టుబడి పెట్టనున్నారు. రూ.200 కోట్లతో కాకినాడలోనే షిప్‌యార్డ్ అభివృద్ధి ప్రాజెక్టుకు మరో ఎంవోయూ కుదుర్చుకున్నట్లు శాన్ మారిటైం ఎండీ అహ్మద్ అలీషా తెలిపారు. సీఎం చంద్రబాబును కలిసి వివరించామని, ముంబయిలో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్ తమ ప్రాజెక్టులను చూసి అభినందించారని పేర్కొన్నారు.

13 జిల్లాల్లో ఆర్టీజీఎస్ కేంద్రాలు

ఈనాడు, అమరావతి: ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఒకే నమూనాలో పనిచేసే 13 ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటుచేస్తోంది. రాజధానిలోని ప్రధాన కేంద్రానికి వాటిని అనుసంధానం చేయనుంది. వాటి ఏర్పాటుకు మౌలిక సదుపాయాలు కల్పించి, అన్ని ప్రభుత్వ విభాగాల సమాచారాన్ని అక్కడి ఆర్టీజీఎస్ కేంద్రాలకు అనుసంధానం చేయనుంది. జిల్లాల్లో నిర్మించే కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలను ఆయా జిల్లాల కలెక్టర్లకు అప్పగించనుంది.

రాజధానిలో ఆధునిక హంగులతో కేంద్రం

రాష్ట్ర ఆర్టీజీఎస్ కేంద్రాన్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం సచివాలయం దగ్గర మల్టీపర్పస్ భవనాన్ని నిర్మిస్తోంది. ఆర్టీజీఎస్ సేవలను విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 750 సేవలను అందిస్తోంది. అవేర్ 2.0 వ్యవస్థ ద్వారా ఇస్రో సహకారంతో శాటిలైట్ సాయంతో వాతావరణ సమాచారాన్ని తెలుసుకోవచ్చు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వశాఖల సమాచారం ఒకేచోట ఉండేలా డేటా లేక్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఈ కార్యకలాపాలకు ఆర్టీజీఎస్ కేంద్రం అవుతుంది.

రాష్ట్రస్థాయి భవనాల్లో ప్రత్యేకతలు ఇవీ

■ రాష్ట్రస్థాయి ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ■ 264 మంది ఆపరేటర్లు పనిచేసేలా వర్క్‌స్టేషన్ టేబుళ్లు ■ 338 మందితో సమావేశం నిర్వహించేలా పెద్ద సమావేశ మందిరం ■ 14 మందితో సమావేశమయ్యేందుకు వీలుగా మినీ కాన్ఫరెన్స్ హాల్ ■ సీఎం, ఆర్టీజీఎస్ డైరెక్టర్ కార్యాలయాలు

ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఆర్టీజీఎస్ కేంద్రాల ఏర్పాటుకు 2018లోనే తెదేపా ప్రభుత్వం ప్రతిపాదించింది. కొన్ని జిల్లాల్లో పనులు ప్రారంభించింది. వైకాపా ప్రభుత్వం పనులను పక్కన పెట్టేసింది. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టులో కదలిక వచ్చింది. ఈ ఏడాది ఆఖరుకు రాష్ట్రస్థాయి కేంద్రంతో పాటు.. 13 జిల్లా ప్రాజెక్టులనూ పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఎన్‌సీసీ-మ్యాట్రిక్స్ ప్రాజెక్టు అమలు బాధ్యతలు నిర్వహిస్తోంది. థర్డ్‌పార్టీ ఆడిట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కమిటీ(పీఎంసీ)గా కాలేజ్ డిజైన్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవహరిస్తోంది.

జిల్లా ఆర్టీజీఎస్ కేంద్రాల్లో ఇలా..

■ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్
■ జిల్లా రియల్‌టైమ్ గవర్నెన్స్, సీసీటీవీ డేటా సెంటర్ ■ ఏపీ ఫైబర్‌నెట్ లిమిటెడ్ జిల్లాస్థాయి నెట్‌వర్క్ సెంటర్ ■ కలెక్టర్, ఎస్పీలు సమీక్షించేందుకు సమావేశ మందిరం.

పార్లమెంట్‌లో విశాఖ యువతి ప్రసంగం

అరుదైన అవకాశం దక్కించుకున్న గానప్రియ



విశాఖపట్నం(పెందుర్తి), న్యూస్‌టుడే : విశాఖ జిల్లా పెందుర్తి మండలం రాంపురం గ్రామానికి చెందిన మధుతూరి గానప్రియకు అరుదైన అవకాశం లభించింది. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా దిల్లీలోని పార్లమెంట్ భవనంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తన గళం వినిపించింది. ఏయూలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న గానప్రియ తండ్రి శ్రీను పెందుర్తిలో సెలూన్ దుకాణం నిర్వహిస్తున్నారు. తల్లి భాగ్యలక్ష్మి స్వచ్ఛంద సంస్థలో పని చేస్తున్నారు. అన్ని అంశాలపై పట్టు సాధించిన గానప్రియ... పార్లమెంట్‌లో జరిగే కార్యక్రమానికి నిర్వహించిన ఎంపిక పరీక్షలో సత్తా చాటారు. దీంతో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కించుకున్నారు. శుక్రవారం రాజ్యసభ సెంట్రల్ హాల్లో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని 'ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ గొప్పతనంపై ప్రసంగించి, అందరి ప్రశంసలు అందుకున్నారు.

గ్రహం అనుగ్రహం

1-11-2025 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; శరదృతువు, కార్తిక మాసం, శుక్లపక్షం
ఏకాదశి: రా. 2-41 తదుపరి ద్వాదశి
శతభిష: మ. 2-26 తదుపరి పూర్వాభాద్ర
వర్జ్యం: రా. 8-41 నుంచి 10-15 వరకు
అమృత ఘడియలు: ఉ. 7-18 నుంచి 8-53 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6-13 నుంచి 7-33 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6.02; సూర్యాస్తమయం: సా.5.27
సర్వ ఏకాదశి

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
నెల్లూరు	36.8	26.0
రాజమహేంద్రవరం	36.0	22.5
తిరుపతి	35.6	23.3
నరసాపురం	34.9	26.5
అనంతపురం	34.7	22.0
ఒంగోలు	34.5	25.4
విశాఖపట్నం	33.8	24.2
కడప	33.0	24.0
కర్నూలు	33.0	21.3
విజయవాడ	32.8	24.6
తాడేపల్లిగూడెం	32.0	29.0
శ్రీకాకుళం	32.0	25.0
గుంటూరు	31.0	27.0
విజయనగరం	30.0	23.0

కశ్మీర్ అంశంలో నెహ్రూ తప్పు చేశారు

ఏకతానగర్ (గుజరాత్): కశ్మీర్ విషయంలో జవహర్‌లాల్ నెహ్రూ చేసిన తప్పిదం.. దశాబ్దాల తరబడి దేశాన్ని సంక్షోభంలోకి నెట్టిందని ప్రధాన నరేంద్రమోదీ పేర్కొన్నారు. గుజరాత్‌లోని నర్మదా జిల్లా కేవడియాలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ఐక్యతా విగ్రహం వద్ద శుక్రవారం జరిగిన వేడుకల్లో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత తొలి ప్రధాని నెహ్రూపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 550కి పైగా సంస్థానాలను దేశంలో కలిపిన పటేల్.. కశ్మీర్ మొత్తాన్ని భారత్‌లో విలీనం చేయాలని ఆకాంక్షించారని, ఆ ప్రయత్నాన్ని నెహ్రూ అడ్డుకున్నారని ఆరోపించారు. ఆ తప్పు.. దశాబ్దాల తరబడి కశ్మీర్‌లో రక్తపాతం కొనసాగడానికి కారణమైందని నిందించారు. 'మిగతా సంస్థానాలను కలిపినట్లు.. మొత్తం కశ్మీర్‌ను భారత్‌లో కలపాలని పటేల్ ఆకాంక్షించారు. ఈ విషయం ప్రస్తుత యువతరంలో చాలా మందికి తెలియదు. స్వాతంత్ర్య భారత తొలి హోం మంత్రిగా చరిత్ర రాయడానికి సమయం వృథా చేయకూడదని.. చరిత్ర సృష్టించాలని పటేల్ విశ్వసించారు. నెహ్రూ అడ్డుకోవడంతోనే కశ్మీర్‌కు ప్రత్యేక రాజ్యాంగం లభించింది. కాంగ్రెస్ బలహీన విధానాల కారణంగానే కశ్మీర్‌లో కొంతభాగం.. పాకిస్థాన్ ఆక్రమణలోకి వెళ్లింది. ఆ తప్పునకు భారత్ భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చింది. ఉగ్రవాదానికి కాంగ్రెస్ తలవంచింది. సర్దార్ పటేల్ దూరదృష్టిని మరిచింది. కానీ మేం మరిచిపోలేదు. అందుకే అధికరణం 370ను రద్దు చేసి కశ్మీర్‌ను భారత్‌లో అంతర్భాగం చేశాం" అని మోదీ తెలిపారు. తన ప్రసంగంలో ఆపరేషన్ సిందూర్ అంశాన్ని కూడా ప్రధాని ప్రస్తావించారు. ఈ ఆపరేషన్‌తో భద్రత విషయంలో భారత్ రాజీపడబోదని, శత్రు భూభాగంలోని వెళ్లి మరీ దాడి చేయగలదన్న సందేశం ప్రపంచానికి వెళ్లిందని అన్నారు.



కేవడియాలో శుక్రవారం ఐక్యతా విగ్రహం వద్ద ప్రధాని మోదీ

పటేల్ కలను మోదీ నెరవేర్చారు: అమిత్ షా

దిల్లీలోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ స్మారకం వద్ద కేంద్ర హోంమంత్రి అమిత్ షా నివాళులర్పించారు. అనంతరం మేజర్ ధ్యాన్‌చంద్ జాతీయ స్టేడియంలో రన్ ఫర్ యూనిటీని ప్రారంభించారు. ఆ సమయంలో అధికరణం 370ని రద్దు చేయడం ద్వారా పటేల్ సమైక్య భారతదేశ కలను ప్రధాని మోదీ నెరవేర్చారని అమిత్ షా తెలిపారు. పటేల్ స్మారకం వద్ద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కూడా నివాళులర్పించారు. పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు, రాజ్యసభలో విపక్ష నేత ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ తదితరులు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు పుష్పాంజలి ఘటించారు.

చొరబాటుదార్లను తరిమికొడతాం

చొరబాటుదార్లు దేశ ఐక్యతకు, సమగ్రతకు అతి పెద్ద ముప్పు అని మోదీ పేర్కొన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చొరబాటుదార్లకు విపక్షాలు వత్తాసు పలుకుతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. అయినా తాము వెనక్కు తగ్గబోమని.. దేశం నుంచి చొరబాటుదార్లను తరిమికొడతామని అన్నారు. పటేల్ జయంతి సందర్భంగా మోదీ.. ప్రత్యేక నాణెం, స్టాంపు విడుదల చేశారు. సాయుధ దళాల కవాతును వీక్షించారు. దేశ ఐక్యతకు, సమగ్రతకు, భద్రతకు కట్టుబడతామని కార్యక్రమంలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు.



రాజేష్ పెంధార్కర్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా (కుడివైపు)

తూర్పు నావికాదళ చీఫ్‌గా వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా

విశాఖపట్నం(సింధియా), న్యూస్‌టుడే: తూర్పు నావికాదళ చీఫ్ (ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్)గా వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం కమాండ్ ముఖ్య కార్యాలయం ఐఎన్ఎస్ సర్కార్స్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈఎన్‌సీ చీఫ్‌గా పని చేసిన వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్‌కు నావికా సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సంజయ్ భల్లాకు గౌరవ వందనం సమర్పించారు. 'సంజయ్ భల్లా 1989 జనవరి 1న భారత నౌకాదళంలో చేరారు. ఆయన సర్వీసులో పలు కమాండ్లలో స్టాఫ్ నియామకాలు చేపట్టడంతోపాటు, కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ వార్‌ఫేర్ కోర్సులో నిపుణుడిగా, ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూ-22, మిలాన్-22 నిర్వహణలో సమర్థమంతంగా సేవలు అందించారు. నేవీ హెడ్‌క్వార్టర్స్‌లో చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా విధులు నిర్వర్తించారు. అతి విశిష్ట సేవా పతకం, నవ్‌సేనా పతకాలను అందుకున్నారు' అని నేవీ వర్గాలు వెల్లడించాయి.

మైనారిటీలకు ఉచిత 'టెట్' కోచింగ్

ఈనాడు, అమరావతి: మైనారిటీ అభ్యర్థులకు 'టెట్' పరీక్షకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు ఆ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. నవంబర్ మొదటి వారం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, కోచింగ్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ అందిస్తామని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సీఈడీఎం) వెబ్‌సైట్ www.apcedmmwd.org లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సంజయ్‌కి రిమాండ్ పొడిగింపు

ఈనాడు, అమరావతి: సీఐడీ, అగ్నిమాపక శాఖల్లో పని చేసిన సమయంలో అక్రమాలకు పాల్పడిన కేసులో ఐపీఎస్ అధికారి సంజయ్‌కి విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్ పొడిగించింది. శుక్రవారంతో రిమాండ్ ముగియనున్న నేపథ్యంలో ఏసీబీ అధికారులు నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. 14 వరకు రిమాండ్ పొడిగిస్తూ ఏసీబీ కోర్టు న్యాయాధికారి భాస్కరరావు ఉత్తర్వులిచ్చారు. దీంతో ఆయన్ను విజయవాడలోని జిల్లా జైలుకు తరలించారు.

శ్రీవారి మెట్టు మార్గంలో చిరుత సంచారం



భక్తులను అప్రమత్తం చేస్తున్న తితిదే భద్రతా సిబ్బంది

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి మెట్టు మార్గంలో చిరుత సంచారం శుక్రవారం భక్తులను కలవరపాటుకు గురిచేసింది. 150-200 మెట్ల మధ్య రోడ్డు దాటుతున్న చిరుతను భక్తులు చూసి, కేకలు వేశారు. స్థానికంగా పనిచేస్తున్న సులభ్ కార్మికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న తితిదే విజిలెన్స్, అటవీశాఖ సిబ్బంది భక్తులను అప్రమత్తం చేశారు. గుంపులుగా కొండపైకి పంపించేలా ఏర్పాట్లు చేశారు.

వారిని అలా పిలవరాదు..

భిక్షాటన నిషేధ చట్టంలోని లెప్పర్, ల్యూనాటిక్ పదాల్లో మార్పు

ఈనాడు, అమరావతి: భిక్షాటన నిషేధ చట్టంలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. 1977 నాటి ఈ చట్టంలో లెప్పర్, ల్యూనాటిక్ అనే పదాలు ఉన్నాయి. జాతీయ మానవ హక్కుల కమిషన్ వీటిని తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఆ మేరకు చట్టంలో లెప్పర్ అని ఉన్న చోట 'కుష్టు వ్యాధి సోకిన వ్యక్తి' అని, ల్యూనాటిక్ అని ఉన్న చోట 'మానసిక వ్యాధిగ్రస్థుడు' అని చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం సవరణలు ప్రతిపాదించింది. వీటిని ఇటీవల శాసనసభ, మండలిలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. తాజాగా గవర్నర్ కూడా ఆమోదించడంతో న్యాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.



కొవ్వు వినియోగ జీవక్రియలతో..

తక్కువ పిండిపదార్థాలు తీసుకున్నప్పుడు, ఉపవాసం చేసేటప్పుడు మన శరీరంలో ఉండే కొవ్వు జీవక్రియలకు ఉపయోగపడుతుంది.

ఈ స్థితిలో గల ప్రయోజనాలు..

✦ రక్తంలో చక్కెరస్థాయిలు స్థిరంగా ఉంటాయి. ✦ శక్తి ఉత్పాదన పెరుగుతుంది. ✦ శరీరాంతర్గత కొవ్వు కరుగుతుంది. ✦ కణస్థాయిలో వాపు ప్రక్రియ నెమ్మదిస్తుంది. ✦ కీటోన్స్ ద్వారా మెదడుకు అందే శక్తితో దాని చురుకుదనం పెరుగుతుంది.

– సుమిత్ శర్మ, వైద్యుడు

రాజధాని పనులపై 15 రోజులకోసారి సమీక్షిస్తా

- గడువులోగా పూర్తి చేయాల్సిందే
- అధికారులు, గుత్తేదారులకు ముఖ్యమంత్రి స్పష్టీకరణ



ఉండవల్లిలోని నివాసంలో సీఆర్డీఏపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రి నారాయణ, అధికారులు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో జాప్యం జరగడానికి వీల్లేదని అధికారులు, గుత్తేదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గడువులోగా పనులు పూర్తి చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీకి కూడా చెప్పానని, పనుల్లో వేగం పెంచాలని ఆయన ఆదేశించారు. పనుల పురోగతిని ఇకపై ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తానని చెప్పారు. రాజధాని పనుల పురోగతి, భూములిచ్చిన రైతులకు స్థలాల రిజిస్ట్రేషన్లు, సుందరీకరణ పనుల వంటి అంశాలపై సీఎం శుక్రవారం ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో అధికారులు, గుత్తేదారులతో సమీక్షించారు. ఏయే నిర్మాణాలు ఎంత శాతం పూర్తి చేశారు, లక్ష్యానికి ఇంకా ఎంత దూరంలో ఉన్నారు, నిర్మాణ కార్మికుల్ని, యంత్రాల్ని ఏ మేరకు మోహరించారు? ఏ పనుల్లో ఎక్కువ జాప్యం జరుగుతోంది వంటి అంశాలపై ప్రాజెక్టుల వారీగా అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. వర్షాలు, ఇతర కారణాలతో జరిగిన జాప్యాన్ని రాబోయే రోజుల్లో పనులు వేగవంతం చేయడం, ఎక్కువ మంది కార్మికుల్ని, యంత్రాల్ని మోహరించడం ద్వారా భర్తీ చేయాలని సీఎం సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో గడువులోగా పనులు పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. పనుల్లో నాణ్యత ప్రమాణాల్ని పక్కాగా పాటించాలన్నారు. ఇంకా కొన్ని సంస్థలు అవసరమైన మేరకు కార్మికుల్ని, యంత్రాల్ని మోహరించలేదని, అవి పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. రాజధాని పనులకు గ్రావెల్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా గనుల శాఖతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. గుత్తేదారులకు జాప్యం లేకుండా నెలకోసారి బిల్లులు చెల్లించాలని సూచించారు.

రైతులు ఇబ్బంది పడకుండా చూడండి

రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు కేటాయించిన స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై సీఎం ఆరా తీశారు. ఇంకా 2,471 మంది రైతులకు స్థలాలు రిజిస్టర్ చేయాల్సి ఉందని పురపాలక శాఖ మంత్రి నారాయణ వివరించారు. చిన్నచిన్న సాంకేతిక, వ్యక్తిగత అంశాల వల్ల అవి పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. సమస్యలు పరిష్కరించి వేగంగా స్థలాల రిజిస్ట్రేషన్‌కు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. త్వరలో రాజధాని రైతులతో సమావేశమవుతానని చెప్పారు. రాజధానిలో నిర్మాణాలకు ఎంత ప్రాధాన్యతనిస్తామో గ్రీనరీ, సుందరీకరణ, పరిశుభ్రతకూ అంతే ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. రాజధానిలో స్థలాలు తీసుకున్న సంస్థలు వాటి భవనాల్ని ఐకానిక్‌గా నిర్మించేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు. అమరావతి ప్రపంచశ్రేణి నగరంలా కనిపించాలంటే ఆకాశ హర్మ్యాలుండాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో సీఆర్‌డీఏ, ఏడీసీ, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, గుత్తేదారు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నెట్‌వర్క్ ఆసుపత్రుల సమ్మె విరమణ



ఆశా ప్రతినిధులతో చర్చిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ఈనాడు, అమరావతి: అక్టోబరు 10 నుంచి చేస్తున్న సమ్మెను విరమిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆశా) ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవలు పునరుద్ధరిస్తామని శుక్రవారం తెలిపింది. బకాయిలన్నీ వన్ టైం సెటిల్‌మెంట్ కింద చెల్లిస్తామన్న ప్రభుత్వ ప్రతిపాదనకు నెట్‌వర్క్ ఆసుపత్రులు అంగీకరించాయి. గురువారం ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు సీఈఓ ఇతర అధికారులతో సమావేశమైన ఆశా ప్రతినిధులు.. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో మరోసారి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి సమస్య తీసుకెళ్లామని, బ్యాంకుల రుణాలతో బకాయిలన్నీ ఒకేసారి చెల్లించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సమ్మె ప్రారంభించాక ప్రభుత్వం రెండు విడతలుగా రూ.488 కోట్లు విడుదల చేసిందని, త్వరలో మరో రూ.250 కోట్లు చెల్లిస్తుందన్నారు. పెండింగు బిల్లుల పరిశీలనలో జాప్యం లేకుండా 50 మంది వైద్యులను నియమిస్తామని వెల్లడించారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ దక్కడంతో సమ్మె విరమిస్తున్నట్లు ఆశా ప్రతినిధులు పేర్కొన్నారు.

★ "మా అనుమానాలు మంత్రి నివృత్తి చేశారు. ప్రభుత్వం స్పందించిన తీరు సంతృప్తినివ్వడంతో సమ్మె విరమించాం. రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవలు ఈరోజు నుంచి పూర్తిస్థాయిలో ప్రారంభిస్తాం. యూనివర్సల్ ఆరోగ్య బీమా అమలుకు ఇన్సూరెన్స్ కంపెనీలకు బిడ్డింగ్ ప్రక్రియలో మమ్మల్నీ భాగస్వాములను చేస్తామన్నారు. ఆరోగ్య బీమా అమలుతో ప్రైవేట్ ఆసుపత్రులకు అన్యాయం జరగదని హామీ ఇచ్చారు" అని ఆశా అధ్యక్షుడు డాక్టర్ కె.విజయ్‌కుమార్ తెలిపారు.

బెల్ట్‌షాపులు ఉండటానికి వీల్లేదు

- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఎక్కడ కూడా బెల్ట్‌షాపులు ఉండటానికి వీల్లేదని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అక్రమంగా ఎక్కడైనా మద్యం తయారు చేస్తే వారిపై ఉక్కుపాదం మోపాలని తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎక్సైజ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని 25 జిల్లాలను ఇప్పటికే నాటుసారా రహితమని ప్రకటించామని, కాకినాడ జిల్లాను కూడా అదే విధంగా తీర్చిదిద్దాలన్నారు. నవోదయం 2.0 కార్యక్రమం, ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలో ఇటీవల వెలుగుచూసిన నకిలీ మద్యం రాకెట్ కేసుల దర్యాప్తు పురోగతిపై ఆరా తీశారు. 'ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ఇప్పటి వరకు 1.69 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. 4.60 లక్షల మద్యంబాటిళ్లు స్కాన్ చేశారు. ఈ యాప్‌పై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం' అని అధికారులు మంత్రికి వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా, కమిషనర్ శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ పాల్గొన్నారు.

వైద్య విద్య ఇన్‌సర్వీస్ కోటా 20 శాతానికి పెంపు

ఈనాడు, అమరావతి: పీహెచ్‌సీ వైద్యుల కోరిక మేరకు 2025-26 విద్యా సంవత్సరానికి క్లినికల్ స్పెషాలిటీల్లోని అన్ని పీజీ సీట్లలో ఇన్‌సర్వీస్ కోటాను ప్రభుత్వం 15 శాతం నుంచి 20 శాతానికి పెంచింది. రాష్ట్ర ప్రభుత్వ కోటాలోని 50 శాతం సీట్లలో.. ప్రభుత్వ వైద్యశాలల్లో పని చేస్తున్న ఇన్‌సర్వీస్ వైద్యులకు ఈ రిజర్వేషన్ వర్తిస్తుందని తెలిపింది. ఈ మేరకు శుక్రవారం వైద్యారోగ్య- కుటుంబ సంక్షేమ శాఖ సవరణ ఉత్తర్వులు జారీ చేసింది.

డిజిటల్ అంతరాలు తొలగాలి

- 'వీఐటీ చెన్నై' టెక్నోవిట్-25లో వక్తలు



ఓ యంత్రం పనితీరు తెలుసుకుంటున్న రాచా అరిబార్గ్. చిత్రంలో జీవీ సెల్వం, ప్రిన్స్ జయకుమార్ తదితరులు

చెన్నై(వడపళని), న్యూస్‌టుడే: వ్యవస్థీకృత నేరాలకు వ్యతిరేకంగా పోరాడటానికి యువత సాంకేతికతను ఉపయోగించుకోవాలని చెన్నైలోని రాయల్ థాయ్ కాన్సుల్ జనరల్ రాచా అరిబార్గ్ సూచించారు. వీఐటీ చెన్నైలో మూడు రోజుల పాటు జరిగే 'టెక్నోవిట్-25' శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమంలో అరిబార్గ్ మాట్లాడుతూ 'ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ అంతరం ఉంది. యువకులు పెద్దలతో కొంత సమయం గడపాలి. లేదంటే వారు తమ దైనందిన జీవితంలో సాంకేతికతను ఉపయోగించుకోకుండా వెనుకబడిపోతారు' అని పేర్కొన్నారు. వీఐటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ జీవీ సెల్వం మాట్లాడుతూ అమెరికా, భారత్ మధ్య ఇటీవల పరిణామాల నేపథ్యంలో ఉన్నత విద్యకు వెళ్లే భారతీయుల సంఖ్య 44శాతం తగ్గిందని, భారత్‌లో 'మేక్ ఇన్ ఇండియా' పుంజుకుంటోందని తెలిపారు. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ప్రిన్స్ జయకుమార్ ప్రసంగిస్తూ 'గత మూడు దశాబ్దాల్లో ప్రపంచ ఐటీ సేవలకు భారత్ రాజధానిగా మారింది. వచ్చే దశాబ్దంలో ఆవిష్కరణల రాజధానిగా ఉద్భవిస్తుంది. అందుకు యువత నుంచి భారీ సహకారం ఉంటుంది' అని అభిప్రాయపడ్డారు. భారత్‌తోపాటు 10 దేశాల నుంచి 10 వేల మంది విద్యార్థులు పాల్గొంటున్న టెక్నోవిట్‌లో విజేతలకు రూ.10 లక్షలకు పైగా విలువ చేసే బహుమతులు అందించనున్నారు.

పరకామణిలో చోరీ కేసు రాజీ..

ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు

- కౌంటర్లు వేయాలని రవికుమార్, ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ తదితరులకు ఆదేశం
- లోక్‌అదాలత్‌లో రాజీ చట్టబద్ధతను తేల్చేందుకు ధర్మాసనం విచారణ
- తదుపరి విచారణ 17కు వాయిదా

ఈనాడు, అమరావతి: తితిదే పరకామణిలో చోరీ కేసును రాజీ చేస్తూ లోక్ అదాలత్ ఇచ్చిన ఉత్తర్వుల (అవార్డు) చట్టబద్ధతను తేల్చేందుకు సుమోటో వ్యాజ్యంపై శుక్రవారం హైకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. చోరీ ఆరోపణలు ఎదుర్కొంటున్న సీవీ రవి కుమార్‌తోపాటు ప్రతివాదులైన పరకామణి అప్పటి అసిస్టెంట్ విజిలెన్స్, సెక్యూరిటీ అధికారి (ఏవీఎస్‌వో) వై.సతీష్‌కుమార్, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి, ఏపీ న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, తిరుపతి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, సీఐడీ డీజీ, తితిదే ఈవో, సీవీఎస్వో, తిరుమల మొదటి పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోలకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 17కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, జస్టిస్ సుభేందు సామంతతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ ఉత్తర్వులిచ్చింది.

2023లో వైకాపా హయాంలో తితిదే పరకామణిలో జరిగిన కుంభకోణంపై సీఐడీతో దర్యాప్తు జరిపించాలని కోరుతూ జర్నలిస్ట్ ఎం.శ్రీనివాసులు హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. పరకామణిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి సీవీ రవి కుమార్ పెద్ద ఎత్తున డాలర్లు, బంగారం అపహరించారన్నారు. దీనిపై 2023 ఏప్రిల్ 29న తిరుమల పోలీసులకు ఫిర్యాదు చేసిన ఏవీఎస్‌వో సతీష్‌కుమార్.. తర్వాత అనూహ్యంగా నిందితుడు రవికుమార్‌తో స్వచ్ఛందంగా లోక్ అదాలత్ (తిరుపతి మొదటి తరగతి రెండో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్) వద్ద రాజీ చేసుకున్నారన్నారు.

చట్టబద్ధతను తేల్చేందుకు ధర్మాసనానికి..

గత నెల 27న ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్.. ఈ వ్యవహారంపై లోతైన దర్యాప్తు చేయాలని సీఐడీని ఆదేశించారు. చోరీకి పాల్పడిన రవికుమార్, ఆయన కుటుంబసభ్యులు కూడబెట్టిన స్థిర, చరాస్తులతోపాటు బ్యాంక్ ఖాతాలపై ఏసీబీ విచారణకు ఆదేశించారు. రవికుమార్, ఆయన కుటుంబసభ్యులు విక్రయించిన, ఇతరులకు బదలాయించిన ఆస్తులపైనా దర్యాప్తు చేయాలని స్పష్టం చేశారు. చోరీ కేసు రాజీకి అనుమతిస్తూ లోక్ అదాలత్ ఇచ్చిన ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చేందుకు ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనానికి నివేదించే నిమిత్తం తీర్పు ప్రతిని సీజే వద్ద ఉంచాలని ఆదేశించారు. దీంతో సీజే ఈ వ్యవహారాన్ని జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, జస్టిస్ సుభేందు సామంతలతో కూడిన ధర్మాసనానికి అప్పగించారు.

మాజీ ఎమ్మెల్యే శివేరి సోమ కుమారుడికి.. డిప్యూటీ తహసీల్దారు ఉద్యోగం

ఈనాడు, అమరావతి: మావోయిస్టుల చేతిలో హత్యకు గురైన మాజీ ఎమ్మెల్యే శివేరి సోమ కుమారుడు సురేశ్ కుమార్‌కు డిప్యూటీ తహసీల్దారుగా ఉద్యోగం ఇస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. 2018 సెప్టెంబరులో అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే శివేరి సోమ మావోయిస్టుల దాడిలో మృతి చెందారు. సోమ కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ఆ సమయంలో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. దీనికి సంబంధించిన పత్రాలు కూడా ప్రభుత్వానికి అందాయి. అయితే వైకాపా ప్రభుత్వ హయాంలో అయిదేళ్లపాటు ఈ దస్త్రాన్ని పక్కన పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేక కేసుగా పరిగణిస్తూ రెవెన్యూ శాఖ జోన్-1 పరిధిలో డిప్యూటీ తహసీల్దారుగా నియమించాలని ఆదేశించింది.

ఆరో తరగతి విద్యార్థినిపై అకృత్యం

- చాక్లెట్లు ఇస్తూ మాయమాటలు చెప్పి అత్యాచారం
- ఐ.పోలవరం మండలంలో ఘటన
- పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు



నిందితుడు రాయపురెడ్డి బాబీ

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: అభం శుభం తెలియని బాలికకు చాక్లెట్లు ఇస్తూ..మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డ ఉదంతమిది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలంలో ఈ అమానవీయ ఘటన జరిగింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన దంపతులకు కుమార్తె(11), కుమారుడు(9) ఉన్నారు. రెండేళ్లక్రితం భర్త చనిపోవడంతో అదే గ్రామంలోని పుట్టింటి వద్ద ఉంటూ పిల్లలిద్దరినీ ఆమె పోషిస్తున్నారు. బాలిక ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన వరుసకు బంధువయ్యే రాయపురెడ్డి వెంకటసత్యకృష్ణ (బాబీ)(52) ఇటీవల బాలిక ఇంటి ముందుకు వచ్చి చాక్లెట్లు ఇచ్చి వెళ్లడాన్ని గమనించిన తల్లి కుమార్తెను ప్రశ్నించింది. తనకు, స్నేహితురాలికి బాబీ అప్పుడప్పుడు చాక్లెట్లు ఇస్తుంటాడని.. పలుమార్లు అతని ఇంటికి, అతని సోదరుడి ఇంటికీ తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడని.. విషయం బయటకు చెబితే చంపుతానని బెదిరించాడని వివరించింది. దీంతో తల్లి గురువారం పోలీసులను ఆశ్రయించారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం టి.కొత్తపల్లి సీహెచ్‌సీకి తరలించారు. నిందితుడిపై పోక్సో సహా వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఐ.పోలవరం ఎస్సై రవీంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, ముమ్మిడివరం సీఐ మోహన్‌కుమార్ బాధితురాలి ఇంటికి వెళ్లి విచారణ చేపట్టారు. బాబీ మాయమాటలు చెప్పి బాలికపై పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడినట్లు విచారణలో తేలిందని.. అతడిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. నిందితుడు ఐ.పోలవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యాకమిటీ ఎక్స్ అఫీషియో సభ్యుడు. విద్యార్థులకు క్రీడలపై అప్పుడప్పుడు పాఠశాలకు వెళ్లి తర్ఫీదు ఇస్తుంటాడు. గతంలోనూ ఇతను పలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు తెలుస్తోంది.

మహిళా కమిషన్ సీరియస్

ఈ ఘటనపై ఏపీ మహిళా కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కమిషన్ ఛైర్‌పర్సన్ డా.రాయపాటి శైలజ స్పందించారు. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించారు. నిందితుడిని తక్షణమే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి లేఖ రాశారు. 48 గంటల్లోగా పూర్తి నివేదికను సమర్పించాలన్నారు. బాధితురాలికి తక్షణ రక్షణ, వైద్య సహాయం, చట్టపరమైన మద్దతు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కార్యాలయానికి ఆదేశాలు జారీచేశారు.

టిడ్కోకు రూ.540 కోట్లు మంజూరు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పట్టణ మౌలిక సదుపాయాల కల్పన సంస్థ(టిడ్కో)కు రూ.540 కోట్ల విడుదలకు ప్రభుత్వం పరిపాలన అనుమతులిచ్చింది. హడ్కో నుంచి తీసుకున్న రుణం చెల్లించేందుకు ఈ మొత్తాన్ని మంజూరు చేసింది. ఈ మేరకు పురపాలక పట్టణాభివృద్ధిశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఈనాడు

వాణిజ్య పోరుకు తాత్కాలిక విరామం

సహకార భావనతో స్వచ్ఛమైన భాగస్వామ్యాలను, అంతర్జాతీయ సంబంధాలను అభివృద్ధి పరచుకోవడం సాధ్యమేనా? అమెరికా, చైనాలు ఎప్పటికైనా నిజమైన పరస్పర విశ్వాసాన్ని పెంపొందించుకోగలవా? అంటూ హెన్రీ కిసింజర్ సందేహపడ్డారు. ఒకరికి జరిగే లాభం మరొకరికి నష్టమయ్యే పద్ధతిలో వాషింగ్టన్, బీజింగ్ సంబంధాలు ఉండాల్సిన అవసరం లేదని ఆయన విశ్లేషించారు. కొన్ని అంశాలపై ఏకాభిప్రాయ సాధన కష్టమే కావచ్చు కానీ, అంతమాత్రాన ఘర్షణలకు దిగితే అసలుకే మోసం వస్తుందని హెచ్చరించారు. దానికి భిన్నంగా నడుచుకుంటూ, చైనాతో వ్యవహారశైలిని ఎప్పటికప్పుడు మార్చుకుంటూ వచ్చిన అమెరికా- ప్రపంచాధిపత్య కాంక్షతో బీజింగ్ బుసలుకొట్టడం ప్రారంభించిన దరిమిలా ఎనిమిదేళ్ల క్రితం దాన్ని వ్యూహాత్మక ప్రత్యర్థిగా ప్రకటించింది. వాణిజ్య యుద్ధాలు, సాంకేతికతలపై ఆంక్షలతో చైనాను కట్టడి చేయడానికి ప్రయత్నించింది. ఆ రెండు అగ్ర ఆర్థికశక్తుల మధ్య దట్టమైన ఘర్షణాత్మక వాతావరణం మూలంగా ప్రపంచ జీడీపీకి 0.8 శాతం మేర కోతపడనుందని 2019లో ఐఎంఎఫ్ అంచనా వేసింది. ఆ తరవాత కాస్త ఉపశమించిన పరిస్థితులు- డొనాల్డ్ ట్రంప్ రెండోసారి శ్వేతసౌధాధిపతి అయ్యాక మళ్లీ విషమించాయి. ట్రంప్ సుంకాలకు ప్రతిగా అరుదైన ఖనిజాల సరఫరాను చైనా బిగబట్టడంతో ఉభయపక్షాల నడుమ ఉద్రిక్తతలు ఎగదన్నాయి. ఈ నేపథ్యంలో ఇరుదేశాల అధ్యక్షుల తాజా సమావేశం సఫలం కావడం- విశ్వ వాణిజ్య సమీకరణాలను మార్చేస్తున్న అవాంఛనీయ సమరానికి తాత్కాలికంగానైనా విరామం ఇవ్వనుంది!

బహుళపక్ష సహకార వేదికలను కాలదన్నుతూ అవధులు దాటిన ఆర్థిక జాతీయవాదాన్ని తలకెత్తుకున్న ట్రంప్- విచక్షణారహిత సుంకాల బాదుడుతో అంతర్జాతీయ సరఫరా గొలుసులను తీవ్ర ఒడుదొడుకుల్లోకి నెట్టారు. చైనాపైనా అదే స్థాయిలో గుడ్లురిమారు. అమెరికా వ్యవసాయోత్పత్తుల దిగుమతులను నియంత్రించడం మొదలు అరుదైన ఖనిజాలపై ఆధిపత్యాన్ని ఆయుధంగా ప్రయోగించడం, తన ఎగుమతులకు ప్రత్యామ్నాయ మార్కెట్లను చూసుకోవడం తదితరాల ద్వారా బీజింగ్- ట్రంప్ టారిఫ్‌లకు భయపడేది లేదని తేల్చిచెప్పింది. అలా సంక్షోభం ముదురుతుండటంతో చైనాతో సంధి చేసుకోక తప్పని పరిస్థితి అమెరికాకు అనివార్యమైంది. ఆ క్రమంలో సోయాబీన్ల కొనుగోలుకు చైనాను ఒప్పించడం వంటి బుసాన్ భేటీ ఫలితాలు స్వదేశంలో ట్రంప్‌నకు రాజకీయ లబ్ధి చేకూర్చుతాయి. అయితే, అంతర్జాతీయ వ్యవహారాల్లో చైనాకు తమతోపాటు అగ్రాసనం వేయించే ధోరణిని అమెరికా గత అధ్యక్షులెవరూ బహిరంగంగా ప్రదర్శించలేదు. దానికి మారుగా 'జీ-2' అంటూ అమెరికా, చైనాల పరపతిని సమంచేస్తూ ట్రంప్ సంబోధించడం- ప్రపంచ పెత్తనంకోసం ఉవ్విళ్లూరుతున్న బీజింగ్‌కు 'గుర్తింపు' పరంగా దక్కిన పెద్ద విజయమే!

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో గడచిన కొన్నేళ్లలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అక్కడ చైనా ప్రాబల్య విస్తరణను అడ్డుకోవడానికి ఇండియా, ఆస్ట్రేలియా, జపాన్, అమెరికాలు చతుర్భుజ కూటమిగా ఏర్పడ్డాయి. లోగడ క్వాడ్‌కు గట్టిగా మద్దతు పలికిన ట్రంప్ ఇప్పుడు స్వీయ ప్రయోజనాల వెంపర్లాటలో దాని భవితను అనిశ్చితిలోకి నెట్టేస్తున్నారు. జిన్‌పింగ్‌తో చెయ్యికలిపి చైనాపై సుంకాలను పదిశాతం తగ్గించిన ఆయన- వాణిజ్య ఒప్పంద సాకార ప్రయత్నాల్లో భాగంగా పరోక్షంగా ఇండియాపై ఒత్తిడి పెంచుతున్నారు. ఈ పరిస్థితుల్లో వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని నిలబెట్టుకుంటూ జాతీయ ప్రయోజనాల పరిరక్షణకు భారతావని ఆచితూచి అడుగులు వేయాలి!




ఇది నాది, అది నీది అనుకునేవాళ్లది సంకుచిత మనస్తత్వం. ఆ హద్దుల్ని అధిగమించినవారికే ప్రపంచమంతా ఒకే కుటుంబమన్న భావన కలుగుతుంది.

– జస్టిస్ రమేశ్ చంద్ర లహోటీ, మాజీ సీజేఐ

తెలివి - వివేకం

తెలివికి వివేకానికి తేడా ఉంది. ప్రతి జీవికీ దాని స్థాయి తెలివి దానికుంటుంది. దాంతోనే అవి కూడు, గూడు సంపాదించుకుంటాయి. శత్రువు నుంచి రక్షణ పొందుతాయి. అయితే ఆ తెలివిని ఎందుకు ఎలా వాడాలో నిర్ణయించుకునే సామర్థ్యమే వివేకం. అది మనిషికి మాత్రమే సొంతం. మనిషి జీవితాన్ని సార్థకం చేసుకోవడానికి వివేకం అవసరం. సకల జీవులు ఆ పరమాత్ముడి అంశతో జన్మించినవే అనే వివేకం, లోకానికి తగిన మేలుచేస్తూ జీవించాలనే జ్ఞానాన్ని ఇస్తుంది.

బాల్యంలో ఎవరికీ జీవితం గురించి ఏ విధమైన అవగాహనా ఉండదు. ఏ సమయానికి ఎలా నడచుకోవాలో ఏమీ తెలియదు. అవన్నీ పెద్దలే పిల్లలకు నేర్పుతారు. ఇంటా బయటా ఎక్కడ ఎలా ఉండాలో, ఏవి తినవచ్చో ఏవి తినకూడదో, ఎవరు ఎవరితో ఎలా ప్రవర్తించాలో... అన్నీ ఇతరులను చూసి కొన్ని, అనుభవంతో మరికొన్ని నేర్చుకుంటారు. ఆ విషయ పరిజ్ఞానం గురించి మన పెద్దలు, శ్రేయోభిలాషులైన పూర్వికులు వివేకంతో మార్గదర్శకత్వం చేశారు. అయితే స్వార్థం మితిమీరినప్పుడు వివేకం నశిస్తుంది. జీవితమంటే ఆధ్యాత్మిక, భౌతిక అనుభూతుల కలయిక. ఆ రెండింటి ప్రగతికీ వివేకం అవసరం. 'వినదగునెవ్వరు చెప్పిన' అని సుమతీ శతకకారుడు అన్నట్లు ఎవరి మాటైనా వినవచ్చు. చేయదగింది, చేయకూడనిది అని విశ్లేషించుకుంటూ ధర్మాధర్మ విచక్షణతో వివేకిగా ఉండాలి. ఎవరైనా ఉన్నత స్థితికి ఎదగాలని కోరుకోవడం సహజమే. ఆ కోరిక వల్ల పరుల శ్రేయస్సుకు భంగం కలిగినట్లైతే అది ధర్మమైన కోరిక కాదు. ధర్మంగా, నిర్భయంగా జీవించడానికి వివేకమే మార్గదర్శకం అవుతుంది. వివేకవంతుల ఉనికి లోకానికి శ్రేయోదాయకం.



అంతర్యామి

మనిషి వివేకవంతమైన జంతువు అని ఆంగ్లంలో నానుడి. కొన్ని జంతువులలో సైతం వివేకాన్ని గమనించవచ్చు. పెంపుడు జంతువులు తమ యజమాని ఆదేశాలను అర్థం చేసుకుంటాయి. అతడి అనుమతి లేకుండా ఏ పనీ చేయవు. ఆహారం తమ ఎదురుగా ఉన్నా తినమని చెబితే కానీ ముట్టుకోవు. ఆ వివేకం నేర్పేవారు ఉండరు కాబట్టే వీధికుక్కలు తమ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తాయి. అట్లాగే నేడు కొందరి ప్రవర్తనలోనూ వివేకం కొరవడుతోంది. దానివల్ల సమాజం అస్తవ్యస్తమవుతోంది.


ఇతరులకు ఇబ్బంది కలుగకుండా తమ అవసరాలూ ఆకాంక్షలపై కొంత అదుపు పాటించడం వివేకవంతుల లక్షణం. అదే ఆధ్యాత్మిక సాధనలో 'లోకా సమస్తా సుఖినోభవంతు' అనే భావనను అర్థవంతం చేస్తుంది. ఆ సాధనలో అంతర్భాగమైన దైవభక్తిని ప్రబోధించడంతో పాటు లోకానికి సరైన మార్గదర్శకత్వం వహించిన నరేంద్రుడు వివేకానందుడిగా ఆదర్శప్రాయుడు అయ్యాడు. పరుల శ్రేయస్సు సైతం ప్రధానం అనే వివేకమే మానవత్వం. జీవులలో మానవుడు వివేకవంతుడు అనే భావనకు అదే ప్రామాణికం.

– దువ్వూరి రామకృష్ణ వర ప్రసాదు

సొంత కాళ్లపైనే స్థిరమైన ప్రగతి

భారత ఆర్థిక రథాన్ని గత మూడు దశాబ్దాలుగా రెండు గుర్రాలు పరిగెత్తిస్తున్నాయి. ఐటీ-సమాచార సాంకేతిక పరిజ్ఞాన రంగం (ఐటీ), విదేశాల నుంచి స్వదేశానికి భారతీయులు పంపుతున్న డబ్బులు. ఐటీ, ప్రవాసుల జమలు దేశానికి భారీగా విదేశీ మారక ద్రవ్య నిల్వలను సమకూర్చాయి. లక్షల్లో ఉద్యోగాలను సృష్టించాయి. భారత్‌ను బలమైన ఆర్థిక శక్తిగా నిలబెట్టాయి. అయితే, ఈ వెలుగుల వెనుక దాగిన అసమతుల్యత మన ఆర్థిక భవితను ప్రభావితం చేయవచ్చు!

భారత్ నుంచి ఐటీ సేవల ఎగుమతులు 2023-24 ఆర్థిక సంవత్సరంలో 19,400 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. బెంగళూరు, హైదరాబాద్, పుణె, ముంబయి తదితర నగరాల్లో ఐటీ సంస్థల్లో 54 లక్షల మంది పనిచేస్తున్నారు. గల్ఫ్ దేశాల్లోని ప్రవాస భారతీయ కార్మికులు, సిలికాన్ వ్యాలీలోని ఐటీ నిపుణులు, ఇతరులు స్వదేశానికి పంపిన విదేశీ మారకద్రవ్యం 2024-25లో 13,546 కోట్ల డాలర్లకు చేరుకుంది. కానీ, ఈ జమలకన్నా సరకుల ఎగుమతుల ద్వారానే భారత్ ఎక్కువ విదేశీ ద్రవ్యం ఆర్జిస్తోందనే వాస్తవం మరుగున పడిపోతోంది. 2023-24లో భారత్ సరకుల ఎగుమతుల ద్వారా 43,700 కోట్ల డాలర్ల విదేశీ మారకాన్ని ఆర్జించింది. భారతదేశ సరకుల ఎగుమతుల్లో పెద్ద వాటా (26.7శాతం) ఇంజినీరింగ్ వస్తు ఎగుమతులదే. వీటిలో విదేశీ విడిభాగాలే ఎక్కువ. మన ఎగుమతుల్లో వ్యవసాయ సరకులు, అనుబంధ ఉత్పత్తుల వాటా 11.9శాతం. ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల వాటా 8.8శాతంగా ఉంది. భారత్ భారీగా స్మార్ట్‌ఫోన్లను ఎగుమతి చేస్తున్నా వాటిలోని విడిభాగాలు చైనా, దక్షిణ కొరియాల నుంచి దిగుమతి అవుతున్నాయి. మన వ్యాపార సరకుల ఎగుమతుల్లో ఫార్మా ఉత్పత్తుల వాటా ఏడు శాతం. భారత్ నేడు ప్రపంచానికి ఫార్మా రాజధానిగా నిలుస్తోంది. అయితే, కార్మికులను అధికంగా నియోగించే జౌళి రంగాన్ని మనదేశం నిర్లక్ష్యం చేయడంతో బంగ్లాదేశ్, వియత్నాం దూసుకుపోతున్నాయి.



భారత్ చేజార్చుకున్న అవకాశాలు

చైనా, దక్షిణ కొరియా, వియత్నాం, తైవాన్‌ల అభివృద్ధిని పరిశీలిస్తే భారత్ ఏం పోగొట్టుకుందో అర్థమవుతుంది. 'మేడిన్ చైనా' పథకంతో ముందుకుసాగిన డ్రాగన్ విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, సొంత నవీకరణలను సాధించింది. నేడు కృత్రిమ మేధ, క్వాంటమ్ వంటి హైటెక్ రంగాల్లో అమెరికాను సవాలు చేస్తోంది. చైనా ప్రభుత్వం మొదట భారీ పరిశ్రమల్లో పెద్దయెత్తున పెట్టుబడులు పెట్టి విస్తృత ఉపాధి, వ్యాపార అవకాశాలను సృష్టించింది. ఇతర దేశాల ఉత్పత్తులను కూర్పు చేసే దశ నుంచి తానే సొంతంగా వస్తువులను ఉత్పత్తి చేసే స్థితికి ఎదిగింది. ప్రపంచానికే ఫ్యాక్టరీగా పరిణామం చెందింది. అంతర్జాతీయ సరఫరా గొలుసులకు ఇరుసుగా మారింది. ప్రత్యేక ఆర్థిక మండలాలతో ఎగుమతులు పెంచింది. నేడు అగ్రస్థానం కోసం అమెరికాతో పోటీ పడుతోంది. దక్షిణ కొరియాలో కొన్ని ధనిక వ్యాపార కుటుంబాలు రకరకాల కార్పొరేట్ సంస్థలను నెలకొల్పి పారిశ్రామికీకరణను వేగవంతం చేశాయి. ఈ కుటుంబాలను 'చేబోల్' అంటారు. వాటికి ప్రభుత్వమే రుణాలు, సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక వసతులు సమకూర్చింది. 1960లలో ఎగుమతులే ప్రధానంగా దక్షిణ కొరియా అభివృద్ధి సాగింది. 1970లకు వచ్చేసరికి భారీ పరిశ్రమలు, రసాయన పరిశ్రమలు వృద్ధి చెందాయి. 1980లలో సమాచార సాంకేతిక పరిజ్ఞాన రంగం దేశాభివృద్ధికి ఊతమిచ్చింది. ప్రభుత్వ అండదండలతో చేబోల్‌లు ప్రపంచమంతటికీ విస్తరించాయి. స్వదేశంలో భారీ ఉపాధి అవకాశాలను కల్పించాయి. తైవాన్‌లోని వ్యాపార సంస్థలు చేబోల్‌ల మాదిరిగా భారీ గ్రూపులు కాకపోయినా వేగంగా కార్యకలాపాలు సాగిస్తూ అంతర్జాతీయ సరఫరా గొలుసులకు కీలకంగా మారాయి. తైవాన్‌లో సెమీకండక్టర్ పరిశ్రమ ప్రపంచానికే చిప్‌ల సరఫరాదారు అయింది. ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల పరిశ్రమ కూడా వర్ధిల్లుతోంది. రెండో ప్రపంచయుద్ధం తరవాత జపాన్ ఎగుమతుల కేంద్రిత ఆర్థిక వ్యవస్థ ద్వారా అగ్ర ఆర్థిక శక్తిగా ఎదగడం ఇలాంటి దేశాలకు ఆదర్శంగా మారింది. వియత్నాం సైతం వ్యవసాయ ఉత్పత్తులతోపాటు పారిశ్రామిక వస్తువులనూ ఎగుమతి చేస్తోంది. వియత్నాం ఆలస్యంగా పారిశ్రామికీకరణను చేపట్టినా సరైన విధానాల అమలుతో విదేశీ సాంకేతికతలను, పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా వేగంగా అభివృద్ధి సాధించవచ్చని నిరూపించింది. ఈ దేశాలన్నీ పారిశ్రామికీకరణ ద్వారా ప్రజలకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించాయి. ఎగుమతులపై దృష్టి కేంద్రీకరించి అధిక వృద్ధిరేటు సాధించాయి. ప్రభుత్వాలు సరైన విధానాలతో పారిశ్రామికీకరణకు ఊతమిచ్చాయి.

ఉపాధి కల్పన కోసం...

భారతదేశంలో ఐటీ రంగం నగరాల్లో భారీగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నా, మొత్తం కార్మిక శక్తిలో కొద్ది భాగానికే లబ్ధి చేకూరుతోంది. విస్తృతంగా ఉపాధి కల్పించే వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు నిర్ణయాత్మక పాత్ర వహించలేకపోతున్నాయి. తూర్పు ఆసియా దేశాల మాదిరిగా భారత్ జౌళి, చిన్న పరిశ్రమలు, ఆహార శుద్ధి వంటి రంగాలను సద్వినియోగం చేసుకోలేక ఉపాధి కల్పనలో వెనకబడింది. ఎక్కువగా ఐటీ రంగం మీదే ఆధారపడటం మంచిదికాదని ట్రంప్ జమానాలో మారుతున్న అమెరికా విధానాలు హెచ్చరిస్తున్నాయి. గల్ఫ్ దేశాలు స్థానికులనే ఎక్కువగా నియమించుకోవాలని చూస్తున్నందున అక్కడి నుంచి భారతీయులు పంపే జమలు తగ్గవచ్చు. అమెరికా, సౌదీ అరేబియాలు తీసుకునే నిర్ణయాలపై భారత ఆర్థిక ప్రగతి ఆధారపడటం శ్రేయస్కరం కాదు. కార్మికుల అవసరం ఎక్కువగా ఉండే జౌళి, ఆహారశుద్ధి వంటి రంగాలపై దృష్టిపెట్టడం ద్వారా ఉపాధిని పెంచవచ్చు. ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్ వస్తువుల విడిభాగాలను కూడా భారత్‌లోనే తయారుచేయగలిగితే ఎక్కువమందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఫార్మా రంగంలో సొంతంగా ఆవిష్కరణలు, నవీకరణలు సాధిస్తే నిపుణ ఉద్యోగాలు పెరుగుతాయి. మన కార్మికులకు ఉపాధి కోసం స్వదేశీ పరిశ్రమలతో పాటు సాగు రంగాన్నీ అభివృద్ధి చేసుకోవాలి. దేశాన్ని బహుళ రంగాల్లో ముందుకుతీసుకెళ్లడం ద్వారా ఉపాధి, వ్యాపార అవకాశాలను పెంచడానికి కృషి జరగాలి. స్వావలంబన, స్వశక్తి, సొంత సాంకేతికతలు అభివృద్ధికి పునాదులుగా మారాలి.



నాగళ్ల శివప్రసాద్

విశ్రాంత ఆచార్యులు, ఐఐటీ-మద్రాసు

అలక పాన్పు



అయిష్టానికి, కోపానికి మధ్యస్థాయిలో నిరసన తెలిపే భావ ప్రకటన 'అలక'. ఎదుటివారి చర్యల పట్ల అసంతృప్తికిది మచ్చుతునక. వివరంగా చెప్పాలంటే కినుక వహించే స్థితి రాబోతోందనే హెచ్చరిక. అసలింతకీ అలక లక్షణాలేంటి? 'కోరిక ఒకటి జనించు.. అది తీరక ఎడద దహించు..' అంటారు ఎస్వీ భుజంగరాయ శర్మ. అదిగో ఆ దహింపుల నుంచి జనించేదే అలక. కోరింది ఇచ్చేవరకూ మంకుపట్టు పట్టే పసిదనపు మూలధనం అలకే. ముసలిదనపు అశక్తత చాటున ముసుగేసుకుని ముచ్చటగా దోబూచులాడేది అలకే. గట్టిగా పోరాడలేని అశక్తతే అలకకు మూలం అనుకోవచ్చు.

బుంగమూతి పెట్టిన తమ బాలకృష్ణులను చూసి 'అలిగిన వేళనె చూడాలి' అని పాడుకునే అమ్మల మురిపెం మాటలకు అందనిది. మనసైన చిన్నది అలిగితే 'అలిగితివా సఖీ ప్రియా అలుక మానవా' అని బతిమాలడం అదో అందమైన అనుభూతి. కాకపోతే పాదాల వైపు నిలబడకూడదని గుర్తు పెట్టుకోవాలి. అలకలు మొలకలు వేయడంలో అరవడాలు కరవడాలూ ఉండవు. మౌనరాజ్యంలో చూపుల తూపులు గుచ్చుతూంటాయి. టీ కాచుకునేటంత నిట్టూర్పుల సెగలుంటాయి. ప్రాణం మీదికి తెచ్చే పగలూ గట్రా ఉండవు కానీ, పట్టపగలుకూ చిమ్మచీకటికీ తేడాల్లేని చిరాకులూ పరాకులూ తప్పనిసరి!

ఆడవారే అలుగుతారనే అపఖ్యాతి ఎందుకొచ్చిందో కానీ నిజానికి మగవారే ఎక్కువ అలుగుతుంటారు. ఒకప్పుడు పెళ్లిళ్లలో 'అలకపాన్పు' అనేది ఒక వేడుకగా ఉండేది. పదిమంది కూడే చోట ఎవరో ఒకరికి ఆ బృందానికి తామే నాయకులమైపోవాలనిపిస్తుంది. ఇంకేముంది... అందరినీ గమనిస్తూ తమను మెచ్చినవారిని దగ్గరికి తీస్తారు. పొగడని వారిపై అలిగి దారిలోకి తెచ్చుకుంటారు. రాజకీయ పదవుల పందేరాల్లో ఈ అలకలను ఎక్కువగా చూస్తూనే ఉంటాం.

అలక వల్ల అయిన పనులేమైనా ఉన్నాయా చరిత్రలో? ఓ.. లేకేం. అలుగుటయే ఎరుగని వాళ్లు అలిగితే ఉపద్రవాలు సంభవించడమే కాదు ఉప్పు ద్రవాలన్నీ ఉవ్వెత్తున ఎగసిపడతాయన్నారు తిరుపతి వేంకటకవులు. ఆ దారిలో నడచి చూపించారు మహాత్మా గాంధీ. కొట్టక తిట్టక, కేకలేయక, బాకులు దూయక పూజ్య బాపూజీ చేసినదేంటి.. అలకబూనడమేగా. సీమ దొరతనాన్ని స్తీమరెక్కించి తోలేయడానికి ఆయన ఎంచుకున్న మార్గం సత్యాగ్రహమనే తిరుగులేని అలక బాట.

సంసారంలో రేగే చిరు చిరు అలకలు కొరకొర చూపులు అరకొరగా సాగి ఆగితే అదో అందం. అదే కొనసాగి కోర్టు మెట్లెక్కితే సరసం కాస్తా విరసమవుతుంది. జంటల మధ్య అలక తాటాకుమంటలా చప్పున చల్లారాలి. అందుకేనేమో 'నట్టింటి అలక పొడుపులు పడకింటి చిలకమడుపులతో సరి' అన్నారు. ఈ హడావుడి కాలం నాటి స్థితి ఆనాడే అంచనా కట్టి 'మూతిబిగింపులు అలకలు పాతబడిన విద్యల'నీ అన్నారు పింగళి 1950 దశకంలోనే. కాబట్టి ముప్పొచ్చే దాకా ముదరనీయకండి. అలక నందనాలలో విరబూసే పారిజాతాలను ప్రేమగీతాలై పల్లవించనీయండి.

– రాంభట్ల నృసింహశర్మ

హరిత కొలువులు



శిలాజ ఇంధనాల వాడకంతో పర్యావరణానికి చేటు కలుగుతోంది. ఈ క్రమంలో సౌర, పవన, హైడ్రో, బయో ఎనర్జీ వంటి పునరుత్పాదక ఇంధన వనరులపై ప్రభుత్వాలు ఎక్కువగా దృష్టిసారిస్తున్నాయి. వీటికి మారడం వల్ల పెద్దసంఖ్యలో కొత్త ఉద్యోగాలు అందివస్తున్నాయి. పన్నెండేళ్లలో ఇవి రెట్టింపునకు మించి పెరిగాయి. 2012లో సౌర ఫలకాల ద్వారా విద్యుదుత్పాదనకు సంబంధించి 13.6 లక్షల ఉద్యోగాలు లభిస్తే, 2023లో అవి 71 లక్షలకు చేరాయి. అదే కాలానికి బయో ఎనర్జీలో కొలువులు 24 లక్షల నుంచి దాదాపు 39 లక్షలకు పెరిగాయి. పవన విద్యుత్తులో 7.5 లక్షల నుంచి సుమారు 15 లక్షలకు చేరాయి. హైడ్రో పవర్‌లోనూ 16.6 లక్షల నుంచి 23.2 లక్షలకు పెరిగాయి. ఆయా సంవత్సరాల్లో పునరుత్పాదక ఇంధన వనరులవైపు మళ్లడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా లభించిన మొత్తం ఉద్యోగాలు (కోట్లలో)...



(ఆధారం: ఇంటర్నేషనల్ రెన్యూవబుల్ ఎనర్జీ ఏజెన్సీ నివేదిక-2024)

జ్ఞానామృత ప్రదాత జానమద్ది!

జానమద్ది హనుమచ్ఛాస్త్రి... ఈ పేరు వినగానే కడపలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయం గుర్తొస్తుంది. దాని నిర్మాణానికి ఎంతగానో పరితపించి వాస్తవ రూపంలోకి తెచ్చిన కార్యశీలి హనుమచ్ఛాస్త్రి. తద్వారా 'బ్రౌన్ శాస్త్రి'గా ఆయన ప్రఖ్యాతి పొందారు. తెలుగులో పదుల సంఖ్యలో గ్రంథాలు వెలువరించారు. జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో హనుమచ్ఛాస్త్రి శతజయంత్యుత్సవాన్ని బ్రౌన్ గ్రంథాలయంలో రేపు నిర్వహిస్తున్నారు.

అనంతపురం జిల్లా రాయదుర్గంలో 1925 అక్టోబరు 20న డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి జన్మించారు. రాయదుర్గంలో ఏడో తరగతి వరకు చదివారు. అనంతరం సమీపంలోని బళ్లారి వెళ్లి వారాలు చేసుకుంటూ పాఠశాల విద్య పూర్తిచేశారు. 1946లో బళ్లారిలో సెకండరీ గ్రేడ్ టీచర్స్ ట్రైనింగ్ పూర్తి చేశారు. అక్కడే ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూ, మద్రాస్ విశ్వవిద్యాలయం నుంచి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులయ్యారు. ఉద్యోగం చేస్తూనే బీఎడ్, ఎంఏ ఇంగ్లిష్, ఎంఏ తెలుగు పట్టాలను అందుకున్నారు. బళ్లారికి చెందిన సుబ్బరత్నమ్మను 1952లో వివాహం చేసుకున్నారు. ఆంధ్ర, కర్ణాటక విభజన తరవాత హనుమచ్ఛాస్త్రి బళ్లారి నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి అధ్యాపకుడిగా పనిచేశారు.

అవాంతరాలను అధిగమించి...

ఎదుటి వ్యక్తిలోని గొప్పతనాన్ని గుర్తించి సమాజానికి తెలియజేసే స్వభావం కలిగిన హనుమచ్ఛాస్త్రి కలం నుంచి 'మా సీమ కవులు' పుస్తకం వెలువడింది. తెలుగు కన్నడ సంబంధాలకు ప్రతీకగా 'కస్తూరి - కన్నడ సౌరభం' పేరిట ఎందరో కర్ణాటక ప్రముఖులను తెలుగు వారికి పరిచయం చేశారు. దైవభక్తి కలిగిన ఆయన 'మన దేవతలు, గణపతి' అనే గ్రంథాలు రచించారు. 'కడపజిల్లా- దర్శనీయ స్థలాలు' వెలువరించారు. సంగీత ప్రియులు కూడా అయిన హనుమచ్ఛాస్త్రి 'సంగీత మేరు శిఖరాలు' అనే గ్రంథాన్ని రచించారు. ఇలా 40కి పైగా పుస్తకాలు తీసుకొచ్చారు. పత్రికల కోసం వందల సంఖ్యలో వ్యాసాలు రాశారు. 'లైవ్స్ ఆఫ్ ఇన్‌స్పిరేషన్' అనే ఆంగ్ల రచనా చేశారు. 'సి.పి.బ్రౌన్ చరిత్ర' హనుమచ్ఛాస్త్రి చివరి పుస్తకం. దీన్ని ఆయన మరణానంతరం 2017 డిసెంబరులో అప్పటి ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు ప్రొద్దుటూరులో ఆవిష్కరించారు.



నిశ్శబ్దంగా రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తున్న హనుమచ్ఛాస్త్రి... తన స్నేహితుడు, ప్రముఖ ఆడిటర్ సంపత్ కుమార్ సౌజన్యంతో కడపలో సి.పి. బ్రౌన్ గ్రంథాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆ మహాయజ్ఞంలో ఎన్నో అంతరాయాలు, అవమానాలు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిచారు. ఆయన కార్యదీక్షకు మెచ్చి గ్రంథాలయ నిర్మాణానికి దాతలు విరివిగా విరాళాలు ఇస్తే, బడిపిల్లలు ఒక్కొక్కరు రూపాయి చొప్పున అందించారు. ఆనాటి పిల్లలే నేడు 'ఇది మా గ్రంథాలయం' అని గర్వంగా చెప్పుకొంటున్నారు. చిన్నారులతో పాటు, వృద్ధుల వరకూ ఎందరికో 'సి.పి.బ్రౌన్ గ్రంథాలయం, భాషా పరిశోధనా కేంద్రం' నేడు జ్ఞానామృతం పంచిపెడుతోంది. ఈ లైబ్రరీకి హనుమచ్ఛాస్త్రి సొంతంగా పదివేల పుస్తకాలు అందించారు. 'ఒక రూపాయి లెక్కన్నా ఇవ్వు.. ఒక బుక్కన్నా ఇవ్వు' అనే నినాదంతో గ్రంథాలయాన్ని తీర్చిదిద్దారు. నేడది లక్ష గ్రంథాలతో అలరారుతోంది. ఈ క్రమంలో హనుమచ్ఛాస్త్రిని 'బ్రౌన్ శాస్త్రి' అని ప్రసిద్ధ రచయిత సి.నారాయణరెడ్డి సంబోధించారు. మానవత్వం, సహనం, క్రమశిక్షణ సహజ ఆభరణాలుగా ముందుకు సాగిన హనుమచ్ఛాస్త్రి 2014 ఫిబ్రవరి 28న కన్నుమూశారు. బ్రౌన్ గ్రంథాలయంలో అదే సంవత్సరం ఆయన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు.


అద్భుత సాహితీ ప్రసంగాలు

'మాసీమ' రాజగోపాలరెడ్డి, డాక్టర్ మల్లెమాల వేణుగోపాలరెడ్డి, పి.రామకృష్ణారెడ్డి లాంటి స్నేహితుల సహకారంతో హనుమచ్ఛాస్త్రి 'కడప జిల్లా రచయితల సంఘం' ప్రారంభించారు. విశ్వనాథ, దేవులపల్లి, ఆరుద్ర, శ్రీశ్రీ, పురిపండా, దాశరథి, సినారె తదితర ప్రసిద్ధ రచయితలను కడపకు రప్పించి అద్భుతమైన సాహితీ ప్రసంగాలు ఇప్పించారు. తితిదే అన్నమయ్య ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రముఖ గాయకులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్, శోభారాజుల ద్వారా అన్నమయ్య సంకీర్తనల మాధుర్యాన్ని కడప ప్రజలకు పరిచయం చేశారు. ఏటా ఆయన జన్మదినాన రచయితలు, గ్రంథాలయ సేవకులను 'జానమద్ది సాహితీ పీఠం' తరఫున సత్కరిస్తున్నారు. 'జీవితం నిర్మలంగా, సాధారణంగా ఉండాలి. ఆశయాలు మాత్రం ఉన్నతంగా ఉండాలి. వాటి సాధనకు తగిన ఆచరణ కూడా కావాలి' అని హనుమచ్ఛాస్త్రి చెబుతుండేవారు. అందుకు సాక్ష్యంగా సీపీ బ్రౌన్ గ్రంథాలయం ఆయన సేవలను ఎప్పుడూ చాటి చెబుతూనే ఉంటుంది.

– జె.విజయభాస్కర్, మేనేజింగ్ ట్రస్టీ, జానమద్ది సాహితీ పీఠం

ఆవు సాయం!

ఒక ఊరి చివర వాగు వేగంగా ప్రవహిస్తోంది. ఆ సమయంలోనే ఒక ఆవు మెల్లగా ఆ వాగు దాటడానికి ప్రయత్నిస్తోంది. అప్పుడే దానికి 'ఎవరైనా నన్ను కాపాడండి.. కాపాడండి' అనే మాటలు వినిపించాయి. ఎవరా అనుకుంటూ అటూఇటూ చూడసాగింది ఆవు. అంతలోనే దానికి కాస్త దూరంలో.. వరదలో కొట్టుకొస్తున్న పాము కనిపించింది. 'అరెరె.. పాపం పాము వరదలో పడిపోయినట్లుంది. ఎలాగైనా దాన్ని కాపాడాలి' అనుకుంది ఆవు. ఆ వరదకు ఎదురుగా తలను పెట్టి, దాని మీదకు ఆ పాము ఎక్కేలా చేసింది. మెల్లగా ఆవు మీదకు పాకి.. కొమ్ములను చుట్టుకుని కూర్చుంది. అప్పుడు పాము.. 'నా ప్రాణాలు కాపాడినందుకు ధన్యవాదాలు మిత్రమా!' అంది. 'అంత చిన్నదానికి ధన్యవాదాలు ఎందుకు మిత్రమా! ఆపదలో ఉన్నవారిని రక్షించడం మనందరి బాధ్యత. నేనూ అదే చేశాను. ఉండు.. నిన్ను జాగ్రత్తగా అవతలి ఒడ్డుకు చేర్చుతాను' అని బదులిచ్చింది ఆవు. అన్నట్లుగానే వరదలో మెల్లగా నడుస్తూ ఆవు ఒడ్డు చేరింది. పాము సంతోషంగా కిందకు దిగి.. 'నా ప్రాణాలు కాపాడినందుకు, నన్ను ఒడ్డుకు చేర్చినందుకు నీకు మరోసారి ధన్యవాదాలు మిత్రమా! నీ మేలు ఈ జన్మలో మర్చిపోలేను' అంటూ ఆవుని ప్రేమగా ముద్దాడి వెళ్లిపోయింది. ఆ తరవాత కొన్ని నిమిషాల్లోనే ఆవు విలవిల్లాడుతూ ప్రాణాలు కోల్పోయింది. దుష్టుల ప్రేమ కూడా చాలా ప్రమాదకరం మరి! వారికి సాయపడినా అది.. చివరికి మనకే హాని చేస్తుంది!



– చంద్ర ప్రతాప్ కంతేటి

రాయగలరా?

ఇక్కడ కొన్ని పదాలు గజిబిజిగా ఉన్నాయి. సరైన వాటిని కలిపి రాయండి చూద్దాం.

కవచం	దానం	కోతి	కాలం
గాలం	కొమ్మ	రాష్ట్ర	బడి
పువ్వు	వేగు	రక్షణ	అన్న
చేష్టలు	సాయం	ఆరు	చెట్టు
పక్షి	పెట్టు	బంతి	చుక్క

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
శనివారం నవంబరు 1, 2025 5




నిండుగా చైతన్యం.. మెండుగా ఆరోగ్యం

క్యాన్సర్‌పై ప్రజల్లో చైతన్యం నింపేందుకు ఇన్నర్ వీల్‌క్లబ్ ఆధ్వర్యంలో బీఆర్‌టీఎస్ రోడ్డు ఫుడ్ జంక్షన్ వద్ద శుక్రవారం ప్రదర్శనను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు – న్యూస్‌టుడే, చుట్టుగుంట



సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా విజయవాడ ఐజీఎంసీ స్టేడియం నుంచి ప్రారంభమైన ఏక్తా ర్యాలీలో ఎంపీ కేశినేని శివనాథ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, యామినీశర్మ - న్యూస్‌టుడే, విజయవాడ క్రీడలు

చిగురించిన రూపం వికసించిన స్నేహం



చిగురించే స్నేహానికి వయసు సంబంధం లేదంటారు.. ఈ చెట్లను చూస్తే అలాగే అనిపిస్తుంది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో కలిసి పెరుగుతున్న రావి, వేప చెట్లు ఇవి. రావి చెట్టు వయసు 70 కాగా, వేప చెట్టు వయసు 8 ఏళ్లు. రావి చెట్టు తొర్ర మధ్యలోంచి వేప చెట్టు బయటకు చొచ్చుకొచ్చి కనిపిస్తుంది. కలెక్టరేట్ ప్రాంగణంలో పెరుగుతున్న ప్రతి చెట్టు పేరుతో పాటు, వయసు వివరాలు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయడంతో అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. - ఈనాడు, అమరావతి

బుద్ధిమాంద్యం విద్యార్థులు పది మార్కులు సాధిస్తే ఉత్తీర్ణత

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: బుద్ధిమాంద్యం కలిగిన విద్యార్థులు పదో తరగతిలో కేవలం పది మార్కులు సాధిస్తే ఉత్తీర్ణత చెందినట్లేనని సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయం ఐఈడీ కోఆర్డినేటర్ పి.వనజ అన్నారు. వినికిడి, దృష్టి లోపం ఉన్న వాళ్లు 20 మార్కులు సాధించాలని చెప్పారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లాలోని మండల విద్యాశాఖాధికారులకు శుక్రవారం బిషప్ అజరయ్య బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు.

చెరువును చెరబట్టి.. చేనులా చక్కబెట్టి..

- వైకాపా హయాంలో ఆక్రమణ
- రైతుల ఫిర్యాదులు పట్టవేం?

ఈనాడు, అమరావతి

జి.కొండూరు మండలం భీమవరప్పాడు గ్రామ చెరువులో నాలుగు ఎకరాలను గత వైకాపా ప్రభుత్వ హయాంలో అక్రమార్కులు కబ్జా చేశారు. దశాబ్దాలుగా ఈ చెరువు నీటిపైనే ఆధారపడి రైతులు సాగు చేస్తుండగా వైకాపా నేతల కన్ను దీనిపై పడింది. అనుకున్నదే తడవుగా చెరువును కబ్జా చేసి మట్టితో పూడ్చేశారు. దానిలో దర్జాగా పామాయిల్ మొక్కలు వేసేశారు. రైతులు తీవ్రంగా వ్యతిరేకించినా, కలెక్టర్ సహా అధికారులందరికీ ఫిర్యాదు చేసినా కనీసం ఇటువైపు కన్నెత్తి చూసింది లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా అధికారులకు ఈ కబ్జా పర్వంపై ఫిర్యాదులు చేసినా ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకున్నది లేదు.

రికార్డుల్లో స్పష్టంగా ఉన్నా..

భీమవరప్పాడులోని ఆర్ఎస్ నంబరు 18లో 25.68 ఎకరాల్లో చెరువు ఉన్నట్టు స్పష్టంగా రికార్డులున్నాయి. ఈ చెరువు నీటిపైనే ఆధారపడి ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు వరి సాగు చేస్తున్నారు. వైకాపా నేతలు నల్లబాపుల నారాయణ, ఆయన తమ్ముడు నాగేశ్వరరావు కన్ను 20ఏళ్ల కిందటే ఈ చెరువుపై పడింది. అప్పట్లోనే వీళ్లిద్దరూ కలిసి ఈ చెరువులో కొంత భాగాన్ని ఆక్రమించారు. రెవెన్యూ అధికారులకు లంచాలు ఇచ్చి.. దొంగ పత్రాలు సృష్టించి, తమ పేరుపైకి మార్చుకున్నారు. దీనిపై రైతులంతా కలిసి న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. అది గ్రామానికి చెందిన చెరువుకు సంబంధించిన భూమే నంటూ తీర్పు వచ్చింది. దీంతో అన్నదమ్ములు ఆ భూమిని అప్పట్లో వదిలిపెట్టాల్సి వచ్చింది.



నాలుగేళ్ల కిందట వేసిన పామాయిల్ మొక్కలు ఏపుగా పెరిగాయిలా..

పక్కా ప్రణాళికతోనే సాగు..

నాలుగేళ్ల కిందట వేసిన పామాయిల్ మొక్కలు పెరిగి పెద్దవయ్యాయి. పైగా చెరువును కబ్జా చేసిన వ్యక్తికి పక్కనే మరో మూడెకరాల పొలం ఉంది. దీంతో చెరువుకు ప్రవాహం అధికంగా వచ్చే సమయంలో తన పంట పాడైపోకూడదని అనేకసార్లు అర్ధరాత్రి వేళ తూము ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసి తమ సాగు దెబ్బతీశాడని పలువురు రైతులు వాపోయారు. తాజాగా మంగళగిరిలోని తెదేపా రాష్ట్ర కార్యాలయానికి సైతం వచ్చి రైతులు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే మండల స్థాయి అధికారులకు పంపిస్తున్నారని, వీళ్లు పట్టించుకోకుండా వదిలేస్తున్నారన్నారు.

నిలదీసినా లెక్కలేదంతే..

2019లో మళ్లీ వైకాపా అధికారంలోకి వచ్చాక ఈ చెరువులో సగం నల్లబాపుల నాగేశ్వరరావు ఆక్రమించాడు. సాగు ఆరంభించి పామాయిల్ మొక్కలు వేశాడు. రైతులు వచ్చి నిలదీస్తే దిక్కున్నచోట చెప్పుకోమన్నాడు.

‘వికాస’ సౌజన్యం..
ఉద్యోగ సోపానం

కలెక్టర్ ప్రోత్సాహంతో 1,741 మందికి ఉపాధి

విజయవాడకు చెందిన శ్రీదేవి 2024 డిసెంబరులో నిర్వహించిన జాబ్ మేళాలో రిలేషన్‌షిప్ మేనేజర్‌గా ఉద్యోగం సాధించారు. ఏడాదికి రూ.2.5లక్షల ప్యాకేజీకి ఎంపిక కాగా ప్రస్తుతం రూ.3లక్షల వరకు పెరిగింది. ఇదే ప్యాకేజీకి 10 మంది ఆ జాబ్ మేళాలో ఎంపికయ్యారు.

సంపత్‌కుమార్ ఇంటర్ వరకు చదువుకున్నారు. ఏ ఉద్యోగం లేక కూలి పనులు చేసుకునేవారు. తెలిసిన వారి ద్వారా ఎన్టీఆర్ వికాస పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 2024 డిసెంబరులో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో సేల్స్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. నెలకు రూ.15వేల జీతం ఇస్తున్నారు. వివిధ కంపెనీల్లో ఇదే ఉద్యోగానికి దాదాపు 40 మంది వరకు ఎంపికయ్యారు. వికాస వల్ల ప్రస్తుతం మంచి స్థితిలో ఉన్నారు.



ఉద్యోగాలు సాధించిన వారితో కలెక్టర్ లక్ష్మీశ

కాల వ్యవధి	జాబ్ మేళాలు	నమోదైన వారు	వచ్చిన ఉద్యోగాలు
2024 డిసెంబరు-మార్చి	6	5,628	1,200
2025 ఏప్రిల్-జూన్	3	444	250
జులై-అక్టోబర్	7	1,166	291
మొత్తం	16	7,238	1,741

ఈనాడు, అమరావతి

కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో జిల్లాలో మొదలైన వికాస యువతకు ఉపాధి నేస్తంగా మారింది. తక్కువ చదువుకున్న వారి నుంచి ఉన్నత విద్యాభ్యాసం చేసిన వారి వరకు ఉద్యోగావకాశాలు సృష్టిస్తూ ప్రగతి పథంలో సాగుతోంది. ప్రారంభించిన ఏడాదిలోనే వందల మందికి ఉపాధి చూపి విజన్-2047 దిశగా దూసుకుపోతోంది. అవగాహన లేమితో చాలా మంది యువత వికాస వైపు దృష్టి సారించడం లేదు.

11 నెలల్లో 16 జాబ్ మేళాలు..

కలెక్టర్ లక్ష్మీశ ఛైర్మన్‌గా వికాసను 2024లో ప్రారంభించారు. అభ్యర్థులు వివరాల కోసం ఏర్పాటు చేసిన వికాస పోర్టల్‌లో ఉద్యోగార్థులు తమ వివరాలు, విద్యార్హతలు నమోదు చేసుకోవాలి. వీటిని పరిశీలించిన తర్వాత వారి విద్యార్హతలను బట్టి సంబంధిత కంపెనీలకు సమాచారం ఇస్తారు. అభ్యర్థులను సన్నద్ధం చేసేందుకు ఆన్‌లైన్ ద్వారా తరగతులు నిర్వహిస్తారు. సదరు కంపెనీవారు అభ్యర్థులకు అనుకూలమైన ప్రాంతాల్లో జాబ్‌మేళా నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. ఈ ఏడాది 16 జాబ్ మేళాల్లో 112 కంపెనీలు ఎంపికలు చేపట్టాయి. ఇందులో సాఫ్ట్‌వేర్ నుంచి సేల్స్ ఆఫీసర్, సపోర్టు ఇంజినీర్, స్టోర్ ఎగ్జిక్యూటివ్, ఫార్మసీ అసిస్టెంట్, టెక్నీషియన్లు వంటి అనేక ఉద్యోగాలున్నాయి. రూ.15వేల నుంచి రూ.35వేల వరకు జీతాలు తీసుకుంటున్న ఉద్యోగులున్నారు. ఐదేళ్లలో 5లక్షల కొలువులు సృష్టించాలన్న ప్రభుత్వ లక్ష్యంతో సాగుతున్నారు.

అన్న గారికి.. అచ్చొచ్చిన గది!



గాంధీనగర్‌లోని దుర్గా కళామందిర్ థియేటర్



ఈ గదిలోనే ఎన్టీఆర్ ఉండే వారు

విజయవాడలోని దుర్గాకళామందిర్‌లో ఆ గది అంటే ఎన్టీఆర్‌కు సెంటిమెంటు. 1934లో ఇదే థియేటర్‌లో నాటకాలు వేసేవారు. ఆయన నటించిన 300 పైచిలుకు సినిమాల్లో 175 వరకు ఇదే థియేటర్‌లో ప్రదర్శించారు. థియేటర్ పైన ఉన్న గది ఎన్టీఆర్‌కు కలిసి రావడంతో ఎప్పుడు విజయవాడ వచ్చినా హోటల్లో దిగకుండా ఈ గదిలోనే ఉండేవారు. విజయవాడ చుట్టుపక్కల ఎక్కడ షూటింగ్ జరిగినా.. నిర్మాతలు పెద్ద హోటల్స్ బుక్ చేసినా.. అక్కడ దిగకుండా దుర్గా కళామందిర్‌లోని ఈ గదిలోనే సేదతీరేవారు. తెలుగుదేశం పార్టీ పెట్టిన తర్వాత కార్యకలాపాలన్నీ అక్కడి నుంచే సాగేవి. అంతటి సెంటిమెంటు ఉండేది... ఆ గదికి. ఉదయాన్నే లేచి థియేటర్ ప్రాంగణంలో వ్యాయామాలు చేసేవారు. అనంతరం గాంధీనగర్ బాబాయ్ హోటల్ నుంచి ఇడ్లీ, సాంబారు తెప్పించుకొని ఆరగించేవారు.

- ఈనాడు, అమరావతి - గాంధీనగర్, న్యూస్‌టుడే

భాషా పండితులకు విదేశీ భాషల్లో శిక్షణ

న్యూస్‌టుడే – ఏఎన్‌యూ (గుంటూరు): విదేశాల్లో ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకునేలా యువతను తీర్చిదిద్దడం కోసం చేపట్టిన ‘వసుధ’ ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం మరింత విస్తరించనుంది. ప్రభుత్వ కళాశాలల్లో పని చేస్తున్న 60 మంది భాషా పండితులకు మంత్రి లోకేశ్ సూచనల మేరకు జపనీస్, ఇటాలియన్, కొరియన్, జర్మన్ భాషల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నారు. వచ్చే ఏడాది నుంచి మొదలయ్యే ఈ శిక్షణ ఏడాదిపాటు సాగుతుంది.

కొంటామండి..
కలవరింతలొద్దండి



నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు

ఈనాడు, అమరావతి

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు శనివారం నుంచి పూర్తి స్థాయిలో మొదలు కానున్నాయి. అక్టోబరు 17న లాంఛనంగా ప్రారంభించినా ధాన్యం అందుబాటులోకి రాకపోవడం, తుపాను తాకిడితో కొనుగోళ్ల ఖాతా తెరవలేదు. అధికారులు కొనుగోలు కేంద్రాలతో పాటు సర్వం సిద్ధం చేశారు.

- ధాన్యం ఉత్పత్తి అంచనా (మె.టన్నుల్లో) : 3,59,733
- కొనుగోలు లక్ష్యం (మె.టన్నుల్లో) : 2,50,000
- జిల్లాలో కొనుగోలు కేంద్రాలు : 160
- ధాన్యం తరలించే మిల్లులు : 25
- కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది : 477
- అందుబాటులో గోనె సంచులు : 10లక్షలు

సర్వం సిద్ధం..

జిల్లాలో ఇప్పటికే వ్యవసాయశాఖ వంద శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తి చేసింది. ముందుగా ధాన్యం వచ్చే తిరువూరు డివిజన్‌పై దృష్టి సారించారు. ఆయా కొనుగోలు కేంద్రాల్లో 3,77,500 గోనె సంచులను సిద్ధం చేశారు. మొత్తం 10లక్షలకు పైగా సంచుల అవసరం ఉండగా ఇప్పటివరకు 5,08,600 సంచులను కేంద్రాలకు చేర్చగా మిగిలిన వాటిని నవంబరు మొదటి వారంలోగా చేరుస్తారు. ఒక్కో కేంద్రంలో సాంకేతిక సహాయకుడు, డేటా ఎంట్రీ ఆపరేటర్, సహాయకులు కలిపి ముగ్గురు సిబ్బంది ఉంటారు. 25 మిల్లుల్లో 19చోట్ల డ్రయర్లు ఉన్నాయి. 160 కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం కొలిచే యంత్రాలు అందుబాటులో ఉంచారు. వాటి పనితీరును ప్రయోగాత్మకంగా పరిశీలించారు.

రైతన్నా మేలుకో..

వైకాపా సర్కారు ధాన్యం కొనుగోలు ప్రక్రియను భ్రష్టు పట్టించింది. కూటమి సర్కారు వచ్చాక కొనుగోలు ప్రక్రియనే కాక నగదు చెల్లింపు విధానాన్ని కూడా గాడిన పెట్టింది. ప్రభుత్వం వేగంగా నగదు జమ చేస్తున్నా రైతుల ఖాతాల్లో సాంకేతిక సమస్యలతో సొమ్ము చేతికందక ఇక్కట్లు పడుతున్నారు. ప్రధానంగా బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం కాకపోవడం, వినియోగంలో లేకపోవడం, నగదు జమ పరిమితి రూ.2లక్షలే ఉండడం, కేవైసీ అప్‌డేట్ చేయించుకోకపోవడం వంటి అనేక సమస్యలతో రైతులకు నగదు జమ కావడం లేదు. రైతులు ముందే అప్రమత్తమై అన్నీ సరి చూసుకుంటే ఇబ్బందులు తొలగుతాయి.

శాంతించిన మునేరు

కాజ్‌వేపై రాకపోకల పునరుద్ధరణ

పెనుగంచిప్రోలు, నందిగామ(న్యూస్‌టుడే): తెలంగాణలో వర్షాలు లేకపోవడంతో మునేరు వరద క్రమంగా తగ్గుతోంది. గురువారం అర్ధరాత్రి నుంచి తగ్గుముఖం పట్టింది. ఒక దశలో 1.65 లక్షల క్యూసెక్కుల వరద ప్రమాదకర స్థాయిలో ప్రవహించడంతో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపైకి వస్తుందని భావించారు. కలెక్టర్ లక్ష్మీశ, పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు ఆదేశాలు మేరకు స్థానిక ఆర్డీవో బాలకృష్ణ, ఏసీపీ అప్పటికప్పుడు ఇతర మార్గాల్లో వాహనాలు మళ్లించేందుకు సిద్ధం చేశారు. మునేరుకు వరద క్రమంగా తగ్గుతుండటంతో అధికారులు ఆందోళన వీడారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు మునేరుకు 56,998 క్యూసెక్కుల నీరు వచ్చింది.



వరద తగ్గాక పెనుగంచిప్రోలు కాజ్‌వే

కృష్ణమ్మ ఉద్ధృతి.. అదే ఒరవడి

ఈనాడు, అమరావతి: మొంథా తుపాను ప్రభావంతో ఉగ్రరూపం దాల్చిన కృష్ణమ్మ.. ప్రవాహం కాస్త తగ్గినా రోజంతా అదే ఒరవడి కొనసాగింది. శుక్రవారం రాత్రి 8 గంటలకు ఇన్‌ఫ్లో 4,32,837 క్యూసెక్కులు నమోదు కాగా మొత్తం నీరు సముద్రంలోకి వదిలేశారు.

బ్యారేజీ దగ్గర వరద
తీవ్రత క్యూసెక్కుల్లో

సమయం	రాక/పోక
ఉదయం-6	4,43,808
ఉదయం-9	4,22,004
మధ్యాహ్నం-12	4,32,837
మధ్యాహ్నం-3	4,38,288
సాయంత్రం-6	4,56,400
రాత్రి-8	4,32,837
రాత్రి-11	3,84,525

జితిన్ కోసం గోవాలో వేట

అక్కడ నకిలీ లేబుళ్ల ముద్రణకు ఆర్డర్ ఇచ్చిన జనార్దనరావు
మద్యం సీసాల మూతలు హైదరాబాద్‌లో తయారీ

ఈనాడు – అమరావతి

గోవా నుంచి స్పిరిట్‌ను సరఫరా చేసిన జితిన్ కోసం ఎక్సైజ్, సిట్ పోలీసులు వేట సాగిస్తున్నారు. రెండు రోజులుగా గోవాలో మకాం వేసి గాలిస్తున్నారు. ఫోన్ నెంబరు మినహా అతని గురించి పూర్తి వివరాలు లేకపోవడంతో ఆచూకీ దొరకడం లేదు. అతను ఉపయోగించే ఫోను కూడా స్విచాఫ్ చేశాడు. చివరి టవర్ లొకేషన్ ఆధారంగా గాలిస్తున్నారు. సొంతంగా డిస్టిలరీ ఉందని విచారణలో నిందితుడు బాలాజీ చెప్పాడు. జితిన్ దొరికితే కానీ పూర్తి వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

ఎన్నికల్లో విచ్చలవిడిగా సరఫరా

2023 నుంచి ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారీని ప్రారంభించిన జనార్దనరావు.. ఎన్నికల సమయంలో పలువురు వైకాపా నేతలకు సరకును సరఫరా చేసినట్లు దర్యాప్తులో తెలిసింది. జనార్దనరావు నుంచి నేతలు తీసుకుని, నకిలీ మద్యం సీసాలను ఎన్నికల ప్రచారంలో భాగంగా పంపిణీ చేసినట్లు సమాచారం. చాలా మంది వైకాపా నేతలు ఓటర్లకు, పార్టీ కార్యకర్తలకు పంచేందుకు ఆర్డర్లు ఇచ్చి సరకు తీసుకున్నట్లు గుర్తించారు. సీసాల మూతలను హైదరాబాద్‌లోని ఓ ఫ్యాక్టరీలో ప్రసాద్ తయారు చేసినట్లు గుర్తించారు. అక్కడి నుంచే ములకలచెరువు, ఇబ్రహీంపట్నం సరఫరా చేసినట్లు దర్యాప్తులో వెలుగుచూసింది. ఈ కేసులో జితిన్‌తో పాటు, ప్రసాద్, ప్రింటింగ్ ప్రెస్ యజమానిని కూడా నిందితులుగా చేర్చే అవకాశం ఉంది.

2021 నుంచే అక్రమ మద్యం వ్యాపారం...

‘గత ప్రభుత్వ హయాంలో ఏపీలో మద్యం ధరలు అధికంగా ఉండడం.. పైగా కోరుకున్న బ్రాండ్లు దొరక్కపోవడంతో హైదరాబాద్‌లో మద్యం కొని, క్యాన్లలో నింపి ఇబ్రహీంపట్నం పంపించేవాడినని’ నిందితుడు తిరుమలశెట్టి శ్రీనివాసరావు విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. అక్కడ జనార్దనరావు.. వాటిని సీసాల్లోకి నింపి విక్రయించేవాడని చెప్పాడు. శుక్రవారం మధ్యాహ్నం ఎక్సైజ్, సిట్ అధికారులు కస్టడీకి తీసుకున్నారు. 3వ తేదీ వరకు కోర్టు కస్టడీకి ఇచ్చింది. ఈ నేపథ్యంలో నెల్లూరులోని కేంద్ర కారాగారం నుంచి అదుపులోకి తీసుకుని, అక్కడే వైద్య పరీక్షలు చేయించిన తర్వాత పోలీసులు విజయవాడకు తరలించారు. తాను గతంలో జగ్గయ్యపేటలో పేపర్ మిల్లు నడిపానని, వ్యాపారంలో నష్టాలు రావడంతో కుటుంబంతో సహా హైదరాబాద్‌కు మకాం మార్చానని వివరించాడు. తనకు పదేళ్లుగా అద్దేపల్లి జనార్దనరావు, అతని సోదరుడు జగన్మోహనరావులు పరిచయమని చెప్పాడు. ఆర్థికంగా కష్టాల్లో ఉన్న సమయంలో జనార్దనరావు తనకు రుణం ఇప్పించి సాయం చేశాడని, అందుకే ఎన్డీపీఎల్ రవాణా, లేబుళ్ల ముద్రణలో సాయం చేశానని విచారణలో వెల్లడించాడు.

అజేయం.. అభయాంజనేయం..



చూడగానే ఆకట్టుకునే సుందర రూపం.. భక్తులకు కొండంత అభయమిచ్చే ఈ ఆంజనేయ విగ్రహానికి ఎంతో ప్రత్యేకత ఉంది. కంచికచర్ల మండలం పరిటాల సమీపంలోని విజయవాడ-హైదరాబాద్ రహదారి పక్కనే ఉన్న 135 అడుగుల ఈ విగ్రహం ఆసియాలోనే ఎత్తైన విగ్రహాల్లో ఒకటి. 11 నెలల పాటు 1.35లక్షల సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేసిన అనంతరం 2001లో శంకుస్థాపన చేశారు. 2003లో ప్రారంభించారు. అంతరాలయంలో స్వామి విగ్రహం విశేషంగా ఆకట్టుకుంటుంది. ఇంకా సీతారామచంద్రస్వామి, రేణుకామాత ఆలయం ఉన్నాయి. -కంచికచర్ల, న్యూస్‌టుడే

నేటి నుంచి ఇంద్రకీలాద్రిపై భవానీ మండల దీక్షలు



విద్యాధరపురం, న్యూస్‌టుడే: దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం చేపట్టిన భవానీ మండల దీక్షల స్వీకరణ నవంబరు 1 నుంచి 5 వరకు మల్లికార్జున మహామండపంలో నిర్వహించనున్నట్లు ఈవో శీనానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 21 నుంచి 25 వరకు భవానీ అర్ధమండల దీక్షల స్వీకరణ కార్యక్రమాన్ని వైదిక కమిటీ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. డిసెంబరు 4న సత్యనారాయణపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో సాయంత్రం 5.30 గంటలకు భవానీ దీక్షాధారులతో కలశజ్యోతి ఊరేగింపు నిర్వహిస్తారని తెలిపారు. డిసెంబరు 11 నుంచి 15 వరకు ఇంద్రకీలాద్రిపై దీక్షల విరమణ కార్యక్రమం చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. డిసెంబరు 15తో భవానీ దీక్షల విరమణ పురస్కరించుకుని పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సౌరభానికి.. నిబంధనల గ్రహణం

- ఐదేళ్ల కిందటే... రూ.4.64 కోట్లతో ఏర్పాటు
- ఉత్పత్తి మొదలైనా దుర్గగుడికి బిల్లుల భారం

ఈనాడు, అమరావతి

‘ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానం, వసతి గృహాలు, ఇతర భవనాలకు. . ఏటా రూ.కోటిన్నర విద్యుత్తు బిల్లులు వస్తున్నాయి. ఈ భారం తీర్చేలా.. ఐదేళ్ల కిందట రూ.4.64 కోట్లతో ఒక మెగావాట్ సామర్థ్య భారీ సౌర విద్యుత్తు ప్లాంటు నెలకొల్పారు. దుర్గగుడికి చెందిన.. పాతపాడులోని 5.85 ఎకరాల్లో దీనిని నిర్మించారు. ఏడాదిలో నెలకొల్పాల్సిన ఈ ప్రాజెక్టు ఏర్పాటుకే సుదీర్ఘకాలం పట్టింది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో శ్రీకారం చుట్టగా... ఆ తర్వాత వైకాపా గద్దెనెక్కాక.. మరింత కాలయాపన జరిగింది. ఎట్టకేలకు అడ్డంకులు వీడి విద్యుదుత్పత్తి జరిగినా.. ఫలాలు నేటికీ దుర్గమ్మ ఆలయానికి అందడం లేదు.’

ఏటా 16 లక్షల యూనిట్ల సౌర విద్యుత్తు.. ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి అవుతోంది. ఐదేళ్ల కిందట ప్లాంట్ ఆరంభమైనప్పుడు దుర్గగుడికి విద్యుత్తు బిల్లు ఏటా రూ.కోటి వరకూ వచ్చేది. ఆ లెక్కన ప్లాంట్ ఏర్పాటుకైన వ్యయం.. నాలుగేళ్లలోనే ఆలయానికి వచ్చేస్తుంది. ఆ తర్వాత 20 ఏళ్లు ఈ ప్లాంట్ నిరంతరం సౌర విద్యుదుత్పత్తి చేస్తుంది. కానీ.. ఐదేళ్లుగా అధికారుల నిర్లక్ష్యంతో.. ఇక్కడ ఉత్పత్తి అవుతున్న విద్యుత్తు దుర్గమ్మకు చెందడం లేదు.



పాతపాడులోని సౌర విద్యుత్తు ప్లాంట్

ఇదెక్కడి కొర్రీ...


నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో ఈ ప్లాంట్ పెట్టేటప్పుడు ఏ అభ్యంతరాలు రాలేదు. కానీ.. ఉత్పత్తి ఆరంభించిన సమయానికి.. ఆలయాలకు 500 కిలోవాట్స్ సామర్థ్యం వరకే నెట్‌మీటరింగ్ ద్వారా అనుమతి ఉందని విద్యుత్తు అధికారులు కొర్రీ పెట్టారు. అంతే అప్పటి నుంచి వివాదం కొనసాగుతూనే ఉంది. ఉత్పత్తి అవుతున్న విద్యుత్తు.. నున్నలో గ్రిడ్‌కు వెళ్లిపోతోంది. నెట్‌మీటరింగ్ లేక ఏపీసీపీడీసీఎల్ నుంచి దుర్గగుడికి నెలవారీ బిల్లులు వచ్చేస్తున్నాయి. అప్పట్లో బిల్లు ఏటా రూ.కోటి ఉండగా.. ఈ ఏడేళ్లలో పెరిగిన విద్యుత్తు ఛార్జీల దెబ్బకు ఇప్పుడు రూ.కోటిన్నర వస్తోంది.

పరిష్కారానికి ముందడుగు...

ఏపీసీపీడీసీఎల్ సీఎండీ ఇటీవల ఆలయానికి వచ్చినప్పుడు.. సౌర విద్యుత్తు ప్లాంట్ గురించి ఈవో శీనానాయక్ వివరించారు. సమస్య పరిష్కరించాలని ఎన్టీఆర్ సర్కిల్ విద్యుత్తు అధికారులకు సీఎండీ సూచించారు. ఒక మెగావాట్ ప్లాంట్‌ను.. రెండుగా మార్చి.. 500 కిలోవాట్స్‌కు ఒక నెట్‌మీటరింగ్‌ను పెట్టాలని అధికారులు నిర్ణయించారు. రెండు శాఖల అధికారులు వీలైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తే.. దుర్గమ్మకు సౌర వెలుగులు సొంతమవుతాయి. ఆలయ పరిధిలో ఏటా 13.50 లక్షల యూనిట్ల విద్యుత్తు వినియోగిస్తుండగా.. ప్లాంట్ ద్వారా 16 లక్షల యూనిట్లు ఉత్పత్తి అవుతోంది. ఆలయానికే 2.50 లక్షల యూనిట్లకు విద్యుత్తు శాఖ డబ్బు చెల్లించేలా అప్పట్లో ప్రణాళికలు వేశారు.

ఇంటి నుంచే విద్యుత్తు సేవలు

● అందుబాటులో ఏపీసీపీడీసీఎల్ యాప్



విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఏపీసీపీడీసీఎల్ ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టింది. ఆండ్రాయిడ్ వరవాణుల్లో ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీనిద్వారా వచ్చిన సమస్యలను విద్యుత్తు శాఖ అధికారులు పరిశీలించి సత్వరం పరిష్కరిస్తారు.

- న్యూస్‌టుడే,సూర్యారావు పేట

జిల్లా	ఎన్టీఆర్	కృష్ణా
కనెక్షన్లు	12,68,111	6,65,000
ప్రతినెలా బిల్లు (రూ. కోట్లు)	225	80

బిల్లు చెల్లించొచ్చు: విద్యుత్తు బిల్లులు చెల్లించేందుకు బిల్‌పే ద్వారా సర్వీసు నంబరు, చరవాణి నంబరు పొందుపరిస్తే సంబంధించిన వివరాలు ప్రత్యక్షమవుతాయి.

నూతన కనెక్షన్: నూతన కనెక్షన్ కోసం సమగ్ర వివరాలను యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. అధికారులు పరిశీలించి కనెక్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటారు.

మొబైల్ లింకింగ్: విద్యుత్తు వినియోగదారులు తమ విద్యుత్తు కనెక్షన్‌కు సంబంధించి చరవాణి నంబరును అనుసంధానిస్తే విద్యుత్తు బిల్లుల సమాచారం చరవాణికి అందుతుంది.

ఎనర్జీ కాలిక్యులేటర్: ఏ ఉపకరణానికి ఎంత విద్యుత్తు ఖర్చవుతుందో దీని ద్వారా తెలుసుకోవచ్చు. నెలవారీ విద్యుత్తు వినియోగానికి సంబంధించిన మీటరు రీడింగ్ వివరాలు పొందుపరిస్తే బిల్లు సమాచారం కనిపిస్తుంది.

కస్టమర్ కేర్: వినియోగదారులు తమ సమస్యలను ఇందులో పొందుపరచొచ్చు. అందిన సప్లై వివరాలు, అవసరమైన అన్ని లింకులు ఇందులో పొందుపరిచి ఉంటాయి.

ఫీడ్ బ్యాక్: విద్యుత్తు శాఖ అందిస్తున్న సేవలపై అభిప్రాయాలు పంచుకోవచ్చు.

కన్‌జంప్షన్: వినియోగదారులు వాడిన యూనిట్లు.. చెల్లించాల్సిన నగదు.. బిల్ లెడ్జర్ వివరాలు అందుబాటులో ఉంటాయి.

పేమెంట్ హిస్టరీ: వినియోగదారులు నెలవారీగా చెల్లించిన విద్యుత్తు బిల్లుల సమాచారం ఇందులో ఉంటుంది.

ఎనర్జీ సేవింగ్స్ టిప్స్: విద్యుత్తు ఉపకరణాలు వాడుతున్నప్పుడు ఆచరించాల్సిన పొదుపు సూచనలు విపులంగా ఉంటాయి.

పే బిల్: సర్వీసు నంబరు నమోదు చేసుకుని నెలవారీ విద్యుత్తు బిల్లులకు సంబంధించిన నగదు చెల్లించొచ్చు.

అధికారుల వివరాలు: వినియోగదారుల పరిధిలోని అధికారుల ఫోన్ నంబర్లు లభ్యమవుతాయి. ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

టారిఫ్: వినియోగదారులకు సంబంధించిన టారిఫ్ వివరాలు ఇందులో పొందుపరిచి ఉంటాయి.

క్విక్‌పే: సర్వీసు నంబరు, చరవాణి నంబరును నమోదు చేస్తే సంబంధిత బిల్లు వివరాలు వస్తాయి. అక్కడినుంచి బిల్లు చెల్లించొచ్చు.

దెబ్బతిన్న పంటల రక్షణపై కేవీకే శాస్త్రవేత్తతో ఫోన్‌ఇన్





డి.సుధారాణి

మొంథా తుపాను పంటల్ని నిలువునా ముంచేసింది. దీనికి ముందు వర్షాలు చాలా వరకు దెబ్బతీశాయి. వరుస అలజడుల నేపథ్యంలో ఉన్న పంటనైనా కాపాడుకోవాలని రైతు తాపత్రయ పడుతున్నాడు. ఈనేపథ్యంలో వరి, మినుము, చెరకు, తదితర ఉద్యాన పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతుల సందేహాలను నివృత్తి చేయడానికి 'ఈనాడు.. మీతోడు' ఆధ్వర్యంలో ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సమన్వయకర్త డి.సుధారాణితో ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. రైతుల సమస్యలు, సందేహాలకు ఆమె సమాధానాలు ఇస్తారు. అన్నదాతలు చేయాల్సిందల్లా కింది సెల్ నెంబరుకు సూచించిన సమయంలో ఫోన్ చేయడమే. - ఘంటసాల, న్యూస్‌టుడే

సెల్ నెంబరు **8008 201253**
తేదీ: 03-11-2025 సోమవారం
ఉదయం: 11 నుంచి 12 గంటల వరకు

పటేల్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

విజయవాడ క్రీడలు: ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పిలుపునిచ్చారు. కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఐజీఎంసీ స్టేడియం నుంచి బెంజి సర్కిల్ వరకు సాగిన ఏక్తా ర్యాలీని రాష్ట్ర బాజపా అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చాక దేశ ఐక్యత, సమగ్రతకు తొలి హోంమంత్రిగా పటేల్ కృషి చేశారని కొనియాడారు. బాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం దేశంలోని 560 సంస్థానాలను కలిపి భారతదేశం మొత్తం ఒక్కటే అని పటేల్ చాటారని గుర్తు చేశారు. నేటి యువతతో పాటు ప్రజలందరూ స్వదేశీ వస్తువులను వాడాలని ఆయన పిలుపునిచ్చారు. ముందుగా కేశినేని శివనాథ్, పీవీఎన్ మాధవ్, ఎన్టీఆర్ జిల్లా బాజపా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, కూటమి నాయకులు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో [illegible] సౌరా సంజయ్ వర్మ, కోవెలమూడి, ఉప్పలపాటి శ్రీనివాస రావు, పసుపు సురేష్, సయ్యద్ బాషా, బాలి, యామిని శర్మ, కొల్లి నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మహాత్మాగాంధీ రోడ్డులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ అక్టోబరు 21 నుంచి 31 వరకు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల నేపథ్యంలో పలు రకాల కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అనంతరం బెంజ్‌సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. దీనికి ముందు కేపీ వ్యాస్ విగ్రహం ఎదుట నివాళులర్పించారు. డీసీపీలు సరిత, కె.తిరుమలేశ్వర్‌రెడ్డి, ఉదయరాణి, ఏడీసీపీ ప్రసాద్, ఏసీపీలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.



కేపీ వ్యాస్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న సీపీ రాజశేఖరబాబు, ఇతర అధికారులు

నూతన వధూవరులకు సీఎం ఆశీర్వాదం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: దిల్లీ ఏపీ భవన్ స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్ రెండో కుమారుడు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ సౌమ్య వివాహం అక్టోబరు 22న జరిగింది. శుక్రవారం రాత్రి ముఖ్యమంత్రి శ్రీరామచంద్ర నగర్‌లోని నివాసానికి వచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన్ను కలిసిన వారిలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, తూర్పు నియోజకవర్గ శాసనసభ్యుడు గద్దె రామ్మోహన్, ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ, ఇతర అధికారులున్నారు. స్థానికులు సీఎం చంద్రబాబుకు అభివాదం చేశారు. అనంతరం కంకిపాడులో జరిగే ఓ కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు. సీఎంను కలిసిన వారిలో మూడో డివిజన్ 7 కార్పొరేటర్ [illegible] ఎన్.సీతారామయ్య చౌదరి, జి.నారాయణరావు, వంగల కృష్ణ ప్రసాద్, జాస్తి శ్రీనివాస్, దాడి సుబ్బారావు, యలమంచిలి పండు, గద్దె రమేష్ కుమార్ ఉన్నారు.



వధూవరులతో ముఖ్యమంత్రి చంద్రబాబు

పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి

నందిగామ, నందిగామ గ్రామీణ: రాష్ట్రంలో పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య కోరారు. మొంథా తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. శుక్రవారం నందిగామ మండలంలోని అంబారుపేటలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పత్తి, వరి పైరును సీపీఐ నాయకులు, రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేతికి వచ్చిన పత్తి, వరి పంటలు వర్షాలకు పూర్తిగా దెబ్బ తిన్నట్లు చెప్పారు. హెక్టారుకు రూ.50 వేలు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. రాష్ట్రంలో 11.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిలో ఎన్టీఆర్, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో ఐదు లక్షల ఎకరాల్లో పత్తి వేసి నష్టపోయారని చెప్పారు. ఎకరాకు రూ.50 వేలు పెట్టుబడి పెట్టి అప్పుల పాలైనట్లు తెలిపారు. తడిసిన పత్తిని సీసీఐ నిబంధనలు సడలించి కొనాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నాయకులు పరుచూరి రాజేంద్రబాబు, జమలయ్య, చుండూరు వెంకట సుబ్బారావు, చామంతి, మన్నె హనుమంతరావు, రాయప్ప, లంకా గోవిందు పాల్గొన్నారు.



పత్తి పైరు పరిశీలిస్తున్న ఈశ్వరయ్య, శంకర్ తదితరులు

అంబేడ్కర్ స్మృతివనం పర్యాటకానికి మణిహారం కావాలి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరంలోని బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పర్యాటకానికి మణిహారం కావాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ సూచించారు. విజయవాడలోని కలెక్టరేట్‌లో సమన్వయ శాఖల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగరానికి వచ్చిన ప్రతి ఒక్కరు స్మృతివనాన్ని సందర్శించేలా, మహనీయుని ఆశయాల స్ఫూర్తిని, విజ్ఞాన వీచికలను భావితరాలకు అందించేలా అవగాహన కల్పించాలన్నారు. పర్యాటకుల సౌకర్యార్థం ఫుడ్‌కోర్టు, చిన్నారులకు ఆట స్థలం, ఆడిటోరియం, ఎక్స్‌పీరియన్స్ సెంటర్, మ్యూజియం తదితరాలకు సంబంధించిన పనులను పటిష్ఠ ప్రణాళికతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ.. జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, వీఎంసీ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బాబ్జీ, డిప్యూటీ జోనల్ మేనేజర్ అబ్దుల్ రహీం, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి ఎం.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజయ్ జైన్, పక్కన కలెక్టర్ లక్ష్మీశ

ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్ వాహనాలతో ఉజ్వల భవిత

కానూరు: రానున్న రోజుల్లో ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్ వాహనాలతోనే ఉజ్వల భవిత సాకారమవుతుందని ఐసీఐ రీజనల్ కౌన్సిల్ ఆన్ సిస్టమ్స్ ఇంజినీరింగ్ అధ్యక్షుడు ప్రసన్నరామమూర్తి అన్నారు. సిద్ధార్థ డీమ్డ్ టు బి విశ్వవిద్యాలయం, పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలు సంయుక్తంగా నిర్వహిస్తున్న రెండు రోజుల ఆటోమోటివ్, ఈవీ సదస్సు-2025లో ఆయన మాట్లాడారు. ఎలక్ట్రిక్ వాహనాలు ఉద్గారాల తగ్గింపునకు, శిలాజ ఇంధనాలపై ఆధార పడటాన్ని తగ్గించడానికి, ప్రజారోగ్యం మెరుగుకు దోహదపడతాయన్నారు. ఆర్థిక అభివృద్ధి, ఆవిష్కరణలు, ఉద్యోగ సృష్టికి ఆటోమోటివ్ రంగం సహాయ పడుతుందన్నారు. ఎలక్ట్రానిక్స్ అధినేత డి.రామకృష్ణ మాట్లాడుతూ మౌలిక వసతులు, ఇంధనం, ఆర్థిక సుస్థిరత, సాంకేతిక పరిష్కారాలు రూపొందించడం, అమలుకు నైపుణ్యం కలిగిన ఇంజినీర్లు కీలకమన్నారు. సీఐఐ పూర్వ ఛైర్మన్ జేఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ ఆటోమోటివ్, ఈవీ పరిశ్రమలకు గొప్ప భవిష్యత్తు ఉందన్నారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, సిద్ధార్థ అకాడమీ ఉపాధ్యక్షుడు వి.నాగభూషణరావు, ఉపకులపతి పి.వెంకటేశ్వరరావు, ప్రోవైస్‌ఛాన్సలర్ ఏవీ రత్నప్రసాద్, ప్రిన్సిపల్ కొండపల్లి శివాజీబాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసన్నరామమూర్తి, రాజయ్య, వెంకటేశ్వరరావు, రత్నప్రసాద్, శివాజీబాబు తదితరులు

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

గాంధీనగర్, న్యూస్‌టుడే: కుల, మతాలకతీతంగా ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించేందుకు కాపు అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(కోపా) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.కైలాసరావు, దుట్టా రమేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ముత్యాలంపాడు సంఘ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో గత 28 ఏళ్లుగా ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన మెరిట్ విద్యార్థులను గుర్తించి ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు. తమ వద్ద లబ్ధిపొందిన విద్యార్థులే దాతలుగా మారి సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, డిప్లొమా కోర్సులు చదువుతున్న విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాల కోసం 94402 39989 నంబరుకు సంప్రదించాలని కోరారు.

డీఎస్‌డీవోగా కోటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా కాకర్ల కోటేశ్వరరావు శుక్రవారం స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని ఎన్టీఆర్ డీఎస్ఏ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఇటీవల చేసిన సాధారణ బదిలీల్లో భాగంగా కోటేశ్వరరావు శాప్ ప్రధాన కార్యాలయంలో క్రీడాధికారిగా విధులు నిర్వర్తించి.. ప్రస్తుతం ఎన్టీఆర్ డీఎస్‌డీవోగా బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎన్టీఆర్ డీఎస్‌డీవోగా పని చేసిన ఎస్ఏ అజీజ్ ఏలూరు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ డీఎస్‌డీవోగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు డీఎస్ఏ శిక్షకులు, కార్యాలయ సిబ్బంది, గ్రౌండ్స్‌మెన్లు ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు.

'టెట్' మినహాయింపుపై చట్ట సవరణ అవసరం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: టెట్ నుంచి సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి చట్ట సవరణ చేయించాలని, కోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) జిల్లా శాఖ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నగరంలోని కలెక్టరేట్‌లో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహానికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ ఎ.సుందరయ్య మాట్లాడుతూ ఎన్‌సీటీఈ నిబంధనల మేరకు ఉపాధ్యాయ వృత్తిలోకి రావాలంటే 2011 తర్వాత నియామకాల్లో డీఎస్సీతో పాటు, టెట్‌లో ఉత్తీర్ణత సాధించాలని ఆ ఏడాది జీవో నంబరు 51లో ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఆ ఉత్తర్వుల్లో అప్పటికే సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు అప్పటి ప్రభుత్వం మినహాయింపు ఇచ్చినట్లు పేర్కొన్నారు. సంఘ సెక్రటరీ జనరల్ ఇంటి రాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు అండగా నిలబడాలని కోరారు. డిప్యూటీ సెక్రటరీ జనరల్ సయ్యద్ ఖాశీం, సంఘ నేతలు జి.అనుగ్రహప్రసాద్, కె.శ్రీనివాసరావు, వి.రాధిక, జె.సుధానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌పై కేసు కొట్టివేత

పటమట, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా తెదేపా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చేపట్టిన ఆందోళనలపై వైకాపా ప్రభుత్వం నమోదు చేయించిన 27వ కేసును శుక్రవారం విజయవాడలోని ఎంపీ, ఎమ్మెల్యేల కేసులు విచారించే ప్రత్యేక కోర్టు కొట్టి వేసింది. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం అవలంబించిన అరాచక పాలన, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తెదేపా ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి ఆందోళనలు నిర్వహించినట్లు తెలిపారు. ఆందోళన అణిచి వేయడానికి వైకాపా ప్రభుత్వం అక్రమంగా కేసులు నమోదు చేసిందని, వీటికి బెదరకుండా ప్రజలతో ఆందోళనలు చేసినట్లు పేర్కొన్నారు.

బెయిల్ షరతులు సడలించాలని వంశీ పిటిషన్

ఈనాడు, అమరావతి: సత్యవర్ధన్‌పై దాడి కేసులో బెయిల్ షరతులను సడలించాలని వైకాపా నేత వల్లభనేని వంశీ, ఎస్సీ, ఎస్టీ కోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం ప్రతి నెలా రెండు, నాలుగో శనివారాలు పటమట స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో ఎదుట హాజరవుతున్నారు. వీటిని తొలగించాలని, ఆరోగ్యరీత్యా ఇబ్బందులు పడుతున్నానని అందులో పేర్కొన్నారు. దీనిపై పోలీసులు కౌంటర్ దాఖలు చేశారు. ఈ కేసులో ఇంకా ఆరుగురు నిందితులను అరెస్టు చేయాల్సి ఉందని, ఈ దశలో బెయిల్ షరతులు సడలించొద్దని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ నిమిత్తం న్యాయాధికారి 3వ తేదీకి వాయిదా వేశారు.

మద్యం కేసులో బెయిల్ పిటిషన్లు దాఖలు చేసిన ముగ్గురు నిందితులు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో ముగ్గురు నిందితులు ఏసీబీ కోర్టులో తాజాగా బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బాలాజీకుమార్ యాదవ్, నవీన్ కృష్ణలు శుక్రవారం వేసిన బెయిల్ పిటిషన్లపై ప్రాసిక్యూషన్‌కు కౌంటర్లు దాఖలు చేసేందుకు ఈ నెల 4వ తేదీకి వాయిదా వేశారు. ఇటీవల వీరి బెయిల్ పిటిషన్లను కోర్టు కొట్టివేసింది. కారాగారంలో తనకు దోమతెర, బెడ్ కోసం అనుమతి ఇవ్వాలని నిందితుడు చాణక్య పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ నిమిత్తం 3వ తేదీకి వాయిదా పడింది. నడుము నొప్పి చికిత్స కోసం మంతెన సత్యనారాయణరాజు ఆశ్రమంలో చికిత్సకు అనుమతించాలని చెవిరెడ్డి మళ్లీ పిటిషన్ వేశారు. దీనిపై 3వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ -213, చికెన్ స్కిన్‌లెస్ - 243. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, 144, 155 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 575 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.96/-.

క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తిస్తే చికిత్స సులభం

చుట్టుగుంట, న్యూస్‌టుడే: క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స విజయవంతమయ్యే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఇన్నర్ వీల్‌క్లబ్ ఆధ్వర్యంలో కిమ్స్ చక్ర క్యాన్సర్ సెంటర్ సహకారంతో శుక్రవారం బీఆర్‌టీఎస్ రోడ్డు ఫుడ్ జంక్షన్ వద్ద నిర్వహించిన అవగాహన ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం అధునాతన సాంకేతిక పద్ధతులతో పలు రకాల క్యాన్సర్ల నివారణకు మందులు, వ్యాక్సిన్ కూడా వచ్చాయన్నారు. దీనిని సామాన్య ప్రజలు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెదేపా ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా బ్రెస్ట్ క్యాన్సర్‌తో పాటు సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తోందన్నారు. క్యాన్సర్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా చూడాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లపై అవగాహన కల్పించడం అత్యవసరమన్నారు. ఇన్నర్ వీల్‌క్లబ్ వంటి సంస్థలు ఈ దిశగా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇన్నర్ వీల్ క్లబ్ జిల్లా ఛైర్మన్ అరుణశ్రీ, అధ్యక్షురాలు బొర్రా సత్య, కార్యదర్శి తేజస్వి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలు కొడాలి కవిత, కిమ్స్ చక్ర క్యాన్సర్ సెంటర్ ప్రతినిధి టి.మహితి, ఫణి, యశ్వంత్, అడుసుమిల్లి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

హోటల్ కార్మికుడిపై ఎస్సై వీరంగం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: హోటల్ కార్మికుడిపై ఎస్సై లాఠీ ఝుళిపించిన సంఘటన ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం రింగుకూడలిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి సేకరించిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం రింగు పవిత్ర సంగమం రోడ్డులో అల్పాహార హోటల్‌ను స్థానిక కౌన్సిలర్ ఒకరు నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి 10.30లకు బీటు పోలీసులు దుకాణాలను మూసేయాలని హోటల్ సిబ్బందికి తెలిపారు. అదే సమయంలో కొండపల్లి సెక్టార్ ఎస్సై పురుషోత్తం అక్కడికి చేరుకొన్నారు. సమయం 11 అవుతున్నా దుకాణాలు ఎందుకు మూయలేదంటూ హోటల్‌లో సరకులు సర్దుతున్న కార్మికుడిని బలంగా కొట్టడంతో అతడికి వాతలు తేలాయి. అయితే సిబ్బందిని లాఠీతో కొట్టే అధికారం ఎవరు ఇచ్చారంటూ హోటల్ యజమాని ఎస్సైని ప్రశ్నించారు. తమకు సమాధానం ఇవ్వాలని కోరారు. దీంతో పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ విషయాన్ని సీఐ చంద్రశేఖర్ దృష్టికి హోటల్ యజమాని తీసుకెళ్లారు. ఎస్సైపై చర్యలు తీసుకొంటామని సీఐ వారికి నచ్చజెప్పి పంపించారు. దీనిపై సీఐ మాట్లాడుతూ.. కొంతకాలంగా భవానీపురం స్వాతి థియేటర్ రోడ్డుతో పాటు ఇబ్రహీంపట్నం రింగుకూడలికి విజయవాడకు చెందిన యువకులు రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాలు, కార్లలో టిఫిన్ చేయడానికి వస్తున్నారన్నారు. ఇలా రావడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. అందువల్లే హోటళ్లను మూయిస్తున్నామన్నారు.



ఎస్సై కొట్టడంతో వాత తేలిందిలా..

అయ్యప్ప దీక్షా వస్త్రాలతో పాఠశాలకు హాజరు

విద్యార్థిని అనుమతించని యాజమాన్యం

గొల్లపూడి, న్యూస్‌టుడే: అయ్యప్ప మాల ధరించి పాఠశాలకు వెళ్లిన విద్యార్థిని యాజమాన్యం అనుమతించని వైనంపై వివాదం తలెత్తింది. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని జీవిజీ ఇంటర్నేషనల్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి అయ్యప్ప దీక్ష తీసుకుని శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లాడు. ఈ క్రమంలో యాజమాన్యం ఆ బాలుడిని లోపలికి అనుమతించకుండా ఇంటికి పంపించింది. సమాచారం అందుకున్న అయ్యప్ప మాల ధరించిన భక్తులు, ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాఠశాల వద్దకు వెళ్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. మాల ధరించిన విద్యార్థిని పాఠశాలలోకి ఎందుకు అనుమతించరంటూ ప్రశ్నించారు. విషయం తెలిసిన భవానీపురం పోలీసులు వచ్చి వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయ్యప్ప దీక్షదారులంతా కలిసి ఈ విషయాన్ని డీఈవో యు.వి.సుబ్బారావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన పాఠశాల యాజమాన్యంతో మాట్లాడడంతో సమస్య సద్దుమనిగింది. జరిగిన సంఘటనపై అయ్యప్ప స్వాములకు క్షమాపణ చెప్పి విద్యార్థిని అనుమతిస్తామని చెప్పారు. ఇటీవల విద్యాధరపురంలోని బెజవాడ రాజారావు ఉన్నత పాఠశాలలో కూడా ఇలాంటి సంఘటన జరగడంతో వివాదం ఏర్పడింది.



పాఠశాల వద్ద ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్వాములు

జీవిజీ పాఠశాల యాజమాన్యానికి డీఈవో నోటీసులు

అయ్యప్ప మాల ధరించి పాఠశాలకు వచ్చిన ఐదో తరగతి విద్యార్థిని తరగతి గదిలోకి అనుమతించని గొల్లపూడిలోని జీవిజీ ఇంటర్నేషనల్ పాఠశాల యాజమాన్యానికి డీఈవో సుబ్బారావు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. రెండు రోజుల్లో పాఠశాల యాజమాన్యం సంజాయిషీ ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే ఏదైనా ప్రైవేటు, ఎయిడెడ్, తదితర పాఠశాలల్లో చదివే విద్యార్థులు మాల ధరించి వస్తే వారికి అభ్యంతరం తెలపకుండా తరగతి గదిలోకి అనుమతించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పాఠశాల నిర్వాహకులు అభ్యంతరం తెలిపినా, అనుమతించకపోయినా యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. పాఠశాల గుర్తింపును రద్దు చేస్తామని హెచ్చరించారు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? విస్సన్నపేట జిల్లా పరిషత్ హైస్కూల్ ఎదురుగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టి పనులు పూర్తయినా నిర్మాణ వ్యర్థాలను రహదారిపై వదిలేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - గోటేటి లక్ష్మీ నరసింహారావు, విశ్రాంత ఉద్యోగి, విస్సన్నపేట

✓ పనులు జరుగుతున్నాయి. స్కూల్ కమిటీ వారితో మాట్లాడి నిర్మాణ వ్యర్థాలను తొలగిస్తాం - కేశవ హరికృష్ణ కుమార్, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, విస్సన్నపేట



◆ స్థానిక పంచాయతీ పరిధి ఎస్సీ వాడలోని డ్రైయిన్ జిల్లో పూడిక పేరుకుపోయి మురుగు ప్రవాహానికి ఆటంకంగా ఉందని స్థానికులు మేమున్నాం.. మీకుతోడుగాకు తెలిపారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. శుక్రవారం పంచాయతీ సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

◆ పట్టణంలోని 17వ వార్డులోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు పారుదలకు ఇబ్బందిగా ఉందని స్థానికుడు ధనుంజయరావు చేసిన ఫిర్యాదుపై మున్సిపాలిటీ శానిటరీ అధికారులు స్పందించారు. పొక్లెయిన్ ఏర్పాటు చేయించి శుభ్రం చేయించారు. పనులను మున్సిపల్ ఛైర్మన్ కె.నిర్మల పర్యవేక్షించారు.

◆ పట్టణంలోని 16 వ వార్డులోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికుడు కాంతారావు మేమున్నాం.. మీకు తోడుగాకు ఫిర్యాదును శానిటరీ అధికారి సంతోష్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించి అనంతరం పొక్లెయిన్‌తో సిమెంట్ తూమును ఏర్పాటు చేయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు టౌన్



విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గంపలగూడెం, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గంపలగూడెం, తోటమూలలో సరఫరా ఆపేస్తున్నట్లు డిస్కం ఏఈ సీహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని కోరారు.

వాటర్ కూలర్ వితరణ

జి.కొండూరు, న్యూస్‌టుడే: స్థానిక భవిత పాఠశాలలోని దివ్యాంగ విద్యార్థులకు చెవుటూరు గ్రామానికి చెందిన పప్పుల వీరాజు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు జగన్మోహన్‌రావు రూ.9 వేల విలువైన వాటర్ కూలర్‌ను శుక్రవారం బహూకరించారు. దాతకు ఉపాధ్యాయులు రత్నకుమారి, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

మైలవరం, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఏపీ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ డైరెక్టర్ డి.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కీర్తిరాయునిగూడెంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

ఘనంగా జపమాలమాత మహోత్సవాలు

మైలవరం, న్యూస్‌టుడే: శాంతినగర్‌లోని ఆర్సీఎం దేవాలయంలో జపమాల మాత మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ముగింపు ఉత్సవాల్లో భాగంగా శాంతినగర్, సుద్దిపేటలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో విచారణ గురువు అనిల్ ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఆటలకు ఎంపిక

విస్సన్నపేట, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నర్సాపురంలో ఇటీవల జరిగిన డివిజన్ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో అండర్14, అండర్17 బాలుర, బాలికల విభాగాల్లో నరసాపురం హైస్కూల్ సంబంధించి విద్యార్థులు ప్రతిభ చూపి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎస్.శోభాలత, తెలిపారు. సీనియర్ విభాగంలో సిహెచ్ మున్నా, ఎన్.కుమార్‌బాబు, ఎం.శరణ్య, ఎన్.కృష్ణవేణి, జూనియర్స్ విభాగంలో వి.చందు, కె.నాగ విష్ణువర్ధన్, ఎం.లావణ్య, ఎస్ చంద్రిక సత్తాచాటారన్నారు. శనివారం గన్నవరంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని వివరించారు. తిరువూరు నియోజకవర్గ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి పి.రమేష్ వారిని అభినందించారు.



ప్రతిభచాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చేతికొచ్చే తరుణం.. పట్టాలిస్తే అభయం

రాయితీ పరదాల కోసం అన్నదాతల ఎదురుచూపులు

ఇబ్రహీంపట్నం(గ్రామీణం(గుంటుపల్లి), న్యూస్‌టుడే: భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి రైతులు తమ పంట నష్టపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో తుపాన్లు, వరదలు ముంచుతున్నాయి. పంట నూర్పిడి చేసి పొలాల్లో, కల్లాల్లో ఆరబోసుకున్న దిగుబడులు తడిసిపోయి నష్టం వాటిల్లుతోంది. ఇలాంటి సందర్భాల్లో టార్పాలిన్‌లు(పట్టాలు) ఎంతగానో ఉపయోగపడతాయి. తెదేపా ప్రభుత్వం జాతీయ ఆహార భద్రత మిషన్ కింద 50 శాతం రాయితీపై వీటిని అన్నదాతలకు అందించింది. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విస్మరించి కస్టమ్ హైరింగ్ సెంటర్ల కింద గ్రూపుగా ఏర్పడిన వారికి మాత్రమే వ్యవసాయ పరికరాలను పంపిణీ చేసింది. వాటిలో రైతులకు అవసరమైన పట్టాలు లేకపోవడం గమనార్హం. దీంతో గత అయిదేళ్లు ఎన్నో అవస్థలు పడాల్సి వచ్చింది. ఫలితంగా ఆర్థిక భారమైనప్పటికీ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేసుకుంటున్నారు. మరి కొందరు అవసరమైన సమయాల్లో అద్దెలకు తెచ్చుకుంటున్నారు.

రోజుకు రూ.30 నుంచి రూ.50 వరకు

బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు పట్టాలు కొనుగోలు చేయలేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. వ్యాపారులు సైజును బట్టి రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇప్పటికే వరి పంట కంకి, పొట్ట పోసుకునే దశకు చేరింది. మొక్కజొన్న కోతకు సిద్ధమైంది. తుపానుతో పాటు వర్షాలు తగ్గుముఖం పట్టినా నేటి పరిస్థితుల్లో మరో పది పదిహేను రోజులలో నూర్పిడిలకు రైతులు సమాయత్తం అవుతున్నారు. ఈ తరుణంలో చేతికి వచ్చిన పంటను దక్కించేందుకు యంత్రాల ద్వారా నూర్పిళ్లు చేయించనున్నారు. ధాన్యం రాసులపై పట్టాలు కప్పి వాన, మంచుకు తడవకుండా చర్యలు చేపడతారు. కొందరు తమతమ అవసరాలను బట్టి వ్యాపారుల వద్ద రోజుకు రూ.30 నుంచి రూ.50 వరకు ఖర్చుపెట్టి అద్దె తెచ్చుకుంటున్నారు. వాతావరణంలో కనిపిస్తున్న మార్పులతో వరికుప్పలు, ధాన్యం రాశులపై కప్పేందుకు పట్టాలు ఎంతో అవసరం అని రైతులు వాపోతున్నారు.



ధాన్యం రాసులపై కప్పిన అద్దె పట్టాలు (పాతచిత్రం)

ప్రభుత్వానికి నివేదించాం: వై.రజని, మండల వ్యవసాయాధికారిణి

మైలవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాలతోపాటు గొల్లపూడి, రాయనపాడు, పైడూరుపాడు గ్రామాల్లో సుమారు 18,900 ఎకరాల్లో 14 వేల మంది రైతులు వరి పంటతోపాటు ఇతర వాణిజ్య వ్యాపార పంటలు సాగు చేశారు. ఈ మేరకు పట్టాల అవసరాన్ని ప్రభుత్వానికి నివేదించాం. అనుమతులు వచ్చిన వెంటనే రాయితీపై అందిస్తాం.

ప్రతిభా పాటవ పోటీల్లో సత్తా

విస్సన్నపేట, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహణకు సంకల్పించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం క్విజ్ పోటీలను పాఠశాలల్లో నిర్వహించి గెలిచిన వారికి శుక్రవారం మండల స్థాయిలో విస్సన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోటీలు పెట్టారు. వారిలో నియోజకవర్గ స్థాయి పోటీలకు ముగ్గురిని ఎంపిక చేసినట్లు ఎంఈవో సుధాకర్ తెలిపారు. విస్సన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి పి.నాగ వెంకటేష్, నరసాపురంలోని అంబేడ్కర్ గురుకులంలో చదివే పదో తరగతి విద్యార్థినులు వి.హాసిని, పి.ప్రణీతలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను ఎంఈవో సుధాకర్, హెచ్‌ఎం ఆర్ శోభారాణి అభినందించారు

తుపాన్లపై మాట్లాడే హక్కు జగన్‌కు లేదు

గొల్లపూడి, న్యూస్‌టుడే: తుపాన్లపై మాట్లాడే నైతిక హక్కు, జగన్‌కు లేదని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గొల్లపూడిలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జగన్ ఎప్పుడూ ప్రచారాల విషసంస్కృతిని మానుకోవాలన్నారు. విపత్తుల సమయంలో ప్రజల పక్షాన బాధ్యతగా లేకుండా మాట్లాడడం తగదన్నారు. ప్రజల కోసం నిరంతరం పర్యవేక్షించే చంద్రబాబు, లోకేశ్ ఉన్నారని, అధికారులను ముందుండి నడిపించారన్నారు. ప్రభుత్వం చేపట్టిన సమర్థవంతమైన చర్యలను పొరుగు రాష్ట్రాల నాయకులు అభినందిస్తున్నారని వెల్లడించారు. ప్రతి రైతుకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. జగన్ పాలనలో ఐదేళ్ల పాటు ప్రజలు, రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని వెల్లడించారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి దేవినేని

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



చింతలపాడులో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో మాధురి

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధరకు విక్రయించాలని ఆర్డీవో మాధురి సూచించారు. తిరువూరు మండలం చింతలపాడులో శుక్రవారం పర్యటించిన ఆమె వరి పంట నష్టం అంచనాపై స్థానిక రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అప్పటికే ఒక రైతు నూర్పిడి చేసి ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. పీపీసీలో విక్రయిస్తేనే పంటకు మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

కేజీవై రహదారి అభివృద్ధిపై విమర్శలు తగవు

జి.కొండూరు, న్యూస్‌టుడే: కందులపాడు గంగినేని ఎర్రుపాలెం(కేజీవై) ఆర్ అండ్‌బీ ప్రధాన రహదారి అభివృద్ధి పనులపై చౌకబారు విమర్శలు తగవని మండల తెదేపా నాయకులు సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. వైకాపా నాయకుల తీరుపై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేజీవై రహదారి అభివృద్ధి పనులు దాదాపు 80 శాతం జరిగాయని మిగిలిన పనులు త్వరలోనే పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కృషి చేస్తున్నారన్నారు. ఐదేళ్ల వైకాపా ప్రభుత్వంలో స్థానికుడిని అని చెప్పుకున్న జోగి రమేష్‌కు మంత్రి పదవి ఉన్నప్పుడు కేజీవై రహదారి అభివృద్ధి చేయాలనిపించలేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు ఆదృష్ట, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెదేపా నాయకులు

బాధితులకు సాయం అందజేత



మైలవరం : సరుకులు అందిస్తున్న తహసీల్దార్, నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో పునరావాస కేంద్రంలో వసతి పొందిన బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సాయాన్ని శుక్రవారం పునరావాస కేంద్రంలో అందజేశారు. ప్రభుత్వం కుటుంబానికి రూ.3 వేల చొప్పున, ఒక్కరుంటే రూ.1000 చొప్పున సాయాన్ని మంజూరు చేసినట్లు తహసీల్దార్ అబ్దుల్ రియాజ్ పేర్కొన్నారు. బాధితులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి ఆదుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్సై సుధాకర్, తెదేపా నాయకులు లితీష్, గోపాలస్వామి, కరీం తదితరులు పాల్గొన్నారు.

ఊటుకూరు, ఆర్లపాడు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మొంథా తుపాన్ కారణంగా పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న మండల పరిధిలోని ఊటుకూరు, ఆర్లపాడు, తోటమూల గ్రామాల్లో పల్లపు ప్రదేశాల్లో నివసిస్తున్న 57 కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలతో పాటు ప్రభుత్వ రూ.1.31లక్షల ఆర్థిక సహాయాన్ని కూడా అందించినట్లు తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజమోహన్ తెలిపారు. వాటిని మండలంలోని ఊటుకూరు, ఆర్లపాడులో పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం తీసుకున్న కుటుంబాలకు శుక్రవారం ఆమె పంపిణీ చేశారు. నాయకులు ఎస్‌కే.నాగుల్‌మీరా, వై.శ్రీనివాసరావు, కె.కిషోర్, వీఆర్వోలు రవి, స్వాతి పాల్గొన్నారు.

నష్ట నివారణ పద్ధతులు తప్పనిసరి

జి.కొండూరు, న్యూస్‌టుడే: మొంథా తుపాన్ ధాటికి పంట దెబ్బతిన్న రైతులు నష్ట నివారణ చర్యలు తప్పక పాటించాలని వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ అధికారులు సూచించారు. మండలంలోని వెంకటాపురం, జి.కొండూరులో గ్రామాల్లో పత్తి పొలాలను శుక్రవారం సందర్శించి రైతులకు నష్ట నివారణకు చర్యలు వివరించారు. పల్లపు ప్రాంతాల్లో నిలిచిన నీటిని తొలగించాలని, తెగుళ్ల ఆశించకుండా డ్రోన్ సహాయంతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో మందులను పిచికారీ చేయాలని సూచించారు. 90 రోజుల పంటలో కాయ తెగులును నివారించేందుకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 600 గ్రా ఎకరాకు పిచికారీ చేయాలని తెలిపారు. శాస్త్రవేత్త డాక్టర్ ఎ.మనీడిన్, డాక్టర్ పీఎన్ శివప్రసాద్, డాక్టర్ ఎన్ రాజశేఖర్, జిల్లా వ్యవసాయాధికారిణి విజయకుమారి, మైలవరం ఏడీఏ శ్రీనివాస్, ఏవో సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చీమలపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని చీమలపాడులో జిల్లా వ్యవసాయాధికారిణి డీఎంఎఫ్.విజయకుమారి, వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.మనీడిన్, లాం, ఆంగ్రూ, రవికిషోర్, పీఎన్.శివప్రసాద్, ఎన్.రాజశేఖర్, ఏఈవో బి.నాగార్జున శుక్రవారం పర్యటించారు. తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న పత్తి, మినుము పంటలను బాధిత రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పత్తిలో నిల్వ ఉన్న నీటిని తొలగించి ఎండగా ఉన్నప్పుడు ఆకు మచ్చ, కాయ తెగులు నివారణకు పిచికారీ చేయాల్సిన మందులను వివరించారు. డ్రోన్ల సాయంతో మందులు పిచికారి చేయాలని, తద్వారా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారి చేసి పంటను కాపాడుకోవచ్చున్నారు.



చెవుటూరులో పత్తి రైతులకు సూచనలిస్తూ..

తిరువూరు టౌన్ న్యూస్‌టుడే : మండలంలోని లక్ష్మీపురం, కాకర్ల గ్రామాల్లోనూ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న వరి, ప్రత్తిపంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పొలంలో నీరు నిలవకుండా అంతర్గత కాలువలు తీసి నీటిని బయటకు పంపిచాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి పద్మ తదితరులు వారి వెంట ఉన్నారు.

ఇబ్రహీంపట్నం(గ్రామీణం, న్యూస్‌టుడే: నదీ తీర గ్రామాల్లో తుపాను కారణంగా దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారిణి రజని శుక్రవారం పరిశీలించి పంట నష్టం అంచనాలను రైతును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దాములూరు సహకార సంఘం అధ్యక్షుడు అప్పారావులతో పాటు సాగుదారులు మాట్లాడుతూ రెండు సార్లు సాగుచేసిన పత్తి పంట పూర్తిగా దెబ్బతిన్నదని ఎకరాకు రూ.35 వేల వరకు ఖర్చు చేసినట్లు వివరించారు. నష్టం అంచనాలను పారదర్శకంగా నమోదుచేసి వేసి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనల మేరకు పంట నష్టాలను నమోదు చేసి పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.



చీమలపాడులో దెబ్బతిన్న మినుము పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

‘అక్రమాలపై చర్యలు ఎందుకు తీసుకోలేదు’

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

కొండపల్లి, న్యూస్‌టుడే: మురుగు కాలువలో సిల్ట్ తొలగింపులో అక్రమాలు ప్రజలందరికీ తెలియాలని కొందరు కౌన్సిలర్లు చేసిన ఆరోపణలతో కౌన్సిల్ దద్దరిల్లింది. కొండపల్లి పురపాలిక కౌన్సిల్ సమావేశాన్ని పుర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ గుంజా శ్రీను మాట్లాడుతూ.. గత సమావేశంలో సిల్ట్ తొలగింపులో అక్రమాలు జరిగాయని, దానిపై విజిలెన్స్ విచారణ కావాలని వైస్ ఛైర్మన్ శ్రీను కోరారని, దానిపై ఇంకా చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. దీంతో పాటు పాలకవర్గం వచ్చిన నాటి నుంచి కొన్ని డివిజన్లలోనే పనులు జరుగుతున్నాయని ఆరోపించారు. అనంతరం 16వ డివిజన్ కౌన్సిలర్ పురపాలికలో విచ్చలవిడిగా కుక్కలు ఉన్నాయని, దానిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వీటితో పాటు ఇబ్రహీంపట్నం ప్రాంతంలో విపరీతమైన ఆక్రమణలు చోటుచేసుకొన్నాయని చెప్పారు. దానిపై కూడా పాలకవర్గం, అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణపై మరి కొందరు కౌన్సిలర్లు ప్రశ్నలను లేవనెత్తారు. సిల్ట్‌లో అక్రమాలు జరగలేదని, పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఛైర్మన్ చిట్టిబాబు, కమిషనర్ రమ్యకీర్తన వివరణ ఇచ్చారు.



ఛైర్మన్, కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ గుంజా శ్రీను

ఘనంగా ఐక్యతా దినోత్సవం



కళాశాల విద్యార్థుల ప్రదర్శన



తిరువూరు: పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో

ఇబ్రహీంపట్నంగ్రామీణం, న్యూస్‌టుడే: జూపూడి నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అక్బర్ ఖాన్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యత దినోత్సవంగా నిర్వహించుకుంటున్నట్లు చెప్పారు. దేశ సమగ్రత, ఐక్యతకు ఆయన చేసిన కృషిని వివరించారు. అనంతరం గ్రామంలో విద్యార్థులంతా ప్రదర్శన నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారులు వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా తిరువూరు నగర పంచాయతీ ప్రధాన రహదారిలో పోలీసుల ఆధ్వర్యంలో ప్రదర్శన, ఫ్యాక్టరీ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. తొలుత పటేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. మైలవరం ఏసీపీ ప్రసాదరావు, సీఐ గిరిబాబు, ఎస్సై సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రక్షితనీటి ట్యాంకులకు క్లోరినేషన్

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక పంచాయతీలో రక్షితనీటి సరఫరా ట్యాంకుల లోపల కడిగించి క్లోరినేషన్ చేయించినట్లు పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు తెలిపారు. ప్రజలకు సురక్షితమైన నీటిని సరఫరా చేసే నిమిత్తం సూపర్ క్లోరినేషన్ చేయిస్తున్నామన్నారు

వంతులు వద్దండి.. సమస్య తీర్చండి

మండలంలోని లోయ గ్రామాల్లో రోజులుగా కృష్ణా జలాల సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు దాహం కేకలు పెడుతున్నారు. జి.కొండూరు సంపు నుంచి గడ్డమణుగు, చెరువుమాధవరం, మునగపాడు, సున్నంపాడు, తెల్లదేవరపాడు, గంగినేని, దుగ్గిరాలపాడు వరకు వెళ్లాల్సిన కృష్ణా జలాలు ఆగిపోయాయి. దీనికి ప్రధాన కారణం పైపులైన్ కేజీవై రహదారి వెంబడి ఉండడం, గడ్డమణుగు చెరువుమాధవరం గ్రామాల మధ్య పలు చోట్ల లీకులు కావడమేనని లోయ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కేజీవై రహదారి పనులు పూర్తయితేనే నూతనంగా పైపులైన్ వేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెపుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం ముందు పైపులైన్ వేస్తే తర్వాత రహదారి నిర్మాణం చేపడతామంటూ ఒకరిపై ఒకరు వంతులు వేసుకుంటూ లోయ గ్రామాల ప్రజల నీళ్లు లేకుండా చేశారు. ఇప్పటికైనా అధికారులు అలసత్వం వీడి దాహార్తిని తీర్చాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

గడ్డమణుగు సమీపంలో నిత్యం లీకవుతున్న కృష్ణా జలాల పైపులైన్



గుంతసైనా పూడ్చించరూ...

మండలంలోని పెనుగొలనులో బొడ్డురాయి కూడలి వద్ద ఆర్ అండ్‌బీ రహదారిపై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. వర్షం కురిసినప్పుడు వాటిల్లో నీరు నిలిచి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారి ధ్వంసమై నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, మరమ్మతులు కూడా చేయడంలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి గుంతలు పూడ్చించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పెనుగొలను(గంపలగూడెం)



మద్యం అక్రమ విక్రేతల అరెస్టు

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని హెచ్ ముత్యాలంపాడు గ్రామానికి చెందిన చిలపరపు బుజ్జి, వెలగలేరు గ్రామానికి చెందిన గజ్జల అనురాధలు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. వారి నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

జూదరులపై కేసు నమోదు

జి.కొండూరు, న్యూస్‌టుడే: జి.కొండూరు శివారు కొండ పక్కన కోడి పందెం నిర్వహిస్తున్నారని సమాచారం అందుకున్న ఎస్సై కె సతీష్‌కుమార్ తన సిబ్బందితో శుక్రవారం మధ్యాహ్నం దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.900, కోడి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి పారిశ్రామిక వాడ ఐవోసీ ఎదురుగా జాతీయ రహదారిపై ఉన్న గుంతలను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనదారుడు సాంబశివరావు వాహనం అదుపు తప్పింది. దీంతో ఆయన కిందపడి గాయాలపాలయ్యారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు ఆయనను సమీపంలోని ఆసుపత్రికి తరలించి బంధువులకు సమాచారం ఇచ్చారు. కనీసం గుంతలైనా పూడ్చకపోవడంతోనే నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు వాపోతున్నారు.

క్రమశిక్షణతో సేవలందించాలి

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: పోలీసులు తమ విధులను క్రమశిక్షణతో నిర్వహించాలని మైలవరం ఏసీపీ వై.ప్రసాదరావు ఆదేశించారు. తిరువూరు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన వార్షిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఠాణాలో ఫిర్యాదులు, కేసుల నమోదు దస్త్రాలను పరిశీలించారు. రాత్రి గస్తీ, రౌడీషీటర్లపై నిఘా, ప్రతి వారం కౌన్సెలింగ్ నిర్వహించడం, విజిబుల్ పోలీసింగ్, రహదారి ప్రమాదాల నియంత్రణ, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి కట్టడి చేయడం, ఆస్తి సంబంధిత నేరాల నియంత్రణ తదితర అంశాలపై మాట్లాడారు. సీఐ గిరిబాబు, ఎస్సై సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏఐటీయూసీతోనే కార్మిక చట్టాలు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్

గొల్లపూడి, న్యూస్‌టుడే: ఏఐటీయూసీ 106వ వ్యవస్థాపక దినోత్సవాన్ని గొల్లపూడిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించారు. స్థానిక ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం వద్ద పతాకాన్ని జాతీయ కార్యదర్శి జి.ఓబులేసు ఎగరవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్రిటీషు పాలకులు కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకునేవారని, ఆ సమయంలో ఏఐటీయూసీ ఏర్పడి చేసిన పోరాటాల కారణంగా అనేక కార్మిక చట్టాలు, హక్కులను సాధించడం జరిగిందని తెలిపారు. అనంతరం కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి కంటి, గుండె, కిడ్నీ సంబంధిత పరీక్షలు చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు. ◆ గొల్లపూడిలోని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ గోదాము వద్ద ఏఐటీయూసీ జెండాను రాష్ట్ర నాయకుడు వెంకటసుబ్బయ్య ఆవిష్కరించారు.

పౌరహక్కులపై అవగాహన ఉండాలి

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఎస్సీవాడలో తహసీల్దార్ వి.రాజకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీవాడ ప్రజలకు పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులపై అవగాహనతో ఉండాలని, అవసరమైనప్పుడు హక్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచి కె.పుల్లమ్మ పాల్గొన్నారు.

ఉక్కుమనిషికి ఘన నివాళి

మైలవరం, న్యూస్‌టుడే: ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు పేర్కొన్నారు. పటేల్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఉప ప్రిన్సిపల్ రమేష్‌రెడ్డి, డీన్‌లు ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎల్బీఆర్‌సీఈలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో భాజపా నాయకులు కె.సూర్యప్రకాశ్, ఎన్.యుగంధర్, కె.నాగగోపాలకృష్ణ, వి.సుజాత, వి.సత్యవాణి ఆధ్వర్యంలో పటేల్ చిత్రపటానికి నివాళులర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు.



గంపలగూడెంలో భాజపా నాయకులు

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని రాజీవ్ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పి.శ్రీనివాసరావు, బి.ప్రకాశ్‌రావు, యు.లక్ష్మీదాస్, డాక్టర్ కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ, వల్లభ్‌భాయ్ చిత్రపటాలకు నివాళులర్పించారు.

పెనుగొలను: పెనుగొలనులోనూ గ్రామస్థులు, చిన్నారులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.



తిరువూరు: కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో

ఇందిరాగాంధీకి...

కొండపల్లి: భారత తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని కొండపల్లిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బొర్రా కిరణ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అక్కల నాగేంద్రప్రసాద్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో నీరు తొలగించండి

సీఎం చంద్రబాబు ఆదేశం

ఈనాడు-అమరావతి: తుపాను ప్రభావంతో పంటపొలాల్లో నిలిచిన నీటిని వెంటనే బయటకు పంపేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారుల్ని ఆదేశించారు. నీట మునిగిన చోట ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి డ్రైనేజీ వ్యవస్థను చక్కదిద్దాలని స్పష్టం చేశారు. తుపాను అనంతర సహాయ చర్యలపై శుక్రవారం ఆయన ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. 'ఉపగ్రహ చిత్రాల ఆధారంగా ఎక్కడెక్కడ పొలాలు నీట మునిగాయో గుర్తించి, శనివారం నాటికి మొత్తం నీటిని మళ్లించాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ఉత్తమ ఫలితాలు చూపించాలి. నీట మునగడం వల్ల పంట దిగుబడి తగ్గకుండా చర్యలు చేపట్టేలా శాస్త్రవేత్తల సూచనలు తీసుకోవాలి' అని నిర్దేశించారు.

కేంద్ర బృందాల్ని ఆహ్వానించండి..

మొంథా తుపానుతో రాష్ట్రానికి జరిగిన నష్టంపై కేంద్రానికి వెంటనే ప్రాథమిక నివేదిక అందించాలని, క్షేత్రస్థాయి పరిశీలనకు కేంద్ర బృందాన్ని ఆహ్వానించాలని చంద్రబాబు సూచించారు. 'తుది నివేదిక సమర్పించేలోగా తక్షణ సాయం అందించాలని కేంద్రాన్ని కోరాలి. నేను ప్రధాని మోదీతో మాట్లాడతా' అని సీఎం పేర్కొన్నారు. కృష్ణా నదికి వరద పరిస్థితి పైనా ఆయన ఆరా తీశారు. బాపట్ల జిల్లాలో ఎక్కువగా నీరు నిలిచిందని, ఆదివారం నాటికి నీరు లేకుండా చూస్తామని అధికారులు సీఎంకు చెప్పారు.

అత్యుత్తమంగా పనిచేసిన వారికి శనివారం సన్మానం

తుపాను సహాయ చర్యల్లో అత్యుత్తమంగా పనిచేసిన వారిని సన్మానించాలని చంద్రబాబు ఆదేశించారు. శనివారం ఉదయం 11 గంటలకు సుమారు 100 మందికి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

తుపానుతో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలి

- ప్రభుత్వం అండగా నిలిచిందన్న సంతృప్తి బాధితుల్లో కలగాలి
- తీర ప్రాంత గ్రామాల రక్షణకు బృహత్ ప్రణాళిక
- తుపాను అనంతర పరిస్థితులపై అధికారులతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: మొంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రకటించిన సాయం బాధితులందరికీ అందేలా చూడాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆయన అన్నారు. తుపాను అనంతర పరిస్థితులపై మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కాకినాడ కలెక్టర్, ఎస్పీ, డీఆర్‌ఓ, ఆర్డీవో, వాటర్ ప్రాజెక్ట్ డైరెక్టర్, పంచాయతీరాజ్, రోడ్లు, భవనాలు, విద్యుత్తు, వ్యవసాయశాఖల అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాకినాడ జిల్లా పరిధిలో తుపాను కారణంగా జరిగిన నష్టాలపై ఆరా తీశారు. పిఠాపురం నియోజకవర్గంలో ప్రస్తుత పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిధిలో మొత్తం 21 మండలాలు, ఏడు పురపాలక సంఘాలు తుపానుకు ప్రభావితమైనట్లు కలెక్టర్ షాన్ మోహన్ వివరించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి అధికారులను ఉద్దేశించి మాట్లాడారు.

రక్షణ గోడ పూర్తయ్యేవరకు తాత్కాలిక చర్యలు

'ఉప్పాడ తీర ప్రాంతంలోని సుబ్బంపేట వద్ద సముద్ర కోత నుంచి రక్షణకు రాళ్లతో తాత్కాలిక రక్షణ గోడ ఏర్పాటు చేయాలి. ఇది సముద్రపు కోతను నిలువరించింది. మిగిలిన తీర ప్రాంత గ్రామాలకు కూడా రాళ్ల గోడ నిర్మించేలా చర్యలు తీసుకోవాలి. శాశ్వత రక్షణ గోడ నిర్మాణం పూర్తయ్యే వరకు ఇది తీర ప్రాంత గ్రామాలకు రక్షణ కల్పిస్తుంది. ఈ గ్రామాల రక్షణకు ప్రత్యేక ప్రణాళిక చేపట్టాలి. ఏలేరు కాలువల గొర్రెకండి గట్టు బలహీనంగా ఉన్న చోట యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. పల్లపు ప్రాంతంలో తుపాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూడాలి' అని పవన్‌కల్యాణ్ కోరారు. పిఠాపురం నియోజకవర్గంలో కోతకు గురవుతున్న ఉప్పాడ, మూలపేట, కొనపాపపేట, అమీనాబాద్, సుబ్బంపేటల్లో పరిస్థితులు ఎలా ఉన్నాయని అధికారుల ద్వారా ఉప ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. పిఠాపురం పట్టణ పరిధిలోని కోనేటిపేట ప్రాంతం వద్ద పల్లపు ప్రాంతంలో నిలిచిన నీటిని తక్షణమే బయటకు పంపే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అంటు వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.



మొంథా తుపాను ప్రభావం.. ప్రస్తుత పరిస్థితులపై సమీక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

రైతుల పక్షాన నిలవాలి

'కష్టకాలంలో ప్రభుత్వం తోడుగా నిలిచిందన్న సంతృప్తి రైతుల్లో కలిగేలా చర్యలు ఉండాలి. నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం నుంచి పరిహారం అందాలి. పంట నష్టం అంచనాలు రూపొందించే సమయంలో రైతుల పక్షాన నిలిచి పక్కాగా నివేదికలు రూపొందించాలి. అన్ని నష్ట వివరాలు కూడా సిద్ధం చేయాలి. దెబ్బతిన్న ఇళ్లకు తక్షణమే పరిహారం చెల్లించే ఏర్పాట్లు చేయాలి. గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. పారిశుద్ధ్య కార్యక్రమాలు ఎప్పటికప్పుడు నిర్వహించాలి. పాక్షికంగా దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి' అని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు.

చుట్టూ జలం.. మధ్యలో కల్యాణం



అనకాపల్లి జిల్లా మునగపాకలోని అనకాపల్లి ఆవకాలువ గురువారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో పొంగి ప్రవహించింది. దీంతో పెళ్లి ఏర్పాటు చేసిన చెరువు మీదుగా చెట్టపల్లిజిపేటను ఆ వరద ముంచెత్తింది. కొద్ది సమయంలోనే వివాహ వేదిక కోవెల నుంచి కూరగాయల మార్కెట్ వరకు రెండు అడుగుల మేర నీటి మట్టం పెరిగింది. ఈ కోవెల ముందే ఏర్పాటు చేసుకున్న కళ్యాణ వేదికను వరద చుట్టుముట్టింది. వేదిక ముందుభాగం అంతా నీటితో నిండిపోయింది. ఈ ఆకస్మిక పరిణామంతో నిర్వాహకులు ఆందోళనకు గురయ్యారు. ముఖ్యుల నడుమ వేదికపైకి చేరుకొని వివాహం జరిపించారు. వచ్చిన బంధువులంతా వేదిక వదిలి.. ఎత్తయిన ప్రాంతాల్లోకి వెళ్లిపోయారు. - న్యూస్‌టుడే, మునగపాక

కృష్ణాలో.. వచ్చిన వరద వచ్చినట్లు దిగువకు

ఈనాడు, అమరావతి: మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాల దాటికి కృష్ణా నదికి వరద కొనసాగుతోంది. గురువారం ప్రకాశం బ్యారేజీ వద్ద ఓ దశలో 6 లక్షల క్యూసెక్కులకు చేరవవడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీచేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ప్రవాహం క్రమంగా తగ్గింది. ఉదయం 6 గంటలకు బ్యారేజీ ఇన్‌ఫ్లో 4,43,808 క్యూసెక్కులకు తగ్గగా, వచ్చిన వరదను వచ్చినట్లు దిగువకు వదిలారు. సాయంత్రం 5 గంటలకు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 4,56,400 క్యూసెక్కులుగా ఉంది. రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించగా, మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. బ్యారేజీ నుంచి పంట కాల్వలకు నీటి విడుదలను నిలిపేశారు. మునేరులో నీటి ప్రవాహం తగ్గింది. పెనుగంచిప్రోలు కాజ్‌వేపై వాహనాల రాకపోకలను పునరుద్ధరించగా, లింగాల కాజ్‌వేపై ప్రయాణాలు సాగడం లేదు.

వరద ముంచెత్తినా.. డ్రోన్ ఉంది అండగా..



మద్దిరాలపాడు వద్ద నీట మునిగిన గ్రామాల్లో పర్యవేక్షణకు వెళ్తున్న డ్రోన్

మొంథా తుపాను తీరం దాటిన వేళ గుండ్లకమ్మ జలాశయం గేట్లు ఎత్తడంతో కొత్తపట్నం, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల్లోని 12 గ్రామాల్లో వరద నీరు భారీగా చేరింది. ఒంగోలు-చీరాల జాతీయ రహదారి మూసుకుపోయి ప్రజలు జలదిగ్బంధంలోకి వెళ్లిపోయారు. అధికారులు అక్కడ అడుగు పెట్టలేని పరిస్థితి. అలాంటి సమయంలో గ్రామాల్లోని బాధితుల బాగోగులు తెలుసుకుని వారితో మాట్లాడి ధైర్యం చెప్పడానికి వీలుగా కర్నూలు ఐఐఐటీ రీసెర్చ్ విభాగం అధికారులు సరికొత్త డ్రోన్‌ను రూపొందించారు. వీడియో, ఫొటోల చిత్రీకరణే కాకుండా.. మైకు, కెమెరా, వీడియో కాలింగ్ తదితర సదుపాయాలున్న ఈ డ్రోన్‌ను శుక్రవారం నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామంలోకి పంపించారు. గ్రామస్థులకు మైక్‌లో అవసరమైన సూచనలు వినిపించడంతో పాటు వారితో లైవ్ వీడియో కాల్‌లో మాట్లాడారు. ఈ డ్రోన్ ద్వారా అవసరమైన వారికి మందులు, నిత్యావసరాలను అందించవచ్చని.. బాధితులతో లైవ్‌లో మాట్లాడే వీలుండడం వల్ల ఏదైనా అత్యవసరమైతే అంబులెన్స్‌లు, డాక్టర్లను పంపడానికి వీలుంటుందని ఐఐఐటీ ప్రొఫెసర్లు కృష్ణానాయక్, నాగరాజు తెలిపారు.

– ఈనాడు, ఒంగోలు



డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న ప్రొఫెసర్ కృష్ణానాయక్

ఆయేషా మీరా హత్య కేసులో..

పునర్విచారణ నివేదిక ఇచ్చేందుకు అంగీకరించిన సీబీఐ

ఈనాడు, అమరావతి: ఆయేషా మీరా హత్య కేసులో పునర్విచారణ నివేదిక ఇచ్చేందుకు సీబీఐ అంగీకరించింది. ఈ నివేదిక కోరుతూ మృతురాలి తల్లిదండ్రులు విజయవాడలోని సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై శుక్రవారం విచారణ జరిగింది. వారికి విచారణ నివేదిక అందజేయాలని సీబీఐని కోర్టు ఆదేశించింది. దీంతో వెంటనే పిటిషనర్లకు నివేదిక కాపీ అందజేస్తామని సీబీఐ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అది అందిన తర్వాత. . పరిశీలించి, తమ అభ్యంతరాలు చెబుతామని ఆయేషా తల్లిదండ్రుల తరఫు న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్ కోర్టుకు తెలిపారు. దీంతో తదుపరి విచారణను నవంబరు 21వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.

ఒంగోలులో ముంపు.. ఒక్కరోజులో తొలగింపు

- యంత్రాంగం పకడ్బందీ చర్యల ఫలితం
- నేడు కమిషనర్‌ను సత్కరించనున్న సీఎం

ఈనాడు, ఒంగోలు: మొంథా తుపాను తీరం దాటే సమయం.. ఒంగోలులో రికార్డు స్థాయిలో వర్షపాతం.. ఒక్కరోజులోనే 29.5 సెం.మీ వర్షం.. ఫలితంగా నగరం జలదిగ్బంధంలో చిక్కుకుంది. ప్రధానంగా నగరాన్ని ఆనుకొని ఉన్న చెరువులు పొంగడం, ఇక్కడి నుంచి వరద నీటిని సముద్రంలోకి తీసుకెళ్లే కాలవల్లో సామర్థ్యానికి మించి ఐదారు రెట్ల ప్రవాహం కొనసాగడంతో భారీ వరద నీరు ఒంగోలును ముంచేసింది. మంగళవారం ఉదయం నుంచి ఆగకుండా వర్షం కురవడంతో బుధవారం తెల్లారేసరికి 50 కాలనీలు నీట మునిగాయి. అయినా.. పకడ్బందీ చర్యలతో నగరపాలక సంస్థ యంత్రాంగం వరద నిర్వహణను మెరుగ్గా చేపట్టి ఒక్క రోజులోనే నగరాన్ని సాధారణ స్థితికి తీసుకొచ్చింది. ముంపు పరిస్థితులను త్వరితగతిన ఎలా చక్కదిద్దారంటూ ఆర్టీజీఎస్ అధికారులు ఆరా తీయడంతో నగర పాలక సంస్థ దీనిపై నివేదికను పంపించింది.

తుపాను హెచ్చరికల నేపథ్యంలో ముందునుంచే 24 గంటలూ సేవలందించేలా ప్రత్యేక బృందాలను, 8 జేసీబీలను, రంపపు కోత యంత్రాలు, ట్రాక్టర్లను యంత్రాంగం సిద్ధం చేసింది. వరద నీరు ఏయే ప్రాంతాలకు చేరవచ్చో అంచనా వేసి, లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సోమవారం నుంచి వర్షాలు మొదలుకాగా, పొడవైన ఎక్స్‌కవేటర్ల సాయంతో కాలువల్లో వంతెనల వద్ద పేరుకుంటున్న చెత్తను నిరంతరాయంగా తొలగించే ప్రక్రియ చేపట్టారు. బుధవారం తెల్లారేసరికి నగరం నీట మునగడంతో తమ చర్యలను ఉద్ధృతం చేశారు. ఎక్కడికక్కడ జేసీబీలను ఏర్పాటు చేసి పూడిక తొలగింపు, కచ్చా కాలువలు తవ్వి ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా చేశారు. జాతీయ రహదారులపైకి నీరు చేరడంతో డివైడర్లను పగలగొట్టడంతో పాటు ప్రవాహానికి అడ్డంగా ఉన్న ఆక్రమణలను తొలగించి వరద నీరు పోయేలా చూశారు. బుధవారం సాయంత్రమే విద్యుత్తు సిబ్బంది వెంటవెంటనే స్తంభాలు ఏర్పాటు చేసి గంటల వ్యవధిలోనే సరఫరా పునరుద్ధరించి చీకట్లు లేకుండా చేశారు.

వరద తొలగిన గంటలోనే సహాయక చర్యలు: వరద తొలగిన ప్రాంతాల్లో గురువారం ఉదయం నుంచే వీధుల్లో ఫైరింజన్ల సాయంతో రోడ్లను శుభ్రం చేయించారు. ప్రత్యేక బృందాలు పారిశుద్ధ్య పనులు చేపట్టి వీధుల్లో చెత్తను తొలగించి, బ్లీచింగ్ చల్లించారు. ప్రజలకు సురక్షిత జలాన్ని, బాధితులకు నిత్యావసరాలు అందించారు. ఈ విషయాలను తెలుసుకున్న ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం అధికారులు వరద నివారణ చర్యలపై ఆరా తీయడంతో పాటు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావును శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు సత్కరించనున్నట్లు వర్తమానం పంపారు. జిల్లా కలెక్టర్ రాజాబాబు, సిబ్బంది చురుగ్గా స్పందించిన ఫలితంగానే వరద ముప్పును తగ్గించగలిగినట్లు కమిషనర్ పేర్కొన్నారు.



ఒంగోలు నగరంలో బుధవారం ఉదయం సహాయక చర్యలు



ఒంగోలులో గురువారం ఉదయం రోడ్లను శుభ్రం చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఉద్యోగాలిప్పిస్తామని వసూళ్లు..
నిడిగుంట అరుణకు రిమాండ్

- విజయవాడలోని ఎస్ఆర్ పేట స్టేషన్‌లో కేసు నమోదు
- నెల్లూరు కారాగారం నుంచి విజయవాడ కోర్టుకు తరలింపు

ఈనాడు, అమరావతి: ఎస్సై, అంగన్‌వాడీ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రూ.24.50 లక్షలు తీసుకుని మోసం చేసిన కేసులో నెల్లూరుకు చెందిన కిలాడీ లేడీ నిడిగుంట అరుణకు విజయవాడలోని ఒకటో ఏసీఎంఎం కోర్టు రిమాండ్ విధించింది. అక్టోబరు 13న విజయవాడలోని సూర్యారావుపేట పోలీసులు అరుణతో పాటు, ఆమె అనుచరుడు బుల్లెట్ బాబు, తదితరులపై నమోదు చేసిన కేసులో ఇటీవల పీటీ వారెంట్ దాఖలు చేశారు. నెల్లూరు కేంద్ర కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న అరుణ కోసం వేసిన పీటీ వారెంట్‌ను కోర్టు అనుమతించింది. దీంతో ఆమెను శుక్రవారం నెల్లూరు నుంచి తీసుకొచ్చి న్యాయస్థానంలో హాజరుపర్చారు. నిందితురాలికి నవంబరు 14 వరకు న్యాయాధికారి రిమాండ్ విధించారు. అనంతరం ఆమెను నెల్లూరు కారాగారానికి తరలించారు. ఈ కేసులో విచారణ కోసం త్వరలో కస్టడీకి తీసుకునే అవకాశం ఉంది.

డబ్బులు తీసుకుని మోసం..

విజయవాడకు చెందిన రమేష్‌బాబు అనే వృద్ధుడిని ఆయన స్వస్థలమైన ఎన్టీఆర్ జిల్లా వీరులపాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులు.. 'మా వాళ్లు ఉన్నారు. . ఏదైనా ఉద్యోగాలు ఇప్పించండి' అని కోరారు. దీంతో దీనిపై రమేష్‌బాబు తనకు పరిచయం ఉన్న సురేంద్ర అనే వ్యక్తితో 2021 మార్చిలో మాట్లాడారు. తర్వాత అతని సూచన మేరకు డీజీపీ కార్యాలయంలో పనిచేసే బంగారి అనే వ్యక్తిని సంప్రదించారు. ప్రస్తుతం ఉద్యోగాలు లేవని, ఏవైనా ఉంటే చెబుతానని అతడు దీనిపై రమేష్‌బాబు ఫోన్ నంబరు తీసుకున్నారు. పది రోజుల తర్వాత ఓ వ్యక్తి రమేష్‌బాబుకు ఫోన్ చేసి మొగల్రాజపురంలోని ఒక హోటల్ వద్దకు రమ్మన్నారు. అక్కడకు బుల్లెట్‌బాబు, మరో వ్యక్తి వచ్చి పరిచయం చేసుకున్నారు. ఎస్సై పోస్టుకు రూ.18.5 లక్షలు, అంగన్‌వాడీ పోస్టుకు రూ.6 లక్షలు ఇవ్వాలని చెప్పారు. ఆ తరువాత ఫోన్ చేసి, డబ్బులు ఇవ్వాలనడంతో 2021 మార్చి 19న వారి సూచన మేరకు పీడబ్ల్యూడీ గ్రౌండ్ వద్దకు వెళ్లిన రమేష్‌బాబు అక్కడ వచ్చిన నిడిగుంట అరుణకు రూ.12 లక్షలు చెల్లించారు. మరో 10 రోజుల తరువాత బుల్లెట్‌బాబు మళ్లీ వచ్చి రమేష్‌బాబు నుంచి మరో రూ.12.5 లక్షలు తీసుకున్నారు. కానీ ఉద్యోగాలు ఇప్పించకుండా రేపు, మాపు అంటూ తప్పించుకు తిరుగుతున్నాడు. ఉద్యోగాలైనా ఇప్పించండి లేదా డబ్బులైనా ఇచ్చేయమని డిమాండ్ చేసేసరికి చంపుతామంటూ బెదిరించాడు. 2021లో జరిగిన ఈ ఘటనపై రమేష్‌బాబు ఈ నెల 13న సూర్యారావుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా ఐపీసీలోని 420, 406, 506 రెడ్ విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు లక్షల మంది రైతులకు కష్టం

(మొదటి పేజీ తరువాయి)

పంపాలని కోరింది.

■ ప్రకాశం జిల్లాలో 31 మండలాలు, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు 17, బాపట్ల 14, నంద్యాల 5, పల్నాడు 2, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1 మండలాల్లో అతి, అత్యంత భారీవర్షాలు కురిశాయని వివరించింది.

వర్షపాతం.. మండలాలు

భారీ వర్షాలు:117 , అతిభారీ వర్షాలు: 58, అత్యంత భారీవర్షాలు: 12

90 నుంచి 100 కి.మీ వేగంతో గాలులు

తుపాను తీరం దాటే సమయంలో నరసాపురం సమీపంలో గంటకు 90 నుంచి 100 కి.మీ. వేగంతో గాలులు వీచాయి. విద్యుత్తు స్తంభాలు నేలకూలాయి. భారీవృక్షాలు నేలకూలాయి. అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలో 236, కృష్ణా 224, బాపట్ల 169, తిరుపతి 103, ఎన్టీఆర్ 84, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 84 గ్రామాలపై ప్రభావం పడింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో విపత్తు సహాయక చర్యల్లో భాగంగా ఆహారం, తాగునీరు, పాలు, మందులు, ఇతర నిత్యావసరాలకు రూ.32 కోట్లు ఖర్చు చేశారు.

మొత్తంగా తుపాను ప్రభావం

249 మండలాలు, 1,434 గ్రామాలు, 48 పట్టణాలు
ప్రభావితమైన ప్రజలు: 18,19,891

ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలు: 1,464
పునరావాస కేంద్రాలకు తరలినవారు: 1,36,907
వేర్వేరు ఘటనల్లో చనిపోయిన వారు: 3

58 పురపాలక, నగర పాలక సంస్థలపై తుపాను ప్రభావం అధికంగా ఉంది. 242. కి.మీ. మేర రోడ్లు, 285 కల్వర్టులు, 10,986 వీధి దీపాలు, 57 కి.మీ. పొడవైన కాల్వలు, 82 కి.మీ. తాగునీటి పైపులైన్స్‌తో పాటు 50 పురపాలక పాఠశాలలు, సామాజిక భవనాలు దెబ్బతిన్నాయి.

● దెబ్బతిన్న గృహాలు	3,045
● పాడైన రహదారులు (ఆర్అండ్‌బి)	4,794 కి.మీ
● దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్లు (18 జిల్లాల్లో)	862 కి.మీ రోడ్లు, 33 కల్వర్టులు, వంతెనలు
● చెరువులు, జలాశయాలకు గండ్లు	2,122
● తాగునీటి వనరులపై ప్రభావం	27

వివిధ రంగాలకు వాటిల్లిన నష్టం (రూ.కోట్లలో)

వ్యవసాయం	829.02
ఉద్యాన	39.99
పట్టు	0.69
పశుసంవర్ధక	1.55
మత్స్య	514.15
పురపాలక, పట్టణాభివృద్ధి	109.05
గృహనిర్మాణ	6.16
రహదారులు, భవనాలు	2,774.42
జలవనరులు	234.86
తాగునీటి సరఫరా	12.58
విద్యుత్తు	19.00
పాఠశాలలు, అంగన్‌వాడీలు	110.54
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి	548.84
చేనేత	9.52
ఆరోగ్య కేంద్రాలు	2.32
సహాయ, పునరావాస చర్యలకు అయిన ఖర్చు	32.00

2.96 లక్షల టన్నుల వ్యవసాయ ఉత్పత్తి కోల్పోయినట్లే

✦ 18 రకాల వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయి.
✦ ప్రాథమిక అంచనాల ప్రకారం 24 జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నాయి. పంటలు నీటమునగడంతో రైతులు 2.96 లక్షల టన్నుల వ్యవసాయ ఉత్పత్తి నష్టపోయారు.
✦ పట్టు పరిశ్రమకు సంబంధించి అల్లూరి సీతారామరాజు జిల్లాలో 712 మంది రైతులకు నష్టం వాటిల్లింది. రూ.68.67 లక్షల పరిహారం చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేశారు.

దెబ్బతిన్న వ్యవసాయ పంటలు: వరి, పత్తి, మొక్కజొన్న, మినుము, పెసర, పొగాకు జూట్, పొగాకు
పాడైన ఉద్యానపంటలు: అరటి, బొప్పాయి, మిరప, కొబ్బరి, పసుపు, కూరగాయలు, జామ, పూలతోటలు, తమలపాకు తదితర పంటలు

దెబ్బతిన్న పంటల పరిస్థితి ఇది.. (ఎకరాలలో)

పంట రకం	విస్తీర్ణం
వ్యవసాయ పంటలు	3,45,000
ఉద్యాన పంటలు	30,537
నష్టపోయిన రైతులు	1,98,000

● పెట్టుబడి రాయితీ నష్టం రూ.869.69 కోట్లు (ఎన్‌డీఆర్ఎఫ్ నిబంధనల ప్రకారం)
● ఆక్వా రంగానికి రూ.514 కోట్ల నష్టం
● 5,136 ఎకరాల్లోని చేపలు, రొయ్యల చెరువులు నీట మునిగాయి.
● 19 పడవలు, 52 వలలు దెబ్బతిన్నాయి. రైతులు, మత్స్యకారులకు రూ.514.15 కోట్ల నష్టం జరిగింది.
● 2,261 పశువులు చనిపోయాయి. 58 పశువుల షెడ్లు దెబ్బతిన్నాయి. రూ.1.52 కోట్లు పరిహారంగా చెల్లించాలి. ● 2,122 చెరువులు, జలాశయాలకు దెబ్బ.. నేలకొరిగిన విద్యుత్తు స్తంభాలు 2,817

నాడు హైదరాబాద్ విలీనం కాకపోయి ఉంటే.. ఆ భూభాగం పాకిస్థాన్ పరిధిలో ఉండేది

మంత్రి సత్యకుమార్ యాదవ్



ఏక్తా ర్యాలీలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు మాధవి, నసీర్, కలెక్టర్ తమీమ్ అన్సారియా, మేయర్ రవీంద్ర

గుంటూరు(నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: స్వాతంత్ర్యం వచ్చాక దేశం మొత్తాన్ని సమైక్యంగా ఉంచేందుకు 562 సంస్థానాలను విలీనం చేసిన ధీశాలి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఏక్తా దివస్ సందర్భంగా గుంటూరులోని ప్రభుత్వ మహిళా కళాశాలలో 'మై భారత్ ఆర్గనైజేషన్' ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆనాడు రజాకార్లు, నిజాం సైన్యాన్ని వల్లభ్‌భాయ్ పటేల్ నాలుగు రోజుల్లో ఓడించి హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేశారని, అలా జరగకపోయి ఉంటే ప్రస్తుత మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లోని 2.15 లక్షల చదరపు కిలోమీటర్ల భూభాగం పాకిస్థాన్ పరిధిలో ఉండేదన్నారు. దేశ సమగ్రత, సమైక్యత కోసం ఆయన చేసిన త్యాగాలు మరువలేనివని పేర్కొన్నారు. అంతకుముందు గుంటూరు కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ఏక్తా ర్యాలీని సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నసీర్, గళ్లా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్ర, కలెక్టర్ తమీమ్ అన్సారియా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల కబ్జాలు కనబడలేదా?

సీఎంను ప్రశ్నించిన సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

ఆర్కేనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: అన్ని విషయాలూ కంప్యూటర్‌లో చూసే మీకు.. అధికార పార్టీ ఎమ్మెల్యేలు చేస్తున్న అవినీతి, అక్రమాలు, కబ్జాలు కంప్యూటర్‌లో కనబడలేదా? తెదేపా నాయకులు చేస్తున్న దురాగతాలు లోకేశ్ రెడ్‌బుక్‌లో రాసుకోరా? అంటూ సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలే కబ్జాలకు పాల్పడుతుంటే ప్రజలు ఎవరికి ఇబ్బందులు చెప్పుకోవాలని మండిపడ్డారు. ఆయన శుక్రవారం అనంతపురంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'గత 16 నెలలుగా 80 శాతంమంది ప్రజాప్రతినిధులు అక్రమార్జనలో తలమునకలై ఉన్నారు. సామాన్య ప్రజలనూ వదిలిపెట్టడం లేదు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వం అప్రతిష్ఠపాలవుతోంది. దారితప్పిన నాయకులను కంట్రోల్ చేయాలి' అని అన్నారు. తుపాను కారణంగా పంట, ఆస్తి నష్టం అధికంగా జరిగిందని రామకృష్ణ పేర్కొన్నారు. టమాటా, ఉల్లి, మామిడి పంటల దిగుబడి మెరుగ్గా ఉన్నా గిట్టుబాటు ధరలు లేక రోడ్డున పారబోసే పరిస్థితి వచ్చిందని తెలిపారు.

ముందస్తు చర్యలతో ప్రాణ నష్టాన్ని నివారించాం

- తుపాను బాధితులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుంది
- హోంమంత్రి అనిత పర్యటన



అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం రజాల సమీపంలో శారదానదికి పడిన గండిని పరిశీలించడానికి ఎలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్‌తో కలిసి స్కూటీపై ప్రయాణిస్తున్న హోంమంత్రి వంగలపూడి అనిత

ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: మొంథా తుపాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని హోంమంత్రి వంగలపూడి అనిత భరోసా ఇచ్చారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం రజాల-వైలోవ గ్రామాల మధ్య మేజర్ శారదా నది వరద గట్టుకు గండిపడిన ప్రదేశాన్ని శుక్రవారం ఆమె కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌తో కలిసి స్కూటీపై వెళ్లి పరిశీలించారు. వరద ముంపు పరిస్థితులను మంత్రికి కలెక్టర్ వివరించారు. సుమారు 200 మీటర్ల మేర పడిన గండిని యుద్ధ ప్రాతిపదికపై పూడ్చాలని మంత్రి సూచించారు. అనంతరం రైతులతో ఆమె మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పంట నష్టంపై నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం సమీక్షిస్తూ ప్రజలు నష్టపోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారన్నారు. గతంలో తమలపాకు రైతులకు ఎకరానికి రూ.15 వేలు ఇచ్చేవారని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఎకరానికి రూ.75 వేలు ఇస్తున్నామన్నారు. ఇది చూసి ప్రతిపక్షానికి ఏం మాట్లాడాలో తెలియడంలేదన్నారు. ముందుగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ గండిని పరిశీలించి రైతులతో మాట్లాడారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.



వరద ముంపు పరిస్థితులను మంత్రి అనితకు వివరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, చిత్రంలో ఎస్పీ తుహిన్‌సిన్హా, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

సచిన్ సలహా పాటిస్తా!

ఎత్తు తక్కువ, బక్క పలచని శరీరం. కానీ ఇంట్లో క్రీడల వాతావరణం, పొరుగింట్లో సచిన్ నివాసం... దాంతో తన బలహీనతల గురించి కాకుండా క్రికెటర్ కావడం గురించే బలంగా ఆలోచించింది జెమీమా రోడ్రిగ్స్. తన అసాధారణ బ్యాటింగ్‌తో టీమ్ ఇండియాను ప్రపంచ కప్ ఫైనల్‌కు చేర్చిన జెమీమా... తన కెరియర్, ఇష్టాలు, అలవాట్ల గురించి ఏం చెబుతుందంటే...



జెమీమా

చిన్నప్పుడు క్రికెట్‌తోపాటు బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, హాకీ ఆడేదాన్ని. 11 ఏళ్లకే హాకీలో మహారాష్ట్ర అండర్-17కి ఎంపికయ్యా. క్రికెట్‌లో వెస్ట్ జోన్ అండర్-17కి ఆడాను. ఏదో ఒకటి మాత్రమే అన్నప్పుడు... క్రికెట్‌లో ఒక అడుగు ముందున్నానని హాకీని వదిలేశా. అది కష్టమైన నిర్ణయమే. భిన్న క్రీడల నేపథ్యం నన్ను శారీరకంగా, మానసికంగా దృఢం చేశాయి. ఏ జట్టులోకి వెళ్లినా అందరిలోకీ నేనే చిన్నదాన్ని. అందరూ నన్నొక బేబీలా చూసేవారు. ఆటేదైనా దేశానికి ఆడాలనే లక్ష్యంతోనే ఉండేదాన్ని. ఇప్పటికీ హాకీలోనూ దేశానికి ప్రాతినిధ్యం వహించాలని ఉంది.

రోల్ మోడల్స్: అన్నయ్యలతో కలిసి క్రికెట్ చూసేదాన్ని. అలా సచిన్ తెందూల్కర్ ఆటను చూస్తూ పెరిగా. ముంబయిలో సచిన్ ఇంటి వెనకాలే మా ఫ్లాట్. 2011 ప్రపంచకప్ గెలిచిన తర్వాత మా వీధిలో ఆయన్ని చూసేందుకు పెద్ద మొత్తంలో అభిమానులు వచ్చారు. నేను మా బాల్కనీ నుంచి చూశా. రోహిత్ శర్మ, మిథాలీ రాజ్‌లకు అభిమానిని. ఇతర క్రీడాకారుల్లో పీవీ సింధు ఇష్టం.

స్మృతి అక్కలాంటిది: ఎప్పుడూ మనకు అండగా ఉండే ఒక వ్యక్తి అవసరం. నా విషయంలో ఆమె స్మృతి మంధాన. మంచి స్నేహితురాలు. తనని అక్కలా భావిస్తా. నేను తుంటరి పనులు చేస్తే హెచ్చరిస్తుంది. ఆమె భుజం మీద తలపెట్టి ఏడ్చిన సందర్భాలు చాలా ఉన్నాయి. అరుంధతి(రెడ్డి) కూడా మంచి స్నేహితురాలు.

అవకాశాలకు సిద్ధం: టీమ్ నుంచి తప్పించినప్పుడు కుంగి పోకూడదని ఓ సందర్భంలో సచిన్ చెప్పారు. 'అవకాశం రావాలంటే ఏం చేస్తావో అది చెయ్యి. మైదానంలో అడుగుపెట్టి బ్యాటింగ్ ప్రాక్టీసు, రన్నింగ్... ఇలా ఏదో ఒకటి చెయ్యి' అంటూ సూచించారు. రోహిత్ భాయ్‌ని అడిగితే... 'తర్వాత అవకాశాన్ని దక్కించుకోవడానికి, దాన్ని సద్వినియోగం చేసుకోవడానికి చూడాలి' అని సలహా. వీటినే పాటిస్తా.

క్రికెట్‌లో నా ప్రదర్శన, ప్రతిభ పరంగా ఇప్పటివరకూ 80-85 శాతానికే చేరుకున్నా. త్వరలోనే 100 శాతానికి చేరుకుంటా.

డబ్ల్యూపీఎల్: మనదేశంలో మహిళల క్రికెట్ లీగ్(డబ్ల్యూపీఎల్) రావడం... ఎంతో సంతృప్తినిచ్చింది. ఐపీఎల్ వచ్చినప్పట్నుంచీ దీని గురించి చర్చ నడుస్తోంది. మేం టీమ్‌లో ఉండగా డబ్ల్యూపీఎల్ రావడం గొప్ప విషయం. ఇది ఎంతోమంది కల. ఫ్రీగా ఆడటానికైనా రెడీ, అన్నట్లుగా ఉండేది మాకు. లీగ్‌కు స్పందన కూడా అద్భుతం.

గిటార్ ఉండాల్సిందే: ఆటవిడుపు కోసం గిటార్ వాయిస్తా. సంగీతం వింటా. నాతోపాటు ప్రతి పర్యటనకు ఒక చిన్న గిటార్ తీసుకువెళ్తా. తీరిక దొరికినప్పుడు దాన్ని ప్లే చేస్తూ ఫ్రెండ్స్‌తో కాలక్షేపం చేస్తా.

షవర్మా తినాల్సిందే: మ్యాచ్‌కు ముందు చీజ్ ఆమ్లెట్, జ్యూస్‌లు తీసుకుంటా. నేను ఎక్కువగా పర్యటనల్లో ఉంటా. ఇంట్లో ఉంటే మాత్రం బాంద్రాలోని కార్టర్ రోడ్‌లో షవర్మా తినడానికి అన్నయ్యలు, కజిన్స్‌తో వెళ్తుంటా.

వసుంధర

vasundhara@eenadu.in

ఆ వ్యసనాన్ని మాన్పించాలనే... ఈ వెండింగ్ మెషీన్లు!



రైల్వే ప్లాట్‌ఫామ్ అంటే కూల్‌డ్రింక్స్, హాట్‌చిప్స్, సమోసా, టీ షాపులు ఇవే కనిపిస్తాయి కదా! కానీ చెన్నై ఎంజీఆర్ సెంట్రల్ స్టేషన్‌లో మాత్రం బుక్ వెండింగ్ మెషీన్ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ప్రయాణాల సమయంలో కొందరితోనైనా పుస్తకాల్ని చదివించాలనే ఆలోచనతో దీన్ని మొదలుపెట్టారు పాతికేళ్ల మాయావతి.

బుక్ వెండింగ్ మెషీన్ ఏంటీ ఇదేదో కోక్‌టిన్ వెండింగ్ మెషీన్‌లాగా అనుకుంటున్నారా! అవును మరి మనం కోక్ తాగాలనుకుంటే దానికి నిర్ణయించిన డబ్బుని మెషీన్‌లో వేస్తే టిన్ బయటికి వస్తుంది కదా! అలాగే ఈ బుక్ వెండింగ్ మెషీన్‌లో డబ్బు చెల్లిస్తే మీకు కావాల్సిన పుస్తకం బయటికి వస్తుంది. ఈ ఆలోచన వెనక ఉన్నది చెన్నైకి చెందిన మాయావతి. ఈమె లిటరేచర్‌లో డిగ్రీ చదివి బ్యాంకు ఉద్యోగం చేసేవారు. ఆమెకు పుస్తకాలు చదవడం అంటే ఇష్టం. ఆ మక్కువతోనే ఉద్యోగాన్ని వదిలి 'సన్‌సెట్ హ్యాబ్జ్ ఫౌండేషన్'ను స్థాపించి దాని ద్వారా బుక్ వెండింగ్ మెషీన్లను ఏర్పాటుచేస్తున్నారు. మొదటి ప్రయత్నంగా చెన్నైలోని ఎంజీఆర్, తాంబరం రైల్వే స్టేషన్లలో వీటిని ఏర్పాటుచేశారీమె. మరికొన్నిరోజుల్లో విమానాశ్రయాలు, మెట్రోస్టేషన్లు, బస్టాపుల్లోనూ అందుబాటులోకి తేనున్నారట. ఈ ప్రాంతాల్లోనే ఈ వెండింగ్ మెషీన్లు ఏర్పాటు చేయడానికి ప్రత్యేక కారణం ఉందంటున్నారీమె. 'చదివే అలవాటు చాలావరకూ తగ్గింది. దీనికి ప్రత్యేకించి సమయాన్ని కేటాయించేవారు చాలా తక్కువమంది ఉంటారు. కొంతమంది బిజీ షెడ్యూల్‌లో సమయాన్ని కేటాయించలేకపోవచ్చు. ప్రయాణాలు చేసేటప్పుడు మాత్రమే ఆ వెసులుబాటు ఉంటుంది. మొబైల్‌ఫోన్లు వచ్చాక ఆ కాస్త సమయాన్ని కూడా స్క్రీన్లతోనే గడిపేస్తున్నాం. పిల్లలతో సహా ఇది అందరికీ వ్యసనంగా మారిపోయింది. దీన్ని దూరం చేయాలనే ఈ వెండింగ్ మెషీన్లు ఏర్పాటుచేశా. రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనికి మద్దతిచ్చింది. పుస్తకం కొనాలనుకునేవారు క్యూరేటెడ్ కోడ్‌ని బ్రౌజ్ చేసి కావల్సిన బుక్‌ని ఎంచుకోవచ్చు. చిన్నారుల కోసం యాక్టివిటీ, కథల పుస్తకాలనూ అందుబాటులో ఉంచాం. దీని ఆపరేటింగ్ యూజర్ ఫ్రెండ్లీగా ఉండటం వల్ల వినియోగదారులకు ప్రతి దశనూ అర్థమయ్యేలా చేస్తాయి. ఒకవేళ చెల్లింపు జరిగి పుస్తకం రాకపోతే దీనిలో ఉండే ప్రత్యేక సెన్సర్లు రెండునిమిషాల్లో డబ్బును రిఫండ్ చేస్తాయి' అంటున్నారీమె. అందర్నీ డిజిటల్ ప్రపంచానికి దూరం చేసి, పుస్తక పఠనానికి దగ్గర చేయాలనుకునే ఈమె ఆలోచన అభినందించదగ్గదే కదా!

అభయ ముద్ర



మ్యాట్‌పైన ప్రశాంతంగా కూర్చోండి. ఆపైన పద్మాసనం, వజ్రాసనం లేదా సుఖాసనంలోకి రండి. నడుమును నిటారుగా ఉంచి కుడి అరచేయి బయటకు చూసేలా అన్ని వేళ్లనూ దగ్గరగా ఉంచండి. ఈ చేయిని కొంత పైకి ఎత్తి ఛాతీ వరకూ తీసుకురండి. వేళ్లను మడవకుండా చాచి ఉంచండి. ఇప్పుడు ఎడమ అరచేతిని తెరచి ఒడిలో విశ్రాంతిగా ఉంచండి. వెన్నెముకను నిటారుగా ఉంచి కళ్లను మూసి ప్రశాంతంగా శ్వాసమీద ధ్యాస నిలపండి. ఇలా 15-20 సెకన్లు ఉండండి.

ఉపయోగాలు: ఆధ్యాత్మిక ఆరోగ్యం అలవడుతుంది. భయం, ఆందోళనలు తగ్గి స్థిరత్వం వస్తుంది. మానసిక ధైర్యం చేకూరుతుంది.

\- శిరీష, యోగ గురు

బ్లూమ్ స్క్రోలింగ్ చేద్దామా..!



నిద్ర లేచింది మొదలు ఏ కాస్త ఖాళీ దొరికినా... ఆ సమయాన్ని సామాజిక మాధ్యమాల వినియోగానికే కేటాయిస్తున్న అమ్మాయిల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. జెన్‌జీలు, మిలీనియల్స్ మాత్రమే కాదు జెన్ ఎక్స్ మహిళలు కూడా దీనికే బానిసలుగా మారుతున్నారు అంటున్నాయి అధ్యయనాలు. పైగా వీరిలో 70శాతం మంది సామాజిక మాధ్యమాల్లో ప్రతికూల అంశాల్ని పదే పదే చూస్తున్న వాళ్లేనట. వీళ్లని డూమ్ స్క్రోలర్స్ అంటున్నారు. నిద్రలేమి, ఒత్తిడీ, ఆందోళనా, డిప్రెషన్... వంటివి ఈ విధానం తెచ్చే చిక్కులే. మరి దీన్నుంచి బయటపడాలంటే డిజిటల్ తెరలకు చరమగీతం పాడాల్సిందే అని కొంతమంది నిపుణులు చెబుతుంటే... అవసరం లేదు హద్దులు పెట్టుకుని 'బ్లూమ్ స్క్రోలింగ్' చేయమంటున్నారు కొంతమంది. అంటే మనసుకు నచ్చిన, ప్రేరణాత్మక, స్ఫూర్తినిచ్చే కంటెంట్‌ను చూడమంటున్నారు. దీనివల్ల కార్టిసాల్ విడుదల తగ్గి, డోపమైన్ స్థాయులు పెరుగుతాయట. దాంతో మనసు నెమ్మదించి మానసిక సమస్యలు దరి చేరవంటున్నారు. అయితే చూడమన్నారు కదా అని... గంటల కొద్దీ దీనికి సమయం వెచ్చించకూడదట. అది మళ్లీ ఇతర సమస్యలకు దారితీస్తుంది. ఐదు నుంచి పది నిమిషాలు మహా అయితే పావుగంట మాత్రమే ఉండాలంటున్నారు. అతి ఏదైనా అనర్థం అని మరచిపోవద్దంటున్నారు. అవసరం అయితే ప్రయత్నించి చూడండి.

మీకు తెలుసా!



దుర్గాబాయి కామత్... తొలి భారతీయ నటి. సంప్రదాయ కుటుంబంలో పుట్టిన ఈమె 'మోహిని భస్మాసుర్' అనే మరాఠీ చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేశారు. 1913 వరకూ సామాజిక నిబంధనల కారణంగా మహిళలు సినిమాల్లో నటించలేదట. ఆ నిబంధనలు బద్దలు కొట్టి తెరపై మెరిశారీమె. పర్యవసానంగా ఆమెను తన వర్గం నుంచి బహిష్కరించారు కూడా.

మీరు 'మైండ్‌ఫుల్' తల్లిదండ్రులేనా..!



మనం ఎంత కాదన్నా, వద్దన్నా సామాజిక మాధ్యమాల మాయాజాలం పిల్లల పెంపకం మీదా పడుతుంది. వాళ్లకు పెట్టే ఆహారం దగ్గర్నుంచీ, కొనిచ్చే బొమ్మల వరకూ ప్రతిదానికి మనం డిజిటల్ తెరల మీదే ఆధారపడుతున్నాం. దీనివల్ల కలిగే ఉపయోగాల కన్నా... మనం చేస్తున్నది తప్పా ఒప్పా అన్న గందరగోళమే ఎక్కువ. దాంతో సంకోచిస్తూనే వారికి అన్నీ అందిస్తున్నాం. ఏ చిన్న తేడా వచ్చినా మనల్ని మనం నిందించుకుంటున్నాం. పైగా, ఇలా వచ్చే ఒత్తిడితో పిల్లల పైనా అరుపులు, కోపాలు ప్రదర్శిస్తున్నాం. దాంతో మైండ్‌ఫుల్ పేరెంటింగ్‌కి రోజురోజుకీ దూరమవుతున్నాం. మీరూ ఇలానే చేస్తున్నారా?

ఓ తల్లిగా పిల్లలకు బెస్ట్ ఇవ్వాలనే తాపత్రయం ఉండటం సహజమే. మీకే కాదు ఇది అందరికీ ఉంటుంది. కానీ దీనికోసం మీరు ఎలాంటి విధానాల్ని ఎంపిక చేసుకుంటున్నారు అనే దాని మీదే మీ పేరెంటింగ్ కూడా ఆధారపడి ఉంటుంది. ఒత్తిడీ, ఆందోళనతో కూడిన పెంపకంతో మీరు సతమతం అవుతూ, పిల్లల్నీ వీటి ప్రభావానికి గురిచేసే బదులు, సాఫీగా ఓ స్పష్టతతో, మనస్ఫూర్తిగా పిల్లల్ని పెంచమంటున్నారు నిపుణులు. 'మైండ్‌ఫుల్ పేరెంటింగ్' కూడా అదే చెబుతోంది. దీనికోసం... ఇదివరకు అమ్మలు వాళ్ల పిల్లలకు ఏం ఇవ్వాలన్నా, పెట్టాలన్నా పెద్దవాళ్లు, అనుభవం ఉన్న స్నేహితుల్ని అడిగేవారు. వాళ్ల సలహాలూ సూచనల్నీ పాటించేవారు. కానీ ఇప్పుడు మనం సామాజిక మాధ్యమాల మీదే ఎక్కువగా ఆధారపడుతున్నాం. ఇలా చేసే ముందు మీరు ఫాలో అవుతున్న ఛానెళ్లు, సైట్లు మెరుగైనవా కాదా అని చెక్ చేసుకోండి. వీడియో, రీల్ ఏం చూసినా దానికింద కామెంట్లు, రివ్యూలను చదవండి. పూర్తి నమ్మకం కలిగితేనే సంబంధిత ఆహార పదార్థాలు, ఉత్పత్తి వాళ్లకు కొని ఇవ్వండి. అప్పుడు ఏ సమస్యా ఉండదు.

మహిళల కోసం... మహిళా వ్యాపారవేత్తలతో... ఈనాడు వెబినార్!



ఈనాడు వసుంధర | TDH FOODS | A BRAND OF TENALI DOUBLE HORSE GROUP

హాయ్... వ్యాపారం చేయాలన్న ఆలోచనలో ఉన్నారా?

ప్రభుత్వం సాయం చేస్తుందా? సంస్థలేమైనా ఫండింగ్ చేస్తాయా? పెట్టుబడితో సిద్ధంగా ఉన్నా గైడెన్స్ ఎవరిస్తారు? ఇప్పటికే ప్రారంభిస్తే ముందుకు తీసుకెళ్లేదెలా... ఇలా అన్నీ సందేహాలే. అందుకే నవంబరు 2న (ఆదివారం) ఉదయం11 గం. నుంచి మధ్యాహ్నం 12.30 గం. వరకూ **ఈనాడు వసుంధర- తెనాలి డబుల్ హార్స్ గ్రూప్** సంయుక్తంగా నిర్వహించే ఉచిత ఆన్‌లైన్ వెబినార్‌లో పాల్గొనండి.

తాజా స్టార్టప్ ట్రెండ్స్, మార్కెట్ స్ట్రాటజీల గురించి నిపుణులు అందించే సమాచారం తెలుసుకోండి. మీ సందేహాలకు తమ అనుభవాల నుంచి వాళ్లు అందించే విలువైన సలహాలూ సూచనలూ అందుకోండి. విద్యార్థులు, యువత, ఆసక్తి ఉన్న మహిళలందరికీ ఇది అద్భుతమైన అవకాశం. ఉపయోగించుకోవాలనుకుంటే...

02.11.2025 (ఆదివారం) నాడు...

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా https://hov.to/7320792f వెబ్‌లింకు ఓపెన్ చేయండి. జూమ్ ఐడీ: 939 3161 0457 పాస్‌కోడ్: 688857 తోనూ జాయిన్ కావొచ్చు.

ఈ వెబినార్ యూట్యూబ్ లైవ్ కోసం స్కాన్ చేయండి.

ఆమె పాటే వాళ్లకి ఓదార్పు..!

ఒంటినిండా సూదులు చేసిన గాయాలతో రోగనిరోధకశక్తి తగ్గిపోయి, జుట్టు ఊడిపోయి, మనసు, శరీరం అలసిపోయి... ఇక మావల్ల కాదు ఈ పోరాటం అనే బాధలో ఉంటారు కీమోలు చేయించుకుంటున్న రోగులు. వాళ్ల దుఃఖం వర్ణనాతీతం. అలాంటి వారందరికీ తన పాటతో సాంత్వన కలిగిస్తోంది జ్యోతిర్మయి నాయక్.

'మీరు పాడుతుంటే... హాయిగా నిద్ర పడుతోంది. మీ పాట విన్నంతసేపూ నొప్పుల్ని మరచిపోగలుగుతున్నాం. మీ పాట వినడానికైనా ఇంకో రోజు కావాలని కోరుకుంటున్నా' ఒడిశాలోని క్యాన్సర్ వార్డులో రోగులు జ్యోతిర్మయికి రోజూ చెప్పే మాటలివి. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న వారికి ఆమె పాటే సాంత్వన మరి. అందుకే వాళ్లు ఆమె వార్డుకు ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తూ ఉంటారు. అందుకే ఆమె కూడా దీన్నో థెరపీలా వాళ్లకి అందిస్తోంది. 24 ఏళ్ల జ్యోతిర్మయి పుట్టి పెరిగిందంతా భువనేశ్వర్. చిన్నప్పట్నుంచీ ఆమెకు సంగీతమంటే ఇష్టం. దాన్ని గమనించిన తల్లిదండ్రులు చక్రధర్, గౌరీ శాస్త్రీయ సంగీత శిక్షణలో చేర్చారు. దాంతో పదో ఏట నుంచే సంగీతం ఆమె జీవితంలో భాగమైంది. 'నాతో పాటే ఈ ఇష్టమూ పెరిగి పెద్దయ్యింది. సంగీతానికి రాళ్లనైనా కరిగించే శక్తి ఉంటుంది. అందుకే బాధ, సంతోషం ఏదైనా మనం పాటల్నే వింటాం. క్యాన్సర్‌తో పోరాడుతున్న వారికీ ఇది ఉపశమనం ఇస్తే బాగుణ్ను అనిపించింది. అప్పుడే మ్యూజిక్ థెరపీ గురించి విన్నాను. 2023లో చెన్నై స్కూల్ ఆఫ్ మ్యూజిక్ థెరపీలో చేరాను. రెండేళ్ల శిక్షణ పూర్తి చేసుకున్నా. స్థానిక ఆస్పత్రిలో ఇంటర్న్‌గా చేరి సేవలందించాను. నా సొంతూరిలోనే ఈ ప్రయాణాన్ని కొనసాగించాలని భావించి ఒడిశా తిరిగి వచ్చేశా' అని గుర్తు చేసుకుంటోంది జ్యోతిర్మయి.

ఈటీవీ భారత్ - యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

ఆమె ఇప్పటికే పలు ఒడియా సినిమాల్లో, భక్తి అల్బమ్స్‌లో పాటలు పాడింది. ఓ వైపు తన ప్యాషన్‌ను కొనసాగిస్తూనే... క్యాన్సర్ వార్డులకి వెళ్తూ వారికీ తన సేవల్ని అందిస్తోంది. ఇటీవల ఇండియన్ ఐడల్ కార్యక్రమంలో పాల్గొని టాప్16 జాబితాలో చోటు సంపాదించుకుంది. 'నా ప్రయాణం, నైపుణ్యాలు ఏదో ఒక్క ప్రాంతానికే పరిమితం కాకూడదు. జాతీయ వేదికల మీద నా స్వరం వినిపించాలి. మ్యూజిక్ థెరపీ గురించి అవగాహన కల్పించాలి. ఆ లక్ష్యంతోనే అడుగులు వేస్తున్నా' అంటోందీమె.



జ్యోతిర్మయి

తింటున్నా... నీరసమే!



జంక్‌ఫుడ్ జోలికే వెళ్లట్లేదు. ఆరోగ్యకరమైన ఆహారమే తింటున్నా. స్నాక్స్‌లోనూ పండ్లే. అయినా నీరసమే. ఎప్పుడూ నిద్రపోవాలన్న భావనే... ఎందుకిలా? గూగుల్ సర్వేలో చాలా మంది అడిగిన ప్రశ్న ఇదేనట. నిపుణులు దీనికేం సమాధానం చెబుతున్నారంటే...

శరీరంలో ఇన్‌ఫ్లమేషన్, ఒత్తిడి, నెలసరి దగ్గర్లో ఉండటం, నిద్రలేమి... అమ్మాయిలకు చాలావరకూ ఈ సమస్యకి ఇవే కారణాలట. ఒత్తిడితో నిద్ర పట్టదు. అది కాస్తా జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపుతుంది. దీంతో పోషకాలు అందవు. ఇలా ఒక్కోదానికీ లింకు ఏర్పడి... ఎంత ఆరోగ్యంగా తిన్నా ఒంటికి పట్టడం లేదన్నమాట. ఇవి కాకుండానూ ఇంకా కొన్ని కారణాలున్నాయి. ఇంత మొత్తంలో ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్ అంటూ లెక్కవేసుకుంటూ తింటే సరిపోదు. ఐరన్, మెగ్నీషియం, విటమిన్ బి12 వంటి ఇతర పోషకాలూ కావాలి. అంతెందుకు, ఆరోగ్యమని స్మూతీలు చేసుకుని తాగుతాం. ఫైబర్ అందుతుంది సరే! మరి ప్రొటీన్ సంగతేంటి? అదీ అందాలంటే జోడీగా సీడ్స్, యోగర్ట్ వంటివి జత చేసుకోవాలి. కాబట్టి, ఏమేం జోడించుకుంటే మేలు అనేదీ గమనించుకోవాలి.

ఆరోగ్యంగా తింటూ వేళలు పాటించకపోయినా లాభం లేదు. ఆరోగ్యకరమైనవి అని చెప్పి సరిగ్గా రాత్రి పడుకునే ముందు తిన్నారనుకోండి. గ్లూకోజ్ స్థాయులు పెరుగుతాయి. దీంతో నిద్ర దరిచేరదు. తిరిగి అజీర్తి వంటి సమస్యలు. ఉదయాన్నే నిద్రలేచిన గంటలోపు, రాత్రి పడుకోవడానికి రెండు గంటలముందు భోజనం తప్పనిసరి. ప్రతి రెండు, మూడు గంటలకోసారి ఆరోగ్యకరమైన స్నాక్సినీ చేర్చుకోవాలి. అప్పుడే శక్తిస్థాయులు అదుపులో ఉంటాయి. నీళ్లు సరిగా తాగకపోయినా, అతిగా టీ, కాఫీలు తాగినా కూడా తలనొప్పి, అలసట వంటివి దరిచేరతాయి. వాటినీ గమనించుకోవాలి. కాబట్టి, ఆరోగ్యంగా తింటున్నాం అని అనుకుంటే సరిపోదు. సరిగా, సరైన వేళల్లో తింటున్నామా అన్నదీ చూసుకోవాలి. మరి గమనించుకుంటారుగా!

బంగారం - వెండి



31న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,25,020	1,12,850	1,53,670
విజయవాడ	1,20,520	1,12,450	1,52,800
ప్రొద్దుటూరు	1,20,800	1,11,140	1,53,500
రాజమహేంద్రవరం	1,23,280	1,13,000	1,65,000
విశాఖపట్నం	1,22,220	1,12,450	1,55,000
తమిళనాడు	-----	1,13,000	1,65,000

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

అందం... అలంకరణ రెండూనూ!

పండుగలైనా... వేడుకలైనా... ఇప్పటితరం అమ్మాయిలంతా కాస్తయినా మేకప్ టచ్ ఉండాలి అనుకుంటున్నారు. అందుకు అనుకూలంగా బ్రష్‌లూ, స్పాంజ్‌లూ అంటూ ఎన్నో ఉత్పత్తుల్ని వాడుతున్నారు. మేకప్ వేసుకునే వరకూ సరే... కానీ వాటి శుభ్రత విషయమేంటి. సరైనా నిర్వహణ లేకపోతే వాటివల్ల ఎన్ని చర్మ సమస్యలు వస్తాయో... వీటన్నింటికీ చెక్ పెట్టేందుకే ఈ ఉపకరణాలు...

తేలికగా శుభ్రం చేస్తుంది...



మేకప్ వేసుకున్న ప్రతిసారి బ్రష్‌లను శుభ్రం చేయాలంటున్నారు సౌందర్య నిపుణులు. లేదంటే వాటిపై బ్యాక్టీరియా, మృతకణాలు చేరి ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఎక్కువ. అలా అని ప్రతిసారి వీటిని శుభ్రం చేయాలన్నా కష్టమే. కానీ, 'ఎలక్ట్రిక్ మేకప్ బ్రష్ క్లీనర్' ఈ పనిని సులభం చేస్తుంది. బ్యాటరీ, విద్యుత్‌తో నడిచే ఈ మెషీన్ అన్ని సైజుల బ్రష్‌ల్ని ఏకకాలంలో శుభ్రం చేసేస్తుంది.

అందంగా దాచేస్తుంది...



అసలే పెళ్లిళ్ల సీజన్... మెరిసిపోవాలంటే మేకప్ తప్పనిసరి కదా! మరి దీనికి సంబంధించిన యాక్సెసరీలన్నీ ఎంత జాగ్రత్తగా తీసుకెళ్లినా ఒక్కోసారి అవి కిందపడే అవకాశం ఉంది. పైగా ఎంత పొందికగా బ్యాగులో భద్రపరిచినా వాటిపై దుమ్మూధూళీ చేరతాయి. ఈ 'డస్ట్ ప్రూఫ్ కవర్ ట్రాన్స్‌పరెంట్ మేకప్ బ్రష్ హోల్డర్' మీ సమస్యకు చెక్ పెడుతుంది. లిప్‌స్టిక్ దగ్గర నుంచి బ్రష్‌ల వరకూ అన్నీ దీనిలోనే భద్రపరచొచ్చు.

అలంకరణగానూ...



అన్ని వయసులవారు ఇప్పుడు మేకప్‌ని ప్రయత్నిస్తున్నారు. ఫౌండేషన్ కోసం బ్రష్‌లూ, క్రీములను అద్దేందుకు స్పాంజ్‌ల్నీ ఉపయోగిస్తున్నారు. పని పూర్తయిన తర్వాత వాటిని భద్రపరుచుకోవడానికి వచ్చినదే ఈ 'మేకప్ స్పాంజ్ హోల్డర్'. నాలుగు అరలతో సులభంగా రొటేట్ అయ్యేలా దీన్ని తయారుచేశారు. మినిమలిస్ట్ లుక్‌ని అందిస్తూ డ్రెస్సింగ్ టేబుల్‌ని అందంగా అలంకరిస్తుంది. అంతేకాదు, పెళ్లి రోజు, పుట్టినరోజులకు మీ స్నేహితురాలికి బహుమతిగా ఇవ్వడానికి మంచి ఎంపిక. ఈ ఉపకరణాలు మీకూ నచ్చాయా అయితే ఓ లుక్కేయండి.

మబ్బులు పట్టిన చల్లటి వాతావరణం.. బౌన్స్, స్వింగ్ అనుకూల పిచ్.. టీమ్‌ఇండియా బ్యాటర్లు అసలు ఇష్టపడని పరిస్థితులు ఇవి. ఇలాంటి స్థితిలో విదేశీగడ్డపై గతంలో ఎన్నోసార్లు పేలవ ప్రదర్శన చేసిన భారత జట్టు మరోసారి తేలిపోయింది. కిక్కిరిసిన స్టేడియంలో అభిమానులు ఇండియా.. ఇండియా అంటూ ఉత్సాహపరిచినా బ్యాటర్లు వారిని అలరించలేకపోయారు. అభిషేక్‌శర్మ, హర్షిత్‌రాణా మినహా అంతా విఫలమవడంతో మెల్‌బోర్న్‌లో ఓటమి తప్పలేదు. పోరాటమే లేకుండా రెండో టీ20లో తలొంచింది టీమ్‌ఇండియా.

ఛాంపియన్స్


సూర్య 1

పేస్‌కు పడిపోయారు

రెండో టీ20లో ఆసీస్ చేతిలో భారత్ ఓటమి

విజృంభించిన హేజిల్‌వుడ్ • అభిషేక్ మెరుపులు వృథా

మెల్‌బోర్న్

భారత జట్టుకు పంచ్. వర్షంతో రద్దయిన తొలి టీ20లో ఆడిన కాసేపు ఆకట్టుకున్న టీమ్‌ఇండియా.. రెండో టీ20లో తేలిపోయింది. 4 వికెట్ల తేడాతో ఆసీస్ చేతిలో చిత్తయింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హేజిల్‌వుడ్ (3/13)తో పాటు బార్ట్‌లెట్ (2/39), నాథన్ ఎలిస్ (2/21) పేస్‌కు విలవిలలాడింది. శుక్రవారం మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 18.4 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌటైంది. అభిషేక్ శర్మ (68; 37 బంతుల్లో 8×4, 2×6) మాత్రమే ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు. హర్షిత్ రాణా (35; 33 బంతుల్లో 3×4, 1×6) పోరాడడంతో స్కోరు వంద దాటింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (46; 26 బంతుల్లో 2×4, 4×6) మెరుపులతో ఆసీస్ 13.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. అయిదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆసీస్ 1-0 ఆధిక్యం సంపాదించింది. ఆదివారం మూడో టీ20 జరుగుతుంది.

హేజిల్‌వుడ్ చకచకా: స్టేడియంలో అభిమానులను చూస్తే భారత్‌లో ఆడిన భావన కలిగిస్తుంటుంది టీమ్‌ఇండియాకు. కానీ బ్యాటర్లు అలవాటులేని పేస్, బౌన్స్ పిచ్‌పై తడబడి వికెట్లు అప్పగించుకున్నారు. హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో ఇన్నింగ్స్ మొదటి బంతికే అభిషేక్ ఎల్బీగా ఇచ్చినా.. రివ్యూలో బతికిపోయిన శుభ్‌మన్ గిల్ (10 బంతుల్లో 5) ఆ తర్వాత ఇబ్బంది పడ్డాడు. ఓ బంతి శుభ్‌మన్ హెల్మెట్‌ను బలంగా తాకింది. చక్కని లెంగ్త్ బౌలింగ్ చేసిన హేజిల్‌వుడ్ తన రెండో ఓవర్లో గిల్‌ను ఔట్ చేశాడు. షాట్ ఆడే క్రమంలో మిడాఫ్ ఫీల్డర్‌కు చిక్కి అతడు పెవిలియన్ చేరాడు. శాంసన్ (2) ఇలా వచ్చి అలా వెళ్లిపోయాడు. ఎలిస్ బౌలింగ్‌లో ఎల్బీగా అతడు ఔటయ్యాడు. 20 పరుగులకు తొలి వికెట్ పడితే.. ఆ తర్వాత కాసేపటికే స్కోరు 49/5గా మారిపోయింది స్కోరుబోర్డు. వచ్చిన బ్యాటర్ వచ్చినట్లే పెవిలియన్ చేరిపోయారు. ఇన్నింగ్స్ అయిదో ఓవర్లో సూర్యకుమార్ (1)ను ఓ షార్ట్ బంతితో బోల్తాకొట్టించిన హేజిల్‌వుడ్.. అదే ఓవర్లో తిలక్‌వర్మ (0)ను వెనక్కి పంపాడు. హేజిల్‌వుడ్ వేసిన బంతిని తిలక్ షాట్ కొట్టే ప్రయత్నం చేయగా.. అది ఎడ్జ్ తీసుకుని వికెట్ కీపర్‌కు చిక్కింది. తన తొలి నాలుగు ఓవర్ల స్పెల్‌లో హేజిల్‌వుడ్ 15 డాట్ బాల్స్ వేసి మూడు వికెట్లు తీసి భారత్ టాప్‌ఆర్డర్‌ను కూల్చాడు. అక్షర్ (7) లేని పరుగు కోసం ప్రయత్నించి రనౌట్ కావడంతో భారత్ యాభైలోపే సగం వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. వంద పరుగులైనా దాటుతుందా అని అనిపించిన తరుణమది.

అభిషేక్ ఒక్కడే: వికెట్లు పడుతున్నా.. ఒత్తిడి ఉన్నా.. అభిషేక్ శర్మ నిలిచాడు. సహచరులు ఆడిన పిచ్ వేరు.. తాను ఆడుతున్న పిచ్ వేరు అన్నట్లు సాగింది అతడి బ్యాటింగ్. లేట్ కట్ షాట్లు, శక్తివంతమైన డ్రైవ్‌లు, పుల్ షాట్లతో మెరుపులు మెరిపించిన అభిషేక్.. స్కోరుబోర్డును కదిలించాడు. బార్ట్‌లెట్ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్లో క్రీజు వదిలి ముందుకు దూసుకొచ్చి ఆఫ్ సైడ్ కొట్టిన సిక్సర్ హైలైట్. ఈ క్రమంలోనే 23 బంతుల్లోనే అర్ధసెంచరీ అందుకున్నాడు. వన్డే సిరీస్‌లో బ్యాట్‌తోనూ సత్తా చాటిన హర్షిత్ రాణా నుంచి అభిషేక్‌కు చక్కటి సహకారం అందింది. స్టొయినిస్ బౌలింగ్‌లో ఓ భారీ సిక్స్ బాదిన హర్షిత్... బార్ట్‌లెట్ ఓవర్లో అలాంటి షాట్‌కే ప్రయత్నించి డేవిడ్‌కు చిక్కాడు. ఆరో వికెట్‌కు అభిషేక్-హర్షిత్ జంట 56 పరుగులు జత చేసింది. ఆ తర్వాత మళ్లీ పాత కథే. శివమ్ దూబె (4), కుల్‌దీప్ (0) నిలవలేకపోయారు. 18వ ఓవర్లో అభిషేక్ ఓ సిక్స్, ఫోర్ అందుకోవడంతో స్కోరు 120 దాటింది. ఆఖరి వరకు అతడు ఉండివుంటే పోరాడగలిగే స్కోరు నిలిచేదేమో. కానీ 19వ ఓవర్లో అభిషేక్‌తో పాటు బుమ్రా (0) ఔటైపోవడంతో మరో ఎనిమిది బంతులు మిగిలుండగానే భారత్ ఇన్నింగ్స్ ముగిసింది. 19వ ఓవర్ వరకు నిలిచినా అభిషేక్ ఎదుర్కొన్న బంతులు 37 మాత్రమే.


హేజిల్‌వుడ్ 3/13

మార్ష్ మెరుపులు: స్వల్ప లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియాను ఆరంభంలో భారత బౌలర్లు ఇబ్బంది పెట్టలేకపోయారు. మనోళ్లు తడబడిన పిచ్‌పై స్వేచ్ఛగా ఆడిన ఓపెనర్ మిచెల్ మార్ష్, ట్రావిస్ హెడ్ (28) ఆసీస్‌కు శుభారంభాన్ని అందించారు. బలమైన పుల్ షాట్లు, చక్కని డ్రైవ్‌లతో మార్ష్ వేగంగా స్కోరు పెంచాడు. హర్షిత్ వేసిన నాలుగో ఓవర్లో రెండు భారీ సిక్స్‌లు బాదాడు. హెడ్ కూడా ఉన్నంతసేపు మెరవడంతో ఆసీస్ స్కోరుబోర్డు పరుగులెత్తింది. ఆ జట్టు 4.1 ఓవర్లలోనే 50 పరుగులు అందుకుంది. హెడ్‌ను వరుణ్ ఔట్ చేసినా.. మార్ష్ తగ్గలేదు. కుల్‌దీప్ వేసిన ఎనిమిదో ఓవర్లో రెండు సిక్స్‌లు, రెండు ఫోర్లతో సహా 20 పరుగులు రాబట్టిన అతడు చివరి బంతికి ఔటయ్యాడు. అప్పటికి స్కోరు 8 ఓవర్లకు 82/2. ఇంకా ఆ జట్టు 39 పరుగులు చేస్తే చాలు. అయితే 5 ఓవర్ల వ్యవధిలో 4 వికెట్లు పడ్డాయి. టిమ్ డేవిడ్ (1)ను వరుణ్.. ఇంగ్లిస్ (20)ను కుల్‌దీప్ ఔట్ చేశారు. బుమ్రా (2/26)ఒకే ఓవర్లో ఓవెన్ (14), షార్ట్ (0)ను పెవిలియన్ చేర్చాడు. కానీ అప్పటికే ఆసీస్ విజయాన్ని ఖాయం చేసుకుంది. ఆ జట్టు మరో 40 బంతులు మిగిలుండగానే గెలిచింది. బంతి మెడకు బలంగా తగలడంతో దుర్మరణం పాలైన ఆసీస్ యువ క్రికెటర్ బెన్ ఆస్టిన్‌కు నివాళిగా రెండు జట్ల క్రికెటర్లు ఈ మ్యాచ్‌లో నల్ల రిబ్బన్లు ధరించి బరిలో దిగారు.


అభిషేక్ 68

భారత్ ఇన్నింగ్స్: శుభ్‌మన్ (సి) మార్ష్ (బి) హేజిల్‌వుడ్ 5; అభిషేక్ శర్మ ఎల్బీ (బి) ఎలీస్ 68; శాంసన్ ఎల్బీ (బి) ఎలీస్ 2; సూర్యకుమార్ (సి) ఇంగ్లిస్ (బి) హేజిల్‌వుడ్ 1; తిలక్‌వర్మ (సి) ఇంగ్లిస్ (బి) హేజిల్‌వుడ్ 0; అక్షర్ రనౌట్ 7; హర్షిత్ (సి) డేవిడ్ (బి) బార్ట్‌లెట్ 35; శివమ్ దూబె (సి) ఇంగ్లిస్ (బి) బార్ట్‌లెట్ 4; కుల్‌దీప్ (సి) అబాట్ (బి) స్టాయినిస్ 0; వరుణ్ నాటౌట్ 0; బుమ్రా రనౌట్ 0; ఎక్స్‌ట్రాలు 3 మొత్తం: (18.4 ఓవర్లలో ఆలౌట్) 125

వికెట్ల పతనం: 1-20, 2-23, 3-32, 4-32, 5-49, 6-105, 7-109, 8-110, 9-125; **బౌలింగ్:** హేజిల్‌వుడ్ 4-0-13-3; బార్ట్‌లెట్ 4-0-39-2; నాథన్ ఎలీస్ 3.4-0-21-2; స్టాయినిస్ 4-0-24-1; ఓవెన్ 1-0-13-0; కునెమాన్ 2-0-14-0

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: మిచెల్ మార్ష్ (సి) అభిషేక్ (బి) కుల్‌దీప్ 46; ట్రావిస్ హెడ్ (సి) తిలక్ (బి) వరుణ్ 28; ఇంగ్లిస్ ఎల్బీ (బి) కుల్‌దీప్ 20; టిమ్ డేవిడ్ (సి) అండ్ (బి) వరుణ్ 1; మిచెల్ ఓవెన్ (సి) శాంసన్ (బి) బుమ్రా 14; స్టాయినిస్ నాటౌట్ 6; షార్ట్ (బి) బుమ్రా 0; బార్ట్‌లెట్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం:** (13.2 ఓవర్లలో 6 వికెట్లకు) **126; వికెట్ల పతనం:** 1-51, 2-87, 3-90, 4-112, 5-124, 6-124; **బౌలింగ్:** బుమ్రా 4-0-26-2; హర్షిత్ రాణా 2-0-27-0; వరుణ్ 4-0-23-2; కుల్‌దీప్ 3.2-0-45-2


ట్రోఫీతో దబంగ్ దిల్లీ జట్టు

ప్రొ కబడ్డీ సీజన్-12 ఆసాంతం ఆధిపత్యం ప్రదర్శించి.. లీగ్ దశలో టాప్-2లో నిలిచిన.. దబంగ్ దిల్లీ టైటిల్‌నూ పట్టేసింది. ఒత్తిడిలోనూ నిలిచి.. డిఫెన్స్‌తో అదరగొట్టిన అషు మలిక్ సారథ్యంలోని జట్టు ఈ సీజన్ విజేతగా ఆవిర్భవించింది. ఉత్కంఠభరిత ఫైనల్లో ఆ జట్టు పుణెరి పల్టాన్‌ను ఓడించింది. దిల్లీకి ఇది రెండో టైటిల్. రెండోసారి ఛాంపియన్ కావాలనుకున్న పుణెరికి నిరాశే.

దిల్లీ ధమాకా

• ప్రొకబడ్డీ ట్రోఫీ కైవసం
• ఫైనల్లో పుణెరిపై గెలుపు

దిల్లీ: సొంతగడ్డపై దిల్లీ అదరగొట్టింది. అదిరే ఆటతో ప్రొ కబడ్డీ టైటిల్‌ను గెలుచుకుంది. శుక్రవారం నువ్వానేనా అన్నట్లు సాగిన తుది పోరులో దిల్లీ 31-28తో పుణెరిని ఓడించింది. త్యాగరాజ్ స్టేడియంలో జరిగిన ఈ పోరులో ఆరంభం నుంచి రెండు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. మొదట దిల్లీ కాస్త ఆధిపత్యం చూపిస్తే.. తర్వాత పుణెరి పుంజుకుంది. గౌరవ్ సూపర్ ట్యాకిల్‌తో 6-7తో దిల్లీని సమీపించింది. రైడింగ్‌లో సత్తా చాటిన దిల్లీ.. నెమ్మదిగా పాయింట్ల అంతరాన్ని పెంచింది. ఆజింక్య పవార్ రాణించడంతో ఇంకో అయిదు నిమిషాల్లో తొలి అర్ధం ముగుస్తుందనగా పుణెరిని ఆలౌట్ చేసి 14-8తో నిలిచింది. దిల్లీ 20-14తో బ్రేక్‌కు వెళ్లింది. విరామం తర్వాత పుణెరి దూకుడు పెంచింది. పంకజ్ మోహిత్ సూపర్ ట్యాకిల్.. ఆదిత్య షిండే రెండు పాయింట్ల రెయిడ్‌తో రేసులోకి వచ్చింది. అయినా దిల్లీ దాడులు ఆపలేదు. ఆధిక్యాన్ని కొనసాగిస్తూనే వచ్చింది. చివరి క్వార్టర్ ఉండనగా ఆ జట్టు 24-18తో విజయం దిశగా సాగింది. కానీ పుణెరి వదల్లేదు. మహ్మద్ అమాన్, ఆదిత్య షిండే మెరుపులతో బలంగా పుంజుకుంది. దిల్లీని ఆలౌట్ చేసి 25-25తో ప్రత్యర్థిని అందుకుంది. అక్కడ నుంచి దిల్లీ డిఫెన్స్‌లో అదరగొట్టింది. కొన్ని సెకన్లలో మ్యాచ్ ముగుస్తుందనగా 30-28తో నిలిచిన దిల్లీ.. అదే జోరుతో ఓ పాయింట్‌ను సాధించి ట్రోఫీని ఎగరేసుకుపోయింది. నీరజ్ నర్వాల్ (9), ఆదిత్య పవార్ (6) దిల్లీ విజయంలో కీలకపాత్ర పోషించారు. పుణెరి తరఫున ఆదిత్య షిండే (10), పంకజ్ (4), అభి (4), గౌరవ్ (3) రాణించినా గెలిపించలేకపోయారు.

● దిల్లీకి ఇది రెండో పీకేఎల్ టైటిల్. 2021లో తొలిసారి టైటిల్ గెలిచింది.

● 12 సీజన్లలో పట్నా పైరేట్స్ అత్యధికంగా మూడుసార్లు నెగ్గింది. దిల్లీ, జైపుర్, రెండేసి టైటిళ్లు సాధించగా.. యు ముంబా, పుణెరి పల్టాన్, హరియాణా స్టీలర్స్, బెంగళూరు బుల్స్, బెంగాల్ వారియర్స్ ఒక్కో ట్రోఫీ నెగ్గాయి.

ప్రైజ్‌మనీ: విజేత దిల్లీకి రూ.3 కోట్లు, రన్నరప్ పుణెరికి రూ.1.8 కోట్లు దక్కాయి.

మహిళల వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాతో సెమీఫైనల్లో భారత్ గెలుపు గీత దాటగానే మొదలైంది జెమీమాలో కన్నీటి ధార. గెలుపు సంబరాల్లో ఉన్నపుడు.. ఆపై బహుమతి ప్రదానోత్సవంలో మాట్లాడుతున్నపుడు.. ఆపై విలేకరుల సమావేశంలో ఆ కన్నీటి ధార అలాగే కొనసాగింది. మ్యాచ్ అయిన గంట తర్వాత కూడా ఏడుస్తూనే ఉంది ఈ ముంబయి అమ్మాయి. ఆమెలో అంతగా ఉద్వేగం కట్టలు తెంచుకోవడానికి కారణమేంటి? ఈ ఇన్నింగ్స్ ఎందుకంత ప్రత్యేకం?


జెమీమా రోడ్రిగ్స్

ఆ కన్నీళ్ల వెనుక..

కొన్నేళ్లుగా మహిళల క్రికెట్‌ను అనుసరిస్తున్న వాళ్లకు జెమీమా రోడ్రిగ్స్ గురించి కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. వయసు పాతికేళ్లే కానీ.. ఆమె టీమ్ ఇండియాలో సీనియరే. ఏడేళ్లుగా వివిధ ఫార్మాట్లలో భారత జట్టుకు ఆడుతోంది స్టైలిష్ బ్యాటర్. ఆమె ఉపయుక్తమైన స్పిన్నర్ కూడా. భారత జట్టులోని అత్యుత్తమ ఫీల్డర్లలో జెమీమా ఒకరు. క్రికెట్లో ఇప్పుడింత పేరు సంపాదించిన ఈ ముంబయి క్రికెటర్‌కు ఫస్ట్ లవ్ మాత్రం ఈ ఆట కాదు. ఆమె ఆటల్లోకి అడుగు పెట్టినపుడు హాకీనే ఎక్కువ ఇష్టపడింది. దాన్నే కెరీర్‌గా ఎంచుకుంది. పాఠశాల స్థాయిలో ఆమె బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ ప్లేయర్ కూడా. వాటితో పాటు క్రికెట్ కూడా సాధన చేసింది. హాకీలోనే ఎక్కువ రాణించిన జెమీమా.. జాతీయ స్థాయికి ఎదిగింది. అయితే తర్వాత అనూహ్యంగా క్రికెట్ వైపు మళ్లింది. తండ్రి ఇవాన్ రోడ్రిగ్స్ తన కోచ్. స్వతహాగా చురుకైన అమ్మాయి, మంచి అథ్లెట్ కావడంతో క్రికెట్లో నైపుణ్యం సంపాదించడానికి ఆమెకు ఎక్కువ సమయం పట్టలేదు. తండ్రి శిక్షణలో స్కూల్ క్రికెట్లో రాటుదేలిన ఆమె.. 13 ఏళ్ల వయసులోనే ముంబయి తరఫున అండర్-19 టోర్నీల్లో ఆడడం విశేషం. 2017లో అండర్-19 మహిళల వన్డే టోర్నీలో డబుల్ సెంచరీ చేసిన రెండో బ్యాటర్ (మొదటి అమ్మాయి స్మృతి మంధాన)గా రికార్డులెక్కింది. ఛాలెంజర్ ట్రోఫీ, ఇండియా-ఎ సిరీస్‌ల్లోనూ రాణించడంతో జెమీమాకు 2018లో, 18 ఏళ్ల వయసులోనే భారత వన్డే జట్టుకు ఆడే అవకాశం దక్కింది. తర్వాత ఆమె టీ20ల్లోనూ అవకాశం దక్కించుకుంది. ఈ ఫార్మాట్లో ఆమె తొలి మ్యాచ్‌లోనే అర్ధశతకం సాధించింది. రెండేళ్ల కిందట జెమీమా టెస్టు క్రికెట్ కూడా ఆడింది. సుదీర్ఘ ఫార్మాట్లో 3 మ్యాచ్‌లాడి 58 సగటుతో 235 పరుగులు చేసిన ఆమె.. వన్డేల్లో 58 మ్యాచ్‌ల్లో 35 సగటుతో 1725 పరుగులు సాధించింది. అందులో 3 శతకాలున్నాయి. 112 టీ20ల్లో జెమీమా 30 సగటుతో 2375 పరుగులు రాబట్టింది.

పడుతూ లేస్తూ..: ప్రస్తుతం భారత్‌కు మూడు ఫార్మాట్లలో ఆడుతున్న మహిళా క్రికెటర్లలో జెమీమా ఒకరు. అయితే ఈ ప్రపంచకప్ ముందు వరకు ఆమె ఒక మోస్తరు స్థాయి బ్యాటర్‌గానే ఉంది. స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ లాగా ప్రపంచ స్థాయి బ్యాటర్‌గా ఆమె గుర్తింపును, జట్టులో సుస్థిర స్థానం సంపాదించలేకపోయింది. కెరీర్ ఆరంభంలో చక్కగా ఆడినా.. తర్వాత ఫామ్ కోల్పోవడంతో 2021 వన్డే ప్రపంచకప్ జట్టులో ఆమెకు స్థానం దక్కలేదు. అప్పుడు జెమీమా ఎంతో బాధ పడింది. కానీ ఆ ప్రపంచకప్ జరిగిన సంవత్సరం వరుసగా ఆరు వన్డే ఇన్నింగ్స్‌ల్లో తన స్కోర్లు.. 1, 9, 0, 8, 4, 10. కాబట్టే జట్టులో స్థానం దక్కలేదు. పైగా వేగంగా ఆడలేదనే ముద్ర కూడా పడింది తన మీద. కానీ పట్టుదలతో ప్రయత్నించి తన ఆటకు మెరుగులు దిద్దుకున్న జెమీమా.. తిరిగి జట్టులో స్థానం సంపాదించింది. 2023 టీ20 ప్రపంచకప్‌లో ఆమె చక్కటి ప్రదర్శన చేసింది. ఆస్ట్రేలియాతో సెమీస్‌లో 173 పరుగుల లక్ష్యం నిలవగా.. భారత్ విజయానికి చేరువగా వెళ్లింది. జెమీమా (24 బంతుల్లో 43) జట్టును గెలిపించడానికి గట్టి ప్రయత్నం చేసింది. కానీ భారత్ 5 పరుగుల తేడాతో త్రుటిలో ఓడింది. అంతకుముందు 2020 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఫైనల్లో ఓడింది. ఆ మ్యాచ్‌లో జెమీమా డకౌటైంది. ఆ రెండు ఓటములకూ గురువారం ఘనంగా ప్రతీకారం తీర్చుకున్నట్లయింది. ప్రపంచకప్ సెమీస్‌లో, అందులోనూ మేటి ఆస్ట్రేలియా బౌలింగ్‌ను ఎదుర్కొంటూ 339 పరుగుల ఛేదనతో ప్రపంచ రికార్డు నెలకొల్పడం అంటే మాటలు కాదు. ఈ విజయంలో జెమీమా (127 నాటౌట్) అత్యంత కీలక పాత్ర పోషించింది. ఒక ఎండ్‌లో జెమీమా పాతుకుపోయి విలువైన పరుగులు సాధించడం వల్లే జట్టు గెలిచింది. చేతుల్లో ఉన్న మ్యాచ్‌లను కోల్పోవడం భారత మహిళల జట్టుకు బాగా అలవాటు. ఈ టోర్నీలో కూడా లీగ్ దశలో సులువుగా గెలవాల్సిన మ్యాచ్‌ల్లో ఓటమి పాలైంది. కానీ ఒత్తిడిలో జెమీమా దృఢచిత్తంతో నిలబడి జట్టును గెలిపించే వరకు మైదానాన్ని వీడలేదు. హర్మన్‌తో కీలక భాగస్వామ్యం నెలకొల్పిన ఆమె.. కెప్టెన్ ఔటయ్యాక కొంత ఒత్తిడికి గురైంది. ఓవైపు సాధించాల్సిన రన్‌రేట్ పెరిగిపోతుండగా, తీవ్రమైన అలసటకు గురైన జెమీమా షాట్లు ఆడలేక ఇబ్బంది పడింది. అయితే రిచా ఘోష్ మెరుపులతో సాధించాల్సిన రన్‌రేట్ అదుపులోకి వచ్చాక.. ఆమె కూడా జోరందుకుంది. చివర్లో తెలివిగా షాట్లు కొట్టి జట్టును విజయతీరాలకు చేర్చింది. తన శతకం పూర్తయ్యాక జెమీమా కనీసం బ్యాట్ కూడా ఎత్తలేదు. ఎలాంటి సంబరాలు చేసుకోలేదు. జట్టును గెలిపించాకే ఏదైనా అని ఆమె నిర్ణయించుకుంది. ఆ పని పూర్తి చేశాక ఆమె మొత్తం దేశంతో కలిసి సంబరాల్లో భాగమైంది. గ్రూప్ దశ ఆరంభంలో జెమీమా ఆశించిన ప్రదర్శన చేయలేకపోవడంతో.. ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌కు ఆమెను పక్కన పెట్టారు. అది ఆమెను బాధించింది. కానీ న్యూజిలాండ్‌పై మళ్లీ ఆడిస్తే 55 బంతుల్లోనే 76 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. సెమీస్‌లో మరింత కసిగా ఆడి అద్భుత ఇన్నింగ్స్‌తో తన పేరును భారత మహిళల క్రికెట్ చరిత్రలో లిఖించుకుంది. కెరీర్లో అత్యంత కీలక దశలో మేటి ఇన్నింగ్స్‌తో జట్టుకు చిరస్మరణీయ విజయం అందించడం.. తన ప్రతిభకు, ఇన్నేళ్ల తన శ్రమకు ఫలితం దక్కడంతో జెమీమాలో ఆనందం, ఉద్వేగం కట్టలు తెంచుకుని కన్నీటి ధారగా మారింది.

– ఈనాడు క్రీడావిభాగం

చదరంగ సమరం

నేటి నుంచి ప్రపంచకప్


ప్రపంచకప్ ట్రోఫీ

పంజిమ్ (గోవా): ఫిడే చెస్ ప్రపంచకప్‌నకు వేళైంది. 80 దేశాల నుంచి 206 మంది టాప్ ప్లేయర్లు తలపడబోతున్న ఈ మెగా టోర్నీ ఆరంభమయ్యేది శనివారమే. సొంతగడ్డపై జరుగుతున్న ఈ పోరులో ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్, యువ కెరటాలు అర్జున్ ఇరిగేశి, ప్రజ్ఞానందపైనే అందరి దృష్టి ఉంది. నాకౌట్ ఫార్మాట్లో జరిగే ఈ సమరంలో పోటీలను క్లాసికల్ పద్ధతిలో నిర్వహిస్తారు. ప్రతి రౌండ్‌కు రెండు గేమ్‌లు ఉంటాయి. ఈ కప్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచే ప్లేయర్లు 2026 క్యాండిడేట్ టోర్నీకి అర్హత సాధిస్తారు. ప్రపంచ ఛాంపియన్ కావడంతో గుకేశ్‌కు ఈ అర్హతతో పని లేదు. అతడు టైటిల్ సాధించడంపై దృష్టి సారించాడు. గత కొన్ని నెలలుగా ఫామ్‌లో లేని ఈ యువ ఆటగాడు.. ఈ కప్ ద్వారానైనా సత్తా చాటాలని కోరుకుంటున్నాడు. ప్రజ్ఞానంద, అర్జున్‌తో పాటు సీనియర్ ప్లేయర్లు పెంటేల హరికృష్ణ, విదిత్ గుజరాతి క్యాండిడేట్ టోర్నీ అర్హత కోసం పోటీపడనున్నారు. మహిళల ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ కూడా ఈ టోర్నీ బరిలో ఉంది. మొత్తంగా భారత్ నుంచి 24 మంది క్రీడాకారులు బరిలో ఉండడం విశేషం. వీరిలో తెలంగాణ యువ ఆటగాడు రాజా రిత్విక్ కూడా పోటీలో ఉన్నాడు. ఈ ఏడాది ఆసియా ఛాంపియన్‌షిప్‌లో ఆకట్టుకున్న రిత్విక్.. ఈ టోర్నీలో ఎలా ఆడతాడో చూడాలి. ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్, అమెరికా గ్రాండ్‌మాస్టర్లు ఫాబియానో కరువానా, నకమురా ఈ కప్‌లో ఆడట్లేదు. ఈ కప్‌లో టాప్-50 ర్యాంకు ప్లేయర్లు నేరుగా రెండో రౌండ్ ఆడనున్నారు.


ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమంలో గోవా సీఎం ప్రమోద్ సావంత్, ఫిడే అధ్యక్షుడు డ్వార్కోవిచ్, కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ

ట్రోఫీ.. ఆనంద్ పేరిట

భారత్‌లో జరుగుతున్న చెస్ ప్రపంచకప్‌నకు విశ్వనాథన్ ఆనంద్ ట్రోఫీ అని నామకరణం చేశారు. శుక్రవారం ఈ టోర్నీ ఆరంభోత్సవంలో కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ఈ కప్‌ను ఆవిష్కరించారు. "చెస్ ప్రపంచకప్‌నకు దిగ్గజ ఆటగాడు విశ్వనాథన్ పేరు పెడుతున్నందుకు ఎంతో గర్విస్తున్నాం" అని అఖిల భారత చెస్ సమాఖ్య వెల్లడించింది. ఆనంద్ అయిదుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచాడు.

పంత్ విఫలం.. ఇండియా-ఎ 234


పంత్

బెంగళూరు: ఇండియా-ఎతో జరుగుతున్న తొలి అనధికారిక టెస్టులో దక్షిణాఫ్రికా-ఎకు ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 299/9తో రెండో రోజు ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా-ఎ 309 పరుగులకు ఆలౌటైంది. అనంతరం ఇండియా-ఎ తొలి ఇన్నింగ్స్‌లో 58 ఓవర్లలో 234 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు ఆయుష్ మాత్రె (65), సాయి సుదర్శన్ (32) తొలి వికెట్‌కు 90 పరుగులతో శుభారంభం అందించినా మిగతా బ్యాటర్లు తేలిపోయారు. దేవ్‌దత్ పడిక్కల్ (6), రజత్ పాటీదార్ (19) కెప్టెన్ రిషబ్ పంత్ (17) నిరాశపరిచారు. ఆయుష్ బదోని (38) రాణించాడు. ప్రెనెలన్ సుబ్రాయెన్ (5/61), లూథో సిపామ్లా (2/35) సత్తాచాటడంతో దక్షిణాఫ్రికా-ఎకు 75 పరుగుల ఆధిక్యం లభించింది. శుక్రవారం ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా-ఎ రెండో ఇన్నింగ్స్‌లో 12 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 30 పరుగులు సాధించింది. మరో రెండ్రోజుల ఆట మిగిలివున్న ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా-ఎ 105 పరుగుల ఆధిక్యంలో ఉంది.

"**అ**ద్భుతమైన విజయం. జెమీమా రోడ్రిగ్స్ గొప్పగా ఆడావు. జట్టును ముందుండి నడిపించిన హర్మన్‌ప్రీత్‌కు అభినందనలు. శ్రీచరణి, దీప్తిశర్మ బంతితో ఆటను సజీవంగా నిలిపారు. అమ్మాయిలు త్రివర్ణ పతకాన్ని సమున్నతంగా నిలపండి"

– సచిన్ తెందుల్కర్

భారత అమ్మాయిలకు ఆ అర్హత ఉంది: అభిషేక్

మెల్‌బోర్న్: వన్డే ప్రపంచకప్ గెలిచే అర్హత భారత మహిళల జట్టుకు ఉందని స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ అన్నాడు. "భారత్-ఆస్ట్రేలియా ప్రపంచకప్ సెమీఫైనల్‌ను మేం అంతా చూశాం. మ్యాచ్ చాలా ఉత్కంఠభరితంగా సాగింది. జెమీమా, హర్మన్‌ప్రీత్ గొప్పగా ఆడారు. భారత్ ప్రపంచకప్ ఫైనల్ చేరడం అందరికి గర్వకారణం. కప్ గెలిచే అర్హత జట్టుకు ఉంది" అని చెప్పాడు.

విండీస్ క్లీన్‌స్వీప్

చట్టోగ్రామ్: బంగ్లాదేశ్‌తో మూడు టీ20ల సిరీస్‌ను వెస్టిండీస్ క్లీన్‌స్వీప్ చేసింది. శుక్రవారం చివరిదైన మూడో టీ20లో ఆ జట్టు 5 వికెట్ల తేడాతో బంగ్లాను ఓడించింది. మొదట బంగ్లా 20 ఓవర్లలో 151 పరుగులకు ఆలౌటైంది. తంజిద్ (89) టాప్ స్కోరర్. రొమారియో షెపర్డ్ (3/36) హ్యాట్రిక్ చేశాడు. 17వ ఓవర్ చివరి బంతికి నూరుల్ (1)ను ఔట్ చేసిన అతడు.. 20వ ఓవర్లో తొలి రెండు బంతులకు తంజిద్, షోరిపుల్ (0) వికెట్లు తీసి హ్యాట్రిక్ నమోదు చేశాడు. అతడితో పాటు కారీ పియరీ (2/23), హోల్డర్ (2/32) రాణించారు. ఛేజ్ (50), అగస్టే (50) అర్ధసెంచరీలతో విండీస్ 16.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది.

దిగ్గజ గోల్‌కీపర్ ఫ్రెడరిక్ మృతి


ఫ్రెడరిక్

దిల్లీ: భారత పురుషుల హాకీ జట్టు మాజీ గోల్ కీపర్ మాన్యుయెల్ ఫ్రెడరిక్ (78) ఇకలేరు. గత 10 నెలలుగా ప్రొస్టేట్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఫ్రెడరిక్ శుక్రవారం ఉదయం బెంగళూరులో కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 1972 మ్యూనిచ్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత జట్టులో ఫ్రెడరిక్ సభ్యుడు. 2019లో కేంద్ర ప్రభుత్వం నుంచి మేజర్ ధ్యాన్‌చంద్ జీవితకాల సాఫల్య పురస్కారం అందుకున్నారు. 1947 అక్టోబరు 20న కన్నూర్‌లోని బర్న్‌స్సేరిలో జన్మించిన ఫ్రెడరిక్.. కేరళకు మొదటి ఒలింపిక్ పతకాన్ని అందించాడు. ఫ్రెడరిక్ తర్వాత హాకీలో కేరళ నుంచి పి.ఆర్.శ్రీజేష్ టోక్యో, పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్యాలు గెలుపొందారు.

ఉన్నతి సంచలన విజయం

సెమీస్‌లో ప్రవేశం


ఉన్నతి హుడా

సార్‌బ్రూకెన్ (జర్మనీ): భారత బ్యాడ్మింటన్ యువ తార ఉన్నతి హుడా సంచలన విజయం సాధించింది. హైలో ఓపెన్ టోర్నీలో నాలుగో సీడ్ తి లిన్ (చైనీస్ తైపీ)కి షాకిచ్చి ఆమె సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఉన్నతి 22-20, 21-13తో తి లిన్‌ను కంగుతినిపించింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ ఓడిపోయాడు. క్వార్టర్స్‌లో 17-21, 21-14, 15-21తో అలెక్స్ లానియర్ (ఫ్రాన్స్)కు తలొంచాడు. ఈ సీజన్లో అలెక్స్ చేతిలో అతడికిది రెండో ఓటమి. మరో క్వార్టర్స్‌లో ఆయుష్ శెట్టి 21-19, 12-21, 20-22తో కోల్జోనిన్ (ఫిన్లాండ్)పై పోరాడి ఓడాడు. పురుషుల సింగిల్స్ కిరణ్ జార్జి మాత్రమే బరిలో ఉన్నాడు.

యశ్వర్ధన్‌కు 'డబుల్'


యశ్వర్ధన్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: అఖిల భారత ఛాంపియన్‌షిప్ సిరీస్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ కుర్రాడు యశ్వర్ధన్‌రెడ్డి 'డబుల్' సాధించాడు. శుక్రవారం ముగిసిన టోర్నీలో అండర్-12 విభాగంలో పదేళ్ల యశ్వర్ధన్ సింగిల్స్, డబుల్స్ టైటిళ్లు కైవసం చేసుకున్నాడు. సింగిల్స్ ఫైనల్లో యశ్వర్ధన్ 6-4, 6-2తో అవి అగర్వాల్‌పై విజయం సాధించాడు. అంతకుముందు సెమీస్‌లో 7-5, 6-2తో ప్రణవ్‌పై గెలుపొందాడు. డబుల్స్ ఫైనల్లో యశ్వర్ధన్- ప్రణవ్ వడ్డె జోడీ 6-2, 6-0తో ఏకలవ్య- అష్రాఫ్ జంటపై నెగ్గింది.

ఎన్డీయేకు షాబాద్ సవాల్!

● బిహార్‌లో పూర్వ వైభవానికి అధికార కూటమి ప్రయత్నం

బిహార్‌లోని షాబాద్ ప్రాంతం ఎన్డీయేకు సవాల్‌గా నిలుస్తోంది. ఒకప్పటి తన కంచుకోటను మళ్లీ గెలుచుకునేందుకు ఆ కూటమి తీవ్రంగా ప్రయత్నిస్తోంది. కుష్వాహా, రాజ్‌పుత్ ప్రాబల్యమున్న ఈ ప్రాంతంలో 22 అసెంబ్లీ సీట్లున్నాయి. 2010లో 19 సీట్లను గెలుచుకున్న ఎన్డీయే.. 2020లో కేవలం 2 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేలో భాజపా 9 చోట్ల, జేడీయూ 8 చోట్ల, రాష్ట్రీయ లోక్‌మంచ్ (ఆర్ఎల్ఎం) 2 చోట్ల, లోక్ జనశక్తి (రామ్‌విలాస్) 3 చోట్ల పోటీ చేస్తున్నాయి. కుష్వాహాల్లో పట్టున్న ఆర్ఎల్ఎం అధినేత ఉపేంద్ర కుష్వాహా సతీమణి ససరాం నుంచి బరిలో నిలిచారు.



4 జిల్లాల్లో..

షాబాద్ ప్రాంతం నాలుగు జిల్లాల్లో విస్తరించి ఉంది. రోహ్‌తాస్, బక్సర్, కైమూర్, భోజ్‌పుర్ జిల్లాలు ఇందులో ఉన్నాయి.

● బక్సర్, భోజ్‌పుర్‌లలో నవంబరు 6న, కైమూర్, రోహ్‌తాస్ జిల్లాల్లో నవంబరు 11న పోలింగ్ జరగనుంది.

● గత ఎన్నికల్లో భోజ్‌పుర్ జిల్లాలోని ఆరా, బర్హరాల్లోనే భాజపా విజయం సాధించింది. జేడీయూ ఖాతా తెరవలేదు. దీంతో మళ్లీ ఇక్కడ పాగా వేయడానికి భాజపా సర్వశక్తులు ఒడ్డుతోంది.

● 2015లో ఇక్కడ ఎన్డీయే కూటమి పరాజయాల పరంపర ప్రారంభమైంది. అప్పుడు నీతీశ్, లాలూ కలిసి పోటీచేయడంతో ఈ ప్రాంతంపై ఎన్డీయే పట్టు కోల్పోయింది. 2020లో మళ్లీ జేడీయూతో కలిసి పోటీ చేసినా ఫలితం దక్కలేదు.

కుష్వాహా, రాజ్‌పుత్‌లలో చీలికతో..

ఈ ప్రాంతాన్ని ప్రభావితం చేసే కుష్వాహా, రాజ్‌పుత్ వర్గాల ఓట్లు గత లోక్‌సభ ఎన్నికల్లో చీలిపోయాయి. ఈ రెండు వర్గాల ఓట్లు గణనీయంగా ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతంలోని నాలుగు లోక్‌సభ సీట్లను ఎన్డీయే కోల్పోయింది.

● ఓబీసీల్లో యాదవ్‌ల తర్వాత ఈ ప్రాంతంలో కుష్వాహాలే అతి పెద్ద వర్గం. వారిపైనే ఇప్పుడు ఎన్డీయే దృష్టి సారించింది. అయితే గత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన కుష్వాహా నేత ఉపేంద్ర కుష్వాహా మూడో స్థానంలో నిలిచారు. ఆ వర్గంలోని ఓట్ల చీలికే దీనికి కారణం.

● రాష్ట్రంలోని కుష్వాహా వర్గం వారి ఓట్లే లక్ష్యంగా ఈసారి ఆర్ఎల్ఎంకు భాజపా.. 6 సీట్లిచ్చింది. అందులో రెండు షాబాద్ ప్రాంతంలో ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్ఎల్ఎంకు ప్రాతినిధ్యమే లేదు.

● షాబాద్ ప్రాంతంలో ప్రాబల్యమున్న భగవాన్ సింగ్ కుష్వాహాను జేడీయూ అధినేత నీతీశ్ కుమార్ ప్రోత్సహిస్తున్నారు. ఆయనకు ఇప్పటికే ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. మళ్లీ భోజ్‌పుర్‌లోని జగదీశ్‌పుర్ అసెంబ్లీ సీటు నుంచి బరిలోకి దింపారు.

● రాజ్‌పుత్‌లను ఆకర్షించేందుకు భోజ్‌పురి నటుడు పవన్ సింగ్‌ను భాజపా.. పార్టీలో చేర్చుకుంది. అయితే ఆయన ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. ఆయనను తన ప్రచార తారల జాబితాలో చేర్చింది.

● అభ్యర్థుల ఎంపికలోనూ కుల, మత అంశాలను ప్రాతిపదికగా ఎన్డీయే తీసుకుంది. కైమూర్‌లో ఆర్జేడీ నుంచి ఇద్దరు నేతలకు టికెట్లిచ్చింది.

సంస్థాగత బలోపేతం దిశగా భాజపా

ఈసారి ఎన్నికల్లో ఎలాగైనా ఈ ప్రాంతంపై పట్టు సాధించాలని భాజపా ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే ఈ ప్రాంతానికి చెందిన 100 మంది నేతలను పార్టీ వర్కింగ్ కమిటీలో చేర్చింది. పలువురు రెబల్ నేతలను రాష్ట్ర కమిటీలోకి తీసుకుంది. మరికొంత మంది నేతలను వివిధ కమిషన్లలో, బోర్డుల్లో నియమించింది.

పట్టు నిలబెట్టుకోవాలని ఇండియా కూటమి

ఈసారి ఎన్నికల్లో 11 చోట్ల ఆర్జేడీ, ఐదేసి చోట్ల కాంగ్రెస్, సీపీఐ (ఎంఎల్-లిబరేషన్) పోటీ చేస్తున్నాయి. ఒక్కో చోట సీపీఐ, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ బరిలో నిలిచాయి. గత ఎన్నికల్లో 19 సీట్లు గెలుచుకున్న ఇండియా కూటమి ఈసారి సత్తా చాటాలని చూస్తోంది. యాదవ్‌లతోపాటు కుష్వాహా, రాజ్‌పుత్‌లలో చీలిక తమకు కలిసి వస్తుందని ఆ కూటమి భావిస్తోంది. ఇదే గత లోక్‌సభ ఎన్నికల్లోనూ ఫలించింది.

నేషనల్ డెస్క్

నా పాత మిత్రుడు.. '393' అంబాసిడర్‌తో



ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు తాను మూడు దశాబ్దాల క్రితం ఉపయోగించిన అంబాసిడర్ కారును చూసి, దాంతో అనుబంధాన్ని గుర్తుచేసుకొన్నారు. ఆయన ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 393 నంబర్ ఉన్న అంబాసిడర్ వాహన శ్రేణిలో రాష్ట్రమంతా పర్యటించేవారు. భద్రతాకారణాల రీత్యా ప్రస్తుతం ఆయన ఆధునిక వాహనాలు ఉపయోగిస్తున్నారు. అప్పటి వరకు హైదరాబాద్‌లో ఉన్న ఈ కారును ఇటీవల మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయానికి తీసుకొచ్చారు. శుక్రవారం పార్టీ ఆఫీసుకు వచ్చిన చంద్రబాబు ఈ కారును చూసి, గత స్మృతులను నెమరువేసుకున్నారు. 'నా పాత మిత్రుడు 393 అంబాసిడర్‌తో' అంటూ ఎక్స్ వేదికగా ఆ ఫొటోలు పంచుకున్నారు.

తొందరపడి టికెట్లు ఇచ్చానేమో..!

● ఎమ్మెల్యే కొలికపూడి, ఎంపీ కేశినేని చిన్ని విభేదాలపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం ● వారి వ్యవహారం తేల్చాలని క్రమశిక్షణ కమిటీకి ఆదేశం

ఈనాడు, అమరావతి: 'పార్టీ సిద్ధాంతాలు, కట్టుబాట్లు గురించి తెలియనివారికి, రాజకీయ అనుభవం లేనివారికి టికెట్లిస్తే ఇలాంటి సమస్యలే వస్తాయి. నేను కూడా తొందరపడ్డానేమో! వారి వ్యవహారశైలిని కొంతకాలం చూశాక టికెట్లు ఇవ్వాల్సింది. యువతను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో టికెట్లు ఇస్తే పార్టీ పరువు ఇలా బజారుకు ఎక్కిస్తున్నారు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) విభేదాలతో రచ్చకెక్కడంపై ఆయన మండిపడ్డారు. వారిద్దరినీ పిలిచి మాట్లాడతామని పార్టీ నాయకులు చెప్పగా.. ఎవర్నీ బతిమలాడాల్సిన పనిలేదని, తీరు మార్చుకోకపోతే ఉపేక్షించబోమని స్పష్టంగా చెప్పాలని చంద్రబాబు పేర్కొన్నారు. వారిద్దరినీ పిలిచి వివరణ తీసుకుని తనకు నివేదించాలని, లండన్ పర్యటన నుంచి తిరిగొచ్చాక వారితో మాట్లాడతానని క్రమశిక్షణ కమిటీకి చెప్పారు. ముఖ్యమంత్రి శుక్రవారం తెదేపా కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నేతలు వర్ల రామయ్య, అశోక్‌బాబు, మంతెన సత్యనారాయణరాజు, బ్యాక్ ఆఫీస్‌లోని వివిధ విభాగాలతో సమావేశం నిర్వహించారు.

పార్టీ గుర్తుపైనే గెలిచారని మర్చిపోతే ఎలా?

● పార్టీ నాయకులు పరస్పర ఆరోపణలతో మీడియాకు ఎక్కడం గతంలో ఎప్పుడూ లేదు. పార్టీ విధానాల్ని అనుసరించకుండా, సొంత ఎజెండాతో వెళ్లాలనుకున్నవారు స్వతంత్రంగా పోటీ చేస్తే వారి సత్తా ఏంటో తెలిసేది. పార్టీ టికెట్ ఇచ్చింది కాబట్టే గెలిచామని గుర్తు పెట్టుకోవాలి.

● వరద సహాయక కార్యక్రమాల్లో పాల్గొనని నాయకుల వివరాలు నాకివ్వండి. ప్రతి నాయకుడి పనితీరు, వ్యవహారశైలిని నమోదు చేస్తున్నాం.

● భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టం వివరాల నమోదు త్వరలో మొదలవుతుంది. ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులంతా తప్పనిసరిగా పాల్గొనాలి.

సీఎంఆర్ఎఫ్ లేఖలు ఇవ్వడానికీ ఎమ్మెల్యేలకు తీరిక లేదా?

పేదలకు ఉపయోగపడుతుందని ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ కింద ఉదారంగా సాయం అందిస్తుంటే కొందరు ఎమ్మెల్యేలు దానిపైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు ఎమ్మెల్యేలు అర్హులైన పేద రోగులకూ సీఎంఆర్ఎఫ్ లేఖలు ఇవ్వడం లేదన్న విషయం సీఎం దృష్టికి తేగా వారి వివరాలు తనకు ఇవ్వాలని, అలాగే అనర్హులకు లేఖలు ఇచ్చినవారి వివరాలూ అందజేయాలని, వారితో మాట్లాడతానని సీఎం పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు సిద్ధమైన తర్వాత కూడా ఎమ్మెల్యేలు వాటిని లబ్ధిదారులకు ఇవ్వకుండా దగ్గర పెట్టుకుంటున్నారని, గడువు ముగిసిపోవడంతో మళ్లీ చెక్కులు ఇవ్వాల్సి వస్తోందని సీఎం పేర్కొన్నారు. ఇలాంటి వాటిలో ఎమ్మెల్యేలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించనన్నారు. మతపరమైన, సున్నితమైన అంశాలపై ఎవరూ మాట్లాడవద్దని పార్టీ నాయకులకు సూచించారు.

మద్యం వ్యాపారానికి దూరంగా ఉండాలి

తెదేపా నాయకులు మద్యం వ్యాపారానికి దూరంగా ఉండాలని, అలాంటి వారి వల్ల పార్టీకి మరక అంటుతోందని సీఎం వ్యాఖ్యానించారు. పార్టీ కేడర్‌ను ఆర్థికంగా ఎలా బలోపేతం చేయాలన్న అంశంపై నాయకులతో చర్చించారు. మొంథా తుపానును దీటుగా ఎదుర్కోవడంలో ప్రభుత్వం చేసిన కృషిని పార్టీ పరంగా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లలేకపోయారని అసంతృప్తి వ్యక్తం చేశారు. లండన్ నుంచి తిరిగొచ్చాక పార్టీ రాష్ట్ర, జిల్లా కమిటీలను ప్రకటిస్తామని చంద్రబాబు తెలిపారు.

తిరుమల పవిత్రతను మంటగలిపిన వైకాపా నేతలు

ప్రపంచవ్యాప్తంగా భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న తితిదేలో కూడా వైకాపా నేతలు అవినీతికి పాల్పడి రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీశారని చంద్రబాబు మండిపడ్డారు. 'కల్తీ నెయ్యి వ్యవహారంతో తిరుమల పవిత్రతను మంటగలిపారు. పరకామణి నుంచి చోరీ వ్యవహారంలో వైకాపా నేతలు నిందితుల్ని కాపాడేలా వ్యవహరించడం సిగ్గుచేటు. వైకాపా నేతలు విపత్కర పరిస్థితుల్లోనూ వికృత మనస్తత్వంతో విషం చిమ్ముతున్నారు' అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

● గ్రామ, వార్డు సచివాలయాల్ని స్వర్ణాంధ్ర కేంద్రాలుగా మార్చాలన్న ప్రతిపాదనపై సమావేశంలో చర్చ జరిగింది.

నేను, లోకేశ్ వారంలో చెరో రోజు పార్టీ ఆఫీస్‌లో ఉంటాం

● విలేకర్లతో ఇష్టాగోష్ఠిలో చంద్రబాబు

ఈనాడు, అమరావతి: భవిష్యత్తులో ఎప్పుడూ తెదేపా ప్రతిపక్షంలో ఉండదని.. సుదీర్ఘకాలం అధికారంలో కొనసాగుతుందని పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. వారంలో ఒక రోజు తాను, మరో రోజు మంత్రి నారా లోకేశ్ పార్టీ కేంద్ర కార్యాలయంలో కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు. తాను గతంలో మూడు పర్యాయాలు సీఎంగా చేసిన పని విధానానికి ఇప్పటికీ చాలా తేడా ఉందన్నారు. ఇప్పుడు చేస్తున్నంత వేగంగా అప్పట్లో పని చేయలేదని పేర్కొన్నారు. శుక్రవారం మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయానికి వచ్చిన ఆయన కొద్దిసేపు విలేకర్లతో ముచ్చటించారు. మొంథా తుపాను నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని పరుగులు పెట్టించి సహాయకచర్యల్ని ముమ్మరం చేయడం, నష్ట తీవ్రతను తగ్గించడం, విపత్తు నిర్వహణకు సమర్థంగా చర్యలు తీసుకోవడాన్ని విలేకర్లు చంద్రబాబు వద్ద ప్రస్తావించారు. 'ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాలనలో వేగం పెరిగింది. ప్రభుత్వ యంత్రాంగం మొత్తాన్నీ గాడిన పెట్టాం. ఆటో పైలట్ విధానంలో ప్రభుత్వ వ్యవస్థలు పనిచేసేలా చేశాం' అని ఆయన వారితో అన్నారు.

● ప్రభుత్వం చేపట్టే ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమానికీ పార్టీ నేతలు ఓనర్‌షిప్ తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. 'పార్టీ కార్యాలయానికి వస్తే సొంతింటికి వచ్చిన భావన కలుగుతుంది. పార్టీలో ఏం జరుగుతుందో, క్షేత్ర స్థాయి పరిస్థితులేంటో తెలుస్తాయి. ఇక నుంచి వారంలో కచ్చితంగా ఒక రోజు పార్టీ ఆఫీసుకు వస్తాను. ఎమ్మెల్యేలు, కార్యకర్తలతో ఇంకా బాగా పనిచేయించేలా దృష్టి సారిస్తాను' అని చంద్రబాబు తెలిపారు.


త్వరలో తితిదేలో శ్రీవారి వైద్యసేవ

ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న డాక్టర్ల సేవలు దేవస్థానం ఆసుపత్రుల్లో అందుబాటులోకి..: ఈవో వెల్లడి

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి సేవను మరింత బలోపేతం చేసేందుకు, దేవస్థానంలోని అన్ని వైద్యశాలల్లో శ్రీవారి వైద్యసేవను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని తితిదే పరిపాలనా భవనంలో శుక్రవారం అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మంలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం శ్రీవారి సేవలకు అవకాశం కల్పిస్తున్న తరహాలోనే వైద్యనిపుణులు, సిబ్బందికి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొనే అవకాశం కల్పించాలని.. అవసరమైతే శిక్షణ అనంతరం వారి సేవలు వినియోగించుకొనేలా చూడాలన్నారు. ఇందుకు అవసరమైన ప్రత్యేక సెల్, విధివిధానాలు రూపొందించాలన్నారు. ముఖ్యంగా అశ్విని, ఆయుర్వేద, స్విమ్స్, బర్డ్, చిన్నపిల్లల ఆసుపత్రుల్లో వారి సేవలు వినియోగించుకోవాలని ఆయా విభాగాల డైరెక్టర్లకు ఈవో సూచించారు. ఎస్వీ గోసంరక్షణశాలలో గోసేవకు వీలుగానూ చర్యలు తీసుకోవాలన్నారు. చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నం, కన్యాకుమారి, బెంగళూరు తదితర ప్రాంతాల్లోని శ్రీవారి ఆలయాల్లో మొదటి విడతగా శ్రీవారి సేవను ప్రారంభించాలని, ఇందుకు అవసరమైన శిక్షణను త్వరలో ప్రారంభించాలని ఆదేశించారు.

తెలంగాణ మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణం

● హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు



ప్రమాణ స్వీకార అనంతరం అజారుద్దీన్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఈనాడు, హైదరాబాద్: భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్ (62) తెలంగాణ రాష్ట్ర మంత్రిగా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ.. అజారుద్దీన్‌తో ప్రమాణం చేయించారు. అనంతరం అజారుద్దీన్‌ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుష్పగుచ్ఛాలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు పాల్గొన్నారు.

నేడు శ్రీసత్యసాయి జిల్లాలో సీఎం పర్యటన

ఈనాడు, పుట్టపర్తి: శ్రీసత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం తలుపుల మండలంలోని పెద్దన్నవారిపల్లిలో శనివారం సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12.45 గంటలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి లబ్ధిదారులతో కొంతసేపు ముచ్చటిస్తారు. అనంతరం ప్రజావేదికలో మాట్లాడుతారు. తరువాత పార్టీ శ్రేణులతో జరిగే సమావేశానికి హాజరవుతారు.

ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగానికి నేడు కౌంట్‌డౌన్

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఆదివారం సాయంత్రం 5.26 గంటలకు ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను ప్రయోగించేందుకు ఇస్రో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ప్రయోగానికి కౌంట్‌డౌన్ ప్రక్రియ శనివారం ప్రారంభం కానుంది. రెండో ప్రయోగ వేదికకు చేరుకున్న ఈ రాకెట్ ద్వారా సీఎంఎస్-03 సమాచార ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపనున్నారు. రాకెట్ ప్రయోగానికి సంబంధించి ఇప్పటికే అన్ని పరీక్షలు పూర్తయ్యాయి. శుక్రవారం బ్రహ్మప్రకాష్ హాలులో రాకెట్ సన్నద్ధత సమావేశం నిర్వహించారు. 4,410 కిలోల బరువున్న సీఎంఎస్-03 ఉపగ్రహాన్ని జియో సింక్రొనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్(జీటీవో)లోకి ప్రవేశపెట్టనున్నారు. అనంతరం హసన్ శాస్త్రవేత్తలు ఉపగ్రహాన్ని దశల వారీగా భూమికి 36 వేల కి.మీ. ఎత్తులోని భూస్థిర కక్ష్యలోకి తరలించనున్నారు.

అధ్యాపకురాలి వేధింపులతో.. డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

విశాఖపట్నం(పెదవాల్తేరు), న్యూస్‌టుడే: అధ్యాపకురాలి వేధింపులతో డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం విశాఖలో సంచలనం రేపింది. ఎంవీపీ పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం.. ఎంవీపీకాలనీ సెక్టార్-4లో నివాసముంటున్న కోన సాయితేజ్(21) సమతా కళాశాలలో డిగ్రీ కంప్యూటర్ సైన్స్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఐదో సెమిస్టర్ పరీక్షలు రాసినప్పటి నుంచీ అతనికి అధ్యాపకురాలి నుంచి వేధింపులు మొదలయ్యాయి. మార్కులు సరిగా వేయకపోవడంతో పాటు రికార్డులు మళ్లీ మళ్లీ రాయిస్తుండటం, వాట్సప్‌లో మెసేజ్‌లు పంపిస్తుండటంతో సాయితేజ్ తీవ్ర మనస్తాపం చెందాడు. ఈ విషయాన్ని శుక్రవారం మధ్యాహ్నం తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ఎంవీపీ కాలనీ స్టేషన్‌కు వెళ్లారు. అధ్యాపకురాలు పంపిన వాట్సప్ మెసేజ్‌లు చూపించి ఫిర్యాదు చేశారు. ఈ లోగా ఇంట్లో ఒంటరిగా ఉన్న సాయితేజ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూడగా కుమారుడు విగతజీవిగా ఫ్యాన్‌కు వేలాడుతుండటం చూసి, గుండెలవిసేలా విలపించారు. ఎంవీపీ స్టేషన్ సీఐ ప్రసాద్ ఘటనాస్థలికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. సాయితేజ్ ఆత్మహత్యకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సహచర విద్యార్థులు కళాశాలలో ఆందోళనకు దిగారు. సాయితేజ్ మంచి విద్యార్థి అని, అధ్యాపకురాలి వేధింపుల వల్లే చనిపోయాడని ఆరోపించారు.



తెదేపా కేంద్ర కార్యాలయానికి వచ్చిన దివ్యాంగుడి దగ్గరికి వెళ్లి సమస్య తెలుసుకుంటున్న సీఎం చంద్రబాబు

అండగా ఉంటా.. ఉద్యోగం ఇప్పిస్తా

● ప్రమాదంలో రెండు చేతులూ కోల్పోయిన యువకుడికి సీఎం భరోసా

ఈనాడు, అమరావతి: చిన్నతనంలో విద్యుదాఘాతంతో రెండు చేతులూ కోల్పోయిన విజయవాడకు చెందిన దుర్గారావు అనే యువకుడికి ఉద్యోగం ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారుల్ని సీఎం చంద్రబాబు ఆదేశించారు. గతంలో మిమ్మల్ని కలవగా ఉద్యోగం ఇస్తానని హామీ ఇచ్చారని ఆ యువకుడు సీఎంకు గుర్తుచేశాడు. 2019లో ఎన్నికల కోడ్ రావడం, తర్వాత ప్రభుత్వం మారడంతో తనకు ఉద్యోగం రాలేదని వాపోయాడు. చంద్రబాబు అతణ్ని ఓదార్చి, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. శుక్రవారం మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయానికి వచ్చిన ఆయన ప్రజలు, నాయకుల వద్దకు తానే వెళ్లి వినతులు స్వీకరించారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు, దివ్యాంగుల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పలు వినతుల్ని సంబంధిత శాఖలకు రిఫర్ చేస్తూ సంతకాలు చేశారు.

పెద్దిరెడ్డి భూ ఆక్రమణపై ఎస్టీ నేతల ఫిర్యాదు: పుంగనూరులో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గిరిజన భూముల్ని ఆక్రమించారని తెదేపా ఎస్టీ విభాగం నేతలు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. తన భూమికి దారి ఇవ్వకుండా వైకాపా నాయకుడు వేధిస్తున్నాడని రాయచోటికి చెందిన గంగాధర్ వాపోయారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన న్యూట్రిఫుల్ సెంటర్‌ను చంద్రబాబు సందర్శించారు.



చంద్రబాబుకు వినతిపత్రం అందిస్తున్న దుర్గారావు

ప్రవర్తనను ప్రశ్నించిందని.. తల్లిని చంపిన కుమార్తె

● నలుగురు బాలలతో కలిసి ఘాతుకం

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే: ఈడొచ్చిన అమ్మాయికి.. తల్లి మంచి మాటలు చెప్పడమే తప్పైంది. యువకులతో తిరగొద్దన్న అమ్మ మందలింపులు ఆమెకు రుచించలేదు. ఆ కోపం పట్టలేక నలుగురు స్నేహితులతో కలిసి తల్లిని కిరాతకంగా కడతేర్చింది. బెంగళూరులోని సుబ్రహ్మణ్యపుర ఠాణా పరిధిలో ఇటీవల ఓ మహిళ అనుమానాస్పద మృతిపై విచారణ చేపట్టిన పోలీసులు.. ఈ దారుణాన్ని వెలుగులోకి తెచ్చారు. నగరానికి చెందిన ఓ మహిళ(35) తన కుమార్తె(15) కట్టుతప్పి ప్రవర్తిస్తున్నట్లు గమనించి ఇటీవల తీవ్రంగా మందలించింది. తల్లిపై పగ పెంచుకున్న ఆ బాలిక అక్టోబరు 25న 17 ఏళ్ల లోపు వయస్సున్న నలుగురు స్నేహితులను తన ఇంటికి పిలిపించుకుంది. పక్క గదిలో నిద్రపోతున్న ఆ మహిళ పిల్లల విపరీత నవ్వులకు లేచింది. లోపలికి వెళ్లి చూడగా నలుగురు బాలలతో కలిసి తన కుమార్తె అభ్యంతరకర స్థితిలో ఉన్నట్లు గుర్తించి, మందలించింది. అప్పటికే పథకం వేసుకున్న వారంతా ఆమెను చుట్టుముట్టి, నోటిని మూసి, గొంతుకు తువ్వాలుతో బిగించి హత్య చేశారు. ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు మృతదేహాన్ని చీరతో ఫ్యాన్‌కు కట్టి వేలాడదీశారు. అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. మరునాడు ఆ ఇంటికి వచ్చిన మృతురాలి సోదరి.. మృతదేహాన్ని గుర్తించి, స్థానికులు, బంధువుల సాయంతో అంత్యక్రియలకు సిద్ధమయ్యారు. అయితే తల్లి అంత్యక్రియలకు ఆ బాలిక రాకపోవడంతో అనుమానం వచ్చి, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా, హత్యోదంతం వెలుగుచూసింది. శుక్రవారం బాలిక సహా నలుగురు బాలలను రిమాండ్‌కు తరలించారు.

మళ్లీ బెంగళూరుకు జగన్

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్ శుక్రవారం మళ్లీ బెంగళూరుకు వెళ్లిపోయారు. బుధవారం అక్కడి నుంచి తాడేపల్లికి వచ్చిన ఆయన.. గురువారం వైకాపా ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లాల అధ్యక్షులతో తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో సమావేశం నిర్వహించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తారని ప్రచారం జరిగినప్పటికీ...శుక్రవారం ఆయన తిరిగి బెంగళూరుకు వెళ్లిపోయారు.

బస్సు నిర్వహణలో భారీగా ఉల్లంఘనలు

● కర్నూలు బస్సు ప్రమాదంలో నిర్ధారించిన రవాణాశాఖ అధికారులు

ఈనాడు, కర్నూలు: కర్నూలు శివారులో ఇటీవల ప్రమాదానికి గురైన బస్సు నిర్వహణలో వేమూరి కావేరి ట్రావెల్స్(వి.కావేరి) సంస్థ తీవ్రమైన ఉల్లంఘనలకు పాల్పడిందని కర్నూలు రవాణాశాఖ ఉన్నతాధికారులు తేల్చారు. సీట్లతో ఉన్న బస్సును కొనుగోలు చేసి దాన్ని బెర్తులుగా మార్చడం తీవ్రమైన విషయంగా పరిగణిస్తున్నారు. స్లీపర్లుగా మార్చడానికి ఏపీ, తెలంగాణ రవాణాశాఖ అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో ఒడిశాలోని రాయగఢ్ రవాణాశాఖ అధికారుల నుంచి అనుమతులు పొందారు. అనుమతులు ఎవరు ఇచ్చినా రవాణాశాఖ జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా బస్సు ఉండాలి. అనుమతులు ఇచ్చిన సమయంలో ప్రమాణాల ప్రకారం అన్ని ఏర్పాట్లు ఉన్నాయా? అన్న విషయాన్ని నిర్ధారించాలని ఒడిశా రాష్ట్ర రవాణాశాఖ అధికారులకు కర్నూలు అధికారులు లేఖ రాయగా ఇప్పటి వరకు సమాధానం రాలేదు.

ప్రధాన ఉల్లంఘనలు

● బస్సు కింది భాగంలో ప్రయాణికుల లగేజీ మాత్రమే భద్రపరచాలి. కానీ ప్రైవేటు వ్యక్తుల సరకులు, పార్శిళ్లను రవాణా చేస్తున్నట్లు అధికారులు తేల్చారు. కార్గో సేవలు అందించడానికి వి.కావేరి సంస్థ ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. కానీ అధికారికంగా బిల్లులు కూడా జారీ చేస్తోంది.

● బస్సులో మండే స్వభావం ఉన్న వస్తువులను రవాణా చేయకూడదు. 234 సెల్‌ఫోన్లను రవాణా చేశారు.

● గ్యాస్ సిలిండర్‌ను బస్సుల్లో తీసుకెళ్లకూడదన్న నిబంధన ఉన్నా.. చిన్న గ్యాస్ సిలిండర్‌ను తీసుకెళ్లారు. ప్రమాదం జరిగిన రోజు ఆ గ్యాస్ సిలిండర్ లీకైంది.

● అత్యవసర సమయాల్లో అద్దాలను బద్దలు కొట్టడానికి సుత్తులను అందుబాటులో ఉంచలేదు.

● బస్సు కింద భాగంలో లగేజీ భద్రపరిచే ప్రాంతంలో అదనపు డ్రైవర్ పడుకోవడానికి వీలుగా ఏర్పాట్లు చేశారు. డ్రైవర్‌కు గాలి తగలడానికి వీలుగా ఒక చిన్న ఫ్యాన్ ఏర్పాటు చేశారు. అత్యవసర ద్వారాలు తెరుచుకోలేదని బస్సు ప్రమాదం నుంచి బయటపడ్డ ప్రయాణికులు చెప్పారు. డ్రైవర్ అతివేగంతో, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపాడని ఫలితంగానే ప్రమాదం జరిగిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కూడా పేర్కొన్నారు.

● మంటలను ఆర్పడానికి కనీసం రెండు అయినా అగ్నిమాపక పరికరాలు ఉండాలి. అధికారుల పరిశీలనలో అవి ఉన్న దాఖలాలు కనపడలేదు.

● బస్సు లోపల ప్రయాణికుల సౌకర్యం కోసం, బస్సు అందంగా కనిపించడానికి వీలుగా ఇష్టారాజ్యంగా ఏర్పాట్లు చేసుకున్నారు. కంపెనీతో వచ్చిన సౌకర్యాలను మార్పుచేర్పులు చేశారు.

● బస్సులో అగ్నిమాపక పరికరాలు లేవని, అధిక వోల్టేజీ హెడ్‌లైట్లు వినియోగిస్తున్నారని ఏపీ, తెలంగాణ రవాణా శాఖ అధికారులు జరిమానాలు విధించారు. అయితే ట్రావెల్స్ సంస్థ ఆయా లోపాలను సవరించలేదు.



బస్సు ప్రమాదంలో పేలిన సెల్‌ఫోన్



ప్రమాదం జరిగిన చోట స్వాధీనం చేసుకున్న గ్యాస్ సిలిండర్

13 గంటల్లోనే డీఎన్‌ఏ పరీక్షలు పూర్తి

ఫోరెన్సిక్ ప్రయోగశాల డైరెక్టర్ సహా బృందాల్ని అభినందించిన డీజీపీ హరీష్‌గుప్తా

ఈనాడు, అమరావతి: కర్నూలు శివారులో జరిగిన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాద ఘటనలో సజీవ దహనమైన వారి మృతదేహాలకు 13 గంటల వ్యవధిలో డీఎన్‌ఏ పరీక్షలు పూర్తి చేసి నివేదికలు ఇచ్చినందుకు ఏపీ ఫోరెన్సిక్ ప్రయోగశాల డైరెక్టర్ పాలరాజు, సంబంధిత బృందాల్ని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా శుక్రవారం అభినందించారు. డీఎన్‌ఏ ప్రొఫైలింగ్ వేగంగా చేయటం వల్ల మృతదేహాలను త్వరితగతిన బాధితుల కుటుంబీకులకు అందజేయటం సాధ్యపడిందని పేర్కొన్నారు. ఘటనా స్థలంలో లభ్యమైన భౌతిక, రసాయన, జీవ నమూనాలను విశ్లేషించి.. సీన్ రీక్రియేషన్‌లోనూ ఫోరెన్సిక్ బృందాలు కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. ఫోరెన్సిక్ విశ్లేషణలో భాగస్వామ్యమైన 16 బృందాల్లోని సభ్యులకు డీజీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రశంసాపత్రాలు అందజేశారు.



ఫోరెన్సిక్ బృందాలతో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా. చిత్రంలో ఫోరెన్సిక్ ప్రయోగశాల డైరెక్టర్ పాలరాజు, శాంతిభద్రతల విభాగం అదనపు డీజీ మధుసూదన్‌రెడ్డి

చీతాల చిత్రం
రూ.119 కోట్లు



మొఘలుల కాలానికి చెందిన ఓ ప్రఖ్యాత సూక్ష్మ పెయింటింగ్ లండన్‌లోని క్రిస్టీస్ వేలంలో రికార్డు ధరకు అమ్ముడుపోయింది. మొఘల్ చక్రవర్తి అక్బర్‌కు ఎంతో ఇష్టమైన చిత్రకారుడు 'బసావన్' వేసిన 1575-80 కాలంనాటి "ఏ ఫ్యామిలీ ఆఫ్ చీతాస్ ఇన్ ఏ రాకీ ల్యాండ్‌స్కేప్" అనే పెయింటింగ్ 10,245,000 పౌండ్లు (దాదాపు రూ.119.49 కోట్లు) పలికి అత్యంత ఖరీదైన భారత శాస్త్రీయ పెయింటింగ్‌గా రికార్డు సృష్టించింది. అంచనా కంటే 14 రెట్లు అధిక ధరకు అమ్ముడుపోయింది. మార్చిలో న్యూయార్క్ వేదికగా జరిగిన క్రిస్టీస్ వేలంలో ఎం.ఎఫ్.హుస్సేన్ గీసిన 'గ్రామ్ యాత్ర' పెయింటింగ్ 13.75 మిలియన్ డాలర్ల(రూ.121.99 కోట్లు)కు అమ్ముడుపోయిన విషయం తెలిసిందే. అక్టోబరు 28న జరిగిన లండన్ వేలంలో ప్రిన్స్, ప్రిన్సెస్ సద్రుద్దీన్ ఆగాఖాన్‌ల సేకరణల్లోని భారత్, ఒట్టమాన్, పర్షియన్ దేశాలకు చెందిన ప్రముఖ చిత్రకారుల 95 పెయింటింగులను ప్రదర్శించారు. ఇవి దాదాపు రూ.533.79 కోట్లకు అమ్ముడుపోయాయి. -దిల్లీ



'15 రోజుల్లో తెల్లగా మారాలనుకుంటున్నారా? చర్మంపై జిడ్డుకు శాశ్వతంగా స్వస్తి చెబుతారా? మొహం మీది మొటిమలను చిటికెలో తొలగించాలా? అయితే మా సబ్బు వాడండి' అంటూ వచ్చే ఇలాంటి ప్రకటనలకు కొదవలేదు..! మరి నిజంగా సబ్బు మన రంగును మార్చగలదా? ఎలాంటి సబ్బును వాడాలి?

సబ్బు.. జబ్బు కాకుండా..!

సబ్బులు మన చర్మంపై ఉన్న మురికి, మలినాలు, సూక్ష్మజీవులు తొలగించడానికి, శరీరాన్ని శుభ్రంగా, తాజాగా ఉంచడానికి, కొన్ని చర్మ సమస్యలు తొలగించడానికి సహాయపడతాయి. కానీ, ఇప్పుడు మార్కెట్‌లోకి వస్తోన్న కొన్ని సబ్బులు శరీర వర్ణాన్ని మార్చకపోగా.. దుష్ప్రభావాలతో కొత్త సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. దీంతో చాలామంది బాధితులు చర్మ వైద్యుల చుట్టూ తిరుగుతున్నారు. శీతాకాలం సమీపిస్తోన్న తరుణంలో శరీర సంరక్షణకు మరిన్ని జాగ్రత్తలు అవసరం. ఈ క్రమంలో.. అసలు ఏ రకం సబ్బు వాడాలి? ముఖానికి, శరీరానికి వేరువేరుగా వాడాలా? ఒకటే వాడాలా?.. ఇలా సవాలక్ష ప్రశ్నలు.

రంగును నిర్ణయించేది జన్యువులు

సబ్బు వాడితే చర్మం తెల్లగా మారుతుందా? అంటే కాదనే అంటున్నారు... నిపుణులు. ఏ రంగుతో పుట్టామో.. జీవితాంతం అదే ఉంటుంది. శరీర వర్ణం జన్యువుల ఆధారంగా వస్తుంది ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, జాగ్రత్తలతో చర్మం నిగనిగలాడుతూ.. ఆకర్షణీయంగా కనిపిస్తుంది తప్పితే... పూర్తిగా రంగుమారదు.

చర్మానికో రకం..!

మనది ఏ తరహా చర్మమో తెలుసుకొని... దానికి తగ్గట్టు సబ్బును ఎంచుకోవాలి

● పొడిచర్మం ఉంటే..: అలోవేరా, కొబ్బరినూనె, ఆల్మండ్, ఆలివ్ ఆయిల్, షియా బటర్, కోకో బటర్, గ్లిజరిన్, హైల్‌రోనిక్ యాసిడ్ వంటివి ఉన్న మాయిశ్చరైజింగ్ సోపుల్ని వాడాలి. ఇవి తేమను కాపాడతాయి. చర్మం బిగుసుకుపోకుండా, పొలుసులుగా మారకుండా నిరోధిస్తాయి. వీటిని ఏ చర్మం ఉన్నవారైనా శీతాకాలంలో వాడొచ్చు.

● జిడ్డు చర్మం, మొటిమలు ఉంటే..: గ్లైకోలిక్ యాసిడ్, సాలిసిలిక్ యాసిడ్, యాక్టివేటెడ్ చార్‌కోల్, టీ ట్రీ ఆయిల్ వంటి పదార్థాలు ఉన్న సబ్బులు వాడాలి. ఇవి మన చర్మం మీద ఏర్పడే అదనపు తైలాల్ని తొలగిస్తాయి. స్వేద రంధ్రాల్ని శుభ్రం చేస్తాయి. సాలిసిలిక్ యాసిడ్ ఉండే క్లెన్సింగ్ సబ్బులు, యాంటీ బాక్టీరియల్, లావెండర్, చమోమిలే, క్రైమ్ సబ్బులు వాడటం మంచిది. డాక్టర్ల పర్యవేక్షణ, సలహా మేరకే వీటిని వినియోగించాలి. ఎక్కువగా వాడకూడదు.



● మీది సున్నిత చర్మమా..? లిక్విడ్ ఫ్రీ క్లెన్సర్స్ వాడితే మంచిది. వీటిలో గాఢ రసాయనాలు ఉండవు. గ్లిజరిన్ బేస్డ్, సెటైల్ ఆల్కహాల్, స్టెరైల్ ఆల్కహాల్, ప్రొపిలిన్ గ్లైకాల్ వంటి కాంపోనెంట్స్ ఉంటాయి. ఇవి శరీరంలోని తేమను తొలగించవు. చర్మం పాడుకాకుండా ఉంచుతాయి. ఓట్‌మీల్, గోట్స్ మిల్స్ వంటి సున్నిత పదార్థాలు ఉన్న ఫ్రాగ్రెన్స్ ఫ్రీ సబ్బుల్ని ఎంచుకోవాలి. కఠిన రసాయనాలు ఉన్న వాటిని దూరంగా ఉంచాలి. హెర్బల్ సోప్స్ కూడా మంచివి.

● సాధారణ చర్మం ఉన్నవారు: కొబ్బరి నూనె, అలోవేరా తదితర సహజ పదార్థాలతో చేసే సబ్బులు మంచి ఎంపిక.


ఎలా ఎంచుకోవాలి?

● సబ్బులు కొనే ముందు వాటిలో ఏ పదార్థాలు వాడారో చూడాలి. మన చర్మతత్వానికి సరిపోయే దాన్ని ఎంచుకొని... దీర్ఘకాలం వాడొచ్చు. ముఖానికి, శరీరానికి ఒకే సబ్బు వాడినా పెద్దగా సమస్య ఉండదు.

● సబ్బు టీఎఫ్‌ఎం (టోటల్ ఫ్యాటీ మ్యాటర్) కనీసం 76 శాతం ఉండే వాటిని సమర్థవంతమైనవిగా భావిస్తారు. సబ్బు కొనే ముందూ వీటిని పరిశీలించాలి.

● టాక్సిక్ కెమికల్స్, స్ట్రాంగ్ డిటర్జెంట్లు, ఆల్కహాల్, పెట్రోలియం ఉత్పత్తులు, గాఢ రసాయనాలు, సల్ఫేట్లు, పారబిన్స్, కృత్రిమ రంగులు, కృత్రిమ ఫ్రాగ్రెన్స్ తదితరాలు ఉండేవి ఎంచుకోవద్దు.

● గాఢ సబ్బులు ఎక్కువగా వాడితే చర్మం తేమను కోల్పోయి పొడిబారే ప్రమాదముంది.



- ఈనాడు, అమరావతి

అనాథల పెళ్లికి.. అధికారులే పెద్దలయ్యారు



సాధారణంగా కుటుంబ, సభ్యులు, బంధుమిత్రులు పెళ్లి పెద్దలుగా వ్యవహరిస్తుంటారు. ప్రేమవివాహాలు కాకపోతే.. సంబంధాలూ వారే చూస్తుంటారు. కర్ణాటకలోని దావణగెరె జిల్లా రామనగరలోని రాష్ట్ర మహిళా సంక్షేమ నిలయంలో ఉంటున్న శాలిని, రుచిత, రక్షిత అనే యువతుల వివాహం మాత్రం ఆసక్తికరంగా సాగింది. దావణగెరె జిల్లా పాలన యంత్రాంగమే వారి వివాహం చేయించడం ఇక్కడ ప్రత్యేకం. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన వీరి వివాహం చేయించేందుకు అధికారులే సంబంధాలు చూశారు. ఆపై అప్పగింతల వరకు వారే బాధ్యత చేపట్టారు. శాలినిని నాగరాజ్‌కు, రక్షితను బసవరాజ్‌కు, రుచితను ప్రవీణ్ అనే యువకుడికిచ్చి శుక్రవారం ఉదయం 11.30 గంటలకు వివాహం చేయించారు. ఇందుకు సంబంధించిన అన్ని ఖర్చులను అధికారులు భరించారు. జిల్లా పంచాయతీ సీఈఓ మాధవ గిత్తె విఠలరావు, ఎస్పీ ఉమా ప్రశాంత్ పెళ్లిపెద్దలుగా మారిన ఈ వేదికపై అధికారులే కన్యాదానం చేయడం విశేషం.

- న్యూస్‌టుడే, దావణగెరె

జగద్ధాత్రి పూజలో..
రామ్ రాబర్ట్ రహీం



పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా చందన్‌నగర్‌లో దసరా ముగిసిన నెల రోజులకు జరిగే జగద్ధాత్రి పూజకు ఓ ప్రత్యేకత ఉంది. ఈ పూజ నిర్వాహకులు హిందువులు కాగా, అక్కడి ఏర్పాట్లన్నీ క్రిస్టియన్లు చేస్తారు. జగద్ధాత్రి అమ్మవారి భారీ విగ్రహం ముస్లింల పర్యవేక్షణలో తయారవుతుంది. ఈ ఏడాది ఇంతియాజ్ హుసేన్ విగ్రహ ఖర్చును భరిస్తున్నారు. ఈద్, క్రిస్మస్ వేడుకలు జరిగే మసీదు కమిటీ జాగాలోనే గత నాలుగు దశాబ్దాలుగా అమ్మవారి పూజను సైతం నిర్వహిస్తున్నారు. ఇలా మూడు మతాల ప్రజలు విరాళాల సేకరణ మొదలు అన్న సంతర్పణ, పూజలు అన్నీ కలిసే చేస్తారు. ఈ ప్రాంతంలో అన్ని మతాల పండుగలు ఇలాగే సర్వమత సమ్మేళనానికి ప్రతీకగా అందరూ కలిసే చేసుకునే సంప్రదాయం చాలా కాలంగా కొనసాగుతోందని జగద్ధాత్రి పూజ కమిటీ సభ్యుడు స్వపన్ సాహా తెలిపారు. 'మా పెళ్లయినప్పటి నుంచీ నా భర్తతో కలిసి అమ్మవారి వేడుకలో పాల్గొంటున్నా. అందరం కలిసి పూజలు చేయడం, తినడం చాలా సరదాగా ఉంటుంది'' అని కమిటీ సభ్యురాలైన మన్నత్ హుసేన్ సంతోషం వ్యక్తం చేశారు.

-ఈటీవీ భారత్

ఈశ్వరా నువ్వు బంగారం





కర్ణాటకలోని ఉడుపి నగరానికి చెందిన ఈశ్వర మల్పె గజ ఈతగాడు. నీటి అడుగునున్న చిన్న వస్తువునైనా ఓర్పుగా నేర్పుతో ఒడిసిపట్టుకురావడం ఆయన పనితనానికి నిదర్శనం. చిక్కమగళూరు జిల్లా మాగడి సమీపంలో వెళుతున్న కారు గురువారం అదుపుతప్పి చెరువులో పడిపోయింది. కారు నడుపుతున్న దావణగెరె జిల్లా మాలెబెన్నూరుకు చెందిన నగల దుకాణం యజమాని సదానంద ఈదుకుంటూ ఒడ్డుకు చేరారు. కారునూ వెలికి తీయించారు. కానీ, అందులోని రూ.50 లక్షల విలువైన ఆభరణాల సంచి కనిపించలేదు. అది చెరువులో పడి ఉంటుందని అనుమానించి.. ఈశ్వర మల్పెను పిలిపించారు. తన బృందంతో వచ్చిన ఆయన చెరువులోకి దూకి నగల సంచిని తీసుకొచ్చారు. పావుగంటలోనే నగల సంచి భద్రంగా తెచ్చి ఇవ్వడంతో ఆ యజమాని సంతోషంతో ఈశ్వరకు పారితోషికం ఇచ్చి, సత్కరించారు. నిరుడు గంగావళి నదిలో కొట్టుకుపోయిన లారీ, పది మృతదేహాలను గుర్తించడంలో ఆయన సహకరించారు. - న్యూస్‌టుడే, చిక్కమగళూరు

శ్వేతనాగుకు శస్త్రచికిత్స





గాయపడిన ఆరు అడుగుల శ్వేతనాగుకు చికిత్స చేసి దాని ప్రాణాన్ని నిలబెట్టిన ఘటన ఇది. విశాఖపట్నంలోని మల్కాపురంలో ఉన్న నేవీ క్యాంటీన్‌లో శుక్రవారం శ్వేతనాగు కనిపించడంతో నేవీ ఉద్యోగులు స్నేక్ క్యాచర్ నాగరాజుకు సమాచారం అందించారు. ఆయన వచ్చి పామును పట్టుకుని చూడగా పడగ భాగంలో గాయాలున్నాయి. వెంటనే హిందూస్థాన్ షిప్‌యార్డు కాలనీలోని పశువుల ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యాధికారి సీహెచ్ సునీల్‌కుమార్ పాముకు మత్తుమందు ఇచ్చి శస్త్రచికిత్స చేశారు. గాయానికి ఎనిమిది కుట్లు వేశారు. ఏదైనా వాహనం దానిపై ఎక్కి ఉండొచ్చని ఆయన తెలిపారు. గాయం తగ్గిన తర్వాత విడిచిపెడతామని పేర్కొన్నారు.

-న్యూస్‌టుడే, విశాఖపట్నం(మల్కాపురం)

తాతగారింట చెత్తబుట్టలో
రూ.2.5 కోట్లు!



గుజరాత్‌లోని గిర్ సోమనాథ్ జిల్లా ఉనా పట్టణానికి చెందిన ఓ మనవడికి తాతగారి ఇంట్లోని చెత్తబుట్టలో రూ.2.5 కోట్ల విలువైన షేర్ల పత్రాలు దొరికాయి. అనుకోకుండా కలిసొచ్చిన ఈ అదృష్టం ఆ కుటుంబంలో వివాదాన్ని రాజేసి కోర్టుకెక్కారు. చనిపోయిన తన తాత సాఫ్జీ పటేల్ ఇంటికి వెళ్లిన మనవడు ఆ ఇంటిని శుభ్రం చేస్తుండగా.. అక్కడున్న ఓ చెత్తబుట్టలో దొరికిన ఈ పత్రాలు చూసి సంబరపడిపోయాడు. ఇంతలో ఆ షేర్లపై తనతోపాటు తండ్రికీ (సాఫ్జీ కుమారుడు) హక్కులు ఉన్నాయని తెలిసింది. నేను వారసుడినంటే.. నేనంటూ తండ్రీకొడుకుల మధ్య వాదులాట మొదలైంది. ఓ హోటలులో వెయిటరుగా పనిచేసిన సాఫ్జీ పటేల్ చనిపోయే ముందు.. ఆస్తి మొత్తానికి తన మనవడే వారసుడని పేర్కొన్నారు. కానీ, ఈ షేర్ పత్రాలపై మాత్రం మనవడితోపాటు కుమారుడు కూడా హక్కుదారుగా రాశారు. ఈ వివాదం గుజరాత్ హైకోర్టుకు చేరింది. నవంబరు 3న దీనిపై విచారణ చేపట్టే అవకాశముంది. -ఇంటర్నెట్ డెస్క్

ఒక్క ఎకరా.. 400 రకాల వరిసాగు



ఇక్కడి వరి పైరు చూశారా? ప్రతి పొలం ఇలాగే ఉంటుంది.. ఏముంది ఇందులో ప్రత్యేకం అంటారా? కనిపిస్తున్న పొలంలో ప్రతి 10 చదరపు మీటర్ల పరిధిలో ఉన్నది ఒక్కో విత్తన రకానికి చెందిన వరి. ఇలా పది, ఇరవై కాదు.. సుమారు 400 దేశవాళీ విత్తనాలు సేకరించి సాగుచేస్తున్నారు పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్లకు చెందిన రైతు, వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈవో) యాదగిరి శ్రీనివాస్. 2016 నుంచి తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విత్తనాలు సేకరించారు. శ్రీనివాస్‌కు మూడెకరాల భూమి ఉండగా రెండెకరాల్లో సాధారణ రకాలు, ఎకరంలో 400 రకాల విత్తనాలను సాగు చేస్తున్నారు. ప్రత్యేక ట్రేలలో నారు పెంచుతున్నారు. ప్రతి 10 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఒక్కో రకాన్ని నాటుతారు. పూర్తిగా జీవామృతంతోనే సాగు చేస్తున్నారు. వర్షాధారిత రకాలే కావడంతో వానాకాలంలో మాత్రమే సాగు చేస్తారు. అవసరం మేరకు విత్తనాలను భద్రపరుస్తారు. మిగిలిన విత్తనాలను కలిపి బియ్యంగా మారుస్తారు. ఏటా 15-20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని ఆయన చెప్పారు. కుటుంబ అవసరాలకు పోనూ మిగిలిన వాటిని క్వింటాలుకు రూ.8-10 వేల వరకు అమ్ముతున్నారు. ఆసక్తి ఉన్న రైతులకు ఉచితంగా విత్తనాలు అందిస్తున్నారు.

-న్యూస్‌టుడే, కమాన్‌పూర్(సెంటినరీకాలనీ)

ప్రయాణ వేంకటేశ్వరస్వామి



ఉలితో ఏళ్లకు ఏళ్లు శిలను మలిచి చేసిన శిల్పం కాదిది.. ఐదు దశాబ్దాల క్రితం చెక్కలో ప్రతిష్ఠించిన మూడచక్కని శ్రీనివాసుని రూపమిది.. 1971లో ఖమ్మంలోని రాఘవ థియేటర్ ప్రారంభ సినిమా 'శ్రీవేంకటేశ్వర మహత్యం' డాక్యుమెంటరీ విడుదలను పురస్కరించుకుని హాల్ నిర్వాహకులు సండ్ర చెక్కతో వేంకటేశ్వరుని విగ్రహాన్ని తయారు చేయించారు. తర్వాత ఆర్టీసీ అధికారుల సహకారంతో ఖమ్మం పాత బస్టాండ్‌లో ప్రతిష్ఠించారు. విగ్రహానికి రంగులు, చుట్టూ తొడుగుతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. అది మొదలు ఐదు దశాబ్దాలుగా నిత్య పూజలందుకుంటోంది. 'ప్రయాణ వేంకటేశ్వరస్వామి'గా పేరొందిన ఈ శ్రీనివాసునికి భక్తులు మొక్కులు తీర్చుకుని రాకపోకలు కొనసాగిస్తున్నారు.

-ఈనాడు, ఖమ్మం; న్యూస్‌టుడే, ఖమ్మం సారథినగర్



'పుట్ట'ను వదిలి..
పువ్వులా మెరిసి!

పుట్టగొడుగులంటే పుట్టలు, దిబ్బలపై కన్పిస్తాయి. ఇదేంటి చెట్టెక్కింది అనుకుంటున్నారా..! ఈ పుట్టగొడుగు ఫ్లూరోటస్ డ్రైనస్ జాతికి చెందింది. ఇవి ఎక్కువగా చెట్టు మొదళ్లు, కాండంపై పెరుగుతాయి. వైఎస్సార్ కడప జిల్లా యోగి వేమన విశ్వవిద్యాలయం బొటానికల్ గార్డెన్‌లో కనిపించింది. వీటిని వీల్డ్ ఓస్టర్ మష్రూమ్ అని కూడా పిలుస్తారని బొటానికల్ గార్డెన్ విభాగాధిపతి డా.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. యూరప్, ఉత్తర అమెరికా అంతటా పెరిగే ఇవి.. మన దేశంలో అరుదుగా దొరుకుతాయని, ఇవి విష పూరితం కావన్నారు. - న్యూస్‌టుడే, కడప

పలుగూ పార తోడు.. గంగమ్మ నవ్వింది చూడు





దృఢ సంకల్పానికి పట్టుదల తోడైనప్పుడు వయసు, వనరుల కొరత ఏవీ అడ్డంకులు కావు. మధ్యప్రదేశ్‌లోని టీకంగఢ్ జిల్లాలో స్వయంగా బావిని తవ్వుకొన్న గిరిజన దంపతుల ఉదంతం ఇందుకు నిదర్శనం. బడాగావ్ తహసీలు పరిధిలోని జమునియా ఖేడా గ్రామానికి చెందిన 65 ఏళ్ల దీప్‌చంద్ ఆదివాసీ, గౌరీబాయ్ దంపతులు ఐదేళ్లు శ్రమపడి బావిని తవ్వారు. ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కేందుకు తమకున్న బంజరు నేలలో బావి తవ్వుదామన్న ఆలోచన మొదట గౌరీబాయికి వచ్చింది. యంత్ర సాయం కూడా లేకుండా పలుగూ పారలతో తవ్విన ఈ బావి వారి తలరాతను మార్చేసింది. ఎర్రటి బంజరు పచ్చని మాగాణిగా మారింది. కుమారుడు నగరంలో పనులు చేసుకొంటూ ఉండగా, నలుగురు కుమార్తెల పెళ్లిళ్లు చేసిన దంపతులు సాగు ఆదాయంతో అప్పులు తీర్చే పనిలో నిమగ్నమయ్యారు. -ఈటీవీ భారత్



నాయకత్వం అంటే..

అనుచరులున్నంత మాత్రాన నాయకుడు కాలేరు. ఆ పరిస్థితి కేవలం వారిని ఆకర్షించినట్టు లెక్క. స్వాభిమానులు తమ వ్యక్తిగత ప్రతిష్ఠ కోసమే నేతలుగా వ్యవహరిస్తారు. నిజమైన నాయకులు సమష్టి లక్ష్యం కోసం తమ తోటివారి ఎదుగుదలకూ సహకరిస్తారు. నాయకత్వం అంటే జనాలను ఆకర్షించడం కాదు.. అర్థవంతమైన లక్ష్యాల కోసం బృందానికి మార్గదర్శకత్వం వహించడం.


- ఆడం గ్రాంట్, సైకాలజిస్టు

కంప్యూటర్ మేలు కదా!



ఏడాది వయసు నిండట్లేదు... కానీ ఆ చిన్ని చేతుల్లో మొబైల్ మాత్రం తప్పక ఉంటోంది. చిన్న తరగతుల పిల్లలకీ బోలెడు స్కూలు ప్రాజెక్టులు. వాటిని పూర్తిచేయాలంటే ఇంటర్నెట్ వాడక తప్పట్లేదు. ఫోన్ లేదంటే తెర కాస్త పెద్దగా ఉంటుందని ట్యాబ్లెట్ చేతిలో పెడుతున్నాం. వేలితో చక్కగా పైకీ కిందకీ నెడుతూ పోతుంటారు. నిజానికి అక్కడ వాళ్లకి చూసేదానిపై దృష్టి ఉండదు. స్క్రోలింగ్ మీదే ధ్యాస ఉంటుంది. ఇది మెదడుతోపాటు మానసిక సమస్యలకీ దారితీస్తుంది అంటున్నాయి అధ్యయనాలు. అసలే టెక్నాలజీ వెనక పరుగులు పెడుతున్న తరాలివి. దీంతో సాంకేతికత ఏమాత్రం పరిచయం లేకపోయినా వెనకపడుతున్నారేమో అన్న కంగారు అమ్మానాన్నలది. పిల్లలకు నిజంగా నేర్పించాలి అంటే... కంప్యూటర్ మేలంటున్నారు నిపుణులు. ఇక్కడ ఏది కావాలన్నా కీబోర్డు, మౌస్ ఉపయోగించక తప్పదు. కీబోర్డు కీలను నొక్కడం, మౌస్‌తో కంట్రోల్ చేయడం వంటివాటికి కన్ను, చేయి సమన్వయం కావాలి. పడుకుని, సోఫాలో జారగిలబడి కూర్చునే వీలు కంప్యూటర్‌తో సాధ్యమవదు. ఒక్కచోట కుదురుగా కూర్చోవాలి. ప్రభావవంతంగా కీబోర్డుని ఉపయోగించడం, ఫైల్స్ దాచడం, సేవ్ చేసుకోవడం వంటివన్నీ నేర్చుకుంటూ ఉంటారు కదా! ఒకసారి కంప్యూటర్ ముందు కూర్చోగానే మనసంతా నేర్చుకోవడం, కొత్తవి సృష్టించడం మీదే లగ్నమవుతుంది. దీంతో ఏకాగ్రతే కాదు మోటార్‌స్కిల్స్ కూడా మెరుగుపడతాయి. అయితే ఇక్కడా యూట్యూబ్‌నే తీసి చూస్తే లాభం లేదు. పెయింటింగ్, లెర్నింగ్, గేమింగ్ యాప్‌లను ప్రయత్నించొచ్చు. పిల్లలూ కోడింగ్ నైపుణ్యాలు నేర్చుకుంటున్న రోజులివి. వాటిలోనైనా చేర్పొచ్చు. కంప్యూటర్ ఉపయోగించి ప్రాజెక్టులు చేసే క్రమంలో వాళ్లు చేసే పరిశోధన పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్నీ పెంచుతుంది. మంచిదే అన్నారు కదా అని గంటలకొద్దీ దీని ముందూ కూర్చోబెట్టొద్దు. దీనికీ పరిమితి ఉండాలి. పిల్లలు ఏం చూస్తున్నారు? ఏం నేర్చుకుంటున్నారన్న పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉండాలి. -వసుంధర డెస్క్

తప్పు దిద్దుకోలేని ఆ క్షణం!



రోజూ వెళ్లే రోడ్డే కదా... రోజూ దాటే జంక్షనే కదా... అన్న నిర్లక్ష్యమో... ఏమో కానీ సెల్‌ఫోన్ వాడుతూ కొందరు... అడ్డగోలు డ్రైవింగ్‌తో మరికొందరు... నిబంధనలు తోసిరాజని ఇంకొందరు... ప్రమాదాలకు కారణమవుతున్నారు. నిలువెల్లా నిర్లక్ష్యం ఆవరించిన ఒక్క క్షణం కొంప ముంచేస్తుంది.. గుర్తుపెట్టుకోండి. సిగ్నళ్లు, జంక్షన వద్ద ఆగడానికైనా... వాటిని దాటడానికైనా కొన్ని నిబంధనలు ఉన్నాయి.. అనుసరిస్తే అందరికీ మేలు!

ఎడమవైపు ఆగి.. కుడి వైపు పయనమా?

☛ కూడలిలో నిబంధనలనుబట్టి కొన్నిచోట్ల నేరుగా ముందుకు వెళ్లడానికి, కుడి, ఎడమల వైపు వెళ్లడానికి సిగ్నలింగ్ వ్యవస్థ ఉంటుంది.

☛ కొందరు కూడలిలో తమ బండికి ఖాళీ లేదని పూర్తిగా ఎడమవైపు ఆగి గ్రీన్‌సిగ్నల్ పడ్డాక కుడివైపు వెళ్లే ప్రయత్నం చేస్తారు.

☛ అప్పటివరకు కూడలి వద్ద నిరీక్షించిన వాహనదారులు సిగ్నల్ పడ్డాక ఒక్కసారిగా వేగంగా ముందుకు వచ్చేస్తారు. ఇలా అడ్డదిడ్డంగా వచ్చే వాహనాలతో ప్రమాదం పొంచి ఉంటుంది.


పాదచారులను చూస్తున్నా రా..?

☛ పాదచారులు దాటేందుకు రోడ్లపై జీబ్రా లైన్లుంటాయి. అక్కడ తప్పనిసరిగా వేగం తగ్గించాలి. కొందరు వాటిని గుర్తించకుండా వెళుతుంటారు.

☛ రోడ్డు దాటేవాళ్లు దగ్గరగా ఉంటే వేగాన్ని నియంత్రించడం కష్టం అవుతుంది, కాబట్టి జీబ్రా లైన్లను ముందే గుర్తించి వేగాన్ని తగ్గించుకోవాలి.



నియంత్రణ లేని వేగం



☛ కూడళ్ల దగ్గర వేగం తగ్గించకుండా దూసుకుపోయే వాళ్లను మనం చూస్తుంటాం. రెడ్ సిగ్నల్ పడ్డా పట్టించుకోకపోతే, ఎదురుగా వచ్చే వాహనాలతో ప్రమాదం పొంచి ఉంటుంది.

☛ కుడి వైపు, ఎడమవైపు మళ్లేటప్పుడు సిగ్నల్ సరిగ్గా ఇవ్వాలి. ఒకవైపు సిగ్నల్ ఇచ్చి మరోవైపు వెళ్లడం, అసలు సిగ్నలే ఇవ్వకపోవడం.. రెండూ అపాయకరమే. మరోవైపు వెళ్లేందుకు వేగం తగ్గిస్తాం. కానీ వెనకాల వాహనాలు వేగంగా వచ్చేస్తాయి. ఈ సమయంలో సిగ్నల్ తప్పుగా ఇస్తే వాహనాలు ఢీ కొనొచ్చు.

లేన్ మార్పులు... పొగమంచు

☛ ఓఆర్ఆర్, జాతీయ రహదారుల్లో ఒక్కోవైపు నాలుగైదు లేన్లు ఉంటాయి. ఒక లేన్ నుంచి మరోదాంట్లోకి మారేటప్పుడు వెనుక నుంచి వచ్చే వాహనాల వేగాన్ని గమనిస్తూ సిగ్నల్ ఇచ్చి మారాలి.

☛ చలికాలం మొదలైంది. ఉదయం వేళల్లో పొగమంచు ఉంటుంది. కొన్నిచోట్ల సిగ్నళ్లు ఉన్నా సరిగా పనిచేయవు. ఇవన్నీ డ్రైవింగ్ చేసేవారిని గందరగోళానికి గురిచేస్తుంటాయి. వీటిని గమనంలోకి తీసుకోవాలి.



ఎప్పుడు ఆగాలి.. వెళ్లాలి..?



☛ రెడ్ సిగ్నల్ పడగానే ఆగాలి. ముందు ఆగిన వాహనానికి కొంచెం దూరాన్ని పాటించాలి.

☛ రెడ్ నుంచి ఎల్లో, ఆ తర్వాత గ్రీన్ రంగులోకి మారినప్పుడు వాహనాన్ని మెల్లగా ముందుకు నడపాలి.

☛ కొందరు సమయం కలిసివస్తుందనో, దూరం తగ్గుతుందనో ఆపోజిట్ డైరెక్షన్‌లో వెళుతుంటారు. ఇది చాలా ప్రమాదకరం.

మొబైల్ చూడొద్దు...

☛ కొన్ని కూడళ్ల దగ్గర రెడ్‌సిగ్నల్ పడ్డాక సమయం ఉంది కదా అని కొందరు మొబైల్ తీసి మాట్లాడుతుంటారు. మెసేజ్‌లు పెడుతుంటారు. వీడియోలు చూసేవాళ్లూ ఉన్నారు.

☛ ఇలా చేయడం వల్ల వెనుక వాహనదారులు వేగంగా దూసుకొచ్చినప్పుడు ప్రమాదాలు జరగొచ్చు. డ్రైవింగ్‌లో మొబైల్ వాడకం మీ ఏకాగ్రతను తీవ్రంగా దెబ్బతీస్తుంది.

☛ మరికొందరు డ్రైవింగ్ చేస్తూనే మొబైల్‌ను చెక్ చేస్తూ, మెసేజ్‌లు పెడుతుంటారు. ఇది వారికే కాకుండా ఇతరులకూ ప్రాణాంతకం కావచ్చు.



" సిగ్నళ్ల దగ్గర నిబంధనలు పాటించకపోవడం, సరిగా అర్థం చేసుకోకపోవడం వల్ల మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకూ ముప్పు ఉంటుంది. ఓ నిమిషం సమయాన్ని ఆదా చేసుకునే క్రమంలో చేసే తప్పులు జీవితకాల నష్టాన్ని మిగులుస్తాయి.

- ఈనాడు, హైదరాబాద్

EENADU Vol: 52, Issue: 81 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao



క్షిపణులు.. డ్రోన్లు.. నావిగేషన్ సిస్టమ్స్

రక్షణ ఉత్పత్తుల కంపెనీలకు జోరుగా ఆర్డర్లు

హైదరాబాద్‌లో విస్తరిస్తున్న పరిశ్రమలు

ఈనాడు – హైదరాబాద్

హైదరాబాద్ కేంద్రంగా రక్షణ ఉత్పత్తుల రంగం వేగంగా విస్తరిస్తోంది. ఈ విభాగంలో ఇప్పటికే పలు కంపెనీలు ఇక్కడ కార్యకలాపాలు సాగిస్తుండగా, కొత్తగా మరిన్ని ఏర్పాటవుతున్నాయి. క్షిపణులు, డ్రోన్లు, నావిగేషన్ సిస్టమ్స్, ట్రైనింగ్ సిస్టమ్స్, విడిభాగాలను ఈ కంపెనీలు అందిస్తున్నాయి. రక్షణ ఉత్పత్తుల కోసం ఎన్నో ఏళ్లుగా ఇజ్రాయెల్, ఫ్రాన్స్, రష్యా, అమెరికాపై ఆధారపడిన మనదేశం.. ఆయా దేశాల కంపెనీల నుంచి ఆయుధాలు, ఆయుధ సామగ్రి, యుద్ధ విమానాలు కొనుగోలు చేస్తూ వచ్చింది. దేశీయంగా రక్షణ ఉత్పత్తుల తయారీ సామర్థ్యాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాలు రూపొందించి, కొన్ని ప్రోత్సాహకాలు ప్రకటించిన ఫలితంగా నాలుగైదేళ్లుగా మార్పు వేగవంతమైంది. ఈ క్రమంలోనే స్థానిక కంపెనీలకు రక్షణ శాఖ, రక్షణ సంస్థల నుంచి ఆర్డర్లు లభిస్తున్నాయి.

ఈ కంపెనీలకు..: రక్షణ శాఖకు చెందిన డీఆర్‌డీఓ (రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ) విభాగాలు హైదరాబాద్‌లో పెద్దఎత్తున విస్తరించి ఉన్నాయి. అదనంగా బీడీఎల్ (భారత్ డైనమిక్స్ లిమిటెడ్), మిధాని, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్నాయి. ఇవన్నీ ప్రభుత్వ రంగ రక్షణ ఉత్పత్తుల సంస్థలే. ఈ సంస్థల మద్దతుతో ప్రైవేటు రంగంలో ఎన్నో సంస్థలు స్థానికంగా ఏర్పాటయ్యాయి. ఇవి నెమ్మదిగా విస్తరించి, ఇప్పుడు అభివృద్ధి పరుగు అందుకుంటున్నాయి. ఇందులో కొన్ని కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు కాగా, మరికొన్ని ప్రైవేటు సంస్థలుగానే కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఇక్కడ కొలువుదీరిన జెన్ టెక్నాలజీస్, అవాంటెల్, అస్త్ర మైక్రోవేవ్, అపోలో మైక్రో సిస్టమ్స్.. తదితర కంపెనీలకూ ఆర్డర్లు ఎక్కువగా వస్తున్నాయి. ట్రైనింగ్ సిస్టమ్స్, యాంటీ-డ్రోన్ సిస్టమ్స్ అందించే జెన్ టెక్నాలజీస్‌కు రక్షణ శాఖ నుంచి తాజాగా రూ.289 కోట్ల ఆర్డర్ లభించింది. డ్రోన్ టెక్నాలజీ ఆధునికీకరణకు వచ్చిన ఈ ఆర్డర్‌ను, ఏడాది కాలంలో పూర్తి చేయాల్సి ఉంటుంది. అస్త్ర మైక్రోవేవ్‌కు రూ.285.56 కోట్ల ఆర్డర్ లభించింది. భారత వాయుసేనలోని స్పెషల్ ఫోర్సెస్ అవసరాలకు అనుగుణంగా కమ్యూనికేషన్ సిస్టమ్స్, విడిభాగాలను 11 నెలల వ్యవధిలో ఈ సంస్థ సరఫరా చేయాలి. అవాంటెల్ సిస్టమ్స్‌కు ఇటీవల పలు చిన్న, మధ్యస్థాయి ఆర్డర్లు లభించాయి. కొన్ని పెద్ద ఆర్డర్ల కోసం ఈ సంస్థ ఎదురు చూస్తున్నట్లు మార్కెట్ వర్గాల్లో ప్రచారంలో ఉంది. స్టాక్‌మార్కెట్లో నమోదు కాని, చిన్న- మధ్యస్థాయి రక్షణ ఉత్పత్తుల సంస్థలు సైతం ఆకర్షణీయ ఆర్డర్లు సంపాదిస్తున్నాయి. దీనివల్ల కొత్తగా ఉద్యోగాల కల్పన సాధ్యమవుతోంది.



స్థానిక కంపెనీలకు తాజాగా లభించిన ఆర్డర్లు

కంపెనీ	ఆర్డర్ విలువ(రూ.కోట్లు)	ఈ విభాగం నుంచి
జెన్ టెక్నాలజీస్	289	రక్షణ శాఖ
అస్త్ర మైక్రోవేవ్ ప్రొడక్ట్స్	285.56	భారత వాయుసేన
ఎంటార్ టెక్నాలజీస్	27.17	ఒక అంతర్జాతీయ సంస్థ
అపోలో మైక్రో సిస్టమ్స్	18.43	డీఆర్‌డీఓ

ఏసీసీ లాభం అయిదు రెట్లు

సిమెంటు తయారీ అగ్రగామి సంస్థ ఏసీసీ లిమిటెడ్, సెప్టెంబరు త్రైమాసికానికి రూ.1119.26 కోట్ల ఏకీకృత నికరలాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.199.7 కోట్ల కంటే ఇది అయిదు రెట్ల కంటే అధికం. ఏకీకృత ఆదాయం కూడా రూ.4542.23 కోట్ల నుంచి రూ.5896.16 కోట్లకు పెరిగింది. ఇదే సమయంలో వ్యయాలు రూ.4473.67 కోట్ల నుంచి రూ.5393.42 కోట్లకు చేరాయి. సిమెంటు, అనుబంధ కార్యకలాపాల ఆదాయం రూ.4373.41 కోట్ల నుంచి రూ.5519.18 కోట్లకు; రెడీమిక్స్ కాంక్రీట్ విభాగ ఆదాయం రూ.289.1 కోట్ల నుంచి రూ.453.62 కోట్లకు వృద్ధి చెందింది.

67% పెరిగిన పతంజలి ఫుడ్స్ లాభం

పతంజలి ఫుడ్స్, సెప్టెంబరు త్రైమాసికంలో రూ.516.69 కోట్ల ఏకీకృత నికరలాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.308.58 కోట్ల కంటే ఇది 67% అధికం. మొత్తం ఆదాయం రూ.8132.76 కోట్ల నుంచి రూ.9850.06 కోట్లకు పెరిగింది.

అమెరికాకు ఎవెరోలిమస్ 1 ఎంజీ ట్యాబ్లెట్: నాట్కో

ఈనాడు, హైదరాబాద్: ఎవెరోలిమస్ 1 ఎంజీ ట్యాబ్లెట్‌ను అమెరికాలో విడుదల చేయనున్నట్లు నాట్కో ఫార్మా ప్రకటించింది. ఇమ్యునోసప్రెసంట్ విభాగానికి చెందిన ఈ ఔషధాన్ని 'జోర్‌ట్రెస్' అనే బ్రాండు పేరుతో నొవార్టిస్ విక్రయిస్తోంది. మూత్రపిండాలు, కాలేయ మార్పిడి చేయించుకున్న వారికి 'ఆర్గాన్ రిజెక్షన్' సమస్యలు తలెత్తకుండా ఈ మందు వినియోగిస్తున్నారు. నాట్కో ఫార్మాకు అమెరికాలోని మార్కెటింగ్ భాగస్వామి అయిన బ్రికెన్‌రిడ్జ్ ఫార్మాస్యూటికల్ ఇంక్., అనే సంస్థ ఎవెరోలిమస్ 1 ఎంజీ ట్యాబ్లెట్‌ను అమెరికాలో పంపిణీ చేస్తుంది. ఈ సంస్థ ఎవెరోలిమస్ 0.25ఎంజీ, 0.5ఎంజీ, 0.75 ఎంజీ ట్యాబ్లెట్‌లను ఇప్పటికే అమెరికాలో విక్రయిస్తోంది. ఇప్పుడు విడుదల చేసిన 1 ఎంజీ ట్యాబ్లెట్‌తో అన్ని డోసుల్లో ఈ మందును అందిస్తున్నట్లు అవుతుంది.

8% తగ్గిన బ్యాంక్ ఆఫ్ బరోడా లాభం

బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) సెప్టెంబరు త్రైమాసికంలో రూ.4,809 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.5,328 కోట్ల కంటే ఇది 8% తక్కువ. ఆదాయం కూడా రూ.35,445 కోట్ల నుంచి రూ.35,026 కోట్లకు తగ్గింది. వడ్డీ ఆదాయం మాత్రం రూ.30,278 కోట్ల నుంచి రూ.31,511 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం రూ.11,637 కోట్ల నుంచి రూ.11,954 కోట్లకు చేరింది. స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) సెప్టెంబరు చివరికి 2.16 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలూ 0.57 శాతానికి తగ్గాయి. మొండి బాకీలకు కేటాయింపులు రూ. 2,336 కోట్ల నుంచి రూ.1,232 కోట్లకు తగ్గాయి.

కోడి గుడ్లు

1న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	570
వరంగల్	572
విజయవాడ	575
తూ/ప గోదావరి	580
విశాఖపట్నం	570
చిత్తూరు	593

నారాయణ హృదయాలయ చేతికి ప్రాక్టీస్ ప్లస్ గ్రూప్ హాస్పిటల్స్

విలువ రూ.2,200 కోట్లు




డాక్టర్ దేవీ శెట్టి

ఈనాడు వాణిజ్య విభాగం: యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ప్రాక్టీస్ ప్లస్ గ్రూప్ హాస్పిటల్స్‌ను 188.78 మిలియన్ పౌండ్ల (దాదాపు రూ.2,200 కోట్ల)కు కొనుగోలు చేయనున్నట్లు నారాయణ హెల్త్ బ్రాండ్ కింద ఆసుపత్రులను నిర్వహించే నారాయణ హృదయాలయ లిమిటెడ్ ప్రకటించింది. ప్రాక్టీస్ ప్లస్ గ్రూప్ హాస్పిటల్స్‌కు చెందిన 100% ఈక్విటీ షేర్లను నగదు రూపేణా కొనుగోలు చేయడం ద్వారా ఈ లావాదేవీని నారాయణ హెల్త్ పూర్తి చేయనుంది. 'హెల్త్ సిటీ కేమన్ ఐలాండ్స్ లిమిటెడ్ పూర్తిస్థాయి అనుబంధ సంస్థ అయిన నారాయణ హృదయాలయ యూకే లిమిటెడ్ ఈ షేర్లను కొనుగోలు చేస్తుందని' బీఎస్‌ఈకి ఇచ్చిన సమాచారంలో నారాయణ హృదయాలయ పేర్కొంది. ప్రాక్టీస్ ప్లస్ గ్రూప్ హాస్పిటల్స్ షేరు ఒక్కోటి 3146.29 పౌండ్ల చొప్పున మొత్తం 60,001 ఈక్విటీ షేర్లను 188.78 మిలియన్ పౌండ్లకు కొనుగోలు చేయనున్నట్లు వివరించింది. ఒప్పందం కుదిరిన తేదీ తర్వాత 6 పనిదినాల్లోగా ఈ లావాదేవీ ముగియనుంది.

అయిదో అతిపెద్ద ప్రైవేటు హాస్పిటల్ గ్రూప్: యునైటెడ్ కింగ్‌డమ్‌లో ప్రైవేటు రంగంలోని అయిదో అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ సంస్థ అయిన ప్రాక్టీస్ ప్లస్ గ్రూప్ హాస్పిటల్స్ ఆధీనంలో 7 ఆసుపత్రులు, 3 సర్జికల్ కేంద్రాలు, 2 అత్యవసర చికిత్సా కేంద్రాలు, 3 మస్క్యులోస్కెలెటల్/డయాగ్నొస్టిక్ కేంద్రాలు, 330 పడకల సామర్థ్యం కలిగిన ఒక కంటి చికిత్సా కేంద్రం ఉన్నాయి. ఏడాదిలో సగటున 80,000 శస్త్రచికిత్సలను ఈ హాస్పిటల్ గ్రూప్ నిర్వహిస్తోంది.

✦ ప్రాక్టీస్ ప్లస్ కొనుగోలుతో నారాయణ హెల్త్ అంతర్జాతీయంగా విస్తరించనుందని సంస్థ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ డాక్టర్ దేవీ ప్రసాద్ శెట్టి వెల్లడించారు. ఆదాయాల పరంగా దేశంలోని అగ్రగామి 3 ఆరోగ్య సంరక్షణ సంస్థల్లో ఒకటిగా నిలిచేందుకు ఈ ప్రక్రియ ఉపయోగ పడుతుందన్నారు. ప్రైవేటు రంగంలో అందుబాటు ధరలకు ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. అత్యంత సమర్థంగా, అందుబాటు ధరల్లో, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలు అందిస్తున్న డాక్టర్ దేవిశెట్టి, నారాయణ హృదయాలయతో తాము కలవడంపై ఎంతో ఆనందంగా ఉన్నామని ప్రాక్టీస్ ప్లస్ గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జిమ్ ఈస్టన్ పేర్కొన్నారు.

మారుతీ సుజుకీ లాభం రూ.3,349 కోట్లు



దిల్లీ: మారుతీ సుజుకీ ఇండియా సెప్టెంబరు త్రైమాసికంలో రూ.3,349 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని పొందింది. 2024-25 ఇదే కాల లాభం రూ.3,102.5 కోట్లతో పోలిస్తే ఇది 8% అధికం. బలమైన ఎగుమతుల వృద్ధి ఇందుకు కలిసివచ్చింది. కార్యకలాపాల ఆదాయం రూ.37,449.2 కోట్ల నుంచి రూ.42,344.2 కోట్లకు చేరుకుంది. మొత్తం వ్యయాలు రూ.33,879.1 కోట్ల నుంచి రూ.39,018.4 కోట్లకు పెరిగాయి.

✦ సమీక్షా త్రైమాసికంలో కంపెనీ దేశీయ టోకు అమ్మకాలు 5.1% తగ్గి 4,40,387కు చేరుకున్నాయి. జీఎస్‌టీ రేట్ల కోత అంచనాల నేపథ్యంలో, చాలా మంది వినియోగదార్లు కొనుగోళ్లు వాయిదా వేసుకోవడం ఇందుకు నేపథ్యం. ఎగుమతులు మాత్రం 42.2% వృద్ధి చెంది 1,10,487కు చేరాయి. దీంతో మొత్తం అమ్మకాలు 1.7% పెరిగి 5,50,874 యూనిట్లకు చేరుకున్నాయి. సెప్టెంబరు త్రైమాసికంలో నికర విక్రయాలు అత్యధికంగా రూ.40,135.9 కోట్లుగా నమోదైనట్లు కంపెనీ ప్రకటించింది.

అర్ధ సంవత్సరానికి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధం (ఏప్రిల్-సెప్టెంబరు)లో మొత్తం 10,78,735 వాహనాలను మారుతీ విక్రయించింది. అర్ధ సంవత్సర ఎగుమతులు (2,07,459) జీవనకాల గరిష్ఠ స్థాయికి చేరడం విశేషం. దీంతో నికర అమ్మకాలురూ.76,760.6 కోట్లకు చేరుకున్నాయి. 2024-25 తొలి ఆరు నెలల్లో నికర విక్రయాలు రూ.69,464.4 కోట్లుగా ఉన్నాయి. నికర లాభం రూ.6,719.1 కోట్ల నుంచి రూ.7,004.8 కోట్లకు చేరుకుంది. జీఎస్‌టీ రేట్ల కోత వల్ల చిన్న కార్ల అమ్మకాలు పుంజుకున్నాయని మారుతీ సుజుకీ ఇండియా ఛైర్మన్ ఆర్‌సీ భార్గవ పేర్కొన్నారు. దేశంలో అయిదో ప్లాంటు ఏర్పాటు ప్రకటనను కొద్ది నెలల్లో వెలువరచనున్నట్లు తెలిపారు.

భారత్‌లో యాపిల్‌కు రికార్డు స్థాయి ఆదాయాలు



దిల్లీ: ఐఫోన్ తయారీ సంస్థ యాపిల్, సెప్టెంబరు త్రైమాసికంలో భారత్‌లో రికార్డు స్థాయి ఆదాయాలను నమోదుచేసింది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌గా ఉన్న మన దేశంలో తయారీతో పాటు రిటెయిల్ విక్రయశాలలను పెంచడం ద్వారా బలమైన వృద్ధి జోరును యాపిల్ కొనసాగిస్తోంది. అంతర్జాతీయంగా సెప్టెంబరు త్రైమాసికంలో యాపిల్ 102.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.9 లక్షల కోట్ల) ఆదాయాన్ని నమోదుచేసింది. 2024 ఇదే త్రైమాసికంతో పోలిస్తే ఇది 8% ఎక్కువ. కొత్త ఐఫోన్ 17కు ప్రపంచవ్యాప్తంగా మంచి స్పందన రావడంతో డిసెంబరు త్రైమాసికంలోనూ మంచి ఆదాయాలను సంస్థ ఆశిస్తోంది. కంపెనీ చరిత్రలో డిసెంబరు త్రైమాసిక ఆదాయం అత్యుత్తమం కానుందని, అత్యధిక స్థాయిలో ఐఫోన్లు అమ్ముడుపోవచ్చని 2025 నాలుగో త్రైమాసిక ఫలితాల సందర్భంగా యాపిల్ సీఈఓ టిమ్ కుక్ అంచనా వేశారు. అమెరికా, కెనడా, లాటిన్ అమెరికా, పశ్చిమ ఐరోపా, పశ్చిమాసియా, జపాన్, కొరియా, దక్షిణాసియా సహా డజన్ల కొద్ది మార్కెట్లలో సెప్టెంబరు త్రైమాసికంలో యాపిల్ రికార్డు ఆదాయాలను సాధించింది. వర్ధమాన మార్కెట్లలో రికార్డు ఆదాయాలను సాధించామని, భారత్‌లో జీవనకాల ఆదాయ రికార్డును నమోదు చేసినట్లు కుక్ వెల్లడించారు. అయితే ఎంత సాధించిందీ తెలుపలేదు.

దేశీయంగా మానవ రహిత విమానాల తయారీ

అమెరికా సంస్థతో ఎల్ అండ్ టీ ఒప్పందం

దిల్లీ: దేశ రక్షణ దళాల కోసం మానవ రహిత విమానాలను దేశీయంగా తయారుచేసేందుకు అమెరికా సంస్థ అటామిక్స్ ఏరోనాటికల్ సిస్టమ్స్, ఇంక్.(జీఏ-ఏఎస్ఐ)తో మౌలిక రంగ దిగ్గజం ఎల్ అండ్ టీ వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం కింద ఇరు కంపెనీలు కలిసి మీడియం ఆల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరన్స్ (ఎమ్ఏఎల్ఈ) రిమోట్లీ పైలెటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్స్(ఆర్‌పీఏఎస్)ను భారత్‌లో తయారు చేస్తాయి. ఎల్ అండ్ టీకి రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో ప్రెసిషన్ తయారీ, సిస్టమ్ ఇంటిగ్రేషన్ సామర్థ్యాలుండగా.. జీఏ-ఏఎస్ఐకి ఈ రంగాల్లో నిర్వహణ నైపుణ్యం ఉంది.

✦ రక్షణ మంత్రిత్వ శాఖ త్వరలో నిర్వహించబోయే 87 ఎమ్ఏఎల్ఈ ఆర్‌పీఏఎస్ ప్రోగ్రామ్‌లో ఎల్ అండ్ టీ పాల్గొననుంది. ఇందులో ఎల్ అండ్ టీ ప్రాథమిక బిడ్డర్‌గా, జీఏ-ఏఎస్ఐ టెక్నాలజీ భాగస్వామిగా ఉంటాయి.

విదేశీ మారకపు నిల్వలు తగ్గాయ్

అక్టోబరు 24తో ముగిసిన వారంలో మన విదేశీ మారకపు నిల్వలు 6.925 బిలియన్ డాలర్లు తగ్గి 695.355 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. అంతకుముందు వారంలో ఇవి 4.496 బిలియన్ డాలర్లు పెరిగి 702.28 బిలియన్ డాలర్లుగా నమోదైన సంగతి తెలిసిందే. సమీక్షా వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 3.862 బిలియన్ డాలర్లు తగ్గి 566.548 బిలియన్ డాలర్లకు పరిమితం అయ్యాయి. పసిడి నిల్వల విలువ 3.01 బిలియన్ డాలర్లు తగ్గి 105.536 బిలియన్ డాలర్లకు దిగివచ్చింది.

సంక్షిప్తంగా..

✦ హరిత ఇంధన రంగంలోని ప్రముఖ సంస్థలతో 28 ఒప్పందాలను వి.ఒ.చిదంబరనార్ పోర్ట్ అథారిటీ (ట్యుటికొరన్) కుదుర్చుకుంది. ఈ మొత్తం ఒప్పందాల విలువ రూ.1.27 లక్షల కోట్ల వరకు ఉంటుంది.

✦ కొత్త తరం ఇంజిన్ల తయారీ నిమిత్తం చెన్నై ప్లాంటులో రూ.3,250 కోట్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు అమెరికా వాహన తయారీ సంస్థ ఫోర్డ్ తెలిపింది.

✦ రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు స్థిరమైన భవిష్యత్ అంచనాతో బీఏఏ2 రేటింగ్‌ను మూడీస్ కొనసాగించింది. మూలధన వ్యయాల కోసం అధికంగా వెచ్చిస్తున్నా, పటిష్ఠ ఆర్థిక మూలాలు, నిధుల లభ్యత, ఆర్థిక విధాన నిర్ణయాలను పరిగణనలోకి తీసుకుని సంస్థకు ఈ రేటింగ్ కొనసాగిస్తున్నట్లు వివరించింది.

ఆరు నెలల ఉత్కంఠకు తెర

- చైనా నుంచి అరుదైన భూ అయస్కాంతాలు వస్తున్నాయ్
- ఈవీ, పునరుత్పాదక, ఎలక్ట్రానిక్స్ రంగానికి ఊరట



ఆరు నెలల ఉత్కంఠకు తెరపడింది. మనదేశానికి అరుదైన భూ అయస్కాంతాల (రేర్ ఎర్త్ మాగ్నెట్స్) ఎగుమతిని చైనా ప్రారంభించింది. దీంతో విద్యుత్ వాహన తయారీదార్లు, పునరుత్పాదక, వినియోగదారు ఎలక్ట్రానిక్స్ రంగాలకు ఊరట దక్కబోతోంది. అయితే చైనా ఎగుమతులకు కీలక షరతులు విధించినట్లు సమాచారం. అక్కడ నుంచి వచ్చిన ఉత్పత్తులను, ఇక్కడ నుంచి అమెరికా ఎగుమతి చేయకూడదని, మిలటరీ అవసరాలకూ ఉపయోగించకూడదని నిబంధన విధించిందట. అమెరికా, చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు పెరగడంతో ఆ దేశానికి వీటి సరఫరాను చైనా నిలిపివేసిన సంగతి తెలిసిందే.

ఏ కంపెనీలకు వస్తాయంటే: చైనా నుంచి భూఅయస్కాంతాలు తెప్పించుకోవడానికి భారత్‌లోని 4 కంపెనీలు అనుమతులు దక్కించుకున్నట్లు ఒక ఆంగ్ల వార్తా సంస్థ తెలిపింది. హిటాచీ, కాంటినెంటల్, జే-ఉషిన్, డీఈ డైమండ్స్ కంపెనీలు స్థానిక అధికారుల నుంచీ అనుమతులు పొందాక, చైనా నుంచి దిగుమతులు చేసుకోవచ్చు. అమెరికా, చైనా అధ్యక్షుల భేటీ అనంతరం వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గిన సంకేతాలు కనిపించినా, రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ సరఫరాపై మాత్రం స్పష్టత రాలేదు.

50 దరఖాస్తులు పెండింగ్‌లో: భారత కంపెనీలు ఇప్పటికే ఎండ్ యూజర్ సర్టిఫికెట్(ఈయూసీ)లను చైనాకు పంపాయి. దాదాపు 50కి పైగా దరఖాస్తులు ఆ దేశ వాణిజ్య శాఖ వద్ద పెండింగ్‌లో ఉండగా, 4 కంపెనీలకు అనుమతులు దక్కినట్లు ఒక సీనియర్ ఎగ్జిక్యూటివ్ తెలిపారు. భారత విదేశీ వ్యవహారాల శాఖ సైతం ఆయా కంపెనీలకు అనుమతులు దక్కినట్లు ధ్రువీకరించింది.

ఎందుకింత ప్రాధాన్యమంటే: భూఅయస్కాంతాల ఉత్పత్తిలో చైనా వాటా 90% పైగా ఉండడం ఒక కారణమైతే, భారత ఈవీ పరిశ్రమ వీటికి అతిపెద్ద వినియోగదారుగా ఉంది. మధ్య, భారీ స్థాయి భూఅస్కాంతాల ఎగుమతులపై చైనా ఏప్రిల్ 4న ఆంక్షలు విధించడంతో భారత్‌తో సహా పలు దేశాలపై ప్రభావం పడింది.

ఎయిరిండియాకు తోడ్పాటు అందిస్తాం

సింగపూర్ ఎయిర్‌లైన్స్




దిల్లీ: ఎయిరిండియాకు అవసరమైన నైపుణ్యాలు, తోడ్పాటు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, సంస్థలో మైనారిటీ వాటా కలిగిన సింగపూర్ ఎయిర్‌లైన్స్ శుక్రవారం వెల్లడించింది. టాటా గ్రూప్ సంస్థ అయిన ఎయిరిండియా తమ గ్రూప్ ప్రధాన సంస్థ అయిన టాటా సన్స్‌తో పాటు సింగపూర్ ఎయిర్‌లైన్స్‌ను రూ.10,000 కోట్లు కోరినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 2024-25లో ఎయిరిండియాలో టాటా సన్స్, సింగపూర్ ఎయిర్‌లైన్స్ రూ.9,558 కోట్ల పెట్టుబడులు పెట్టాయి. ఈ ఏడాది మార్చిలోనే ప్రమోటర్లు రూ.4,306 కోట్ల పెట్టుబడులు అందించారు. నష్టాల్లో ఉన్న ఎయిరిండియా, ఇటీవల కొన్ని ప్రతికూలతలను ఎదుర్కొంది. జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం కుప్పకూలడంతో 260 మంది చనిపోయారు. పాకిస్థాన్ గగనతలాన్ని మన సంస్థలకు మూసివేయడంతో, ఎయిరిండియాకు దాదాపు రూ.4000 కోట్ల నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

పెండింగ్ రిటర్న్‌లు మూడేళ్లకు మించితే దాఖలు చేయలేరు



గడువు తేదీ నుంచి మూడేళ్లు - అంతకుమించి పెండింగ్‌లో ఉన్న జీఎస్‌టీ రిటర్న్‌లను ఈ ఏడాది నవంబరుతో మొదలయ్యే పన్ను కాలం నుంచి దాఖలు చేసే వీలుండదని జీఎస్‌టీ నెట్‌వర్క్ (జీఎస్‌టీఎన్) తెలిపింది. నెలవారీ, త్రైమాసిక, వార్షిక జీఎస్‌టీ రిటర్న్‌లకు ఇది వర్తిస్తుందని పేర్కొంది. రిటర్న్‌ల దాఖలుకు సమయ ఆంక్షలను విధిస్తూ 2023లో జీఎస్‌టీ చట్టంలో చేసిన సవరణల ఆధారంగా, ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. దీని ప్రకారం.. 2022 అక్టోబరులో దాఖలు చేయకుండా పెండింగ్‌లో ఉన్న నెలవారీ రిటర్న్ ఫారంలు జీఎస్‌టీఆర్-1, జీఎస్‌టీఆర్-3బీలను, 2020-21 ఆర్థిక సంవత్సరానికి సమర్పించాల్సిన వార్షిక రిటర్న్ జీఎస్‌టీఆర్-9ను 2024 డిసెంబరు 1 తర్వాత నుంచి దాఖలు చేయడానికి వీలుండదని జీఎస్‌టీఎన్ తెలిపింది.

ఎన్ఎస్ఈ ఐపీఓ త్వరలోనే: సెబీ ఛైర్‌పర్సన్


తుహిన్ కాంత పాండే

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) పబ్లిక్ ఇష్యూ త్వరలోనే ఉంటుందని సెబీ ఛైర్‌పర్సన్ తుహిన్ కాంత పాండే తెలిపారు. పరస్పర విరుద్ధ ప్రయోజనాల వెల్లడికి సంబంధించి ఒక విధానాన్ని సూచించేందుకు ఏర్పాటు చేసిన కమిటీ నవంబరు 10 కల్లా తన నివేదిక సమర్పించే అవకాశం ఉందని ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన తెలిపారు. మ్యూచువల్ ఫండ్ వ్యయాల నిష్పత్తిపై ఆందోళనలు తొలగించి, మరింత స్పష్టత ఇచ్చేందుకే రుసుములపై ముసాయిదా నిబంధనలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. తక్కువ మొత్తం సిప్‌లకు మదుపర్ల నుంచి ఆదరణ పెంచేందుకు మార్గాలపై చర్చిస్తున్నామని అన్నారు. దేశీయ స్టాక్ మార్కెట్లలో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పీఐ) అమ్మకాలకు దిగుతుండటంపై పెద్దగా ఆందోళన చెందనక్కర్లేదని తెలిపారు. ఎఫ్‌పీఐలకు పలు మార్కెట్లలో పెట్టుబడులు ఉంటున్నందున, విలువ ఆధారితంగా నిర్ణయాలు తీసుకుంటుంటారని అన్నారు.

బీపీసీఎల్ డివిడెండ్ రూ.7.50


దిల్లీ: భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), సెప్టెంబరు త్రైమాసికంలో రూ.6,442.53 కోట్ల స్టాండలోన్ నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.2,397.93 కోట్లతో పోలిస్తే ఇది 169% అధికం. రిఫైనింగ్ మార్జిన్లు పుంజుకోవడం ఇందుకు కారణమని కంపెనీ తెలిపింది. ఒక్కో ఈక్విటీ షేరుపై రూ.7.5 మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది. బ్యారెల్ ముడిచమురును పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాలుగా మార్చడం ద్వారా 10.78 డాలర్లను సంస్థ ఆర్జించింది. 2024 జులై- సెప్టెంబరులో ఇది బ్యారెల్‌కు 4.41 డాలర్లుగా ఉంది.

మదుపర్ల లాభాల స్వీకరణ

- ప్రైవేట్ బ్యాంకులు, లోహ షేర్లలో అమ్మకాలు
- రూ.2.10 లక్షల కోట్లు తగ్గిన మదుపర్ల సంపద

ఎఫ్ఐఐ అమ్మకాలు– రూ.6769.34 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు– రూ.7068.44 కోట్లు

సెన్సెక్స్ ▼466 83939 | నిఫ్టీ ▼156 25722



వరుసగా రెండో రోజూ స్టాక్ మార్కెట్ డీలాపడింది. ప్రైవేట్ రంగ బ్యాంకులు, లోహ, విద్యుత్ రంగ కంపెనీల షేర్లలో లాభాల స్వీకరణ ఇందుకు కారణమైంది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందడం ప్రభావం చూపింది. విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలకు దిగడంతో మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ ఒకపైసా తగ్గి 88.70 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు ధర 0.49% పెరిగి 65.32 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో జపాన్, దక్షిణ కొరియా మినహా మార్కెట్లన్నీ నష్టాల్లో ముగిశాయి. ఐరోపా మార్కెట్లు కూడా నష్టాల్లోనే ట్రేడయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.10 లక్షల కోట్లు తగ్గి రూ.470.26 లక్షల కోట్ల (5.30 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

స్వల్ప నష్టాలతో మొదలై..: బీఎస్ఈ సెన్సెక్స్ (క్రితం ముగింపు 84,404.46) స్వల్ప నష్టంతో 84,379.79 పాయింట్ల వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత వెంటనే లాభాల్లోకి వచ్చి 84,712.79 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. అనంతరం మళ్లీ నష్టాల్లోకి జారుకుని, చివరి వరకు అదే ధోరణిలో చలించింది. ఆఖరుకు 465.75 పాయింట్ల నష్టంతో 83,938.71 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 155.75 పాయింట్లు తగ్గి 25,722.10 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,711.20 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని; 25,953.75 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 273.17 పాయింట్లు, నిఫ్టీ 73.05 పాయింట్ల మేర నష్టపోయాయి.

5 మినహా మిగతావి నష్టాల్లో..: సెన్సెక్స్ 30 షేర్లలో 5 మినహా మిగతావి నష్టాల్లో ముగిశాయి. ఎటర్నల్ 3.52%, ఎన్‌టీపీసీ 2.39%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.66%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.28%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.25%, పవర్‌గ్రిడ్ 1.17%, ట్రెంట్ 1.06%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.05% తగ్గాయి. బెల్ 3.95%, ఎల్‌అండ్‌టీ 1.09%, టీసీఎస్ 0.73%, ఐటీసీ 0.37%, ఎస్‌బీఐ 0.31% లాభపడ్డాయి. బీఎస్ఈ రంగాల సూచీల్లో లోహ, విద్యుత్, సేవలు, కమొడిటీస్, మన్నికైన వినియోగ వస్తువులు, ఆర్థిక సేవలు డీలాపడ్డాయి. ఇంధనం, ఇండస్ట్రియల్స్, భారీ యంత్రపరికరాలు, చమురు- గ్యాస్ సూచీలు రాణించాయి.

ఐపీఓ సమాచారం

✦ ఫిన్‌బడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు ఇష్యూ ధరగా రూ.140- 142ను నిర్ణయించారు. ఈ ఐపీఓ నవంబరు 6న మొదలై 10న ముగియనుంది. ఫిన్‌బడ్ ఫైనాన్షియల్‌లో క్రికెటర్ ధోనికి పెట్టుబడులు ఉన్నాయి.

✦ లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ తొలి పబ్లిక్ ఆఫర్ మొదటి రోజున 1.13 రెట్ల స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలో 1.31 రెట్లు అధికంగా బిడ్‌లు దాఖలయ్యాయి. నవంబరు 4న ఇష్యూ ముగియనుంది.

✦ ఓర్క్లా ఇండియా ఐపీఓ ముగిసే సరికి 48.73 రెట్ల స్పందన లభించింది. రిటెయిల్ విభాగంలో 7.05 రెట్లు అధికంగా బిడ్‌లు దాఖలయ్యాయి.

✦ స్టడ్స్ యాక్సెసరీస్ ఐపీఓ రెండో రోజుకు 5.08 రెట్ల స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలో 6.02 రెట్లు అధికంగా బిడ్‌లు వచ్చాయి.


జులై - సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
ఎల్‌టీ ఫుడ్స్	163.85	150.61	2772.48	2544.19
వేదాంతా	3479	5603	40464	38934
శ్రీరామ్ ఫైనాన్స్	2314	2153	11921	10097
గెయిల్	2823.19	3453.12	35031	32931
కల్పతరు ప్రాజెక్ట్స్	237	126	6552	4947
రట్టన్‌ఇండియా పవర్	(31.55)	(1.35)	743	771
ధనూకా అగ్రిటెక్	93.96	117.51	604.56	665.07
ఎంఫసిస్	469	423	3902	3536
జీసీపీఎల్★	459.34	491.31	3825.09	3666.33
మహీంద్రా హాలిడేస్	17	11.5	717.34	670.74

★ మధ్యంతర డివిడెండ్ రూ.5

ఈనాడు సినిమా

ఒకరోజు ముందుగానే ఆంధ్ర కింగ్!



రామ్, భాగ్యశ్రీ

ఈ నెలాఖరున 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రంతో థియేటర్లలో సందడి చేయనున్నారు కథానాయకుడు రామ్ పోతినేని. ఆయన, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన ఈ సినిమాని పి. మహేశ్‌బాబు తెరకెక్కించారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. ఉపేంద్ర కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రంలోని 'చిన్ని గుండెలో' అంటూ సాగే మెలోడీ గీతాన్ని శుక్రవారం విడుదల చేశారు. ఈ పాటకు వివేక్ - మెర్విన్ స్వరాలు సమకూర్చగా.. కృష్ణకాంత్ సాహిత్యమందించారు. మెర్విన్ సోలమన్, సత్య యామిని ఆలపించారు. ఈ పాటలో రామ్ - భాగ్యశ్రీల కెమిస్ట్రీ ఆకర్షణగా నిలిచింది. వినూత్నమైన రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబైన ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉంది. దీన్ని ఈ నెల 28న విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే దానికి ఒక రోజు ముందుగానే ఈ నెల 27న తెరపైకి తీసుకొచ్చేందుకు నిర్మాతలు నిర్ణయించినట్లు సమాచారం. త్వరలో దీనిపై స్పష్టత రానుంది.

నయనికతో అల్లు శిరీష్ నిశ్చితార్థం

యువ కథానాయకుడు అల్లు శిరీష్ వివాహ నిశ్చితార్థం నయనికతో శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో శిరీష్, నయనిక ఉంగరాలు మార్చుకున్నారు. జూబ్లీ హిల్స్‌లోని నయనిక నివాసంలో ఈ వేడుకను నిర్వహించారు. 'నేను, నయనిక కలిసి జీవితాన్ని పంచుకోనున్నాం' అంటూ అక్టోబరు 1న అల్లు శిరీష్ సామాజిక మాధ్యమాల్లో ప్రకటించిన విషయం తెలిసిందే. చిరంజీవి కుటుంబ సభ్యులు, అల్లు కుటుంబం మధ్య సందడిగా నిశ్చితార్థ వేడుకని నిర్వహించారు. త్వరలోనే శిరీష్, నయనిక జంట పెళ్లి పీటలెక్కనుంది.


కుటుంబ సభ్యుల సమక్షంలో ఉంగరాలు మార్చుకుంటున్న కాబోయే జంట


నయనిక

పెద్ది.. తొలి పాటతో సిద్ధం!


రామ్ చరణ్

'పెద్ది'గా సినీప్రియుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు రామ్ చరణ్. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. శివ రాజ్‌కుమార్, దివ్యేందు శర్మ, జగపతిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా నుంచి తొలి పాట వినిపించేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది. ఈ నెల 8న రామోజీ ఫిల్మ్ సిటీలో జరగనున్న ఏఆర్ రెహమాన్ లైవ్ కాన్సర్ట్‌లోనే ఈ చిత్ర తొలి గీతాన్ని వినిపించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు దర్శకుడు బుచ్చిబాబు సామాజిక మాధ్యమాల వేదికగా సంకేతాలు అందించారు. ఆటలతో ముడిపడి ఉన్న బలమైన భావోద్వేగాలు నిండిన కథతో ఈ సినిమా ముస్తాబవుతోంది. ఇది వచ్చే ఏడాది మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనికి రెహమాన్ సంగీతమందిస్తుండగా.. రత్నవేలు ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

డబుల్ కష్టాలు.. ట్రిపుల్ నవ్వులు

ఒకరేమో ఎంచుకున్న పాత్రలతోనే గుర్తిండిపోయే నాయిక.. మరొకరేమో నటనతో పాటు ప్రత్యేక పాటల్లో స్టెప్పులు వేస్తూ కుర్రకారుని అలరించే భామ.. మరి ఇలాంటి ఇద్దరు అందాల తారలు కలిసి తెరపై సందడి చేస్తే ఆ హంగామా ఎలా ఉంటుందో చూపించడానికి సిద్ధమయ్యారు కథానాయికలు మృణాల్ ఠాకూర్, పూజా హెగ్డే. వీరిద్దరు, బాలీవుడ్ హీరో వరుణ్ ధావన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'హై జవానీ తో ఇష్క్ హోనా హై'. డేవిడ్ ధావన్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా రాకకు ఇంకాస్త ఆలస్యం కానున్నట్లు తెలుపుతూ కొత్త విడుదల తేదీని ఇన్‌స్టా వేదికగా ప్రకటించింది చిత్రబృందం. "డబుల్ ట్రబుల్.. ట్రిపుల్ ఫన్ కోసం వచ్చే ఏడాది జూన్ 5న సిద్ధంగా ఉండండి" అనే వ్యాఖ్యను జోడించింది. ముక్కోణపు ప్రేమకథగా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో జిమ్మీ షెర్గిల్, మౌనీ రాయ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.


పూజా హెగ్డే
మృణాల్ ఠాకూర్

నాని చిత్రం కోసం హాలీవుడ్ నటుడు?


నాని


ర్యాన్ రేనాల్డ్స్

తెలుగు సినిమాలు అంతర్జాతీయ మార్కెట్‌పైనా గురిపెడుతున్నాయి. మొన్నటివరకూ టాలీవుడ్‌లో పాన్ ఇండియా అనే మాటే ఎక్కువగా వినిపించేది. ఈమధ్య మరో అడుగు ముందుకు పడింది. పాన్ వరల్డ్ అంటున్నారు చాలామంది దర్శకనిర్మాతలు. ఎక్కువమంది ప్రేక్షకులకు చేరువ కావాలనే లక్ష్యంతో... అంతర్జాతీయ స్థాయిలో తమ సినిమాల్ని తెరకెక్కిస్తున్నారు. అందుకోసం ప్రత్యేక హంగుల్ని జోడిస్తున్నారు. నాని కథానాయకుడిగా నటిస్తున్న 'ది ప్యారడైజ్' కూడా అంతర్జాతీయ స్థాయిలోనే రూపొందుతోంది. భారతీయ భాషలతోపాటు, ఇంగ్లిష్, స్పానిష్‌లోనూ దీన్ని విడుదల చేయనున్నారు. ఈ సినిమాకి అంతర్జాతీయ ఆకర్షణని తీసుకొచ్చేలా ఓ కీలకమైన పాత్ర కోసం ఓ హాలీవుడ్ నటుడిని ఎంపిక చేసుకోవాలని చిత్రబృందం ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. అందులో భాగంగానే ర్యాన్ రేనాల్డ్స్‌ని సంప్రదించినట్టు సమాచారం. 'డెడ్‌పూల్' చిత్రంతో ఆకట్టుకున్న నటుడు ఈయన. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో... సుధాకర్ చెరుకూరి నిర్మాతగా రూపొందుతున్న చిత్రమిది.

కన్నునొదిలి కనుపాప ఉంటుందా...!


కామాక్షి, నరేశ్

అల్లరి నరేశ్ కథానాయకుడిగా... నాని కాసరగడ్డ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం '12ఏ రైల్వే కాలనీ'. కామాక్షి భాస్కర్ల కథానాయిక. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. పవన్‌కుమార్ సమర్పకులు. 'మా ఊరి పొలిమేర' సిరీస్ చిత్రాల ఫేమ్ డా. అనిల్ విశ్వనాథ్ కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు సమకూర్చారు. 'కన్నొదిలి... కలనొదిలి కనుపాపే ఉంటుందా...' పాట విడుదలతో శుక్రవారం ఈ సినిమా ప్రచార కార్యక్రమాలు ఆరంభమయ్యాయి. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ పాటకి, దేవ్ పవార్ సాహిత్యం అందించారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ ఆలపించారు. నాయకానాయికల మధ్య మంచి కెమిస్ట్రీ, అద్భుతమైన విజువల్స్‌తో ఈ పాట ఆకట్టుకునేలా ఉంది. "ప్రేమ, థ్రిల్లింగ్ అంశాలతో రూపుదిద్దుకుంటున్న చిత్రమిది. భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉంది. టీజర్‌తోనే ప్రేక్షకులకు ఓ గొప్ప సినిమాటిక్ అనుభవాన్ని పంచుతుందనే అంచనాల్ని పెంచిన ఈ చిత్రం నవంబరు 21న ప్రేక్షకుల ముందుకొస్తుంద"ని సినీ వర్గాలు తెలిపాయి. సాయికుమార్, వైవా హర్ష, గెటప్ శ్రీను తదితరులు నటించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: కుశేందర్ రమేశ్‌రెడ్డి.

'నేను రెడీ'కి మిక్కీ స్వరాలు


మిక్కీ జె మేయర్

హవీశ్ హీరోగా త్రినాధరావు నక్కిన తెరకెక్కిస్తోన్న చిత్రం 'నేను రెడీ'. నిఖిల కోనేరు నిర్మిస్తున్నారు. కావ్య థాపర్ కథానాయిక. శ్రీలక్ష్మి, గోపరాజు రమణ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి మిక్కీ జె మేయర్ సంగీతమందిస్తున్నట్లు శుక్రవారం ప్రకటించారు. "ప్రస్తుతం చిత్రీకరణతో పాటు సంగీత పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇది అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించే రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఉండనుంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి కూర్పు: ప్రవీణ్ పూడి, ఛాయాగ్రహణం: నిజార్ షఫీ.

వంద శాతం వినోదం పంచుతాం


ఆర్.పి.పట్నాయక్, సాహితి, త్రినాథ్

యువతరం ప్రేక్షకులు తమతోపాటు తల్లిదండ్రుల్ని థియేటర్‌కి తీసుకెళ్లి చూపించాలనుకునే సినిమా ఇదని చెప్పారు ఆర్.పి.పట్నాయక్. ఆయన స్వర కల్పనలో త్రినాథ్ కటారి కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. సాహితీ అవంచ కథానాయిక. సంజీవని ప్రొడక్షన్స్ పతాకంపై బళ్లారి శంకర్ నిర్మిస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా త్రినాథ్ కటారి మాట్లాడుతూ "ఇదొక తండ్రీ కొడుకుల కథ, తండ్రీ కూతుళ్ల కథ, అమ్మాయి అబ్బాయి కథ. సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్‌కి కథ చెబుతున్నప్పుడే ఒక హిట్ సినిమా చేయబోతున్నాం అన్నారు. ఆయన చెప్పిన ఆ మాట ఎంతో ప్రోత్సాహాన్నిచ్చింది. ప్రేక్షకులకు వంద శాతం వినోదం పంచబోతున్నాం" అన్నారు. సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ మాట్లాడుతూ "నాకు బాపు సినిమాకి పనిచేసే అవకాశం లేకుండా పోయింది. ఈ సినిమా చేస్తే ఆ కోరిక తీరుతుందనే అభిప్రాయం కలిగింది. తప్పకుండా ఈ సినిమా అందరికీ నచ్చుతుంది" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "ఆర్.పి. పట్నాయక్ సంగీతం అందించడంతో సినిమా స్థాయి పెరిగింది" అన్నారు.

థ్రిల్ చేసే సందిగ్ధం


సంధ్య, అశోక్ కుమార్, పార్థ సారథి

నిహాల్, ప్రియా దేశ్ పాగ్, అర్జున్ దేవ్, కాజల్ తివారి ప్రధాన పాత్రల్లో పార్థ సారథి కొమ్మోజు తెరకెక్కించిన చిత్రం 'సందిగ్ధం'. సంధ్య తిరువీధుల నిర్మించారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్ర టీజర్‌ను నటుడు, నిర్మాత అశోక్ కుమార్ శుక్రవారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. "టీజర్ చాలా ఆసక్తికరంగా ఉంది. భార్యాభర్తలైన సంధ్య, పార్థు కష్టపడి తీసిన ఈ సినిమా విజయవంతమవ్వాలని కోరుకుంటున్నా" అన్నారు. "ఇదొక విభిన్నమైన సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్. ఆద్యంతం ఆసక్తిరేకెత్తిస్తూ సాగుతుంది" అన్నారు దర్శకుడు పార్థ సారథి.

రాజ్‌కుమార్‌తో కీర్తి?


రాజ్‌కుమార్ రావు

'మాలిక్' చిత్రంతో ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చి అలరించాడు బాలీవుడ్ నటుడు రాజ్‌కుమార్ రావు. తాజాగా ఆయన ఆదిత్య నింబాల్కర్ దర్శకత్వంలో ఓ సినిమాలో నటించనున్నట్లు వార్తలొస్తున్నాయి. భారతదేశ విద్యా వ్యవస్థ నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ చిత్రంలో రాజ్‌కుమారికి జోడీగా కీర్తి సురేశ్, తాన్య మణిక్తలు నటించనున్నట్లు తెలుస్తోంది. "ఈ చిత్రంలో నటించనున్న ప్రతి ఒక్కరి పాత్ర కీలకమైనది. ముఖ్యంగా తాన్య పాత్ర డిమాండింగ్ వ్యవస్థను నావిగేట్ చేస్తున్న అనేకమంది భారతీయుల స్వరాన్ని ప్రతిబింబిస్తుంద"ని చిత్ర సన్నిహిత వర్గాల సమాచారం. ఈ చిత్రం ప్రస్తుతం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న విద్యాపరమైన ఒత్తిళ్లు, వ్యవస్థాగత సవాళ్లను అన్వేషించనున్నట్లు తెలుస్తోంది. నవంబరులో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది.


కీర్తి సురేశ్

ఇక శాశ్వతంగా ముగింపు పలుకుదాం!


'స్ట్రేంజర్ థింగ్స్ 5'

ఓటీటీ బొమ్మ

ఓటీటీలో ప్రేక్షకులను మలుపులతో సీటు అంచున కూర్చోబెడుతూ. . ఉత్కంఠ కలిగించే వెబ్‌సిరీస్‌లకు ఉండే ప్రత్యేకతే వేరు. అందులో ముందు వరుసలో ఉంటుంది 'స్ట్రేంజర్ థింగ్స్'. ఇప్పటికే నాలుగు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు వచ్చి విశేష ప్రేక్షకాదరణను సొంతం చేసుకుందీ సిరీస్. ఇప్పుడు ఇందులో 'స్ట్రేంజర్ థింగ్స్ 5' రాబోతున్న సంగతి తెలిసిందే. మిల్లీ బాబీ బ్రౌన్, ఫిన్ వోల్ఫ్ హార్డ్, సాడీ సింక్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. రాస్ డఫర్ రూపొందించారు. తాజాగా ఈ సిరీస్ ట్రైలర్‌ను ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్. "మనం వెక్నాను కనిపెట్టి ఇక శాశ్వతంగా ముగింపు పలుకుదాం', 'నువ్వు దీని ముగింపును రాయలేవు" లాంటి సంభాషణలతో సాగుతున్న ఈ ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. 1980లో హాకిన్స్ అనే ఊరిలో మనుషులపై ప్రయోగాలు జరుగుతుంటాయి. ఈ ప్రభావం హాకిన్స్‌లోని ప్రజలపై ఎలా పడుతుంది? వాళ్లు ఏం చేశారు? అన్నదే ఈ సిరీస్ కథ. నవంబరులో విడుదల కానుంది.

ప్రతీకారం పోరులో చిగురించిన స్నేహం

తన భార్య, కుమార్తెలను దారుణంగా హత్య చేసిన వాళ్లపై ప్రతీకారం తీర్చుకోవడానికి ఓ థాయ్ మార్షల్ ఆర్ట్స్ యోధుడు చేసే పోరాటాల చుట్టూ తిరుగుతుందీ 'స్ట్రైకింగ్ రెస్క్యూ' సినిమా. వాళ్ల మరణానికి కారణమైన వాళ్లని వెతుక్కుంటూ వెళ్లే బైఆన్‌కి ఎదురైన సవాళ్లేంటి? శత్రువుల గురించి తెలుసుకున్నాక అతడు ఏం చేశాడనేదే ఈ సినిమా కథాంశం.

బ్రో.. ఓ లుక్కేయొచ్చు!

సినిమా: 'స్ట్రైకింగ్ రెస్క్యూ'

జానర్: యాక్షన్ థ్రిల్లర్ (చైనీస్- థాయ్ యాక్షన్ మూవీ)

ప్లాట్‌ఫామ్: జియో హాట్‌స్టార్ (తెలుగు, హిందీ, తమిళ)



కథాంశం: థాయ్‌లాండ్‌కు చెందిన బైఆన్(టోనీ జా) తన భార్య, కూతురితో సంతోషమైన జీవితాన్ని గడుపుతుంటాడు. ఓ రోజు కారులో కుటుంబంతో కలిసి బయటికి వెళుతున్నప్పుడు.. ఉద్దేశపూర్వకంగానే ఒక డ్రగ్స్ మాఫియా బృందం యాక్సిడెంట్ చేస్తుంది. ఈ ప్రమాదంలోనే హంతకులు బైఆన్ భార్య నుంచి ఓ రహస్యం తెలుసుకుని ఆమెని, కూతుర్ని చంపేస్తారు. దాంతో కళ్లముందే కుటుంబాన్ని కోల్పోయిన అతడు తీవ్ర మనస్తాపానికి గురై దీనికి కారణమైన వాళ్లు ఎక్కడున్నా.. చంపి ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకుంటాడు. దీని కోసమే శత్రువు వేటకై బయలుదేరతాడు. అంతలోనే తాను చంపాలనుకునే వ్యక్తికి కూడా ఓ కూతురు ఉంటుందని తెలుసుకుంటాడు. దాంతో తాను అనుభవిస్తున్న పరిస్థితి ఆమెకు ఎదురవకూడదనుకుంటాడు. దాంతో హాని చేయడానికి వెళ్లి అదే శత్రువు కూతురిని ప్రమాదాల నుంచి కాపాడుతూ స్నేహం కుదుర్చుకుంటాడు. ఆ తర్వాత ఏమైందో తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే.

❑ థాయ్‌లాండ్ అగ్ర నటుడు, యాక్షన్ కొరియోగ్రాఫర్, దర్శకుడు టోనీ జా ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ సినిమాకి సియు చెంగ్ దర్శకత్వం వహించారు. ఇందులో టోనీ జా తనదైన శైలిలో అదిరిపోయే యాక్షన్ స్టంట్స్ చేస్తూ ప్రేక్షకులకు మంచి థ్రిల్‌ని పంచుతాడు. ప్రతీకారం తీర్చుకోవడానికి మొదలైన ప్రయాణంలో భావోద్వేగాలకు ప్రాధాన్యత ఇచ్చే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. తన కుటుంబంతో గడిపిన క్షణాలు తలుచుకుని బాధపడుతూ గతాన్ని వర్తమానంతో పోల్చే దృశ్యాలు ప్రేక్షకుల్ని అలరించేలా ఉంటాయి. కుటుంబ హత్యల వెనుక కారణాన్ని తెలుసుకునే నేపథ్యంలో వచ్చే ట్విస్ట్‌లు ఆద్యంతం ఉత్కంఠ కలిగిస్తాయి. ముఖ్యంగా ఈ సినిమాలో టోనీ జా చేసే ఫైటింగ్ సన్నివేశాలు ప్రత్యేకంగా ఆకట్టుకుంటాయి. యాక్షన్ ప్రియులకు తప్పకుండా నచ్చుతుందీ సినిమా.

ఈతరం

youthpage@eenadu.in

సైకిల్‌పై దేశమంతా చుట్టేసి..

దేశమంటే ప్రేమ.. ఫిట్‌నెస్ అంటే పిచ్చి.. ప్రకృతి మీద మమకారం.. ఏదో సాధించాలనే తపన.. సొంత లక్ష్యాల కంటే నలుగురి కోసం పని చేయాలనే ఆసక్తి.. ఇవన్నీ ఇతడిలో ఉన్నాయ్. అతడే మహారాష్ట్రకు చెందిన సుబోధ్.



యువత కెరియర్ పోరులో పరుగులు పెడుతుంటారు.. కానీ సుబోధ్ సైకిల్ హ్యాండిల్ చేతపట్టాడు. సాఫ్ట్‌వేర్ కొలువులు చేద్దామా, గవర్నమెంట్ జాబ్ కొడదామా అని ఆలోచనలో ఉంటారు.. కానీ ఆ సైకిల్‌నే తన లక్ష్యసాధనకు సాధనంగా చేసుకున్నాడు. ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా 28 రాష్ట్రాల్లో సైకిల్ యాత్ర చేయాలని తలపెట్టాడు. కేవలం ఆలోచనే కాదు, గత కొన్నాళ్లుగా అదే పనిలో ఉన్నాడు. ఇదంతా తను ఎందుకు చేస్తున్నాడో తెలుసా? అందరిలో పర్యావరణం పట్ల ప్రేమ, దేశం మీద భక్తి, శారీరక దృఢత్వం మీద అవగాహన కల్పించడానికి! ఈ అబ్బాయి ప్రయాణం విచిత్రంగా ఉంది కదూ.. అందుకే ఇంకా వివరంగా తెలుసుకుందాం.



సుబోధ్ వయసు 26 ఏళ్లు. ఇప్పటివరకూ 9 రాష్ట్రాల మీదుగా సైకిల్ తొక్కాడు. మొత్తం 495 రోజుల యాత్ర పూర్తి చేసుకున్నాడు. ఇటీవలే గుజరాత్‌లోని మహేసనా నగరానికి చేరుకున్నాడు. మొదట లద్దాఖ్ పర్వత ప్రాంతం నుంచి ఈ 'సంకల్ప్ యాత్ర'ను ప్రారంభించాడు. తన యాత్ర లక్ష్యం కేవలం సైకిల్‌పై తిరగడం మాత్రమే కాదు. మాతృభూమిని పచ్చగా చూడాలనే గొప్ప సంకల్పం దీని వెనక దాగుంది. అంతేకాదు, యువతలో దేశభక్తిని పెంపొందించడం, ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించడమూ ఈ యాత్రలో అంతర్భాగం. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా లక్ష మొక్కలు నాటాలని నిర్ణయించుకుని ఆ దిశగా కృషిచేస్తున్నాడు. ఇలా చేయడం వల్ల పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందని భావిస్తున్నాడు.

2027 నాటికి ఈ యాత్ర పూర్తయిన తర్వాత చివరగా ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు సుబోధ్. మొత్తంగా 950 రోజుల్లో 28 రాష్ట్రాల్లో పయనించాలనేది తన ప్రణాళిక. ఇందుకోసం దాదాపు లక్ష కిలోమీటర్లు ప్రయాణించనున్నాడు.

స్ఫూర్తిదాయకం

దేశం కోసం ఏమైనా చేయాలనే ఉద్దేశాన్ని యువతకు ప్రబోధిస్తూ.. దేన్ని సాధించాలన్నా శారీరక పటుత్వం ఎంత ప్రధానమైన అంశమో వివరిస్తూ, పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలని చెబుతున్న ఈ యువకుడి యాత్ర ఎంతో స్ఫూర్తిదాయకం. తను అనుకున్న లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని మనమూ కోరుకుందాం!

మనోడి ప్రతిభ బుల్లెట్‌ప్రూఫ్!

ఇరవైఏళ్ల ప్రాయమంటే కెరియర్ రూపుదిద్దుకునే వయసు. దేని మీదా పూర్తిగా అవగాహన, ఆసక్తి ఏర్పడని సమయం. కానీ ఈ కుర్రాడు అందరిలా కాదు. తన మార్గమేంటో త్వరగా తెలుసుకున్నాడు. బుల్లెట్‌ప్రూఫ్ గ్లాస్ మీద దేశంలో ఎక్కడా లేని విధంగా పరిశోధన చేసి అంతర్జాతీయస్థాయి జర్నల్స్‌లో మెరిశాడు. మైక్రోసాఫ్ట్ లెర్నింగ్‌లో అసోసియేట్ మెంటార్‌గా ఉన్నాడు. ఇదంతా చూసి మనోడు ముందు నుంచి ఇంతేనేమో అనుకుంటే పొరపాటే. ఇంటర్‌లో వచ్చిన మార్కులు పట్టుమని ఆరొందలు. కానీ ఇంజినీరింగ్ పూర్తయ్యేసరికి మొత్తం కథ మార్చేశాడు మిర్యాలగూడకు చెందిన ముచ్చర్ల మినీష్‌కుమార్.



మినీష్ మొదట్లో సగటు విద్యార్థి. పదోతరగతిలో 8.8 జీపీఏ, ఇంటర్‌లో 622 మార్కులొచ్చాయి. కానీ తన ప్రతిభకు జేఎన్‌టీయూ వేదికగా సానపట్టాడు. అమ్మానాన్నలు మహాలక్ష్మి, ప్రసాదరావు.. వ్యాపారస్థుల కుటుంబం. ఎంసెట్‌లో 8,208వ ర్యాంకు వచ్చింది. జేఎన్టీయూ హైదరాబాద్‌లో ఈ మధ్యే మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. ఇంజినీరింగ్ మొదటి ఏడాదిలో ఉండగానే చేపల పెంపకానికి సంబంధించిన ఒక యంత్రాన్ని రూపొందించి బంగారు పతకాన్ని సాధించాడు. దీంతో కళాశాలలో రిసెర్చ్ ప్రోగ్రామ్‌లో అవకాశం వచ్చింది. అలా 'ఇంటర్నేషనల్ జర్నల్ ఫర్ సైన్స్, ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ' వారి స్పాన్సర్‌షిప్‌తో బుల్లెట్‌ప్రూఫ్ గ్లాస్ టెక్నాలజీపై సుమారు రెండేళ్ల మూడు నెలలపాటు పరిశోధన చేసి పత్రాలు రూపొందించాడు. అవి తాజాగా ప్రచురితమయ్యాయి. ఈ అంశంపై మొట్టమొదటి పరిశోధన పత్రం 45 ఏళ్ల క్రితం ప్రచురితమైంది. ఆ తర్వాత మళ్లీ మినీష్ రిసెర్చ్ మాత్రమే పబ్లిష్ అయ్యింది!

అంతేకాదు.. ఈ పరిశోధనకుగానూ ఇతడికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఇతడిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రస్తుతం మినీష్ మినిస్ట్రీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో అసోసియేట్ మెంటార్‌గా ఉంటూ ప్రభుత్వ ప్రాజెక్టుల్లో సాయం అందిస్తున్నాడు. మైక్రోసాఫ్ట్ లెర్నింగ్‌లో సైతం అసోసియేట్ మెంటార్‌గా ఉన్నాడు. గూగుల్ డెవలప్‌మెంట్ గ్రూప్(జీడీజీ) హైదరాబాద్ బ్రాంచ్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ.. పలు కళాశాలల్లో సాంకేతికతపై విద్యార్థులకు పరీక్షలు, పోటీల నిర్వహణ, అవగాహన సదస్సుల పనులు చూస్తున్నాడు.

ఏమిటీ గ్లాస్ టెక్నాలజీ

ఇటలీలో 1980లో రూపొందించిన సాంకేతికత ఆధారంగానే నేటికీ బుల్లెట్‌ప్రూఫ్ అద్దాలు తయారవుతుండగా.. మన దేశంలో వాడే గ్లాస్ చాలా వరకూ జర్మనీ నుంచి దిగుమతి అవుతోంది. ఈ విషయాన్ని గమనించి, మనదేశంలోనే ఎందుకు నాణ్యమైన అద్దాలు తయారు చేయకూడదు... అనే ఆలోచనతో పరిశోధన మొదలుపెట్టాడు. ప్రస్తుతం తయారవుతున్న గ్లాస్ 600 నానోమీటర్స్ ఫ్రీక్వెన్సీతో వచ్చే లేజర్ కిరణాలకు ధ్వంసమవుతుండగా.. దీని కంటే తక్కువ ధరలో మరింత దృఢంగా అద్దాలను తయారు చేయాలనే లక్ష్యంతో మినీష్ పరిశోధన కొనసాగింది. దీనికోసం గతంలో ఎప్పుడూ లేని విధంగా అద్దాల తయారీలో క్రోమియం, నికెల్ పదార్థాలను ఉపయోగించడం ద్వారా 650 నానోమీటర్స్ ఫ్రీక్వెన్సీ వద్ద సైతం అద్దం అవతల ఉన్న వ్యక్తికి ఎటువంటి అపాయం కలగకుండా తయారుచేయొచ్చని కనిపెట్టాడు. డిజైన్ చేసి చూపించాడు.

సొంతంగా..

నాలుగేళ్ల క్రితం ఆక్వాటెక్ ఫౌండేషన్‌ను స్థాపించాడు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులకు వివిధ ప్రాజెక్టులు ఇచ్చి.. వాటిని పూర్తి చేసిన వారికి బహుమతులు అందిస్తూ ప్రోత్సహిస్తున్నాడు. సుమారు 16 కళాశాలల్లో వర్క్‌షాప్స్ నిర్వహించాడు. 2023లో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పరీక్షా పే చర్చా' కార్యక్రమంలో పాల్గొన్నాడు. ముంబై, విశాఖపట్నం, విజయవాడ వంటి నగరాలతోపాటు జియో ప్లాట్‌ఫాం వంటి వేదికలపై 20 వరకు ప్రసంగాలు ఇచ్చాడు.

- ప్రస్తుతం మెటీరియల్ టెక్నాలజీపై ఒక పుస్తకం రాశాడు. త్వరలోనే అది మార్కెట్లోకి రానుంది. డిఫెన్స్ సిస్టమ్‌లో నూతన సాంకేతికతతో ప్రయోగాలు చేసి బుల్లెట్‌ప్రూఫ్ గ్లాస్ అతి తక్కువ ధరలో, ఎక్కువ మన్నికతో తయారు చేయడమే తన లక్ష్యంగా చెబుతున్నాడు మినీష్. అంతేకాదు.. ఇంజినీరింగ్ 20 ఏళ్లలోపే పూర్తి చేయడంతోపాటు.. అద్దాలపై పరిశోధన సాగించినందుకుగానూ ఈనెలలో జరగనున్న జేఎన్‌టీయూ హైదరాబాద్ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో యంగెస్ట్ సైంటిస్ట్ అవార్డుకు సైతం ఎంపికయ్యాడు.

– ఆవుల రమేశ్, మిర్యాలగూడ పట్టణం

6543210


సంతోషమైన జీవితానికి ఎన్నో సూత్రాలు. కొత్తగా సోషల్ మీడియా కూడా ఓ రూల్ కనిపెట్టేసింది, అది కాస్తా అందరికీ నచ్చేసింది. మరి మనమూ చూసేద్దామా..

- **6** - ఆరంకెల జీతం ఉండాలి.
- **5** - వారానికి ఐదు రోజులు చేసేలా మంచి ఉద్యోగం కావాలి.
- **4** - నాలుగు చక్రాల వాహనం ఉండాలి, అదే మంచి మోడల్ కార్.
- **3** - ట్రిబుల్ బెడ్‌రూమ్ ఫ్లాటు కూడా కావాలి. అమ్మానాన్నలు, పిల్లలతో హ్యాపీగా ఉండేందుకు!
- **2** - ఇద్దరు పిల్లలు.. చక్కగా ముత్యాల్లా.
- **1** - అర్థం చేసుకునే భాగస్వామి.
- **0** - జీరో టెన్షన్.

ఇలా చెబుతున్న రీల్స్ ఇన్‌స్టాలో తెగ వైరల్ అయిపోతున్నాయి. మరి మీకు నచ్చితే ఎంచక్కా ఇవన్నీ సాధించేందుకు ట్రై చేసేయండి!



తెలుసా?



ఎప్పుడైనా బాధగా అనిపిస్తే బెస్ట్‌ఫ్రెండ్‌తో మాట్లాడాలి అనుకుంటాం కదా... దీనికో శాస్త్రీయ కారణం ఉంది తెలుసా? 'ఇల్లినాయిస్ అర్బానా ఛాంపైన్ యూనివర్సిటీ' వారి అధ్యయనం ప్రకారం.. 20 నిమిషాలు మన ప్రాణ మిత్రుడితో మాట్లాడితే ఒత్తిడి హార్మోన్ అయిన కార్టిసాల్ స్థాయిలు తగ్గి, మనసుకు ఉపశమనం లభిస్తుందట. అందుకే చాలామంది ఏ బాధ ఉన్నా ఫ్రెండ్స్‌తో చెప్పుకోవడానికే ఎక్కువ ఇష్టపడతారట. మరి మీకు ఎప్పుడైనా ఇబ్బంది కలిగితే ఫ్రెండ్‌కి కాల్ చేయడం మర్చిపోకండి.

కార్పొరేట్ జిందగీ..



కంట్రోల్ 'సి' - సంతోషాలను 'కాపీ' చేసుకుంటూ..

కంట్రోల్ 'వి' - ఇతరుల అభిప్రాయాలను 'పేస్ట్' చేయనివ్వకుండా..

కంట్రోల్ 'ఎక్స్' - అనవసర విషయాలని 'కట్' చేస్తూ..

కంట్రోల్ 'ఎస్' - చిన్న చిన్న మూమెంట్లను 'సేవ్' చేసుకుంటున్నాం!

– కంద ప్రశాంత్

వంద వద్దు బ్రో



పొద్దున్నే కాలేజీకి వెళ్లేటప్పుడు బస్‌లో పాటలు వినాలి. రోజంతా ఖాళీ సమయంలో ఫోన్ బయటకు తీస్తూ ఉండాలి. రాత్రి తిరిగి ఇంటికొచ్చే వరకూ ఆ ఛార్జ్ మిగలాలి. అందుకే మనలో కొందరు ఎప్పుడూ ఛార్జ్ వందశాతం తగ్గకుండా చూసుకుంటారు. పూర్తిగా హండ్రెడ్ పర్సంట్ ఉన్నా సరే కేబుల్ తీయరు. కానీ ఇది అస్సలు మంచిది కాదు తెలుసా! అలా ఫుల్ ఛార్జ్ పెడితే ఫోన్‌లోని లిథియం - అయాన్ బ్యాటరీపై ఒత్తిడి పెరిగి దాని పనితీరు దెబ్బతింటుంది. 100% చేరుకున్న తర్వాత కూడా ప్లగ్ ఉంచితే అది 'ట్రికిల్ ఛార్జింగ్' స్థితిలోకి చేరుతుంది. దీని వల్ల వేడి ఉత్పత్తి అయి బ్యాటరీ చెడిపోతుంది. తప్పనిసరి అయితే అప్పుడప్పుడు ఫుల్ ఛార్జ్ పెట్టుకున్నా పర్వాలేదు కానీ. . తొందరగా బ్యాటరీ పాడవ్వకుండా ఉండాలంటే ఛార్జ్‌ను 20%-80% మధ్య ఉంచాలని చెబుతున్నారు టెక్ గురూలు!

ఆ చూపు అర్థమేమిటో

మబ్బువెనక
చందమామలా
నువ్వు చూసే
ఆ చూపునకు
అర్థమేమిటోనని
పదేపదే పరితపిస్తున్న
నా గుండెకు
వివరిస్తావా
నీ మనసేమిటో!?

- గాలిశెట్టి వేణుగోపాల్

పంచుకుందాం



రూల్ ఉందోయ్



రోజూ జిమ్ చేసి అమ్మాయిల ముందు కండలతో కళకళలాడిపోవాలని మనలో కొందరి ఆరాటం. కానీ మరికొందరు మాత్రం... కనీస వ్యాయామంతో హెల్దీగా ఉంటే చాలని కోరుకుంటారు. అలాంటి కుర్రాళ్లు.. 6-6-6 రూల్ పాటించాలి అంటున్నారు నిపుణులు. ఎలా అంటే...

వాకింగ్‌లో అయితే.. ప్రతిరోజూ ఉదయం లేదా సాయంత్రం 6 గంటలకు 60 నిమిషాల పాటు నడవాలి. దానికంటే ముందు 6 నిమిషాలు వామప్ చేయాలి. ఇది పెరగనున్న బ్లడ్ ఫ్లోకి శరీరాన్ని సిద్ధం చేస్తుంది. నడక పూర్తయ్యాక 6 నిమిషాలు కూల్‌డౌన్ అవ్వాలి. ఇది బాడీని తిరిగి యథాస్థితికి సిద్ధం చేస్తుంది.

స్ట్రెంత్ ట్రైనింగ్‌లో అయితే... ఏ ఎక్సర్‌సైజ్ అయినా ఆ సెట్లను, ప్రతి సెట్‌లో 6 రిపిటేషన్లు ఉండేలా చేయాలి. ప్రతి సెట్ మధ్య 60 సెకెండ్లు విరామం తీసుకోవాలి. ఇది కండరాలను మరింత బలంగా తయారు చేస్తుంది.

ప్రేమ.. స్నేహం.. విధేయత

'నీతో కలకాలం నడుస్తాను.. నీ ప్రేమకు విధేయుడనై నిలుస్తాను'.. ప్రతి ప్రేమికుడు తనకు ఇష్టమైన అమ్మాయికి రింగ్ తొడుగుతూ మనసులోనే వేసుకునే ఒట్టు. ఇలా ప్రేమ, స్నేహం, విధేయతకు చిహ్నంగా.. ఐరిష్ సంప్రదాయంలో ఓ ఉంగరం ఉంది. అదే క్లడాగ్ రింగ్. కిరీటం తొడిగిన హృదయాన్ని.. రెండు చేతులూ పొదివి పట్టుకున్నట్టు ఉంటుంది దీని ఆకారం. ఆ చేతులు మైత్రిని, హృదయం ప్రేమను, కిరీటం లాయల్టీను సూచిస్తాయి. అందుకే బాగా ప్రేమించేవారికి... దీన్ని ఇష్టంగా తొడగడం పరిపాటిగా మారింది.



17వ శతాబ్దంలో రిచర్డ్ జోయిస్ అనే వ్యక్తిని సముద్రపు దొంగలు పట్టుకుని.. బానిసగా అమ్మేశారట. అప్పటికే తన సొంత ఊరిలో ఓ అమ్మాయిని ప్రాణంగా ప్రేమించాడు రిచర్డ్. బానిసగా ఉన్నచోట బంగారం పని నేర్చుకుని అందమైన ఆభరణాలు తయారుచేయడం మొదలుపెట్టాడు. అలా ఆమె కోసం ఓ అందమైన ఉంగరాన్ని తయారుచేశాడు, అదే ఈ డిజైన్. వారిది క్లడాగ్ అనే ఊరు. అందుకే దీనికా పేరొచ్చింది. వారి ప్రేమకు సాక్ష్యంగా ప్రపంచవ్యాప్తంగా దీనికి గుర్తింపు వచ్చింది. మరి మీరు ప్రేమించేవారికీ నచ్చుతుందేమో చూడండి!

చలిచలిలో.. చంకీ లూఫర్స్



ఒకేసారి స్టైల్‌గానూ, బోల్డ్‌గానూ కనిపించాలంటే.. లూఫర్స్ మంచి ఎంపిక. మందపాటి బేస్‌తో మదిదోచే ఈ డిజైన్లు.. వణికించే చలిలో వేడి పుట్టించడానికి మళ్లీ రెడీ అయిపోయాయి. నిజానికి ఇవి మరీ కొత్తవేం కాదు, 90ల్లో పాపులర్ అయిన షూసే! ఎత్తుగా ఉన్నప్పటికీ సౌకర్యవంతంగా అనిపించడం వీటి ప్రత్యేకత. అందులోనూ చంకీ లూఫర్స్ ఇప్పటికే వింటర్ ఫ్యాషన్‌లో అటు అందంతో మెప్పిస్తూ ఇటు పాదాల సంరక్షణలో ముందుంటున్నాయి. మరి వీటిలో ఇంకా ఏమేం టైప్స్ అందుబాటులో ఉన్నాయో, ఎలా మెప్పిస్తున్నాయో ఓ లుక్కేద్దామా!

నిజానికి వీటిలో చాలా వెరైటీలున్నాయి. హీల్ ఎత్తు, లగ్‌సోల్ (దళసరి ట్రెడ్‌తో), ఫ్లాట్‌గా కనిపించే ప్లాట్‌ఫామ్.. ఇలా విభిన్నమైన ఆప్షన్లు చంకీ లూఫర్స్ సొంతం. ఒక్కో సందర్భానికి ఒక్కొక్కటి బాగుంటుంది.

పెన్నీ: డైమండ్ షేప్ కట్‌ఔట్‌తో ఉంటుంది. ఎక్కువగా, అడ్జస్ట్ చేసుకోవడానికి వీలుండే స్ట్రాప్‌తో వస్తాయి. ఎత్తు కాస్త ఎక్కువే కనిపించేలా చేస్తాయి. క్యాజువల్ దుస్తుల మీదకు చక్కగా నప్పుతాయి. జీన్స్ వేసినా, రిలాక్స్ ఫిట్ ప్యాంట్‌తో జతచేసినా బాగా కనిపిస్తాయి.

టాజిల్ : చూడటానికి అందమైన టాజిల్స్‌తో వస్తాయి. లూఫర్స్‌లో అమ్మాయిల మొదటి ఎంపిక ఇదే. కాజువల్, ఫార్మల్.. రెండు విధాలుగానూ ధరించవచ్చు. సెమీ ఫార్మల్ సందర్భాలకు బాగుంటాయి. సాక్స్ లేకుండా ధరించడం వల్ల ఫంకీ లుక్ తీసుకురావచ్చు.

హార్స్‌బిట్ : పాదం పైభాగంలో మెటల్ హార్స్‌బిట్‌తో అందమైన డీటెయిలింగ్ దీని ప్రత్యేకత. ముదురు రంగు జీన్స్‌తో కానీ, ఇతర ఫార్మల్ ఔట్‌ఫిట్‌తో కానీ సరిగ్గా సరిపోతాయి.



లగ్ సోల్: మామూలు దుస్తులు ధరించినా.. వాటిని మరింత ప్రత్యేకంగా కనిపించేలా చేయడం వీటి ప్రత్యేకత. మందంగా, లోతుగా గట్టిగా ఉంటాయి. ప్రతిరోజూ వాడేందుకు సులభంగా అనిపిస్తాయి. ఫార్మల్ దుస్తుల్లో వీటితో కనిపిస్తే.. మెరుపు రెట్టింపు అవ్వడం ఖాయం!

నమ్మకంతో కోరుకో


పదిసార్లు ఒక మాట చెబితే.. పదకొండోసారి అది నిజమైనా కాకపోయినా నమ్మబుద్ధి అవుతుంది అంటారు. అదే 'అనుకోవడానికి' ఉన్న బలం. ఏదైనా జరగాలని అనిపిస్తున్నప్పుడు.. 'బలంగా కోరుకో, అయిపోతుంది' అంటారు, అదే మానిఫెస్టేషన్ ప్రాధాన్యం. అంటే ఏదైనా అవుతుంది అని బలంగా నమ్మడం. నచ్చిన కాలేజీలో సీటు, ప్రయత్నిస్తున్న ఫస్ట్ ర్యాంక్, కోరుకున్న ఉద్యోగం.. ఇలా ఏదైనా సరే, మానిఫెస్టేషన్ ఉండాలి. దీన్ని ఎలా చేయాలంటే..



1. **నిర్ణయం** - మొదటగా ఏం కావాలో కోరుకోవాలి. లక్ష్యం స్పష్టంగా ఉండాలి. ఆ అంశంపై దృష్టి సారించాలి.
2. **నమ్మకం** - మనం కోరుకున్నది కచ్చితంగా జరుగుతుందని బలంగా నమ్మాలి.
3. **స్వీకరించడం** - ఏది జరిగినా మన మంచికే అని పాజిటివ్‌గా రిసీవ్ చేసుకోవాలి.

మనం దేని గురించి ఆలోచిస్తామో దాన్నే ఆకర్షిస్తాం అనేది ఓ థియరీ. మన ఆలోచనాశక్తికి ఉన్న బలం అదని నిపుణులు చెబుతారు. అందుకే బలంగా కోరుకుని పనిచేస్తే.. ఏదైనా సాధ్యమే!

నీవల్లేరా.. థాంక్యూ!



ఏ చిన్న ఫొటో తీసుకున్నా.. వెంటనే సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసేయడం మనకు బాగా అలవాటు. నా ఫ్రెండ్ మోహన్ కూడా ఇదే బాపతు. ఫొటోలు దిగడమంటే ఎంత సరదానో వాడికి! రేపు ఎక్కడికైనా వెళ్తాం, ఫొటోలు తీసుకోవచ్చు అంటే ఇవాళ్టి నుంచే ఏ డ్రెస్ వేసుకోవాలి, ఎలా రెడీ అవ్వాలి అని తెగ ఆలోచించేవాడు. వాడికి ఫొటోలు తీయడం కోసం మమ్మల్ని మునగచెట్టు ఎక్కించేవాడు. ఒకరోజు సరదాగా చుట్టుపక్కల పొలాలు చూడటానికి వెళ్లినప్పుడు.. నన్నలాగే ఉసిగొల్పాడు. 'నువ్వెంత మంచి ఫొటోగ్రాఫరో నీకు తెలియదు. నీలో ఉన్న టాలెంట్ అంతా బయటకు తీయ్! తడాఖా చూపించు' అంటూ ఫోన్ కెమెరా ఆన్ చేసి చేతికిచ్చాడు. 'వీడి పని కోసం ఎంత అయినా పొగుడుతాడు' అని నవ్వుకుంటూ కొన్ని క్లిక్‌మనిపించా. అవి చూస్తుంటే.. చాలా బాగా వస్తున్నాయనిపించింది. అలా తీస్తున్న ఫొటోలు కాస్తా.. పూర్తయ్యేసరికి చాలా సమయం పట్టింది. మొత్తం క్లిక్స్ చూశాక... ఫ్రెండ్స్ అందరూ నన్ను అభినందించడం మొదలుపెట్టారు. నాకు ఫొటోగ్రఫీ టెక్నిక్ అంత బాగా కుదురుతుందనే విషయం అప్పటివరకూ నాక్కూడా తెలియదు. తర్వాత వాటిని మోహన్ సోషల్‌మీడియా ఖాతాల్లో పోస్ట్ చేశాడు. చాలా మంచి కామెంట్లు రావడంతో భలే సంతోషంగా అనిపించింది. 'ఫోన్ కెమెరాతోనే ఇంత బాగా తీస్తే, ఇక ప్రొఫెషనల్ కెమెరా ఉంటే చెలరేగిపోతావ్‌రా' అంటూ ప్రోత్సహించాడు. వాడి మాటలకు ఆ రంగంపై ఆసక్తి పెరిగింది. ఆన్‌లైన్‌లో ఫొటోగ్రఫీ క్లాసులు వినడం మొదలుపెట్టా. మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీ వారి కోర్స్ పూర్తి చేశా. ఆఖర్లో అసైన్‌మెంట్ కోసం మోహన్‌కి తీసిన ఫొటోలే పంపించా. అక్కడ కూడా వాటికి మంచి గుర్తింపు లభించింది. నెమ్మదిగా ఒక సెకెండ్ హ్యాండ్ కెమెరా కొని ఫొటోలు తీయడం ప్రారంభించిన నేను.. ప్రస్తుతం ఒక ఫొటోగ్రఫీ పుస్తకాన్ని రచించానంటే, దానికి కారణం నా ఫ్రెండే! అంతేకాదు, దానిపై వచ్చిన ఆదాయంతో హైఎండ్ ప్రొఫెషనల్ కెమెరాకి ఓనర్‌నయ్యా. వారమంతా చదువుకుంటూ.. వీకెండ్స్‌లో కెమెరా చేతపట్టి నా దేశపు సౌందర్యాన్ని ప్రపంచానికి చూపిస్తున్నా. నాలో ప్రతిభను గుర్తించేలా చేసి, వెన్నుతట్టి ప్రోత్సహించిన నా 'సలార్' మోహన్‌కు కృతజ్ఞతలతో.. – వివేక్.

మనసులో మాట

కొంటె కొటేషన్



పెంపుడు కుక్క జూలు..
యజమానికి జులపాలు! – కొండలరావు, దూసి

కుక్కతో చేశావు కనికట్టు..
అది కరిచిందో నీ పని పట్టు.
– విజయకుమార్, తాళ్లపూడి

కుక్క కదిలితే ఊడిపోవు విగ్గు..
అప్పుడు నువ్వు పడేవు సిగ్గు..
– లద్దగిరి పవన్, ముత్రాసుపల్లి

బాబుగారి జుట్టు భౌభౌ
అందుకే అంటున్నాం వావ్! – దేవరత్నం

పప్పీతో బాబు సెల్ఫీ
చూపరులకు ఇదే కుల్ఫీ – జితేంద్ర

డాగ్ కొట్టేను స్టైలు
నీకు కుదిరిందిలే హెయిర్‌స్టైలు
– సుమన్ కుమార్

తెలుసులే అది కుక్క జూలు
నీ ఫొటో పోజులిక చాలు!
– రాంరెడ్డి, పూడూరు

బొచ్చు డాగ్.. దాన్నే విగ్గు చేసిన డాన్!
– గొందేసి సోలాపురి, కొత్తగూడెం



ఈ ఫొటోకి సరదా వ్యాఖ్య రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.

షాజహాన్

షాజహాన్ కాలంలో మొగల్ వాస్తు, శిల్పకళ అత్యున్నత శిఖరాలకు చేరుకుంది. షాజహాన్ అనేక కట్టడాలను ఆగ్రా, ఢిల్లీ నగరాల్లో నిర్మించాడు.

ఆగ్రాకోటలోని నిర్మాణాలు: దివాన్-ఐ-ఆమ్, దివానీ ఖాస్, శీష్ మహల్, ఖాస్ మహల్, జాస్మిన్ ప్యాలెస్, పూర్తి పాలరాతితో నిర్మించిన మోతీ మసీదు.

❖ ఆగ్రాలో యమునా నది ఒడ్డున అద్భుతమైన తాజ్‌మహల్‌ను నిర్మించాడు. ఇది తన భార్య ముంతాజ్ మహల్ (అర్జుమండ్ బాను బేగం) సమాధి. షాజహాన్ సమాధి కూడా ఇందులోనే ఉంటుంది.

తాజ్‌మహల్ విశిష్టతలు: దీన్ని 1631-53 మధ్య ఉస్తాద్ ఈసా ఆధ్వర్యంలో నిర్మించారు.

❖ అష్ట భుజాకారంలో ఉంటుంది. పొడవు, వెడల్పులు సమానంగా ఉంటాయి.

❖ ఒక ఎత్తయిన వేదికపై చార్‌బాగ్ అనే ఉద్యానవనంలో ఉంటుంది.

❖ మక్రాన గనుల నుంచి తెచ్చిన పాలరాయిని దీని నిర్మాణానికి ఉపయోగించారు. ఇందులో అందమైన, అత్యంత ఖరీదైన పిత్రదుర అలంకరణ ఉంటుంది.

❖ రెండు గుమ్మటాలు, నాలుగు అందమైన మినార్‌లు ఉంటాయి.

❖ ఢిల్లీలో 1639-48 మధ్యలో ఉస్తాద్ హమీద్ ఆధ్వర్యంలో షాజహాన్ ఎర్రకోటను నిర్మించారు.

ఎర్రకోటలోని నిర్మాణాలు: రంగ్‌మహల్ లేదా ఇంతియాజ్ మహల్, ఖాస్ మహల్. నహర్-ఐ-బిహిష్, దివాన్-ఐ-ఆమ్.

దివాన్-ఐ-ఖాస్: ఇక్కడే సుప్రసిద్ధమైన నెమలి సింహాసనం ఉండేది. దివాన్-ఐ-ఖాస్ గోడలపై అమీర్ ఖుస్రూ రాసిన 'భూమిపై స్వర్గం ఇదే' అనే కవిత లిఖించి ఉంటుంది.

❖ ఢిల్లీలోని ఎర్రకోటకు సమీపంలో షాజహాన్ జామా మసీదును నిర్మించాడు. ఇది భారతదేశంలోని అత్యంత పెద్ద మసీదుల్లో ఒకటి.



మొగల్ సామ్రాజ్యం - వాస్తు, శిల్ప కళలు

బీబీ కా మక్బారా దక్కన్ తాజ్‌మహల్

మొగలుల కాలంలో వాస్తు, శిల్పకళా రంగం అత్యున్నత స్థాయికి చేరింది. అత్యంత సుందరమైన, అద్భుతమైన కట్టడాలను మొగల్ చక్రవర్తులు నిర్మించారు. ఇండో పర్షియన్ శిల్ప కళారీతిని అత్యున్నత శిఖరాలకు చేర్చిన ఘనత మొగల్ చక్రవర్తులదే. వీరు తొలి కట్టడాలను ఎర్ర ఇసుకరాయితో నిర్మించగా, జహంగీర్ కాలం నుంచి పాలరాతి వాడకం పెరిగింది. పేరుగాంచిన సుప్రసిద్ధ చిత్రకారులు వీరి కాలంలో ఉండేవారు. వీరు హిందుస్తానీ సంగీతాన్ని ఆదరించారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు తాన్‌సేన్ అక్బర్ కాలానికి చెందినవాడు.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

భారతదేశ చరిత్ర



మొగల్ చక్రవర్తులు - ముఖ్య కట్టడాలు

బాబర్

ఇతడికి వాస్తు, శిల్పకళలో అభిరుచి ఉన్నప్పటికీ భారతదేశంలో ఇతడి పాలనా కాలం తక్కువగా ఉండటంతో చెప్పుకోదగిన నిర్మాణాలు చేపట్టలేదు. కేవలం నాలుగు అతిసాధారణ మసీదులను మాత్రమే నిర్మించాడు. ఇవి పానిపట్, ఆగ్రా, ఢిల్లీ సమీపంలోని సంభాల్, అయోధ్యలో ఉన్నాయి.

హుమయూన్

వాస్తవంగా మొగల్ వాస్తు శిల్పకళా నైపుణ్యానికి నిదర్శనంగా ఢిల్లీలోని హుమయూన్ సమాధిని పేర్కొనవచ్చు. దీన్ని హుమయూన్ మరణానంతరం, ఆయన భార్య హమీదా బాను బేగం నిర్మించింది. యునెస్కో దీన్ని ప్రపంచ వారసత్వ కేంద్రంగా గుర్తించింది.

ఈ కట్టడం ముఖ్య లక్షణాలు: అష్ట భుజాకారంలో నిర్మించారు.

✦ ఎత్తయిన వేదికపై ఉద్యానవనం మధ్యలో ఉంటుంది.

✦ ఒకదాని కింద మరొకటిగా నిర్మించిన రెండు గుమ్మటాలు ఉంటాయి.

✦ గుమ్మటాలు మాత్రం పాలరాతితో ఉండగా, మొత్తం కట్టడాన్ని ఎర్ర ఇసుకరాయితో నిర్మించారు.

✦ ఈ కట్టడంలో మినార్‌లు లేకపోవడం విశేషం.

✦ ఇది సమర్ఖండ్‌లోని తైమూర్ సమాధిని పోలి ఉంటుంది.

అక్బర్

ఆగ్రాలోని ఎర్రకోట, లాహోర్ కోట, అలహాబాద్ కోటలను నిర్మించాడు.

▮ 1572లో ఆగ్రాకు 36 కి.మీ.ల దూరంలో ఫతేపూర్ సిక్రీ అనే కొత్త రాజధాని నగరాన్ని నిర్మించాడు. దీన్ని రాజధానిగా చేసుకుని అక్బర్ 1572-86 వరకు పరిపాలన కొనసాగించాడు. అనంతరం నీటి కొరత కారణంగా రాజధానిని లాహోర్‌కు మార్చాడు. కొంతకాలం తర్వాత రాజధానిని తిరిగి ఆగ్రాకు మార్చాడు. అక్బర్ ఫతేపూర్ సిక్రీ నగరంలో అనేక కట్టడాలను నిర్మించాడు. వాటిలో ముఖ్యమైనవి:

▮ **దివాన్-ఐ-ఆమ్:** ప్రజలను కలిసే సమావేశ మందిరం

▮ **దివాన్-ఐ-ఖాస్:** అధికారులను కలిసే సమావేశ మందిరం.

▮ జామా మసీదు

▮ **షేక్ సలీం చిష్తీ దర్గా:** ఇది అక్బర్ మతగురువు షేక్ సలీం చిష్తీ సమాధి. దీన్ని జామా మసీదు ఆవరణలో పాలరాతితో నిర్మించారు.

▮ **బులంద్ దర్వాజ:** ఇది జామా మసీదు, షేక్ సలీం చిష్తీ దర్గాకు ద్వారం. దీని ఎత్తు 180 అడుగులు, వెడల్పు 90 అడుగులు. ప్రపంచంలోనే అత్యంత పెద్ద ద్వారమైన బులంద్ దర్వాజాను యునెస్కో ప్రపంచ వారసత్వ కేంద్రంగా గుర్తించింది.

▮ జోథాబాయ్ ప్యాలెస్, సుల్తానా ప్యాలెస్, మరియం ప్యాలెస్, బీర్బల్ ప్యాలెస్. ▮ ఇబాదత్ ఖానా

▮ **పంచ్‌మహల్:** ఇది అయిదు అంతస్తుల కట్టడం. బౌద్ధ విహార ఆకారంలో నిర్మించారు.

▮ అక్బర్ సమాధిని ఆగ్రా శివార్లలో సికంద్రా వద్ద నిర్మించారు. దీన్ని నిర్మాణాన్ని అక్బర్ స్వయంగా ప్రారంభించగా, అతడి కుమారుడు జహంగీర్ పూర్తిచేశాడు. దీనికి నాలుగు వైపులా పాలరాతితో నిర్మించిన మినార్‌లు ఉంటాయి.

జహంగీర్

ఇతడు చిత్రలేఖనానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి వాస్తు, శిల్ప కళలను నిర్లక్ష్యం చేశాడు. కానీ ఇతడి భార్య నూర్జహాన్ రెండు ప్రధాన కట్టడాలను నిర్మించింది. అవి:

జహంగీర్ సమాధి: ఇది లాహోర్ సమీపంలోని షాదారా అనే ప్రాంతంలో దిల్‌కుషా ఉద్యానవనంలో ఉంది.

ఇత్‌మత్ ఉద్దౌల సమాధి: నూర్జహాన్ తన తండ్రి ఇత్‌మత్ ఉద్దౌల సమాధిని ఆగ్రాలో నిర్మించింది. ఇది పూర్తిగా పాలరాతితో నిర్మించిన తొలి మొగల్ సమాధి. ఇందులోనే మొదటిసారిగా పిత్రదుర అలంకరణ కనిపిస్తుంది. రంగురంగుల వైఢూర్యాలను పాలరాతి గోడల్లో పొదగడాన్ని 'పిత్రదుర' అంటారు.

ఔరంగజేబ్

ఔరంగజేబ్ సనాతనవాదం మొగల్ వాస్తు శిల్పకళ అంతమయ్యేలా చేసింది. ఇస్లాం ప్రకారం రాజు ప్రజాధనాన్ని విలాసాల కొరకు దుర్వినియోగం చేయకూడదు. ఈ సూత్రాన్ని ఔరంగజేబ్ అమలు చేయడంతో మొగల్ వాస్తు శిల్పకళలు అంతమయ్యాయి. మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లాల్లో ఖులాదబాద్ అనే పట్టణంలో ఔరంగజేబ్‌ని అత్యంత సామాన్యుడిలా సమాధి చేశారు. కేవలం రూ.14 ఖర్చుతో ఇతని దహన సంస్కారాలు పూర్తి చేశారు.

☛ ఔరంగజేబ్ కాలంలో మూడు కట్టడాలు నిర్మితమయ్యాయి. అవి...

1) లాహోర్‌లోని బడాషాహీ మసీదు

2) ఢిల్లీ ఎర్రకోటలోని మోతీ మసీదు

3) ఔరంగాబాద్‌లోని బీబీ కా మక్బారా: ఇది ఔరంగజేబ్ భార్య రబియా-ఉద్-దుర్రాని సమాధి.

● ఈమె అసలు పేరు దిల్రస్ భాను బేగం. ఔరంగజేబ్ కుమారుడు ఆజం షా దీన్ని నిర్మించాడు. ఇది తాజ్‌మహల్‌ను పోలి ఉండటంతో దీన్ని దక్కన్ తాజ్‌మహల్ అంటారు.



రచయిత
డాక్టర్ ఎం. రవి కుమార్
విషయ నిపుణులు

817 Word of the Day

Curtail

Telugu meaning: కుదించు, తగ్గించు

English meaning: The word curtail (కర్టైల్) is a verb that means to reduce, shorten, or limit something.

Synonyms: Lessen, Restrict

Antonyms: Expand, Extend

Usage: **1.** Due to a shortage of funds, the company decided to curtail its overseas operations.

2. The new law aims to curtail the misuse of personal data by online platforms.

కరెంట్ అఫైర్స్



భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్‌ను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 2025, అక్టోబరు 30న ఉత్తర్వులు జారీచేశారు. ఈయన నవంబరు 24న సీజేఐగా పదవీ ప్రమాణం చేస్తారు. 2027 ఫిబ్రవరి 9 వరకు పదవిలో కొనసాగుతారు. భారత 50వ ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ చంద్రచూడ్ తర్వాత జస్టిస్ సూర్యకాంత్ అత్యధిక కాలం సీజేఐగా బాధ్యతలు నిర్వహించబోతున్నారు.



ప్రముఖ ఆన్‌లైన్ నిఘంటువు వెబ్‌సైట్ 'డిక్షనరీ.కామ్' ఈ ఏడాది (2025) వర్డ్ ఆఫ్ ద ఇయర్‌గా '67'ను ప్రకటించింది. ఈ సంఖ్యను కౌమారదశలోకి అడుగుపెట్టినవారు, జెన్ ఆల్ఫా (2010-2025 మధ్య జన్మించినవారు) విపరీతంగా వినియోగిస్తున్నారు. 67ను కలిపి కాకుండా విడివిడి (ఆరు, ఏడు)గా చదవాలి.

● ఈ సంఖ్య అర్థంపై పూర్తి స్పష్టతలేదు. ఏదో ఊరికే అలా వాడే పదం. దీన్ని నిర్వచించడం అసాధ్యం అని డిక్షనరీ.కామ్ వెల్లడించింది.



టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ రోహిత్ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచిన అతడు.. రెండు స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. ఆఫ్గనిస్థాన్ బ్యాటర్ ఇబ్రహీం జద్రాన్ రెండో, భారత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మూడో స్థానంలో ఉన్నారు.

వాతావరణ మార్పులతో ముడిపడిన వేడిగాలులు అధికమవడం వల్ల భారతదేశం గత ఏడాది 24,700 కోట్ల పని గంటలను కోల్పోయిందని ఇటీవల విడుదలైన లాన్సెట్ నివేదిక వెల్లడించింది. ఇది ఆర్థికంగా రూ.17.11 లక్షల కోట్ల (194 బిలియన్ డాలర్లు) ఆదాయాన్ని నష్టపోవడంతో సమానమని పేర్కొంది. ప్రతి భారతీయుడు 2024లో 420 పని గంటలను కోల్పోయాడని విశ్లేషించింది. 'పర్యావరణ మార్పులు.. ఆరోగ్యంపై ప్రభావం-2025' పేరుతో ప్రచురించిన నివేదికలో ఈ వివరాలను వెల్లడించింది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ఎయిర్‌పోర్ట్ లేని దేశాల జాబితా

స్టడీ జోన్

దేశాభివృద్ధికి కీలకమైన మౌలిక సదుపాయాల్లో విమానయాన రంగం ఒకటి. వాయుమార్గాల ద్వారా రవాణా అనేది వేగవంతమైన, ఖరీదైన విధానం. ఈ రంగం ఆధునిక ప్రపంచంలో రవాణాలో అనేక విప్లవాత్మక మార్పులు తెచ్చింది. ప్రయాణికులు, సరకుల తరలింపులో దేశాలను, దూరాలను దగ్గర చేస్తూ పర్యాటకం, వాణిజ్యం లాంటి ఎన్నో రంగాలకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు విమానయాన రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఎయిర్‌పోర్ట్స్ నిర్మాణం - విస్తరణ, కొత్త టెర్మినళ్ల ఏర్పాటు లాంటి అంశాలపై దృష్టి సారిస్తున్నాయి. అయితే ప్రపంచంలోని కొన్ని దేశాల్లో నేటికీ ఎయిర్‌పోర్టులు లేవు.. అక్కడ విమానాలు దిగలేవు. అవేంటో ఇవాళ్టి స్టడీ జోన్‌లో చూసేద్దాం..!

భౌగోళిక అంశాలు, పరిమాణం, ఐసోలేషన్ కారణంగా కొన్ని దేశాల్లో నేటికీ విమానాలు సంచరించే వీలు లేదు. ఎయిర్‌పోర్టులు లేని దేశాలను పరిశీలిస్తే..



అండోరా: ఇది పశ్చిమ యూరప్‌లో ఫ్రాన్స్, స్పెయిన్ దేశాల మధ్య పైరినీస్ పర్వతాల్లో ఉంది. రాజధాని అండోరా లా వెల్లా. ఎక్కువ భూభాగం పర్వతాలు, గుట్టలతో నిండి ఉండటం వల్ల విమానం టేకాఫ్‌కు రన్ వే కష్టంగా ఉంటుంది.

మొనాకో: పశ్చిమ యూరప్‌లోని ఫ్రెంచ్ రివేరాలో ఉంది. ఇది మూడు వైపులా ఫ్రెంచ్‌తో సరిహద్దు పంచుకుంటుంది. నాలుగో వైపు మధ్యధరా సముద్రం ఉంది. విస్తీర్ణం 2.1 చ.కి.మీ.

లీక్టెన్‌స్టెయిన్: మధ్య ఐరోపాలో స్విట్జర్లాండ్, ఆస్ట్రియా దేశాల మధ్య ఉంది. తక్కువ పరిమాణం, పర్వత భూభాగం, చదునైన నేల తక్కువగా ఉండటంతో ఇక్కడ విమానాశ్రయం లేదు.

శాన్ మారినో: దక్షిణ ఐరోపాలో అపెనైన్ పర్వతాల ఈశాన్య భాగంలో ఇటాలియన్ ద్వీపకల్పంలో ఉంది. దేశం పర్వత ప్రాంతంలో, తక్కువ వైశాల్యంలో ఉండటం, విమానాలు తిరిగేందుకు అవసరమైన రన్ వే లేకపోవడం లాంటి కారణాల వల్ల ఇక్కడ ఎయిర్‌పోర్ట్ లేదు.

వాటికన్ సిటీ: ఇటలీలోని రోమ్‌లో ఉంది. తక్కువ వైశాల్యం కారణంగా ఎయిర్‌పోర్ట్ కట్టడం అసాధ్యం

2008లో యునెస్కో ప్రపంచ వారత్వ ప్రదేశాల్లో ఒకటిగా ప్రకటించిన ప్రాంతం ఏది? మన దేశంలోని ఏ విమానాశ్రయం వాటికన్ సిటీ కంటే పెద్దది? తెలుసుకోవడానికి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - రసాయనశాస్త్రం

రూపాంతరత

ఒక మూలకం రెండు లేదా అంతకంటే ఎక్కువ భౌతిక రూపాలను కలిగి ఉండటాన్ని 'రూపాంతరత' అంటారు. ఆ భౌతిక రూపాలను రూపాంతరాలు అంటారు. రూపాంతరాలు రసాయనిక ధర్మాల్లో సారూప్యతను కలిగి ఉండి, భౌతిక ధర్మాల్లో విభేదిస్తాయి. ఒక మూలకంలోని పరమాణువుల అమరికలో తేడాల వల్ల రూపాంతరాలు ఏర్పడతాయి.

కార్బన్ రూపాంతరాలు

రూపాంతరత ప్రదర్శించే మూలకాల్లో కార్బన్ అత్యంత ముఖ్యమైంది.


✦ కార్బన్ స్ఫటిక, అస్ఫటిక రూపాల్లో ఉంటుంది.

బక్‌మిన్‌స్టర్ ఫుల్లరిన్

ఫుల్లరిన్ అణువులో సాకర్ బంతిని పోలిన నిర్మాణంలో 60 కార్బన్‌లు అమరి ఉంటాయి. అందుకే దీన్ని బక్‌మిన్‌స్టర్ ఫుల్లరిన్ అంటారు.

బొగ్గు

వాయురహిత స్థితిలో వృక్ష, జంతుజాలాలు భూపొరల్లో నిక్షిప్తమై ఉంటాయి. అప్పుడు అవి వియోగ చర్యలకు గురై బొగ్గు ఏర్పడుతుంది.



ఫాస్ఫరస్ రూపాంతరాలు

15వ గ్రూపు మూలకాల్లో ఫాస్ఫరస్‌కు అనేక రూపాంతరాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి.

✦ తెల్ల ఫాస్ఫరస్

✦ ఎర్ర ఫాస్ఫరస్

✦ నల్ల ఫాస్ఫరస్

వజ్రం, గ్రాఫైట్, కోక్, చార్‌కోల్, సల్ఫర్ రూపాంతరాలు మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

టెక్నీషియన్ పోస్టులు

హోమి బాబా క్యాన్సర్ హాస్పిటల్ ముజఫర్‌పూర్ తాత్కాలిక ప్రాతిపదికన టెక్నీషియన్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 13. అర్హులైన అభ్యర్థులు 14 నవంబరు 2025న ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చు.

ఇంటర్న్‌షిప్ పోస్టులు

డీఆర్‌డీవో - టెర్మినల్ బాలిస్టిక్స్ రిసెర్చ్ ల్యాబొరేటరీ (టీబీఆర్ఎల్) చండీగఢ్ ఇంజినీరింగ్/సైన్స్‌లో అండర్ గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్ ఇంటర్న్‌షిప్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 41. ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 17 నవంబరు 2025.

ప్రాజెక్ట్ స్టాఫ్ ఉద్యోగాలు

రాజస్థాన్ పిలానీలోని సీఎస్ఐఆర్‌కు చెందిన సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఈఈఆర్ఐ) తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 23. అర్హులైన అభ్యర్థులు 2025, నవంబరు 9లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (నవంబరు 1) చివరి తేదీ

▮ ఐఐటీ బెంగళూరులో రిసెర్చ్ అసోసియేట్ పోస్టులు. బీటెక్/ ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.

▮ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో పోస్టులు. డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Railway Exams

Mathematics

Probability

1. A person claims to tell the truth 3 times out of 4. He rolls a fair six-sided die and reports that the outcome is a six. What is the probability that the die actually shows a six?

A) $\frac{1}{8}$ B) $\frac{3}{8}$ C) $\frac{1}{4}$ D) $\frac{3}{10}$

2. A card is drawn at random from a standard deck of 52 playing cards. What is the probability of getting a king or a heart?

A) $\frac{4}{13}$ B) $\frac{2}{13}$ C) $\frac{1}{4}$ D) $\frac{17}{52}$

3. Two dice are thrown simultaneously. Find the probability of getting a sum of 9.

A) $\frac{1}{9}$ B) $\frac{2}{9}$ C) $\frac{1}{12}$ D) $\frac{1}{8}$

4. A bag contains balls numbered from 1 to 40. One ball is drawn at random. What is the probability that the number on the ball is divisible by 5 or 8?

A) $\frac{1}{4}$ B) $\frac{3}{10}$ C) $\frac{2}{5}$ D) $\frac{11}{40}$

5. A problem is given to three students whose chances of solving it are $\frac{1}{5}$, $\frac{1}{4}$, and $\frac{1}{3}$, respectively. What is the probability that the problem will be solved?

A) $\frac{3}{5}$ B) $\frac{11}{20}$ C) $\frac{7}{10}$ D) $\frac{2}{3}$

6. Five teachers - P, Q, R, S, and T - are being considered for a three-member academic delegation to represent their school at an education summit. What is the probability that teacher P gets selected?

A) $\frac{3}{5}$ B) $\frac{3}{10}$ C) $\frac{1}{2}$ D) $\frac{2}{5}$

7. Bag X contains 3 red and 5 blue balls. Bag Y contains 4 red and 6 blue balls. One ball is drawn at random from each bag. What is the probability that both balls drawn are blue?

A) $\frac{3}{10}$ B) $\frac{1}{4}$ C) $\frac{1}{3}$

D) None of these

8. From a standard deck of 52 cards, all red Jacks and red Queens are removed. If one card is drawn at random from the remaining deck, what is the probability that it is a Heart?

A) $\frac{9}{25}$ B) $\frac{1}{2}$ C) $\frac{11}{48}$ D) $\frac{12}{25}$

9. When four coins are tossed simultaneously, what is the probability of getting at least one tail?

A) $\frac{15}{16}$ B) $\frac{1}{4}$ C) $\frac{3}{4}$ D) $\frac{7}{8}$

10. A bag contains 5 red, 7 blue, and 8 green balls. If two balls are drawn at random, what is the probability that both balls are blue?

A) $\frac{4}{130}$ B) $\frac{21}{190}$ C) $\frac{12}{150}$ D) $\frac{11}{60}$

11. A fruit basket contains 8 mangoes and 12 bananas, out of which 2 mangoes and 3 bananas are defective. If two fruits are chosen at random, what is the probability that either both are bananas or both are non-defective?

A) $\frac{93}{190}$ B) $\frac{89}{190}$ C) $\frac{33}{41}$ D) $\frac{27}{38}$

12. Bag A contains 3 white and 5 black balls. Bag B contains 4 white and 6 black balls. If one ball is drawn from each bag, find the probability that both balls are black.

A) $\frac{3}{10}$ B) $\frac{1}{4}$ C) $\frac{1}{3}$ D) $\frac{3}{8}$

13. A bag contains 5 white and 7 red balls. Three balls are drawn at random. What is the probability that exactly two balls are white and one is red?

A) $\frac{25}{143}$ B) $\frac{35}{143}$ C) $\frac{30}{143}$ D) $\frac{7}{22}$

14. A speaks the truth 4 out of 6 times and B speaks the truth 5 out of 8 times. What is the probability that they contradict each other while stating the same fact?

A) $\frac{23}{48}$ B) $\frac{25}{48}$ C) $\frac{11}{24}$ D) $\frac{13}{24}$

15. In a test of 12 questions, a teacher finds that a student answered four questions incorrectly. What is the probability that the eighth reviewed question is the last wrong question checked by the teacher?

A) $\frac{3}{55}$ B) $\frac{4}{165}$ C) $\frac{2}{33}$ D) $\frac{7}{99}$

16. Three cards are drawn one after another with replacement from a well-shuffled deck of 52 playing cards. What is the probability that the first card is a Queen, the second card is red, and the third card is an odd-numbered card?

A) $\frac{2}{169}$ B) $\frac{3}{104}$

C) $\frac{9}{104}$ D) $\frac{1}{169}$

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

జీవన ప్రమాణాలకు మెరుగైన కొలమానం!

జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ

దేశ అభివృద్ధి స్థాయిని తెలియజేసే ప్రామాణిక కొలమానమే మానవ అభివృద్ధి సూచిక. ఇది ఆర్థికాభివృద్ధికి మాత్రమే కాకుండా మానవ శ్రేయస్సుకూ ప్రాధాన్యం ఇస్తుంది. ప్రజల ఆరోగ్యం, విద్యాస్థాయి, జీవన ప్రమాణాల సగటును ప్రతిబింబిస్తుంది. దేశానికి నిజమైన సంపద ప్రజలే అని స్పష్టం చేస్తున్న ఈ సూచికకు ఉన్న ప్రాధాన్యం, లెక్కించే విధానంపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. మానవాభివృద్ధి సూచికలో భారతదేశ స్థాయి, స్థానం, ప్రమాణాలు మెరుగయ్యేందుకు తీసుకోవాల్సిన చర్యలు, రావాల్సిన విధాన మార్పులు, ప్రస్తుతం ఉన్న సవాళ్లను తెలుసుకోవాలి.







"ప్రజల ఎంపికలను విస్తృతం చేయడంతో పాటు ప్రజాశ్రేయస్సును పెంపొందించే క్రమమే మానవాభివృద్ధి సూచిక.
- మహబూబ్ ఉల్ హక్, హెచ్‌డీఐ రూపశిల్పి

మానవ అభివృద్ధి సూచిక

దేశ ప్రగతిని అంచనా వేయడానికి, ప్రజల జీవన నాణ్యతను తెలియజేయడానికి ఉన్న అంతర్జాతీయ ప్రామాణిక కొలమానం 'మానవ అభివృద్ధి సూచిక (హెచ్‌డీఐ)'. ప్రజల ఆయుర్దాయం, విద్య, జీవన ప్రమాణాలు తదితర మానవ వనరుల గణాంకాల మిశ్రమ సూచిక ఇది. ఒక దేశ అభివృద్ధిని గుర్తించడానికి ఆర్థిక వృద్ధి మాత్రమే సరిపోదని, అక్కడి ప్రజలు, వారి సామర్థ్యాలే అంతిమప్రమాణాలుగా ఉండాలనే లక్ష్యంతో ఈ సూచికను సృష్టించారు. ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం(యూఎన్‌డీపీ) నిర్వహించే మానవాభివృద్ధి కార్యాలయం రూపొందించిన నివేదికలో హెచ్‌డీఐ మూలాలు ఉన్నాయి. దీనిని 1990లో పాకిస్థాన్ ఆర్థికవేత్త మహబూబ్ ఉల్ హక్ రూపొందించారు. అభివృద్ధి, ఆర్థికాంశాల దృష్టిని జాతీయ ఆదాయం లెక్కల నుంచి ప్రజలు కీలకంగా ఉండే విధానాలకు మార్చాలనే స్పష్టమైన ఉద్దేశం ఇందులో ఉంది. ఆర్థిక పురోగతి ద్వారా మాత్రమే కాకుండా ప్రజల సంక్షేమంలో మెరుగుదల ద్వారా కూడా అభివృద్ధిని అంచనావేయవచ్చని తెలియజేస్తుంది.

హెచ్‌డీఐ గణన: 2010 నుంచి మూడు అంశాల్లో సాధించిన సగటు ఫలితాలతో హెచ్‌డీఐను లెక్కిస్తున్నారు.

1) దీర్ఘకాల ఆరోగ్యవంతమైన జీవనం: దీనిని ఆయుర్దాయంలో కొలుస్తారు.

2) విద్య/విజ్ఞానం: సగటు పాఠశాల విద్యా సంవత్సరాలు (MYSI), పాఠశాల విద్య అంచనా సంవత్సరాలు (EYSI).

3) మెరుగైన జీవన ప్రమాణం: దీనిని వాస్తవ తలసరి జీడీపీ ద్వారా కొలుస్తారు. (డాలర్లలో కొనుగోలు శక్తి - పర్చేజింగ్ పవర్ ఆఫ్ పారిటీ)

✿ ఆయుర్దాయం, విద్య, జీవన ప్రమాణం.. ఈ మూడింటికీ సమాన ప్రాధాన్యం ఉంటుంది.

హెచ్‌డీఐ లెక్కించే సూత్రం

$$\text{హెచ్‌డీఐ} = \frac{\text{వాస్తవ విలువ (సాధించిన విలువ) - కనిష్ఠ విలువ}}{\text{గరిష్ఠ విలువ - కనిష్ఠ విలువ}}$$

హెచ్‌డీఐ లెక్కించడానికి తీసుకున్న కనిష్ఠ, గరిష్ఠ విలువల పట్టిక.

అంశం	కనిష్ఠ విలువ	గరిష్ఠ విలువ
ఆయుర్దాయం	20 సంవత్సరాలు	85 సంవత్సరాలు
విజ్ఞానం/ విద్య:		
★ ఎమ్‌వైఎస్ఐ	0	15 సంవత్సరాలు
★ ఈవైఎస్ఐ	0	18 సంవత్సరాలు
తలసరి ఆదాయం	$ 100	$ 75,000




ఈ విలువల ఆధారంగా హెచ్‌డీఐ = $\sqrt[3]{(LEI + EAI + SLI)}$

ఎల్ఈఐ: జనన సమయంలో ఆయుర్దాయం. **ఈఏఐ:** **ఎమ్‌వైఎస్ఐ–** సగటు పాఠశాల విద్యాసంవత్సరాలు అనేది 25 ఏళ్ల కంటే ఎక్కువ వయసున్న విద్యార్థి వాస్తవానికి పొందిన సగటు విద్యా సంవత్సరాలు.

ఈవైఎస్ఐ: పాఠశాల విద్య అంచనా ఏళ్లు అంటే ఒక విద్యార్థి పాఠశాల నుంచి విశ్వవిద్యాలయం వరకు ఎన్నేళ్లు హాజరుకావాలో లెక్కించడం.

ఎస్ఎల్ఐ: జీవన ప్రమాణ సూచిక.



హెచ్‌డీఐ వర్గీకరణ: ఆ సూత్రం ప్రకారం ప్రతి దేశానికి 0 నుంచి 1 మధ్య విలువ వస్తుంది. దీని ఆధారంగా ప్రపంచ దేశాలను 4 రకాలుగా వర్గీకరించారు.

అత్యంత ఉన్నత మానవాభివృద్ధి (0.800 నుంచి 1.0): ఉన్నతమైన జీవనప్రమాణాలు, అద్భుతమైన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు, దీర్ఘఆయుర్దాయం ఉన్న దేశాలను సూచిస్తుంది.

అధిక మానవాభివృద్ధి (0.700 – 0.799): ఉన్నత స్థాయి మానవాభివృద్ధి సాధించిన దేశాలు.


మధ్యస్థ మానవాభివృద్ధి (0.550 – 0.700): ఇప్పటికీ అభివృద్ధి దశలోనే ఉన్న దేశాలు. అయితే విద్య, ఆరోగ్య సంరక్షణ మెరుగుదలలో పురోగతి ఉంటుంది.

తక్కువ మానవాభివృద్ధి (0.550 కంటే తక్కువ): గణనీయమైన సవాళ్లు ఎదుర్కొంటున్న దేశాలు. విస్తృత పేదరికం, ప్రాథమిక విద్య, ఆరోగ్య సంరక్షణకు పరిమిత అవకాశాలు, తక్కువ జీవనప్రమాణాలు, అల్ప ఆయుర్దాయం లాంటివి ఉంటాయి.

మానవాభివృద్ధి నివేదిక - 2025 భారతదేశ పురోగతి

యూఎన్‌డీపీ 'ఎ మ్యాటర్ ఆఫ్ ఛాయిస్, పీపుల్స్ అండ్ పాజిబిలిటీస్ ఇన్ ది ఏజ్ ఆఫ్ ఏఐ' శీర్షికతో విడుదల చేసిన 2025 మానవాభివృద్ధి నివేదికలో భారతదేశం 193 దేశాల జాబితాలో 130వ స్థానంలో నిలిచింది. 2022లో భారత్ 133వ స్థానంలో ఉండగా 2025లో 130వ స్థానానికి మెరుగైంది. హెచ్‌డీఐ విలువ 0.676 నుంచి 0.685కి పెరిగింది. దీని ప్రకారం భారత్ గణాంకపరంగా అధిక మానవాభివృద్ధి స్థాయికి చేరుకున్నప్పటికీ వాస్తవానికి మధ్యస్థ మానవాభివృద్ధి విభాగంలోనే ఉంది.

ఆయుర్దాయం: దేశ ప్రజల సగటు ఆయుర్దాయం 1990లో 58.6 సంవత్సరాల నుంచి ప్రస్తుతం 72 ఏళ్లకు పెరిగింది. జాతీయ ఆరోగ్య మిషన్, ఆయుష్మాన్ భారత్, జననీ సురక్ష యోజన, పోషణ్ అభియాన్ లాంటి కార్యక్రమాలు ఇందుకు దోహదపడ్డాయి.



విజ్ఞానం: భారత్‌లో సగటు పాఠశాల విద్యాసంవత్సరాలు పెరిగాయి. ప్రతి విద్యార్థి పాఠశాలలో 13 ఏళ్లకు పైగా ఉంటున్నట్లు అంచనా. 1990లో ఇది కేవలం 8.2 సంవత్సరాలే. 2009లో చేసిన విద్యాహక్కు చట్టం, జాతీయ విద్యావిధానం-2020, సమగ్ర శిక్షా అభియాన్ లాంటి విద్యాపథకాలు ఇందుకు దోహదం చేశాయి.

తలసరి స్థూల జాతీయాదాయం: 1990లో 2,167 డాలర్లు ఉండగా, 2023 నాటికి 9046.7 డాలర్లకు పెరిగింది.

ఏఐ (AI) నైపుణ్యాభివృద్ధి: భారతదేశంలో ఏఐ నైపుణ్యాల వ్యాప్తి, అభివృద్ధి వేగవంతంగా జరుగుతోంది. ప్రపంచవ్యాప్త ఏఐ పరిశోధకుల్లో 20% భారత్‌లోనే ఉన్నారు.

భారతీయ మానవాభివృద్ధి సూచీ - ప్రభావితం చేసే సవాళ్లు, పరిష్కారాలు

✿ హెచ్‌డీఐకి సంబంధించిన అన్ని అంశాల్లో భారతదేశం స్థిరమైన పురోగతి సాధించినప్పటికీ, విపరీతమైన అసమానతలు ఈ విజయాలను తగ్గించాయి. అసమానతల కారణంగానే భారత హెచ్‌డీఐ 30.7% తగ్గిందని నివేదిక పేర్కొంది. ✿ మహిళా శక్తి భాగస్వామ్యం, రాజకీయ ప్రాతినిధ్యంలో దేశం ఇంకా వెనుకంజలోనే ఉంది. ఫలితంగా లింగ అసమానత అధికంగా నమోదవుతోంది. ✿ లింగ సమానత్వం కోసం చట్టసభల్లో మహిళలకు 1/3వ వంతు రిజర్వేషన్లు కల్పించాలి. ✿ చట్టపరమైన సంస్కరణల్లో భాగంగా లింగ ఆధారిత హింస, బాల్యవివాహాలు, కార్యాలయాల్లో మహిళలపై వివక్ష మొదలైన వాటిపై కఠినంగా వ్యవహరించాలి. ✿ పెరుగుతున్న ఆర్థిక అసమానతల పరిష్కారానికి గ్రామీణ ఉపాధిహామీ పథకం, ప్రధానమంత్రి ఉపాధి కల్పనా కార్యక్రమం, పీఎం జన్‌ధన్ యోజన లాంటి సమ్మిళిత కార్యక్రమాలను బలోపేతం చేయాలి. ✿ ఆరోగ్యం, విద్యపై చేస్తున్న వ్యయం, పెట్టుబడులు గణనీయంగా పెంచాలి. పోషణ్ అభియాన్ 2.0 లాంటి పథకాలు, ఆరోగ్య సంరక్షణ విధానాలు, నూతన విద్యావిధానాలు, సాంకేతిక ఆధారిత విద్య విస్తృతంగా అమలుచేయాలి.

మాదిరి ప్రశ్నలు

1. 2025 ప్రపంచ మానవ అభివృద్ధి నివేదిక ప్రకారం మొదటి 3 ర్యాంకులు సాధించిన దేశాలను గుర్తించండి.
   1) నార్వే, స్విట్జర్లాండ్, ఐస్‌లాండ్
   2) ఐస్‌లాండ్, నార్వే, స్విట్జర్లాండ్
   3) డెన్మార్క్, ఐస్‌లాండ్, నార్వే
   4) జర్మనీ, స్వీడన్, డెన్మార్క్
2. 2025 మానవాభివృద్ధి సూచికలో భారతదేశం కంటే మెరుగ్గా ఉన్న దేశాలను గుర్తించండి.
   1) బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక
   2) శ్రీలంక, భూటాన్, పాకిస్థాన్
   3) చైనా, శ్రీలంక, భూటాన్
   4) నేపాల్, మయన్మార్, పాకిస్థాన్
3. లింగ అసమానత సూచిక (జీఐఐ)ను ఎప్పుడు ప్రవేశపెట్టారు?
   1) 2010 2) 2012 3) 2005 4) 1999
4. మానవ పేదరిక సూచికను ఏ సంవత్సరంలో రూపొందించారు?
   1) 1995 2) 1997 3) 2001 4) 2000

సమాధానాలు: 1-2; 2-3; 3-1; 4-2.



రచయిత: వమరవల్లి రమణయ్య

కరెంట్ అఫైర్స్



■ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు భారత నూతన రాయబారిగా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? **జ:** డాక్టర్ దీపక్ మిత్తల్

■ మహిళా క్రికెట్‌ను ప్రోత్సహించడానికి ఐసీసీ ఇటీవల ఏ సంస్థతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది? **జ:** గూగుల్

■ 2026 బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీలను ఎక్కడ నిర్వహించనున్నారు? **జ:** న్యూదిల్లీ (ప్యారిస్‌లో జరిగిన 2025 బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీల ముగింపు వేడుకలో బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బీడబ్ల్యూఎఫ్) 2026 ఆతిథ్య నగరాన్ని ప్రకటించింది.)

■ జాతీయ మహిళా కమిషన్ రూపొందించిన నేషనల్ యాన్యువల్ రిపోర్ట్ అండ్ ఇండెక్స్ ఆన్ ఉమెన్స్ సేఫ్టీ (నారి–ఎన్ఏఆర్ఐ) నివేదిక ప్రకారం భారతదేశంలో మహిళలకు అత్యంత సురక్షితమైన తొలి అయిదు నగరాలు? **జ:** కోహిమా (నాగాలాండ్), విశాఖపట్టణం (ఆంధ్రప్రదేశ్), భువనేశ్వర్ (ఒడిశా), ఐజ్వాల్ (మిజోరాం), గ్యాంగ్‌టక్ (సిక్కిం).

మాదిరి ప్రశ్నలు

మరింత సమాచారం

దరఖాస్తు చేశారా?



☛ ఏపీఎన్ఎల్‌లో జూనియర్ టెక్నీషియన్ పోస్టులు (98)
చివరి తేదీ: 02.11.2025

☛ నార్త్ వెస్టర్న్ రైల్వేలో యాక్ట్ అప్రెంటిస్ ఖాళీలు (2,094)
చివరి తేదీ: 02.11.2025

సందిగ్ధత వద్దు.. నచ్చిందే ఎంచుకోండి! లైఫ్ స్కిల్స్



ఇష్టమైన సబ్జెక్టు ఒకటి, కానీ ఇంట్లోవాళ్లో లేదా ఇంకెవరో చెప్పారని చదువుతున్న గ్రూపు మరొకటి. ఎంతోమంది విద్యార్థులకు ఇలాంటి సందిగ్ధ పరిస్థితులు ఎదురవుతుంటాయి. పదోతరగతి తర్వాత ఇంటర్మీడియట్‌లో గ్రూప్ ఎంపిక విషయంలో, ఇంటర్ తర్వాత డిగ్రీ విషయంలో, ఇతర సందర్భాల్లో ఎన్నో సందేహాలు వస్తుంటాయి. అప్పుడు అభ్యర్థికి నచ్చింది, ఆసక్తి ఉన్నది కాకుండా మరొకటి ఎంచుకుంటే పొరపాటు నిర్ణయమే అవుతుంది. ఆ తర్వాత సరిదిద్దుకునే అవకాశం ఉండకపోవచ్చు. ఇలాంటి పరిస్థితి నుంచి ఎలా బయటపడాలో ముందే తెలుసుకోవాలి. సందేహం ఉన్నప్పుడు ఎలా వ్యవహరించాలో నేర్చుకోవాలంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

అరటిలో భాస్వరం.. యాపిల్‌లో ఐరన్!



మానవ జీవనానికి కావాల్సిన ఆహారం, వస్త్రాలు, ఔషధాలు తదితరాలన్నీ మొక్కల నుంచే లభిస్తాయి. ఆ మొక్కలు, వాటి ఉత్పత్తులతో ఉన్న ఉపయోగాలను సమగ్రంగా, శాస్త్రీయంగా వివరించేదే ఆర్థిక వృక్షశాస్త్రం. ఆహార, వాణిజ్య పంటల ఆర్థిక ప్రాముఖ్యతను తెలిపి, వాటి అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టాలో చెబుతుంది. పర్యావరణ సంరక్షణ, నేలల సుస్థిర వినియోగం కోసం కావాల్సిన ప్రణాళికలను సిద్ధం చేసుకోవడానికి ఉపకరిస్తుంది. సంబంధిత ప్రాథమిక అంశాలపై, సహజ ఆహార పదార్థాల్లోని పోషక విలువలపై పోటీపరీక్షల అభ్యర్థులకు అవగాహన ఉండాలి.

జనరల్ స్టడీస్ - బయాలజీ

ఆర్థిక వృక్షశాస్త్రం

1. కింది వాటిలో సత్య వాక్యాన్ని ఎన్నుకోండి.
   ఎ) పిండిపదార్థాలు అధికంగా ఉన్న కాండ రూపాంతరం - బంగాళాదుంప
   బి) పిండిపదార్థాలు అధికంగా ఉన్న ఫలం - మామిడి
   సి) ప్రొటీనులు అధికంగా ఉన్న పప్పుధాన్యాలు - సోయాబీన్స్
   డి) విటమిన్ - ఎ అధికంగా ఉన్న ఫలం - బొప్పాయి
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి
   3) ఎ, బి, డి 4) ఎ, సి, డి
2. కింది వాటిని జతపరచండి.
   జాబితా – 1 / జాబితా – 2
   1) అల్లం ఎ) ఐరన్
   2) యాపిల్ బి) నేలపై పాకే ఆహార వనరు
   3) పచ్చిమిర్చి సి) అయోడిన్
   4) పుచ్చకాయ డి) ఫాస్ఫరస్
   1) 1-సి, 2-ఎ, 3-బి, 4-డి
   2) 1-సి, 2-డి, 3-బి, 4-ఎ
   3) 1-సి, 2-ఎ, 3-డి, 4-బి
   4) 1-ఎ, 2-సి, 3-డి, 4-బి
3. కింది వాటిలో అసత్య వాక్యాన్ని ఎన్నుకోండి.
   1) మానవుడికి ఉపయోగపడే మొక్కలను అధిక సంఖ్యలో పెంచడాన్ని పంట అంటారు.
   2) పంట కాలాన్ని ఖరీఫ్, రబీ పంటలుగా వర్గీకరిస్తారు.
   3) వర్షాకాలం పంటలకు ఉదాహరణ ఆవాలు, అవిసె
   4) ఖరీఫ్ పంటలుగా సోయాబీన్స్, వేరుశనగ పండిస్తారు.
4. కింది వాటిలో ఆహార పంట?
   1) బెర్సిన్ 2) ఓట్స్
   3) సూడాన్ 4) అర్హర్
5. పౌల్ట్రీ ఆహారంలో ఏ విటమిన్లు అధికంగా ఉంటాయి?
   1) విటమిన్ - ఎ 2) విటమిన్ - కె
   3) విటమిన్ - సి 4) ఎ, కె
6. కింది వాటిలో సత్య వాక్యాన్ని ఎన్నుకోండి.
   ఎ) సమీకృత వ్యవసాయంలో పశువుల పెంపకం ప్రధాన ప్రయోజనాలు పాలు, వ్యవసాయం.



బాస్ ఇండికస్ జాతి ఆవు

   బి) భారతదేశంలో బాస్ ఇండికస్ అనే ఆవుల జాతి, బాస్ బుబాలిస్ అనే గేదె రకం ఉన్నాయి.
   సి) పాల ఉత్పత్తి పెంచడం అంటే పాలిచ్చే కాలాన్ని పెంచడం.
   డి) సమీకృత వ్యవసాయంలో అధిక దిగుబడి ఇచ్చే వంగడాలు ఉపయోగిస్తారు.
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి
   3) ఎ, సి, డి 4) ఎ, బి
7. కింది వాటిని జతపరచండి.
   ధాన్యం రకం / మారుపేరు
   1) బఠాణి ఎ) అర్హర్
   2) కందిపప్పు బి) మటర్
   3) మినపప్పు సి) మసూద్
   4) ఎర్రపప్పు డి) ఉరాద్
   1) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి
   2) 1-బి, 2-డి, 3-సి, 4-ఎ
   3) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి
   4) 1-సి, 2-డి, 3-ఎ, 4-బి
8. వాదన–ఎ: భారతదేశంలో 1952 నుంచి 2010 వరకు వ్యవసాయ సాగు భూమి 25% పెరిగింది.




   వాదన–బి: పెరిగిన వ్యవసాయ భూమిలో ఆహారధాన్యాల ఉత్పత్తి మాత్రం నాలుగు రెట్లు పెరిగింది.
   1) ఎ, బి సరికావు.
   2) ఎ, బి సరైనవి.
   3) ఎ సరికాదు. 4) బి సరికాదు.
9. పంట దిగుబడి పెంచేందుకు అవలంబించాల్సిన ప్రధాన కార్యకలాపాలు..
   1) పంట రకం అభివృద్ధి
   2) పంట ఉత్పత్తిలో అభివృద్ధి
   3) పంట రక్షణ, నిర్వహణ 4) పైవన్నీ
10. మిల్చ్ అంటే..
   1) ఆడ పాడిపశువులు
   2) వ్యవసాయ మెట్ట జంతువులు
   3) పౌల్ట్రీ నిర్మాణాలు 4) 1, 2
11. కింది వాటిని జతపరచండి.
   జాబితా – 1 / జాబితా – 2
   1) ఎపిస్ సెరినా ఇండికా ఎ) రాక్ బీ
   2) ఎపిస్ డార్సెటా బి) ఇండియన్ బీ
   3) ఎపిస్ ఫ్లోరియా సి) ఇటాలియన్ బీ
   4) ఎపిస్ మెల్లిఫెరా డి) లిటిల్ బీ
   1) 1-బి, 2-డి, 3-ఎ, 4-సి
   2) 1-బి, 2-సి, 3-ఎ, 4-డి
   3) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి
   4) 1-సి, 2-డి, 3-ఎ, 4-బి
12. తేనె నాణ్యత, రుచి దేని మీద ఆధారపడుతుంది?




   1) పచ్చిక బయళ్లు
   2) పుష్పాల రకం
   3) పువ్వుల్లోని పుప్పొడి
   4) పైవన్నీ
13. కింది వాటిలో మంచి నీటి రొయ్యను గుర్తించండి.
   1) పీనియస్ మోనోడాన్
   2) మాక్రోబ్రాకియం రోజన్ బెర్గీ
   3) కార్ప్ 4) మ్రిగాల్
14. దోమలను తరిమే పదార్థాల తయారీలో ఉపయోగించే వేర్లు?
   1) వట్టి వేర్లు 2) వెలామిన్ వేర్లు
   3) లెమన్‌గ్రాస్ వేర్లు 4) పైవన్నీ
15. కింది వాటిలో పోషకాల పరంగా భిన్నమైంది..
   1) మాలిబ్డినం 2) నైట్రోజన్
   3) క్యాల్షియం 4) గంధకం
16. కింది వాటిలో ఏ మొక్కను పచ్చిరొట్టగా ఉపయోగిస్తారు?
   1) జనుము 2) గోరుచిక్కుడు
   3) పెసర 4) పైవన్నీ
17. కింది వాటిలో కలుపు మొక్క కానిదాన్ని గుర్తించండి.
   1) బజ్రా 2) జాంథియం
   3) పార్థినియం 4) రొటాండస్ సైపరేనస్
18. కింది వాటిలో కలుపు నివారణకు సరైన మార్గం?
   ఎ) యాంత్రిక పద్ధతిలో తొలగింపు
   బి) విత్తనాలను సకాలంలో విత్తడం
   సి) అంతర పంటలు, పంటమార్పిడి లాంటి పద్ధతులు అనుసరించడం
   డి) 2 - 4 - D లాంటి రసాయనాలను వాడటం.
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి
   3) ఎ, సి, డి 4) ఎ, బి
19. కింది వాటిలో అసత్య వాక్యాన్ని ఎన్నుకోండి.
   1) స్వదేశీ కోళ్ల జాతికి ఉదాహరణ అసీల్
   2) విదేశీ కోడి జాతికి ఉదాహరణ లెగ్‌హార్న్
   3) పౌల్ట్రీ ఆహారంలో విటమిన్ సి, బి ఉంటాయి.
   4) విదేశీ ఆవుజాతికి ఉదాహరణ బ్రౌన్ స్విస్
20. పంట దిగుబడి దేనిపై ఆధారపడుతుంది?



   1) వాతావరణం
   2) నేల నాణ్యత
   3) నీటిలభ్యత
   4) పైవన్నీ
21. వాదన–ఎ: సేంద్రియ పదార్థం నేల స్థితిగతులను పెంచుతుంది.
   వాదన–బి: సేంద్రియ పదార్థాలు ఇసుక నేలలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతాయి. బంకమట్టి నేలలో తగ్గిస్తాయి.
   1) ఎ సరైంది, బి సరికాదు.
   2) ఎ సరికాదు, బి సరైంది.
   3) ఎ, బి సరైనవి. 4) ఎ, బి సరికావు.
22. గాలి నుంచి మొక్కకు లభించే పోషకం?
   1) కార్బన్ 2) నైట్రోజన్
   3) పొటాషియం 4) జింక్
23. మేక మాంసానికి ఉండే పేరు?
   1) మటన్ 2) చికెన్ 3) బీఫ్ 4) చివాన్
24. సహజ నాగలిగా మారిన జీవి?
   1) జలగ 2) వానపాము
   3) ఆఫ్రొడైట్ 4) హైడ్రా
25. తేనెటీగ లార్వాను ఏమంటారు?



   1) గ్రబ్ 2) మగ్గాట్
   3) రిగ్లర్ 4) 1, 2
26. ప్రొటీన్లు అధికంగా ఉన్న పప్పుధాన్యాలు..
   1) అనప 2) పెసర
   3) సోయాబీన్స్ 4) మినుము
27. విటమిన్–ఎ అధికంగా ఉన్న ఫలం?
   1) ద్రాక్ష 2) బొప్పాయి
   3) సీతాఫలం 4) యాపిల్
28. అరటిలో అధికంగా ఉండే ఖనిజ లవణం?
   1) భాస్వరం 2) ఐరన్
   3) అయోడిన్ 4) నికెల్
29. యాపిల్‌లో అధికంగా ఉన్న ఖనిజ వనరు?
   1) క్యాల్షియం 2) ఐరన్
   3) అయోడిన్ 4) 1, 2
30. కొవ్వుపదార్థాల పరీక్షకు ఉపయోగపడే పరీక్ష?
   1) కాపర్ సల్ఫేట్ 2) పేపర్ పరీక్ష
   3) మోల్స్ అర్ధపత్ర ప్రయోగం
   4) గాన్యాల్స్ అర్ధపత్ర ప్రయోగం
31. గడ్డి అధ్యయన శాస్త్రాన్ని ఏమంటారు?
   1) అగ్రస్టాలజీ 2) అగ్రానమీ
   3) మిర్మికాలజీ 4) 1, 2
32. మేకల్లో అత్యంత ప్రసిద్ధి చెందిన జాతి?
   1) ఆరాది 2) మెరినో
   3) అంగోరా 4) జెన్ని
33. మేకల్లో అతి ముఖ్యమైన జాతి?
   1) అంగోరా 2) జాగ్విర్
   3) లెగ్‌హార్న్ 4) పైవన్నీ
34. కింది వాటిలో తోలుకు ప్రసిద్ధి చెందింది?
   1) పిజ్‌వాల్‌స్కీ 2) కోరెడల్
   3) మెరినో 4) అంగోరా
35. కింది వాటిలో అత్యుత్తమ కొబ్బరి జాతి?
   1) రాంగాంగ 2) చిట్టిల్లు
   3) చివాన్ 4) సీలోన్
36. కొబ్బరిలో తినదగిన భాగం?
   1) ఫలం 2) అంకురచ్ఛదం
   3) విత్తనం 4) పైవన్నీ
37. యాపిల్ ఒక..
   1) పుష్పవృంతం 2) పుష్పాసనం
   3) అండం 4) అండన్యాసం
38. పుష్పాల అధ్యయనం?
   1) కాలాలజీ 2) అగ్రస్టాలజీ
   3) ఆంథాలజీ 4) 1, 2
39. అతిపెద్ద ఫలం?
   1) మామిడి 2) లోడిషియా
   3) ఆర్కిడేసి 4) రఫియా రఫియా
40. అత్యధికంగా ప్రొటీన్లు ఉన్న పప్పు?
   1) సోయాబీన్స్ 2) మొగలి
   3) రబ్బీ 4) కంది



రచయిత: వట్టిగౌనళ్ల పద్మనాభం

సమాధానాలు

1-1, 2-3, 3-3, 4-4, 5-4, 6-1, 7-3, 8-2, 9-4, 10-1, 11-3, 12-4, 13-2, 14-3, 15-1, 16-4, 17-4, 18-1, 19-3, 20-4, 21-3, 22-1, 23-4, 24-2, 25-1, 26-3, 27-2, 28-1, 29-2, 30-2, 31-1, 32-3, 33-1, 34-2, 35-4, 36-2, 37-1, 38-3, 39-2, 40-1.

దిల్లీలో వాయుకాలుష్యంతో 15% మరణాలు

జీబీడీ నివేదిక వెల్లడి



దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో 2023లో సంభవించిన మరణాల్లో దాదాపు 15% వాయుకాలుష్యం వల్లేనని గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ (జీబీడీ) నివేదిక వెల్లడించింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఇవాల్యుయేషన్ (ఐహెచ్‌ఎంఈ) సంస్థ అక్టోబర్ నెల ప్రారంభంలో విడుదల చేసిన జీబీడీ- 2023 డేటా ప్రకారం.. వాతావరణంలోని ధూళికణాల(పర్టిక్యులర్ మ్యాటర్ పొల్యూషన్) కారణంగా 17,188 మంది మరణించారు. అంటే ఈ నగరంలోని ప్రతి 7 మరణాల్లో ఒకటి వాయుకాలుష్యం కారణంగానే సంభవించింది. వాయు కాలుష్యం తర్వాత దిల్లీలో అధిక మరణాలకు కారకాల్లో రక్తపోటు (12.5%), మధుమేహం (9%), అధిక కొలెస్ట్రాల్ (6%) ఉన్నట్లు పేర్కొంది. మధుమేహంతో సంభవించే మరణాల కంటే వాయుకాలుష్య మరణాలు పెరుగుతున్నట్లు సెంటర్ ఫర్ రీసెర్చ్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సీఆర్ఈఏ) పరిశోధకులు పేర్కొన్నారు. వాయుకాలుష్యం కేవలం పర్యావరణ సమస్య కాదని, దీన్ని తగ్గించడానికి శాస్త్రీయపరమైన చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

వైదిక వారసత్వ పరిరక్షణలో ఆర్యసమాజ్ పాత్ర అమోఘం

- భారతీయ విలువల గురించి నిర్భీతిగా మాట్లాడిన సంస్థ ఇది
- ప్రధాని మోదీ వ్యాఖ్యలు



దిల్లీలో శుక్రవారం అంతర్జాతీయ ఆర్యుల సదస్సులో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

దిల్లీ: ప్రముఖ సంఘ సంస్కర్త దయానంద్ సరస్వతి స్థాపించిన ఆర్య సమాజ్.. భారత వైదిక వారసత్వ పరిరక్షణలో అందించిన సేవలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. దేశ పురాతన రాత ప్రతులు, సహజసిద్ధ వ్యవసాయాన్ని పరిరక్షించడానికి ఈ సంస్థ కృషి చేయాలని కోరారు. ఆర్య సమాజ్ 150వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇక్కడ నిర్వహించిన 'అంతర్జాతీయ ఆర్య మహాసమ్మేళన్'ను ఉద్దేశించి శుక్రవారం ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య సమరంలో ఈ సంస్థ పాత్రను ప్రశంసించారు. అయినా రాజకీయ కారణాల వల్ల ఈ అంశంలో సరైన గుర్తింపునకు నోచుకోలేదన్నారు. "ఆర్య సమాజ్ ఏర్పడి 150 ఏళ్లు పూర్తయిన ఈ సందర్భం.. సమాజంలో ఒక వర్గానికే పరిమితం కాదు. ఇది వైదిక వారసత్వం, భారత దేశ విశిష్టతతో ముడిపడింది" అని ఆయన పేర్కొన్నారు. ప్రగతికి అడ్డంకిగా మారిన కట్టుబాట్లకు స్వస్తి పలికి, వినూత్న ఆలోచనలతో ముందుకు సాగేలా దయానంద్ సరస్వతి అందరిలోనూ స్ఫూర్తిని నింపారన్నారు.

జాతి నిర్మాణంలో ఆర్య సమాజ్ ఎన్నో సేవలు అందించిందని మోదీ తెలిపారు. స్వదేశీ ఉద్యమానికి ఊపిరిలూదిందన్నారు. "పురాతన రాతప్రతులపై యువత అధ్యయనం చేసేలా మీ గురుకులాలు, ఇతర సంస్థల ద్వారా చర్యలు చేపట్టాలి. ప్రకృతి సేద్యం, తృణ ధాన్యాల సాగుపై అవగాహన కల్పించాలి. జల్‌జీవన్ మిషన్, అమృత్ సరోవర్ వంటి కార్యక్రమాలకు తోడ్పాటు అందించాలి" అని ఆర్య సమాజ్‌ను కోరారు. లాలా లజపతి రాయ్, రామ్‌ప్రసాద్ బిస్మిల్ వంటి ఎందరో ఆర్య సమాజ్ నుంచి స్ఫూర్తి పొందారని తెలిపారు. భారతీయ విలువల గురించి ఈ సంస్థ నిర్భయంగా గొంతెత్తిందన్నారు. దేశ వ్యతిరేక సిద్ధాంతాలతోపాటు, సంస్కృతిని కలుషితం చేసే ప్రయత్నాలపై పోరాడిందని పేర్కొన్నారు. కులవివక్ష, అంటరానితనాన్ని దయానంద్ సరస్వతి వ్యతిరేకించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర గవర్నర్ ఆచార్య దేవ్‌ప్రత్, దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, 39 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

క్షమాపణలు చెప్పిన మోదీ

అంతకుముందు దయానంద సరస్వతి 200 జయంతి, ఆర్య సమాజ్ 150వ వార్షికోత్సవం సందర్భంగా దేశానికి వారు చేసిన సేవలను గుర్తిస్తూ నాణేలను మోదీ విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ఆలస్యంగా వచ్చానంటూ సభికులకు క్షమాపణ చెప్పారు. "ఈరోజు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి. అందువల్ల ఐక్యతా విగ్రహం వద్ద కార్యక్రమం ఉంది. ఫలితంగా ఆలస్యమైంది" అని పేర్కొన్నారు.

కేజ్రీవాల్‌కు పంజాబ్‌లో మరో శీష్ మహల్

- భాజపా ఆరోపణ



దిల్లీ: దిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు పంజాబ్‌లో ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కోటా కింద సెవెన్ స్టార్ సౌకర్యాలున్న మరో శీష్ మహల్ నిర్మిస్తున్నారని శుక్రవారం భాజపా ఆరోపించింది. పంజాబ్ ప్రభుత్వంలో కేజ్రీవాల్ భాగం కానప్పటికీ ఆయనకు విలాసాలు సమకూరుస్తున్నారని ధ్వజమెత్తింది. దిల్లీ ఎన్నికల్లో ఓడిపోయిన ఆప్ నాయకులకు పంజాబ్‌లోని వివిధ బోర్డులు, కమిషన్లలో పదవులు కట్టబెట్టారని భాజపా జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఆరోపించారు. దీనిపై కేజ్రీవాల్, ఆయన పార్టీ వివరణివ్వాలని డిమాండ్ చేశారు. "ప్రభుత్వానికి ప్రజలు చెల్లించే పన్నుతో పంజాబ్‌లో కేజ్రీవాల్ కోసం శీష్ మహల్ పార్ట్ 2 నిర్మిస్తున్నారు. కేజ్రీవాల్ ఆ రాష్ట్రానికి సూపర్ సీఎంలా వ్యవహరిస్తున్నారు. పంజాబ్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేదు. అక్కడి మహిళలకు ఇచ్చిన హామీలు నిజం చేయలేదు. కానీ కేజ్రీవాల్‌కు వీవీఐపీ భద్రత కోసం 100 కార్ల కాన్వాయ్‌ని, విలాసవంతమైన భవనాన్ని అందించారు" అని వ్యాఖ్యానించారు.

సదరన్ నేవల్ కమాండ్ అధిపతిగా వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా

కొచ్చిన్: కేరళలోని కొచ్చిన్ నగరంలో సదరన్ నేవల్ కమాండింగ్ ఇన్ చీఫ్ ఆఫ్ ఫ్లాగ్ ఆఫీసర్‌గా వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పదవీ విరమణ చేసిన వైస్ అడ్మిరల్ వి.శ్రీనివాస్ స్థానంలో ఆయన నియమితులయ్యారు. ఎస్ఎన్‌సీ వార్ మెమోరియల్ వద్ద జరిగిన కార్యక్రమంలో అమరులకు సక్సేనా నివాళులర్పించారు. ఆయన 1989 జులై 1న నౌకాదళంలో చేరారు.

తీవ్ర జాప్యమైందనే కారణంతో మధ్యవర్తిత్వ తీర్పును రద్దు చేయలేం



- దాని దుష్ప్రభావమేమిటో పరిశీలించాలి
- సుప్రీంకోర్టు స్పష్టీకరణ

దిల్లీ: మధ్యవర్తిత్వ తీర్పు వెలువరించడంలో తీవ్ర జాప్యం జరిగితే దాని పర్యవసానాలూ ప్రమాదకరంగానే ఉంటాయని సుప్రీం కోర్టు తెలిపింది. ఆ జాప్యానికి సహేతుక కారణాన్ని వివరించలేకపోతే ఇరుపక్షాల మనసుల్లో అనుమానాలకు, అనవసర ఊహాగానాలకూ తావిచ్చినట్లు అవుతుందని జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ ధర్మాసనం పేర్కొంది. మధ్యవర్తిత్వ వ్యవస్థపై విశ్వాసం సడలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేసింది. చెన్నైలో ఓ భవన నిర్మాణానికి సంబంధించిన వివాదంలో మధ్యవర్తిత్వ న్యాయస్థానం 2012 జులై 28న తీర్పును రిజర్వు చేసి దాదాపు నాలుగేళ్ల తర్వాత వెలువరించింది. స్పష్టమైన పరిష్కారాన్ని సూచించలేదు. దీంతో ప్రతివాదులు సుప్రీంకోర్టును ఆశ్రయించి ఆ తీర్పును రద్దు చేయాలని కోరారు. మధ్యవర్తిత్వ తీర్పు వెలువరించడంలో తీవ్ర జాప్యం జరిగినంత మాత్రాన దానిని రద్దు చేయలేమని, ఆ జాప్యం వల్ల జరిగిన పర్యవసానాలు, దుష్ఫలితాలను పరిశీలించాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. అలాగని మధ్యవర్తిత్వ తీర్పుల్లో జాప్యాన్ని సమర్థించలేమనీ స్పష్టం చేసింది. ఈ కేసులో ఇరుపక్షాలు మరోసారి మధ్యవర్తిత్వ న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశాన్నీ పరిశీలించుకోవచ్చని సూచించింది. అయితే, ప్రస్తుత వివాదంలో...ఒప్పందంలో పేర్కొన్న గడువులోగా భవన నిర్మాణం పూర్తయ్యిందా లేదా అన్నదే కీలకమని తెలిపింది. ప్రస్తుతం తమ ముందున్న ఆధారాల ప్రకారం...మధ్యవర్తిత్వ తీర్పు వెలువడినప్పటి నుంచీ వివాదాస్పద భవనంలో 50శాతం వాటా ప్రతివాదుల వినియోగంలోనే ఉంది. మూడు నెలల్లోగా కంపెనీ రూ.10కోట్లను ప్రతివాదులకు చెల్లించి ఆ భవనంలోని మిగిలిన 50 శాతం వాటాను, భూమిపై తన వాటాను పొందవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది.

కేంద్ర సాయుధ పోలీస్ బలగాల్లో ఐపీఎస్‌ల డెప్యుటేషన్ల తగ్గింపు తీర్పు సమీక్షకు నిరాకరణ

- క్యాడర్ రివ్యూ ఉత్తర్వుకు సమర్థన
- కేంద్రం పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

దిల్లీ: కేంద్ర సాయుధ పోలీస్ బలగాల్లో(సీఏపీఎఫ్) ఐపీఎస్ అధికారుల డెప్యుటేషన్లను తగ్గించాలంటూ మే 23న ఇచ్చిన తీర్పును సమీక్షించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ తీర్పును పునఃపరిశీలించాలంటూ కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం శుక్రవారం తోసిపుచ్చింది. 'రివ్యూ పిటిషన్‌లోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాం. వాటితో జతపరిచిన పత్రాలు సంతృప్తికరంగానే ఉన్నాయి. వాటి ప్రకారం ఈ ఏడాది మే 23న వెలువరించిన తీర్పును పునఃపరిశీలించాల్సిన అవసరంలేదు' అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ అంశంపై విచారణ జరపాల్సిందేమీ లేదని పేర్కొంది. మే 23నాటి తీర్పు ప్రకారం...సీఏపీఎఫ్‌లో భాగమైన ఐటీబీపీ, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీలలో ఆరు నెలల్లోగా క్యాడర్ రివ్యూ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత సర్వీసు నిబంధనలు/నియామక నిబంధనలను సమీక్షించాలి. 2021 నుంచి క్యాడర్ సమీక్ష పెండింగ్‌లో ఉంది.

ఉప రాష్ట్రపతితో గవర్నర్ భేటీ

ఈనాడు, అమరావతి: దిల్లీ పర్యటనలో ఉన్న గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ శుక్రవారం అక్కడ ఉపరాష్ట్రపతి ఎన్‌క్లేవ్‌లో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గవర్నర్ 3 రోజుల దిల్లీ పర్యటన శుక్రవారంతో ముగిసింది. మరోవైపు భారత మహిళా క్రికెట్ జట్టు ఆస్ట్రేలియాపై విజయం సాధించడంపై గవర్నర్ 'ఎక్స్'లో జట్టుకు అభినందనలు తెలిపారు.

ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. యోగా, అంతర్గత పరివర్తన శిబిరాలు

ఈనాడు, అమరావతి: ప్రాచీన యోగా శాస్త్రాల ఆధారంగా ప్రజల్లో పరివర్తన తెచ్చేందుకు రాష్ట్రంలో 'ఇన్నర్ ఇంజినీరింగ్' పేరిట శిబిరాలు నిర్వహించనున్నట్లు ఈశా ఫౌండేషన్ వెల్లడించింది. నవంబర్ 5 నుంచి 11 వరకు విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం, నెల్లూరు నగరాల్లో నిర్వహించే ఈ శిబిరాల్లో.. ప్రముఖ యోగి సద్గురు జగ్గీ వాసుదేవ్ రూపొందించిన యోగా ప్రక్రియలపై తెలుగులో అవగాహన కల్పించనున్నారు. 'మనలో అంతర్గత పరివర్తన, ఒత్తిడి, ఆందోళన, భావోద్వేగాల నియంత్రణ, ఏకాగ్రత సాధన, ఆలోచనల్లో స్పష్టతకు ఈ కార్యక్రమం దోహదం చేస్తుంది. 21 నిమిషాల శాంభవి మహాముద్ర క్రియ అందిస్తారు. నవంబర్ 5 నుంచి 8 వరకు, 10, 11 తేదీల్లో ఉదయం, సాయంత్రం 6-9 గంటల వరకు బృందాల వారీగా శిక్షణ ఇస్తారు. వివరాలకు 040-41896666 నంబర్‌లో సంప్రదించవచ్చు. isha.co/ieapt ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు' అని ఫౌండేషన్ ఓ ప్రకటనలో తెలిపింది.

ఉషకు మతం మారే ఆలోచన లేదు కానీ..


- విమర్శలపై అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ స్పందన



న్యూయార్క్: తన సతీమణి ఉషా వాన్స్ క్రిస్టియన్ కాదని, ఆమెకు మతం మారే ఆలోచన లేదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ శుక్రవారం పేర్కొన్నారు. ఉష ఏదో రోజు క్రైస్తవంలోకి మారుతుందని ఆశిస్తున్నట్లు అంతకు ముందు తాను చేసిన వ్యాఖ్యలపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఆయన ఈ మేరకు 'ఎక్స్'లో స్పందించారు. "నా మతాంతర వివాహం గురించి ప్రశ్నలు వస్తున్నాయి. ప్రజాప్రతినిధి కావడంతో వీటి గురించి తెలుసుకునేందుకు ఆసక్తిగా ఉండటం సహజం. వీటిపై మాట్లాడకుండా తప్పించుకోలేను. నా మత విశ్వాసాలను నేను గౌరవిస్తాను. నా సతీమణి కూడా చాలా ఏళ్ల క్రితమే ఇందుకు అంగీకరించింది. ఆమె క్రిస్టియన్ కాదు. మతం మారే ఆలోచన కూడా లేదు. కానీ, ఇతర మతాంతర వివాహాలు, బంధాల్లో మాదిరిగానే.. ఏదో ఒక రోజు నా దృష్టితో ఆలోచిస్తుందని ఆశిస్తున్నా. ఏదేమైనా ఆమెను ప్రేమిస్తూ, ఆమెకు అండగా ఉంటూనే ఉంటా. ఆమె నా భార్య అయినందున అన్ని విషయాలపై ఆమెతో మాట్లాడతా" అని జేడీ వాన్స్ పేర్కొన్నారు.

ఆరెస్సెస్‌ను నిషేధించాలి

- పటేల్ వారసత్వాన్ని మోదీ అవమానిస్తున్నారు
- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే వ్యాఖ్యలు



దిల్లీలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే. చిత్రంలో పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్

దిల్లీ: దేశంలో శాంతిభద్రతల సమస్యలు ఎక్కువగా తలెత్తడానికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆరెస్సెస్), భాజపాలే కారణమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. అలాంటి ఆరెస్సెస్‌ను నిషేధించాలంటూ తన వ్యక్తిగత అభిప్రాయాన్ని ఆయన బయటపెట్టారు. ప్రభుత్వ ఉద్యోగులు ఆరెస్సెస్‌తో అనుసంధామయ్యేందుకు అనుమతినివ్వడం ద్వారా.. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ వారసత్వాన్ని ప్రధాని నరేంద్ర మోదీ అవమానిస్తున్నారని ఆయన మండిపడ్డారు. పటేల్ జయంతి సందర్భంగా కాంగ్రెస్‌పై మోదీ చేసిన ఆరోపణలను ఖర్గే తిప్పికొట్టారు. 1948లో మహాత్మాగాంధీ హత్యకు దారితీసిన వాతావరణాన్ని ఆరెస్సెస్ సృష్టించిందని విమర్శిస్తూ పటేల్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఉదాహరించారు. "ఆరెస్సెస్‌ను నిషేధించాలన్నది నా వ్యక్తిగత అభిప్రాయం. ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, ఉక్కు మహిళ ఇందిరా గాంధీలు గొప్ప నేతలు. వారిరువురు ఐక్యతను కాపాడేందుకు కృషి చేయడంతో పాటు దేశానికి ఎంతో సేవచేశారు. భారత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, పటేల్ మధ్య గొప్ప సంబంధాలు ఉన్నప్పటికీ, వారిరువురి మధ్య చీలిక తెచ్చేందుకు నిత్యం ప్రయత్నించేవారు. దేశ ఐక్యతకు ప్రతీకగా నిలిచిన పటేల్‌ను నెహ్రూ ప్రశంసించారు. ఐక్యతను తీసుకురావడానికి, శాంతిని నెలకొల్పడానికి పటేల్ పోరాడారు" అని ఖర్గే పేర్కొన్నారు. కశ్మీర్ మొత్తాన్ని భారత్‌లో కలపాలని పటేల్ కోరుకున్నప్పటికీ, నాటి ప్రధాని నెహ్రూ ఆ ప్రయత్నాలను అడ్డుకొన్నారని మోదీ చేసిన ఆరోపణలపై ఖర్గే ఈ మేరకు స్పందించారు.

మోదీ ఇంకా చక్రవర్తి కాలేదు..

దేశంలోని పలు రాష్ట్రాలను ప్రతిపక్షాలు పాలిస్తున్నాయని, మోదీ ఇంకా చక్రవర్తి కాలేదని ఖర్గే వ్యాఖ్యానించారు. అహ్మదాబాద్ కార్యక్రమంలో బ్రిటిష్ టోపీ ధరించి రాజులా చుట్టుపక్కల ముఖ్యమంత్రులు, మంత్రులు ఎవరూ లేకుండా మోదీ ఒక్కరే కూర్చున్నారని ఆయన ఎద్దేవాచేశారు. "రాజు అంటే ప్రతి రాష్ట్రాన్ని శాసించాలి. కానీ తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, కర్ణాటక, తెలంగాణ సహా పలు రాష్ట్రాలను ప్రతిపక్షాలు పాలిస్తున్నాయి. మెజారిటీ కూడా లేని మోదీ- నీతీశ్ కుమార్, చంద్రబాబు నాయుడు వంటి పలు నేతల సహాయంతో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారు" అని ఖర్గే వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

రాహుల్ సహా పలువురు కాంగ్రెస్ నేతల నివాళి

మరోవైపు, 150వ జయంతి సందర్భంగా వల్లభ్‌భాయ్ పటేల్‌కు నివాళులు అర్పిస్తూ ఖర్గే సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా ప్రాథమిక హక్కులపై పటేల్ ఆమోదించిన తీర్మానాలు భారత రాజ్యాంగానికి ఆత్మగా నిలిచాయని గుర్తుచేసుకున్నారు. రాహుల్ గాంధీ కూడా పటేల్‌కు నివాళులు అర్పించారు. దేశాన్ని ఏకంచేసిన పటేల్ ఐక్యత, సమగ్రతకు బలమైన పునాది వేశారని రాహుల్ గాంధీ అన్నారు.

మైనారిటీలు అధికంగా ఉన్న ప్రాంతాల అభివృద్ధికి రూ.203 కోట్లు

ఈనాడు, అమరావతి: మైనారిటీలు అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి జన్ వికాస్ కార్యక్రమానికి(పీఎంజేవీకే) రూ.203 కోట్లు విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఈ పథకం కింద మైనారిటీల కోసం గురుకులాలు, పాఠశాలలు, పాలిటెక్నిక్, ఐటీఐ, వసతి గృహ భవనాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతారు. 2017-19 మధ్య తెదేపా హయాంలో రూ.900 కోట్ల విలువైన ప్రాజెక్టులను రాష్ట్రానికి కేంద్రం మంజూరు చేసింది. కానీ వైకాపా హయాంలో పలు దశల్లో ఉన్న వీటి పనుల పూర్తికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. మైనారిటీ సంఘాలు విజ్ఞప్తి చేసినప్పటికీ ఐదేళ్లూ అసంపూర్తిగా వదిలేసింది. తాజాగా వీటిని పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం రాష్ట్రవాటాను విడుదల చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు పూర్తిగా అందించాలి

ఈనాడు, అమరావతి: ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు చెల్లించాల్సిన ప్రోత్సాహకాలు పూర్తిగా విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల జేఏసీ అధ్యక్షుడు రాజశేఖర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర సచివాలయం ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అధికారులను కలిసి వినతిపత్రం అందించారు. 'నాలుగేళ్లుగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు అందలేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. రెండు వర్గాలకూ కలిపి సుమారు రూ.490 కోట్లు విడుదల చేయాలి' అని పేర్కొన్నారు.


విమానాశ్రయాల్లో వీల్‌ఛైర్ల నిబంధనలకు సవరణ

- వైకల్యం లేనివారు రుసుములు చెల్లించాలి

దిల్లీ: ఎలాంటి వైకల్యం లేనివారు విమానాశ్రయాల్లో వీల్‌ఛైర్ల సేవలను వినియోగించుకుంటే అందుకు విమానయాన సంస్థలకు రుసుములు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు పౌరవిమానయాన విభాగం డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) నిబంధనలను సవరించింది. వీల్‌ఛైర్ బుకింగ్‌లపై విమానయాన సంస్థలు, విమానాశ్రయ నిర్వాహకులపై అనేక ఫిర్యాదులు రావడంతో డీజీసీఏ.. ఈ అంశంపై నిబంధనలను సవరిస్తూ ఒక ముసాయిదాను తయారుచేసింది. వాటిని సెప్టెంబరు 19న ప్రజాభిప్రాయ సేకరణకు ఉంచింది. తాజాగా వాటిని అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం.. వీల్‌ఛైర్ సేవలను కోరే ప్రయాణికులు ముందుగానే ఆ విషయాన్ని సంబంధిత సంస్థకు తెలియజేయాలి. టెర్మినల్ లేఅవుట్, భద్రతా నిబంధనలు, వనరుల లభ్యత వంటి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని.. ప్రయాణ సమయానికి ఎంత ముందుగా రావాలో ఆయా విమానయాన సంస్థలు నిర్దేశిస్తాయి. వీల్‌ఛైర్‌లను సమకూర్చే ప్రధాన బాధ్యత విమానయాన సంస్థదే. అయితే ఎయిర్‌పోర్ట్ నిర్వహణ సంస్థ కూడా ప్రయాణికుల సౌకర్యార్థం అవసరమైన చోట అదనపు వీల్‌ఛైర్లను అందుబాటులో ఉంచాలి. దివ్యాంగులు, నడవలేనివారు కాకుండా ఇతరులు చక్రాల కుర్చీల సేవలను వినియోగించదలిస్తే నిర్దేశిత రుసుములను చెల్లించాల్సి ఉంటుంది. ఆ వివరాలు విమానాయన సంస్థ వెబ్‌సైట్‌లో ఉంటాయి.

సోదరుడిపై బ్రిటన్ రాజు వేటు

- యువరాజు హోదా తొలగింపు
- సెక్స్ కుంభకోణం ఆరోపణలతో..



ఆండ్రూ

లండన్: జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం కేసు అమెరికాతో పాటు బ్రిటన్‌లోని బకింగ్‌హామ్ ప్యాలెస్‌నూ కుదిపేస్తోంది. ఈ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న యువరాజు ఆండ్రూపై ఆయన సోదరుడు, బ్రిటన్ రాజు చార్లెస్-3 కఠిన చర్యలు తీసుకున్నారు. ఆండ్రూను 'యువరాజు' హోదా నుంచి చార్లెస్ తొలగించినట్లు, ఆయన్ను రాజభవనం నుంచి బయటకు పంపించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు బకింగ్‌హామ్ ప్యాలెస్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇటీవల ఆండ్రూ తన రాయల్ టైటిల్ 'డ్యూక్ ఆఫ్ యార్క్'ను స్వచ్ఛందంగా వదులుకున్నారు. 'యువరాజు ఆండ్రూకు ఉన్న అన్ని గౌరవాలు, బిరుదులను తొలగించే పనులను రాజు అధికారికంగా మొదలుపెట్టారు. ఇకపై ప్రిన్స్ ఆండ్రూ కేవలం 'ఆండ్రూ మౌంట్‌బాటెన్ విండర్స్' మాత్రమే. ఆయన ప్రస్తుతం నివాసం ఉంటున్న లండన్‌లోని విండ్సర్ ఎస్టేట్‌ను కూడా ఖాళీ చేయాలని అధికారిక నోటీసులు పంపాం" అని బకింగ్‌హామ్ ప్రకటన తెలిపింది. దీంతో ఆండ్రూ తూర్పు ఇంగ్లాండ్‌లోని సాండ్రిగ్‌హామ్ ప్రైవేటు ఎస్టేట్‌లోకి మారతారు. తనపై వచ్చిన ఆరోపణలను ఆండ్రూ పలుమార్లు తిరస్కరించినా.. ఈ చర్యలు అనివార్యమని రాజు భావిస్తున్నట్లు ప్రకటన తెలిపింది. ఈ సందర్భంగా రాజు చార్లెస్, రాణి కెమిల్లా కుంభకోణంలోని బాధితుల వైపే ఉంటారని స్పష్టం చేసింది. ఆండ్రూ 'యువరాజు' హోదాను తొలగించడాన్ని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సమర్థించారు. తన మద్దతు బాధితులకేనని తెలిపారు.

మధ్యప్రదేశ్‌లో యాత్రికుల బస్సు బోల్తా

- మహిళ మృతి, 55 మందికి గాయాలు

బడ్‌వానీ: మధ్యప్రదేశ్‌లోని బడ్‌వానీ జిల్లాలో 'నర్మదా పరిక్రమ' యాత్రకు వెళ్తున్న యాత్రికుల బస్సు బోల్తాపడటంతో ఓ మహిళ మృతిచెందింది. మరో 55 మంది గాయపడ్డారు. శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. వాహనంపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బైగురు గ్రామంలో బస్సు బోల్తాపడి డివైడర్‌ను ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం కేసులో నిందితుల ఆస్తుల ఎటాచ్‌కు కోర్టు అనుమతి

ఈనాడు, అమరావతి: మద్యం కేసులో నిందితులు ముడుపుల సొమ్ముతో కొనుగోలు చేసిన ఆస్తుల ఎటాచ్‌మెంట్‌కు ఏసీబీ కోర్టు అనుమతించింది. అక్రమ సంపాదనతో ఆస్తులు కొన్నారని, వీటిని ఎటాచ్ చేసేందుకు సిట్ పిటిషన్ వేసింది. దీనిపై శుక్రవారం కోర్టు ఉత్తర్వులిచ్చింది. కొన్ని నెలల క్రితం ఆస్తులను జప్తు చేసేందుకు ప్రభుత్వం రెండు జీవోలు జారీ చేసిన సంగతి తెలిసిందే. చెన్నైలోని ఆస్తుల వివరాలను అందించడంలో అక్కడి రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు జాప్యం చేస్తున్నారని సిట్ దాఖలు చేసిన మెమోను కోర్టు అనుమతించింది. వివరాలను అందజేయాలని తమిళనాడు రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీని ఆదేశించింది.

పరీక్షకు ముందు ఎంబీబీఎస్ విద్యార్థి ఆత్మహత్య

జైపుర్: పరీక్షకు ముందు ఎంబీబీఎస్ విద్యార్థి ఒకరు హాస్టల్ గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజస్థాన్‌లోని భరత్‌పుర్‌లో చోటుచేసుకుంది. అల్వార్‌కు చెందిన అవీరల్ సైనీ (23) ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం అతడు పరీక్ష రాయాల్సి ఉంది. అయితే ఉదయం సైనీ స్నేహితులు అతణ్ని నిద్రలేపడానికి వెళ్లగా గది లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. ఎంత పిలిచినప్పటికీ అతని నుంచి సమాధానం రాకపోయేసరికి కిటికీలోంచి చూడగా, సైనీ ఫ్యానుకు ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

26న హెచ్‌ఎన్‌పీసీఎల్ అదనపు టారిఫ్ ప్రతిపాదనపై బహిరంగ విచారణ

ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలోని హిందుజా నేషనల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి ఐదో నియంత్రిత వ్యవధిలో (2024-25 నుంచి 2028-2029 మధ్య) ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కు అదనపు క్యాపిటల్ కాస్ట్ కోసం దాఖలు చేసిన పిటిషన్‌పై నవంబరు 26న విచారణ చేపట్టనున్నట్లు ఏపీఈఆర్‌సీ తెలిపింది. దీనిపై వ్యక్తులు/సంస్థలు/భాగస్వామ్య పక్షాలు అభ్యంతరాలు, సూచనలు, అభిప్రాయాలను కమిషన్‌కు పంపాలని పేర్కొంది. వాటిపై డిస్కంలు, హెచ్‌ఎన్‌పీసీఎల్ వివరణను వెబ్‌సైట్‌లో ఉంచాలని కమిషన్ ఆదేశించింది.

కర్నూలు లోక్‌సభ నియోజకవర్గ వైకాపా సమన్వయకర్తగా బుట్టా రేణుక

ఈనాడు, అమరావతి: కర్నూలు లోక్‌సభ నియోజకవర్గ వైకాపా సమన్వయకర్తగా మాజీ ఎంపీ బుట్టా రేణుకను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటించింది. గతేడాది సాధారణ ఎన్నికల్లో బుట్టా రేణుక కర్నూలు లోక్‌షభ టికెట్‌ను ఆశించినప్పటికీ ఆమెను ఎమ్మిగనూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైకాపా పెద్దలు పోటీ చేయించారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయిన ఆమెను ఇప్పుడు మళ్లీ కర్నూలు లోక్‌సభ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. ఎమ్మిగనూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయర్తగా అక్కడి మాజీ ఎమ్మెల్యే కడిమెట్ల చెన్నకేశవ రెడ్డి మనవడు రాజీవ్ రెడ్డిని నియమించారు.

విద్యాశాఖలో రోహిత్ ఆర్య పనిపై నివేదిక కోరాం

- మహారాష్ట్ర మంత్రి దాదా భూసే



రోహిత్

ముంబయి: ముంబయిలో 17 మంది చిన్నారులను నిర్బంధించి పోలీసుల కాల్పుల్లో హతమైన రోహిత్ ఆర్య మహారాష్ట్ర ప్రభుత్వ విద్యా శాఖతో కలసి పనిచేసినట్లు ప్రాథమిక విద్యా శాఖ మంత్రి దాదా భూసే తెలిపారు. రోహిత్‌కు చెందిన అప్సర ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ విద్యా శాఖతో కలసి స్వచ్ఛతా మానిటర్ ప్రాజెక్టును నిర్వహించినట్లు మంత్రి చెప్పారు. దానికి సంబంధించి అతడు పాఠశాలల నుంచి డబ్బు తీసుకొన్నట్లు తెలుస్తోందన్నారు. విద్యా శాఖ నుంచి తనకు రూ.2 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని రోహిత్ గురువారం వీడియోలో ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విద్యా శాఖలో రోహిత్ చేసిన ప్రాజెక్టు, దానికి చెల్లించిన రుసుం తదితర అంశాలపై అధికారులను నివేదిక కోరినట్లు మంత్రి శుక్రవారం తెలిపారు.

త్రుటిలో తప్పించుకున్నా: మరాఠీ నటి రుచితా



పిల్లలను బంధించడానికి రెండ్రోజుల ముందు తాను రోహిత్ ఆర్యను కలవాల్సి ఉందని మరాఠీ నటి రుచితా విజయ్ జాదవ్ వెల్లడించారు. అతడి బారిన పడకుండా త్రుటిలో తప్పించుకున్నానని ఆమె సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశారు. "కొద్ది రోజుల క్రితం రోహిత్ ఆర్య అనే వ్యక్తి నిర్మాతగా నాకు పరిచయమై, సినిమా గురించి మాట్లాడాలన్నాడు. బంధించే నేపథ్యంలో సినిమా తీయనున్నట్లు చెప్పడంతో కథ వినేందుకు అంగీకరించా. 28న కథ వినేందుకు కలుస్తానని అంగీకరించా. అయితే, కొన్ని అనివార్య కారణాల వల్ల చివరి నిమిషంలో వెళ్లలేకపోయా. ఇప్పుడు మీడియాలో అతడి గురించి చూడగానే వణికిపోయా. కొత్త వ్యక్తులతో పరిచయాలు పెంచుకునేందుకు ముందు మనం అప్రమత్తంగా ఉండాలి. మీరు ఎక్కడికి వెళ్తున్నారు? ఏం చేస్తున్నారనే విషయాలను కుటుంబసభ్యులతో పంచుకోండి" అని రుచితా సూచించారు.

3 నుంచి వృత్తి విద్య నైపుణ్య పోటీలు

ఈనాడు, అమరావతి: సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వృత్తి విద్య నైపుణ్య పోటీలు నిర్వహించబోతున్నారు. రాష్ట్రంలోని 1,378 పాఠశాలల్లో వృత్తి విద్య కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 3న పాఠశాల స్థాయిలో, 7న జిల్లా స్థాయిలో, 14న రాష్ట్ర స్థాయిలో పోటీలు ఉండనున్నాయి. 9-12 తరగతుల విద్యార్థులకు వ్యవసాయం, ఆటోమోటివ్, అపెరల్, బ్యూటీ-వెల్నెస్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సురెన్సు, ఎలక్ట్రానిక్స్, ఆహార శుద్ధి, ఆరోగ్యసంరక్షణ, ఐటీ, రిటెయిల్ ట్రేడ్‌ల్లో పోటీలు జరగనున్నాయి.

సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి సడలింపు ఇప్పించండి

రాష్ట్రపతికి లేఖ రాసిన బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో అర్హత సాధించాల్సిందేనన్న నిర్ణయం అనుభవజ్ఞులైన విద్యావేత్తల సేవలను ప్రమాదంలో పడేస్తుందని బీసీవై పార్టీ అధ్యక్షుడు ఆందోళన వ్యక్తం చేశారు. 2009 ఆర్టీఈ చట్టం అమలుకు ముందు నియమితులైన, 10 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి సడలింపు ఇవ్వాలని కోరుతూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు లేఖ రాసినట్లు శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. విద్యా ప్రమాణాలను కాపాడుతూ, మరోవైపు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల అభ్యర్థనను పరిశీలించి, మానవీయ కోణంలో ఆచరణీయమైన పరిష్కారం చూపేందుకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు.



తెదేపా కేంద్ర కార్యాలయంలో వల్లభ్‌భాయ్ పటేల్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నమస్కరిస్తున్న సీఎం చంద్రబాబు

దార్శనికుడు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్

● ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: భారత రాజ్యాంగంలో పౌరులకు ప్రాథమిక హక్కులు మాత్రమే కాదు.. వాటిని కాపాడే బాధ్యత కూడా ఉందని ప్రతి పౌరుడికి బోధించిన దార్శనికుడు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదికగా కొనియాడారు. క్యాంపు కార్యాలయం, మంగళగిరి తెదేపా కేంద్ర కార్యాలయంలోనూ సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చిత్రపటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఐక్యతకు ప్రతీక పటేల్

● ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: దేశ ఐక్యతకు ప్రతీక.. భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కొనియాడారు. శుక్రవారం వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటూ 'ఎక్స్' వేదికగా రాష్ట్రీయ ఏక్తా దివస్ శుభాకాంక్షలు తెలిపారు.

దేశ ఐక్యతకు కృషి



తాడేపల్లి, న్యూస్‌టుడే: దేశ ఐక్యతకు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కృషి చేశారని మంత్రి నారా లోకేశ్ అన్నారు. పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి ఉండవల్లి నివాసంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉత్కంఠ పోరులో అద్భుత విజయం సాధించారు

● భారత మహిళా క్రికెట్ జట్టుకు పవన్‌కల్యాణ్ అభినందనలు

ఈనాడు, అమరావతి: ఉత్కంఠభరితమైన సెమీ ఫైనల్‌లో ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ జట్టును ఓడించి అద్భుతమైన విజయంతో భారత జట్టు మహిళల ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకోవడం అభినందనీయమని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. భారత మహిళా క్రికెట్ జట్టుకు హృదయపూర్వక అభినందనలు అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.

ఆధునిక భారతదేశ శిల్పి పటేల్: జగన్

ఈనాడు, అమరావతి: 'ఆధునిక భారతదేశ శిల్పి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళి. సంస్థానాలను విలీనం చేయడంలో ఆయన చూపిన నిబద్ధత, తీసుకున్న నిర్ణయాలు భారతదేశానికి బలమైన పునాదులుగా నిలిచాయి' అని మాజీ సీఎం జగన్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

98 శాతం విద్యుత్ పునరుద్ధరణ

ఈనాడు, అమరావతి: మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో 98 శాతం విద్యుత్ పునరుద్ధరించామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మూడు డిస్కంల పరిధిలో 1,500 మంది సిబ్బంది పని చేశారన్నారు. 'విశాఖ, మచిలీపట్నం, బాపట్లకు ప్రత్యేక అధికారులను నియమించాం. దెబ్బతిన్న 12,500 విద్యుత్ స్తంభాలకు బదులు కొత్త వాటిని ఏర్పాటు చేశాం. విపత్కర పరిస్థితుల్లో సైతం సిబ్బంది విధులు నిర్వర్తించడం పట్ల వారికి ఉన్న అంకితభావం అర్థమవుతోంది' అని అన్నారు.

3న దుబాయ్ పర్యటనకు మంత్రి నారాయణ

ఈనాడు, అమరావతి: పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ఈ నెల 3 నుంచి 6 వరకు దుబాయ్, అబుదాబిల్లో పర్యటించనున్నారు. రాజధాని అమరావతిలో పెట్టుబడులకు ఉన్న అవకాశాల్ని వివరించి, పెట్టుబడిదారుల్ని ఆకర్షించేందుకు ఆయన దుబాయ్, అబుదాబీల్లో పర్యటించనున్నారు.

దేశమంతా ఏపీ వైపే చూస్తోంది

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

ఈనాడు, అమరావతి: మొంథా తుపాను నష్ట నివారణకు సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో యావత్తు దేశం ఏపీ వైపు చూస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తుపానును మానవతప్పిదం అంటూ వైకాపా అధినేత జగన్ చేసిన వ్యాఖ్యల్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు హెచ్‌ఎస్‌బీఎఫ్ శిక్షణ

ఈనాడు-అమరావతి: ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, బీమా రంగాల్లో ఉపాధి అవకాశాలు పొందేందుకు వీలుగా హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (హెచ్‌ఎస్‌బీఎఫ్) శిక్షణ ఇవ్వనుంది. 50 శాతం మార్కులతో పట్టభద్రులైనవాళ్లు, పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారికి విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిల్లో నెల రోజుల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనుంది. ప్రస్తుతం బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాలు కీలకంగా ఉన్నాయని, ఇటువంటి వాటిలో తమ పిల్లలకు శిక్షణ ఇప్పించేందుకు ఆర్టీసీ ఉద్యోగులు చొరవ చూపాలని ఆర్టీసీ చీఫ్ మేనేజర్ (పర్సనల్) సూచించారు.

అక్టోబరులో వర్షాలు.. ఈసారే అధికం!

● ఈశాన్య రుతుపవనాల పరిధిలో విరివిగా వానలు

ఈనాడు, విశాఖపట్నం: దేశంలో ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాల సీజన్‌లోనూ నైరుతి స్థాయిలో వర్షపాతం నమోదైంది. బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో ఏర్పడిన తుపాన్లు, వాయుగుండాల ప్రభావంతో అక్టోబర్‌లో పలు ప్రాంతాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిశాయి. అక్టోబర్‌లో సగటున 112.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 2001 తర్వాత ఈ స్థాయిలో వానలు కురవడం ఇదే తొలిసారని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) పేర్కొంది. 1901 తర్వాత ఇది 16వ సారి.

● ఇక, ఈశాన్య రుతుపవన ప్రాంతం (కోస్తాంధ్ర, రాయలసీమ, కేరళ, మాహె, దక్షిణ అంతర్గత కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, కరైకల్ సబ్ డివిజన్లు)లో అక్టోబర్‌లో సగటున 245.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. 2019లో అత్యధికంగా 250.9 మి.మీ. నమోదు కాగా, తర్వాత ఈసారే అత్యధికం. 2001 తర్వాత ఇది మూడో గరిష్ఠం. దేశవ్యాప్తంగా గత ఐదేళ్లలో ఎప్పుడూ లేనంతగా ఈసారి అక్టోబర్‌లో 236 ప్రాంతాల్లో అతి భారీ (115.6 మి.మీ-204.5 మి.మీ.), 45 చోట్ల అత్యంత భారీ (204.5 మి.మీ.కు మించి) వర్షాలు కురిశాయి.

రాష్ట్రంలో సాధారణం కంటే 79% ఎక్కువ

రాష్ట్రంలో అక్టోబరులో సాధారణ సగటు వర్షపాతం 161.5 మి.మీ. కాగా, మొంథా తుపాను, వాయుగుండం ప్రభావంతో 288.3 మి.మీ.గా నమోదైంది. ఇది సాధారణం కంటే 79% ఎక్కువ అని ఐఎండీ వెబ్‌సైట్‌లో పేర్కొంది. 19 జిల్లాల్లో సాధారణం కంటే 40% ఎక్కువ వర్షం కురిసింది. ప్రకాశం జిల్లాలో 140%, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు-131%, విజయనగరం-124%, పల్నాడు-119%, గుంటూరు జిల్లాలో 109% అధికంగా నమోదైంది. కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో సాధారణ వర్షాలు కురవగా, తూర్పుగోదావరి జిల్లాలో లోటు కన్పించింది.

■ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ వెబ్‌సైట్ ప్రకారం అక్టోబరులో రాష్ట్రంలోని 12 జిల్లాల్లో సాధారణానికి మించి వానలు పడ్డాయి. ఏ జిల్లాలోనూ లోటు వర్షపాతం నమోదు కాలేదు.

■ నవంబరులోనూ ఏపీలో సాధారణానికి మించి వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేస్తోంది. నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో సాధారణం లేదా అంతకుమించి వర్షపాతం నమోదు కావొచ్చని పేర్కొంది. కోస్తా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా ఉండొచ్చని తెలిపింది.

అక్టోబరులో అతి భారీ వర్షాలు కురిసిన ప్రాంతాలు

సంవత్సరం	సంఖ్య
2021	160
2022	133
2023	77
2024	96
2025	236

అత్యంత భారీ వర్షాలు కురిసిన ప్రాంతాలు

సంవత్సరం	సంఖ్య
2021	36
2022	13
2023	5
2024	5
2025	45

'మొంథా'పై 6 కోట్ల మెసేజ్‌లు

'మొంథా' తీవ్ర తుపానుపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు అమరావతి వాతావరణ కేంద్రం, విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం, ఇతర కార్యాలయాల ద్వారా మొత్తం ఆరు కోట్ల సందేశాలు (ఎస్ఎంఎస్) వెళ్లాయి. దీనిపై 55 జాతీయ బులెటిన్లు విడుదల చేసినట్లు ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర్ తెలిపారు. 'ఈసారి నైరుతి రుతుపవనాల సీజన్‌లో బంగాళాఖాతంలో రెండు, అరేబియా సముద్రంలో రెండు వాయుగుండాలు ఏర్పడగా వాటిలో ఒకటి తీవ్ర తుపానుగా, మరోటి తుపానుగా బలపడ్డాయి. మొంథా తీవ్ర తుపాన్ గమనం అంచనాలకు భిన్నంగా ఉంది. వీటి ట్రాకింగ్‌పై మరింత అధ్యయనం అవసరమ'ని మహాపాత్ర్ వివరించారు.

పట్టణాల్లోని ఆలయ భూముల లీజులకు కమిటీ

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: పట్టణ ప్రాంతాల్లోని ఆలయాల భూములను సద్వినియోగం చేసుకునేలా, వాటిని దీర్ఘకాలిక లీజులకు ఇచ్చే అంశాన్ని పరిశీలించేందుకు కమిటీని ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. దేవాదాయశాఖ కార్యదర్శి, కమిషనర్, ఆ శాఖ చీఫ్ ఇంజినీర్, ఆయా ఆలయాల ఈవోలు ఈ కమిటీలో ఉంటారు.

● రాష్ట్రవ్యాప్తంగా వివిధ నగరాలు, పట్టణాల్లోని ప్రధాన, ముఖ్య ఆలయాలకు చెందిన భూములు ఖాళీగా ఉన్నాయి. వాటిలో భక్తులకు వసతుల కల్పనకు వీలుగా పెద్ద హోటళ్ల వంటివి నిర్మించేందుకు ముందుకొచ్చే వారికి అవసరమైన భూములను దీర్ఘకాలిక (33 ఏళ్లకు) లీజులకు ఇవ్వాలని భావిస్తున్నారు. దీనివల్ల ఆయా ఆలయాలకు వచ్చే భక్తులకు సౌకర్యాలు అందుబాటులోకి రావడంతోపాటు, ఆలయానికి అదనపు రాబడి రానుంది. ఇందుకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది.

ఖాళీ స్థలాల లీజులకు ప్రతిపాదనలు పంపండి

రాష్ట్రంలోని ఆలయాలకు చెందిన ఖాళీ స్థలాలను 11 ఏళ్లకు లీజుకు ఇచ్చేలా ప్రతిపాదనలు పంపాలని అన్ని జిల్లాల దేవాదాయశాఖ అధికారులకు.. ఆ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదేశాలు జారీచేశారు. పది రోజుల్లో ప్రతి జిల్లా నుంచి కనీసం 10 ప్రతిపాదనలు పంపాలని కోరారు. వీటిని టెండరు/బహిరంగ వేలం ద్వారా కేటాయించనున్నారు.

● ప్రతి జిల్లా దేవాదాయశాఖ అధికారి.. నెలకు కనీసం మూడు చొప్పున ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ కోరారు. ఆలయ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకునేలా ఆదేశాలిచ్చారు.

● దేవాదాయశాఖకు చెందిన 80,793 ఎకరాలు ఇంకా వెబ్‌ల్యాండ్‌లో నమోదు కాలేదని గుర్తించారు. అన్ని జిల్లాల దేవాదాయశాఖ అధికారులూ అక్కడి కలెక్టర్లు, జేసీలకు లేఖలు రాసి, ఆ భూములను వెబ్‌ల్యాండ్‌లో నమోదయ్యేలా చూడాలని కమిషనర్ ఆదేశించారు.

ఏపీఆర్‌డీసీకి 16 మంది డైరెక్టర్ల నియామకం

ఈనాడు, అమరావతి: ఏపీ రహదారి అభివృద్ధి సంస్థ (ఏపీఆర్‌డీసీ)కు 16 మంది డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వు జారీచేసింది. బత్తుల హరిదాసు (మంగళగిరి), బి.శ్యామ్ (ఎలమంచిలి), ద్వారపురెడ్డి శ్రీనివాసరావు (పార్వతీపురం), జి.చంద్రమోహన్ యాదవ్ (హిందూపురం), గరికపాటి శివశంకర్ (గన్నవరం), కె.హేమలత (ధర్మవరం), కె.అప్పలనాయుడు (విజయనగరం), కె.రహమతుల్లా (బద్వేల్), నక్కా శ్రీను (యర్రగొండపాలెం), సాయిలక్ష్మి బండారు (గజపతినగరం), సునీత ఆచంట (జగ్గయ్యపేట), వీరవల్లి వంశీ ప్రసన్నకుమార్ (నరసరావుపేట), వెంకట కృష్ణారావు కారుమంచి (పర్చూరు), సీహెచ్.వెంకటరత్నం (ఏలూరు), వెన్న ఈశ్వరుడు (ప్రత్తిపాడు), వేణుగోపాల కృష్ణరాజు ముదునూరి (రాజోలు) డైరెక్టర్లుగా నియమితులయ్యారు. వీరంతా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి రెండేళ్ల పదవిలో కొనసాగనున్నారు.

పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం

ఈనాడు, అమరావతి: ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల్లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లేఖ రాశారు. "గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు రుణాలు, ఎరువులు, ధాన్యం కొనుగోలు వంటి ముఖ్య సేవలు అందిస్తున్న 7 వేల మంది పీఏసీఎస్ ఉద్యోగుల వేతనాలు, ఇతర సమస్యలు ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. 2019లో పీఏసీఎస్ ఉద్యోగుల వేతనాలను సవరిస్తూ జీఓ-36 ఇచ్చారు. 2014 ఏప్రిల్ నుంచి నోషనల్‌గా అమల్లోకి వస్తాయని అందులో పేర్కొన్నారు. ఇంతవరకూ అమల్లోకి రాలేదు. ఉద్యోగుల పదవీవిరమణ వయసును 62ఏళ్లకు పెంచే అవకాశం ఉన్నా తగిన ఆదేశాలు ఇవ్వలేదు" అని పేర్కొన్నారు.

పీఎం కుసుమ్ టారిఫ్ ఆమోదం కోసం ఏపీఈఆర్‌సీకి ప్రతిపాదన

● ఈ నెల 26న బహిరంగ విచారణ

ఈనాడు-అమరావతి: పీఎం కుసుమ్ కింద ఫీడర్ స్థాయిలో ఏర్పాటు చేసే మినీ సౌర విద్యుత్ ప్రాజెక్టులకు నిర్వహించిన టెండర్లలో గుత్తేదారుల నుంచి వచ్చిన టారిఫ్ ప్రతిపాదనలు అనుమతించాలని డిస్కంలు ఏపీఈఆర్‌సీకి పంపిన ప్రతిపాదనపై నవంబరు 26న కర్నూలులోని కార్యాలయంలో బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు ఏపీఈఆర్‌సీ తెలిపింది. ఆన్‌లైన్‌లో కూడా పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తామని. . సంబంధిత వ్యక్తులు/సంస్థలకు లింక్ వ్యక్తిగతంగా పంపుతామని పేర్కొంది. వ్యక్తులు, భాగస్వామ్య పక్షాలు తమ అభిప్రాయాలు, అభ్యంతరాలు, సూచనలను ఏపీఈఆర్‌సీ కార్యాలయానికి నేరుగా కానీ, మెయిల్ commn-secy@aperc.in ద్వారా కానీ నవంబరు 10వ తేదీలోగా పంపాలని కమిషన్ పేర్కొంది. అదే సమాచారాన్ని మూడు డిస్కంలకూ పంపాలని పేర్కొంది. ప్రజల నుంచి అందిన అభ్యంతరాలపై పది రోజుల్లోగా డిస్కంలు వివరణ అందించాలని కమిషన్ ఆదేశించింది. పీఎం కుసుమ్ పథకం కింద 3,725 మెగావాట్ల మినీ సౌర విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు కాంపిటేటివ్ బిడ్డింగ్ విధానంలో డెవలపర్లను ఎంపిక చేసేందుకు ఇంధన శాఖ టెండర్లు పిలిచింది. అందులో ఎంపిక చేసిన డెవలపర్లతో సంప్రదింపుల తర్వాత టారిఫ్‌ను తేల్చింది.

పీటీడీ రిటైర్డ్ ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ వైద్యం

● ఆర్టీసీ ఆసుపత్రుల్లోనూ వైద్యసేవలకు అవకాశం

ఈనాడు, అమరావతి: పదవీవిరమణ పొందిన, ముమ్ముందు రిటైర్ కానున్న ప్రజా రవాణాశాఖ (ఆర్టీసీ) ఉద్యోగులు.. ఉద్యోగి ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్) కింద వైద్యం పొందేందుకు అవకాశం కల్పించేలా ఆర్టీసీ యాజమాన్యం శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆర్టీసీ ఉద్యోగులు 2020 జనవరి 1న ప్రభుత్వంలో విలీనమయ్యారు. వీరికి పింఛను సదుపాయం లేదు. పదవీవిరమణ అనంతరం ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు అందే ఈహెచ్‌ఎస్ వైద్యం, అటు ఆర్టీసీ ఆసుపత్రుల్లోనూ వైద్యం దక్కడం లేదు. ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు పదేపదే విజ్ఞప్తి చేయడంతో పీటీడీ విశ్రాంత ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ వైద్యసదుపాయం కల్పిస్తూ ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 6న ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించి విధివిధానాలు పేర్కొంటూ శుక్రవారం ఆర్టీసీ యాజమాన్యం నోటిఫికేషన్ జారీ చేసింది.

● 2020 జనవరి నుంచి రిటైరయిన పీటీడీ ఉద్యోగులు, ఇకపై రిటైర్ అయ్యేవారిలో ఈహెచ్‌ఎస్ సదుపాయం కావాలనుకునేవారు సూపరింటెండెంట్ కేడర్ వరకు ఒకేసారి రూ.38,572 చెల్లించాలి. అసిస్టెంట్ మేనేజర్ కేడర్ నుంచి ఆపై స్థాయి అధికారులు రూ.51,429 చెల్లించాలి.

● ఈ డబ్బులు ఎలా చెల్లించాలి, ఏయే వివరాలు అప్‌లోడ్ చేయాలనే వివరాలను ఆర్టీసీ ఐటీ విభాగం త్వరలో ప్రకటించనుంది.

● ఈ మొత్తం చెల్లించిన ఉద్యోగి దంపతులకు జీవితాంతం ఆర్టీసీ ఆసుపత్రులు, డిస్పెన్సరీల్లో వైద్య సదుపాయం, మందులు లభిస్తాయి.

● ఈహెచ్‌ఎస్ రిఫరల్ ఆసుపత్రుల్లోనూ వైద్యం పొందేందుకు అవకాశం కల్పిస్తారు.

● అత్యవసరంగా ఏదైనా ప్రైవేటు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందితే, ఆ ఖర్చులను రీయింబర్స్ చేస్తారు.

ఆర్టీసీ ఉద్యోగ సంఘాల హర్షం

2020 తర్వాత రిటైరయిన ఉద్యోగులు వైద్యం అందక ఇంతకాలం ఇబ్బందులు పడ్డారని, వీరికి ఈహెచ్‌ఎస్ వర్తింపజేయడంపై ప్రభుత్వానికి, ఆర్టీసీ ఎండీకి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు వేల మంది విశ్రాంత ఉద్యోగుల వైద్య కష్టాలు తొలగించే ఉత్తర్వులు ఇచ్చినందుకు ప్రభుత్వానికి, ఆర్టీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య పేర్కొన్నారు. ఇటీవల సీఎంను కలిసి విజ్ఞప్తి అందజేయగా, స్పందించి ఆదేశాలివ్వడంపై ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు కార్మిక పరిషత్ అధ్యక్షులు ఎస్వీ శేషగిరిరావు చెప్పారు.

ఉపాధి శ్రామికులకు ప్రతిబంధకంగా ఈకేవైసీ నమోదు

● 38 లక్షల మందిపై ప్రభావం చూపే అవకాశం
● 'లిబ్‌టెక్ ఇండియా' అధ్యయన నివేదిక

ఈనాడు, అమరావతి: ఉపాధి హామీ పథకంలో శ్రామికులకు ఈకేవైసీ నమోదు తప్పనిసరి చేయడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 38 లక్షల మంది ఉపాధిపై ప్రభావం చూపే ఆస్కారముందని ఈ పథకం అమలుపై ఏటా సర్వే చేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ 'లిబ్‌టెక్ ఇండియా' పేర్కొంది. గ్రామాల నుంచి వలసలు, సాంకేతిక, మొబైల్ నెట్‌వర్క్ సమస్యల కారణంగా శ్రామికులు ఈకేవైసీ నమోదు చేయించుకోలేక పోతున్నారని తెలిపింది. ఈకేవైసీ తప్పనిసరి చేయొద్దని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరాలని సూచించింది. ఏపీలో ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఉపాధి హామీ పథకం అమలు తీరుపై అధ్యయనం చేసిన లిబ్‌టెక్ ఇండియా.. సంబంధిత వివరాలను శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించింది.

● గతేడాదితో పోల్చితే ఈ ఏడాది మూడు జిల్లాలు ఉపాధి పని దినాల వినియోగంలో వెనుకబడ్డాయి. గరిష్ఠంగా ఎన్టీఆర్ జిల్లాలో 44.7%, చిత్తూరులో 31.3%, పల్నాడు జిల్లాలో 0.4% తక్కువ పనిదినాలు వినియోగించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరులో 4.8%, విశాఖపట్నం జిల్లాలో 4.1% ఎక్కువగా పని దినాలు ఉపయోగించుకున్నారు.

● జాతీయ స్థాయిలో పరిశీలిస్తే పనిదినాల వాడకంలో ఏపీలో ఈ ఏడాది 13.6% తగ్గుదల ఉంది. కుటుంబాల భాగస్వామ్యం కూడా 42.79 లక్షల నుంచి 40.74 లక్షలకు (-4.8%) తగ్గింది. షెడ్యూల్డ్ కులాల్లో 18.7%, షెడ్యూల్డ్ తెగల్లో 17%, ఇతరుల్లో 11.3% తగ్గుదల నమోదైంది.

● శ్రామికుల కనీస వేతనం గతేడాది రూ.300 కాగా, ఈ ఏడాది 307కి పెరిగింది. అయితే, పని దినాల వినియోగం తగ్గినందున శ్రామికులకు వచ్చే వార్షిక ఆదాయం రూ.10,695 నుంచి రూ.10,178కి తగ్గింది.

3 జిల్లాల్లోని 37 మండలాల్లో కరవు

ఈనాడు-అమరావతి: ఖరీఫ్ పంటకాలంలో 3 జిల్లాల పరిధిలోని 37 మండలాలను కరవు ప్రభావితమైనవిగా ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. శ్రీసత్యసాయి జిల్లాలో మొత్తం 25 కరవు మండలాలను ప్రకటించగా వాటిలో 12 తీవ్ర, 13 మధ్యస్థ కరవు ప్రాంతాలుగా పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో 9, ప్రకాశం జిల్లాలో 3 మండలాల్ని మధ్యస్థ కరవు మండలాలుగా ప్రకటించారు. అన్నమయ్య జిల్లాలో గాలివీడు, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, వీరబల్లె, వాల్మీకిపురం, కురబలకోట, మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల్లో మధ్యస్థ కరవుగా పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని అగలి, ఆమడగూరు, గాండ్లపెంట, హిందూపురం, మడకశిర, ముదిగుబ్బ, ఎన్‌పీకుంట, ఓడీ చెరువు, రామగిరి, రొళ్ల, తలుపుల, తనకల్ మండలాల్లో తీవ్ర కరవుగా ప్రకటించారు. అమరాపురం, బత్తపల్లి, బుక్కపట్నం, ధర్మవరం, గుడిబండ, కదిరి, కనగానిపల్లి, కొత్తచెరువు, లేపాక్షి, నల్లచెరువు, నల్లమడ, పుట్టపర్తి, సోమందేపల్లి మండలాల్లో మధ్యస్థ కరవుగా గుర్తించారు. ప్రకాశం జిల్లా కొండపి, జరుగుమల్లి, పొన్నలూరు మండలాల్లో మధ్యస్థ కరవుగా పేర్కొన్నారు.

3 నుంచి గనుల సరిహద్దులు గుర్తింపు

డి.హీరేహాళ్, రాయదుర్గం, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ మండలం ఓబుళాపురం గ్రామ శివారులోని ఆరు గనులకు సంబంధించిన సరిహద్దులను ఈ నెల 3 నుంచి డ్రోన్ కెమెరాలతోపాటు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తిస్తామని మైన్స్ అండ్ జియాలజీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసచౌదరి తెలిపారు. సిద్ధాపురంలోని వై.మహాబలేశ్వరప్ప గనుల ప్రాంతాన్ని శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఓబుళాపురం గనుల సరిహద్దు వివాదాలపై 2010లో కొందరు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేయగా... ఆ సమస్య ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల అధికారుల సమక్షంలో 2022లో పరిష్కారమైందన్నారు. ప్రస్తుతం ఆరు గనులకు సంబంధించి నెలకొన్న అంతర్గత సరిహద్దు సమస్యను తేల్చాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు విశ్రాంత న్యాయమూర్తి, జస్టిస్ సుదాంశ్ దునియా ఆధ్వర్యంలో కమిటీ నియామకమైందన్నారు. ఈ కమిటీ త్వరలో క్షేత్రస్థాయిలో పర్యటించనున్నట్లు వెల్లడించారు.

డైట్‌లో డిప్యుటేషన్ దరఖాస్తులకు గడువు పొడిగింపు

ఈనాడు, అమరావతి: డైట్‌ల్లో డిప్యుటేషన్‌పై పని చేసేందుకు స్కూల్ అసిస్టెంట్ల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తుల గడువును ఈ నెల 3 వరకు పొడిగించింది. డైట్‌ల్లో ఖాళీలను సబ్జెక్టు టీచర్ల డిప్యుటేషన్లతో భర్తీ చేసేందుకు విద్యా శాఖ చర్యలు చేపట్టింది. షెడ్యూల్ ప్రకారం అక్టోబరు 29తో దరఖాస్తు గడువు ముగిసింది.

ఖతార్‌లో ఆయిల్, గ్యాస్ కంపెనీల్లో ఉద్యోగాలు

ఈనాడు, అమరావతి: గల్ఫ్ దేశం ఖతార్‌లో ఆయిల్, గ్యాస్ కంపెనీల్లో సూపర్‌వైజర్ ఉద్యోగావకాశాలు ఉన్నాయని, యువత వీటిని వినియోగించుకోవాలని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) సూచించింది. స్ట్రక్చరల్ వెల్డింగ్, స్ట్రక్చరల్ ఫిట్టర్, పైప్ ఫిట్టర్, పెయింటర్ కేటగిరీల్లో సూపర్‌వైజర్ పోస్టులు ఉన్నాయి. ఆయా విభాగాల్లో డిప్లొమా, టెక్నికల్ సర్టిఫికెట్‌తో పాటు పదేళ్ల ఆయిల్, గ్యాస్ రంగంలో అనుభవం, ఆంగ్ల భాష కమ్యూనికేషన్ ఉన్న 45 ఏళ్ల లోపు వయస్కులు అర్హులు. ఈ ఉద్యోగాల కాంట్రాక్టు రెండేళ్లు ఉంటుంది. పనితీరును బట్టి పొడిగించవచ్చు. వీసా, ఎయిర్ టికెట్ యజమాని అందిస్తారు. భోజనం, వసతి ఖర్చులను అభ్యర్థి భరించాలి. అర్హులు నవంబరు 6లోగా https://naipunyam.ap.gov.in ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, వివరాలకు 99888 53335, 87126 55686 నంబర్లపై సంప్రదించవచ్చని ఏపీఎస్ఎస్‌డీసీ సూచించింది.

సైనిక్ పాఠశాలల ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పొడిగింపు

ఈనాడు, అమరావతి: సైనిక్ పాఠశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును ఈ నెల 9 వరకు పొడిగించినట్లు ఎన్‌టీఏ తెలిపింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణకు గడువు అక్టోబరు 30తో ముగియగా, దీన్ని 9 సాయంత్రం 5 గంటల వరకు పొడిగించింది. పరీక్షను జనవరి 18న నిర్వహించనున్నట్లు పేర్కొంది.

దేశీయ ఉక్కు డిమాండ్‌లో 11-13% వృద్ధి

● కేంద్ర సహాయమంత్రి శ్రీనివాసవర్మ



స్వీడన్ ఇంధనం, వ్యాపారం, పరిశ్రమల శాఖ సహాయమంత్రి సారామోడిగ్‌తో కేంద్ర ఉక్కుశాఖ సహాయమంత్రి శ్రీనివాసవర్మ

ఈనాడు, దిల్లీ: ప్రపంచ మార్కెట్‌లో ఉక్కుకు డిమాండ్ మందగిస్తున్నా భారతదేశంలో పెద్దఎత్తున చేపడుతున్న మౌలిక వసతుల ప్రాజెక్టుల కారణంగా ఇక్కడ ఉక్కు డిమాండ్ ఏటా 11-13 శాతం మేర పెరుగుతోందని కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. ఆయన శుక్రవారం దిల్లీలో తన మంత్రిత్వశాఖ కార్యాలయంలో స్వీడన్ దేశ ఇంధనం, వ్యాపారం, పరిశ్రమలశాఖ సహాయమంత్రి సారామోడిగ్‌తో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. 2030 నాటికి దేశీయంగా 300 మిలియన్ టన్నుల ముడి ఉక్కు ఉత్పత్తికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా స్వీడన్ మెటలర్జికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, స్టీల్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ మిషన్ ఆఫ్ ఇండియా సంస్థల మధ్య పరిశోధన సహకారాన్ని విస్తరించాలని నిర్ణయించారు. ఉక్కు ఉత్పత్తికి అవసరమైన కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని తీర్మానించారు.

పెట్టుబడి రాయితీ పొందినా పంట అమ్ముకోవచ్చు

● వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు



ఈనాడు-అమరావతి: ఒక సర్వే నంబర్లో పంట నష్టం కింద పెట్టుబడి రాయితీ ఇస్తే.. అదే సర్వే నంబర్లో పంట అమ్ముకునేందుకు రైతులకు వీలుండదనే నిబంధనపై పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ అధికారులతో మాట్లాడి తగిన సూచనలు జారీ చేశామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నిబంధన కారణంగా రైతులు ఇబ్బంది పడ్డారని, ఇప్పుడు అలాంటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించినట్లు వివరించారు. శుక్రవారం ఆయన వ్యవసాయశాఖ సంయుక్త డైరెక్టర్లతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. పంటనష్టం అంచనాలు కచ్చితంగా సేకరించి రైతులకు ఉపశమనం కల్పించాలని కోరారు.

గనుల లీజులకు పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించండి

● మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశం



ఈనాడు, అమరావతి: గనుల లీజులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 6,500 దరఖాస్తులను పరిష్కరించి, 45 రోజుల్లోగా అర్హులైన అర్జీదారులకు వాటిని కేటాయించాలని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. శుక్రవారం ఆయన సచివాలయంలో గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా, ఏపీఎండీసీ ఎండీ ప్రవీణ్‌కుమార్, సంచాలకుడు డబ్ల్యూబీ చంద్రశేఖర్‌తో సమీక్షించారు. ఈ ఏడాది గనుల శాఖ రాబడి లక్ష్యం అక్టోబరు వరకు రూ.1,617 కోట్లు కాగా, రూ.1,584 కోట్ల (98 శాతం)కు చేరడంపై సంతృప్తి వ్యక్తంచేశారు. కీలకమైన ఖనిజాలకు విలువ జోడింపు ద్వారా మరింత ఆదాయం తెచ్చే మార్గాలను అన్వేషించాలన్నారు. వడ్డెర సంఘాలకు పలు ఖనిజాల లీజుల్లో 15% రిజర్వ్ చేసేందుకు విధివిధానాలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ఇసుక లభ్యత, ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ జరిపితే 60-75% సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. కేంద్రం మరిన్ని బీచ్‌శాండ్ మినరల్ లీజులు కేటాయిస్తే, గనుల శాఖకు ఆదాయం పెరిగేందుకు వీలుంటుందని మంత్రి రవీంద్ర తెలిపారు.

ప్రభుత్వంపై బురద జల్లడం సరికాదు

● జగన్‌పై ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ధ్వజం

ఈనాడు, అమరావతి: ఆపద సమయాల్లో ప్రభుత్వానికి, ప్రజలకు అండగా ఉండాల్సిన విపక్ష నేత జగన్ బెంగళూరులో కూర్చుని ప్రభుత్వంపై బురద జల్లడం సరికాదని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ధ్వజమెత్తారు.

నేటి నుంచి రాష్ట్రాల్లో సీఆర్‌ఎం బృందాల పర్యటన

ఈనాడు, అమరావతి: దేశవ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కార్యక్రమాల అమలు, ఆరోగ్య వ్యవస్థల పనితీరు పరిశీలనకు కేంద్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కామన్ రివ్యూ మిషన్ (సీఆర్‌ఎం) బృందాలు శనివారం నుంచి రాష్ట్రాల్లో పర్యటించనున్నాయి. నవంబరు 1 నుంచి 7 వరకు, 17 నుంచి 21 వరకు రెండు దశల్లో ఈ పర్యటనలు సాగనున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో ఈ బృందాలు సందర్శించి పరిస్థితిని సమీక్షిస్తాయి. ప్రతి రాష్ట్రంలో ఎంపిక చేసిన రెండు జిల్లాల్లో నాలుగైదు రోజులపాటు సీఆర్‌ఎం ప్రతినిధులు పర్యటిస్తారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారు. అందులో భాగంగా కేంద్ర ఆరోగ్య- కుటుంబ సంక్షేమ శాఖలోని పోషకాహార, అనుబంధ ఆరోగ్య సేవల ఉప కమిషనర్ డాక్టర్ జోయా అలీ రిజ్వీ నేతృత్వంలోని 12 మంది సభ్యులతో కూడిన బృందం ఈ నెల 3 నుంచి 7 వరకు రాష్ట్రంలోని పార్వతీపురం మన్యం, చిత్తూరు జిల్లాల్లో పర్యటిస్తుంది.

రవాణా వాహనాల హరిత పన్ను తగ్గింపు గెజిట్ ప్రచురణ

ఈనాడు, అమరావతి: రవాణా వాహనాల హరిత పన్ను (గ్రీన్ ట్యాక్స్) తగ్గింపునకు సంబంధించి ప్రభుత్వం శుక్రవారం గెజిట్ ప్రచురించింది. వైకాపా ప్రభుత్వం ఈ పన్నును 4 స్లాబ్‌లుగా మార్పుచేసి, వాహనదారులపై భారం వేసింది. 7-10 ఏళ్ల వాహనాలకు సగం త్రైమాసిక పన్ను (హాఫ్ క్వార్టర్లీ ట్యాక్స్) విలువ, 10-12 ఏళ్ల వాహనాలకు త్రైమాసిక పన్ను విలువ, 12 ఏళ్లు దాటిన వాటికి రెండు త్రైమాసిక పన్నుల విలువ మేర చెల్లించేలా 2022 నుంచి అమలు చేసింది. తర్వాత త్రైమాసిక పన్నులూ పెంచడంతో వాహనదారులపై మరింత భారం పడింది. కొన్ని వాహనాలకు ఏడాదికి గరిష్ఠంగా రూ.20 వేలు వరకు చెల్లించాల్సి వచ్చింది. దీనిపై లారీల యజమానులు విజ్ఞప్తులు చేయడంతో.. అధికారంలోకి వచ్చాక పన్ను తగ్గిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఆ మేరకు హరిత పన్నును 2 స్లాబ్‌లుగా మార్పుచేశారు. 7-12 ఏళ్ల వాహనాలకు ఏడాదికి రూ.1,500, 12 ఏళ్లు దాటి వాహనాలకు రూ.3 వేలు మాత్రమే హరిత పన్నుగా ఖరారు చేశారు. దీనిని ఈ ఏడాది ఆగస్టు నుంచి అమల్లోకి తీసుకొచ్చారు. ఈ పన్ను తగ్గింపునకు సంబంధించి ఏపీ మోటారు వాహన పన్ను విధానంలో సవరణ బిల్లుకి గత నెలలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదం లభించింది. దీనికి సంబంధించి శుక్రవారం గెజిట్ ప్రచురించారు.